వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 17 సంచిక : 11 హైదరాబాద్ 220 నవంబర్ 2019 పేజీలు : 68 రు. 25

- గిలానీ - ఉరికంబం మీద ఉహాగానం
- వ్యవసాయ మార్కెట్‌లో రైతు దుస్థితి
- కార్మికవర్గ స్ఫూర్తిని చూపిన ఆర్‌టిసి సమ్మె
- సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్ చిన్న పరిశ్రమలు
- న్యాయమూర్తికి బహిరంగ లేఖ
- సైనిక దిగ్బంధంలో కశ్మీర్
- ఇజ్రాయిల్ భవిష్యత్తు ఏమిటి?

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	సుందరయ్య భవన్ నల్గొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	జగ్‌జీవన్‌నగర్, న్యూ బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	...
నవ తెలంగాణ బుక్ హౌస్	బాప్టిస్ట్ చర్చ్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, హనుమకొండ	...
నవ తెలంగాణ బుక్ హౌస్	పాత సిపిఐ (ఎం) ఆఫీస్, బాలాజీనగర్, ఖమ్మం	...
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్‌స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394

220

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

నవంబర్ 2019
సంపుటి : 17
సంచిక : 11

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన శ్రేయోభిలాషి, హనుమకొండ - రు. 2,000; ఎం. సురేష్, అనంతపురం - రు. 5,000 ; వి. రామకృష్ణారెడ్డి, హైదరాబాద్ - రు. 5,000; జె.వి. పద్మ, కొత్తగూడెం - రు. 6,000. మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం పత్రికలో వస్తున్న వ్యాసాలను ప్రతి నెల శ్రద్ధతో చదువుతూ చర్చించుకుంటున్నాం. ప్రతి సంచికలో ప్రామాణికమైన రచయితలు రాస్తున్న వ్యాసాలు హేతుబద్ధమైన విశ్లేషణలతో ఉండడం గణనీయం. ఆయా సమయాల్లో రగులుతున్న సమస్యలపై వస్తున్న వ్యాసాలు పాఠకులకు సమగ్రమైన అవగాహన కలగడానికి దోహదం చేస్తున్నాయి. ముఖ్యంగా తాజా సెప్టెంబర్ సంచికలో నేడు దేశ వ్యాప్తంగా రగులుతున్న కశ్మీర్ సమస్యపై సంపాదకీయం, వ్యాసాలు, నిజనిర్ధారణ బృందం నివేదిక, శ్రేయాఖైతాన్, షహనాజ్ బషీర్, నిశితా త్రిసాల్, రాజేంద్రబాబు ఆర్వీణిల వ్యాసాలు హేతుబద్ధమైన విశ్లేషణలతో కశ్మీర్ సమస్యపై గందరగోళంలో ఉన్నవారిని వాస్తవికమైన పరిస్థితిని అర్థం చేసుకొనేలా ఉన్నాయి. అలాగే 'తలాక్' పై డానీ రాసిన వ్యాసం కూడా సమాచార యుక్తంగా ఉంది. పత్రికను మెరుగైన ప్రమాణాలతో తీసుకు వస్తున్నందుకు అభినందనలు.

– క్రాంతికార్
ఖమ్మం

వీక్షణం పత్రికను ప్రతినెలా తప్పకుండా చదువుతున్నాను. అందులో వచ్చే అన్ని వ్యాసాలు చదవదగినవిగా ఉంటున్నాయి. అక్టోబర్ సంచికలో పున్నయ్య రాసిన 'తిరోగమన దిశలో తెలంగాణ బడ్జెట్' వ్యాసం తెలంగాణ ప్రభుత్వం నీటి పారుదల ప్రాజెక్టులకు, దేవాలయాలకు అధిక బడ్జెట్ కేటాయించి, ఆర్థిక మాంద్యం పేరుతో విద్య, వైద్య రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో చిన్న చూపు చూసిన విషయాన్ని తన వ్యాసంలో ఎత్తిచూపారు. అలాగే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆర్‌టిసికి ప్రతి సంవత్సరం ఎంతో కొంత బడ్జెట్ కేటాయిస్తూ ఈ సంవత్సరం ఒక్క పైస కూడా కేటాయించకపోవడం చూస్తుంటే ఆర్‌టిసిని ప్రైవేటీకరించే విషయంగానే చూడాలి. అలాగే ఎం.కె. కుమార్ రాసిన తుమ్మలపల్లె యురేనియం వ్యాసంలో అక్కడ యురేనియం ప్రాసెసింగ్ కర్మాగారం నుండి విడుదలవుతున్న వ్యర్థాల కారణంగా పంట పొలాలు, తాగునీరు కలుషితమై ప్రజలు పడుతున్న బాధలను కళ్లకు కట్టినట్లు చెప్పారు. ఇదంతా కూడా బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానమనే విషయాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ప్రభుత్వాలు ప్రజలకు, ప్రకృతికి ఎలాంటి హాని కలిగించకుండా ఉండాలి, కాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధనార్జన కోసం ప్రజలను, ప్రకృతిని విధ్వంసం చేయాలనుకోవడం విచారకరం.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం మాసపత్రిక విధానం-తీరుతెన్నులూ చాలాకాలం నుంచీ పరిశీలిస్తున్నాను. కానీ, ఒకే విషయంపై సుమారు 4 నుంచి 6 వ్యాసాలు వస్తున్నాయి. ఇది పాఠకుడికి ఆసక్తిని చంపేసి, చిరాకునీ, విసుగునీ కలిగిస్తుందన్న విషయం నేను మీ దృష్టికి గతంలో కూడా తీసుకొచ్చినా, మీరు పట్టించుకోలేదు! సెప్టెంబర్ పత్రికలో 17 వ్యాసాలు వచ్చాయి. అందులో ఆరు వ్యాసాలు కేవలం కశ్మీర్‌పైనే వచ్చాయి. ఇక ఉన్నావ్ సమస్యపై 2 వ్యాసాలు అదే సమస్య, అవే పదాలు, అదే ఘటన! చదివేవారికి ఆసక్తి, శ్రద్ధ, విషయంపై అవగాహనా ఇంకేముంటుంది! ఇలా ఒకే విషయంపై నలుగురూ, ఆరుగురూ రాయడం పాఠకుడి సహనాన్ని పరీక్షించడమే అవుతుంది. ఇదేదో గిట్టని, పనిలేని, విమర్శగా భావించకండి. పత్రిక ఇతర సమస్యలపై, సమగ్రమైన, వివేకవంతమైన నిజాయితీతో రాసే విధానం మరే పత్రికకు సాధ్యపడనంత అద్భుతంగా తెస్తున్నా, ఈ విధానం మాత్రం ఎంతమాత్రం సముచితం కాదు. సిన్సీయర్‌గా ఆలోచిస్తే మీకే అవగతమవుతుంది. దేశంలో సమస్యలకి కొరతలేదు కదా. సాహిత్యంపై చర్చలు లేపండి. సైద్ధాంతిక చైతన్యాన్ని పెంచే అనేక రచనలు వేయండి. పత్రికాధిపతులుగా మీకు మేము సలహాలివ్వడం సూర్యుడికి దివిటి చూపించడం లాంటిదే. వీక్షణంకి ఉన్న మరో విశిష్ట లక్షణం పత్రికపై వచ్చే విమర్శల్ని కూడా నిజాయితీగా, నిర్భీతిగా ప్రచురించడం ప్రశంసించగల లక్షణం. నా సూచనని మీరు ప్రచురిస్తే వీక్షణం పాఠకులు కూడా ఏకీభవిస్తారని విశ్వసిస్తున్నాను. మతతత్వం, నిరంకుశత్వం, ప్రజల హక్కుల్ని హరించడం, ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీలు ప్లాంటు లాంటి భారీ కంపెనీల్ని ప్రైవేట్ పరం చేయబూనుతున్న ప్రభుత్వంపై కార్మిక వర్గాన్ని చైతన్యం చేయడం లాంటి అనేక విషయాలు వేయండి. కానీ – పదేపదే అదే విషయం అసహజం.

– బి.ఎ. నారాయణరావు
విశాఖపట్నం

వీక్షణం అక్టోబర్ సంచికలో జస్టిస్ మార్కండేయ కట్జూ రాసిన 'దేశానికి రానున్నవి చీకటి రోజులు' అన్న వ్యాసం ఇప్పుడు దేశంలో నెలకొన్న పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. నాజీ జర్మనీకి, భారతదేశంలో భారతీయ జనతా పార్టీకి పోలికలు చెప్తూ జర్మనీలో జరిగినట్లుగానే పాలకులు ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని, అందులో భాగంగానే పాకిస్తాన్‌లోని బాలాకోట్ మీద వైమానిక దాడి, దానికి సానుకూలమైన భారత ప్రచార సాధనాల ద్వారా యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం కూడా అందులో భాగమేనంటున్నారు. భారతదేశంలోని నిజమైన సమస్యలలో ఏ ఒక్కటీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో చర్చకే రాలేదన్నారు. ప్రజల సమస్యలంటే పాలకులకు ఎంత నిర్లక్ష్యమనే విషయాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి వెల్లడించాడంటే దేశం ఏ పరిస్థితుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యాసం పాలకులు ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరును బహిరంగపరిచి పాఠకులకు చాలా విషయాలను తేటతెల్లం చేసింది.

– మహేష్
వరంగల్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

భారత సమాజ వినాశనమే సంఘ్ దుర్మార్గ పథకం

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏడు దశాబ్దాలుగా చెప్పుకుంటున్న ఎజెండానూ, బైటికి చెప్పని రహస్య ఎజెండానూ కూడ త్వరితగతిన అమలు చేయడానికి, అమలు చేస్తామని బెదిరిస్తూ దేశాన్ని అల్లకల్లోలం చేయడానికి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఉవ్విళ్లూరుతున్నది. రెండోసారి అధికారంలోకి వచ్చిన విజయగర్వంతో ఈ ఎజెండాల అమలు మరింత వేగం పుంజుకున్నది. అధికరణం 370 తొలగింపు, ఉమ్మడి పౌర స్మృతి నెలకొల్పడం, రామాలయ నిర్మాణం మూడూ తన ఎజెండా కేంద్ర బిందువులని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్పష్టంగానే ప్రకటిస్తూ వస్తున్నది. ఈ మూడు పథకాలూ భారత సమాజాన్ని చీలదీసి, విద్వేషంలో ముంచి, ప్రజలను అసలు సమస్యల పరిష్కారాల ఆలోచన నుంచి పక్కదారి పట్టించేవే. ఆ మూక ఉన్మాద స్థితిలో దేశ వనరులను దేశంలోని దళారీ ఆధిపత్య వర్గాలకూ, దేశదేశాల సంపన్నులకూ, సామ్రాజ్యవాదానికీ అప్పనంగా అప్పగించే పథకాలే. అవి ఎంత దుర్మార్గమైన, భారత సమాజాన్ని వినాశనం వైపు తీసుకువెళ్లే కుటిల పథకాలైనా వాటికి విశాల ప్రజానీకపు ప్రత్యక్ష, పరోక్ష మద్దతు సాధించగలగడమే సంఘ్ పరివార్ సాధించిన విజయం. ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలా, ఒకే దేశంలో పౌరులకు భిన్న వ్యక్తిగత చట్టాలా అనే తప్పుడు ప్రశ్నలతో మొదటి రెండు కుతంత్రాలకు అమాయకుల ఆమోదాన్ని సంపాదించారు. చరిత్రలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతున్నామనే తప్పుడు చరిత్రతో, సమాజంలోని గణనీయమైన భాగాన్ని పరాయివారుగా, శత్రువులుగా చూపుతూ మూడో దుర్మార్గానికి సమర్థన సంపాదించారు.

ఈ మూడు దుష్టపథకాల అసలు గుట్టును విప్పిచెప్పి, ఆ పథకాల దుర్మార్గాన్ని ప్రజల్లో ప్రచారం చేసి, వాటి పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెంచి, సంఘ్ పరివార్ కు నిర్ణయాధికారం దక్కకుండా చేయవలసిన శక్తులు అశక్తతలో, నిర్లక్ష్యంలో, చిత్తశుద్ధి లేమిలో, అరకొర ఆలోచనాచరణలో కూరుకుపోయిన ఫలితంగా దశాబ్దాల పాటు చాపకింద నీరులా ఈ దుష్టపథకాలకు బహిరంగ, మౌన ఆమోదం వ్యాపించింది. భారత ఉపఖండ చరిత్రను, విభిన్న జాతుల సమాఖ్యగా రూపొందిన దేశంలో అనివార్యంగా అధికరణం 370 వచ్చిన చరిత్రను వివరించడంలో ప్రగతిశీల శక్తులు విఫలమయ్యాయి. ఒకదేశంలో పౌరులందరికీ సమానమైన ఒకే చట్టం అనేది ఆదర్శమే గాని, ఆ పౌరుల మధ్య తీవ్రమైన అసమానతలు, వివక్ష, ప్రత్యేకించి ఒక సమూహం పట్ల ద్వేష భావన పెంచి పోషించబడుతున్నప్పుడు అది కుదరదని, అది బలహీనులను అణచివేయడానికి బలవంతుల చేతి ఆయుధమవుతుందని చెప్పడంలో, అటువంటి ఏకీకృత చట్టం రూపొందడానికి ముందు విస్తారమైన చర్చ, ఆదాన ప్రదానాలు, బలహీన సమాజానికి రక్షణలు వంటి దీర్ఘకాలిక ప్రక్రియ అవసరమవుతుందని చెప్పడంలో ప్రగతిశీల శక్తులు విఫలమయ్యాయి. ఇక ముస్లిం సమాజాన్ని భయభీతావహంలో ముంచడానికే, వారి అస్తిత్వ, గౌరవ చిహ్నాలను తుడిచిపెట్టేందుకే, బాబ్రీ మసీదును ధ్వంసం చేయడానికే రామజన్మభూమి వివాదం రెచ్చగొట్టబడినప్పుడు ఆ మౌలిక వాస్తవం గుర్తించి, ఆ ప్రయత్నాన్ని అడ్డుకోవడంలో సంకోచించిన ప్రగతిశీల శక్తుల వైఫల్యమే బాబ్రీ మసీదు విధ్వంసానికి దారితీసింది.

అలా ప్రగతిశీలశక్తుల వైఫల్యపు పునాదుల మీద తమ భవనం నిర్మించుకున్న సంఘ్ పరివార్ రెండోసారి అధికారానికి రాగానే అధికరణం 370ని తొలగించింది. ఉమ్మడి పౌర చట్టం అనే మాట బదులు మరింత దుర్మార్గమైన, తటస్థత సూచించే జాతీయ పౌర జాబితా (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ – ఎన్ఆర్‌సి) ప్రారంభించింది. మొదట కాందిశీకుల సమస్య ఎక్కువగా ఉన్నదని ప్రచారమైన సరిహద్దు రాష్ట్రాలలో, ముఖ్యంగా అస్సాంలో ప్రారంభించి ఈ దుష్ట పన్నాగాన్ని దేశానికంతా, ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాలకు వర్తింపజేస్తామని పాలకులు నిస్సిగ్గుగా బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. ఇది దేశం నుంచి ముస్లింలను, మత మైనారిటీలను తొలగించే దుర్మార్గ ప్రయత్నం. యూదులను గుర్తించి, నిర్బంధించి, గ్యాస్ చాంబర్లలో మూకుమ్మడిగా హత్య చేసిన హిట్లర్ పథకాన్ని భారత సమాజంలో అమలు చేసే ప్రయత్నమిది. ఇక బాబ్రీ మసీదు విధ్వంస దుర్మార్గాన్ని రామాలయ నిర్మాణ ప్రయత్నంగా, ఆస్తి తగాదాగా మార్చి, ముస్లింలలోనే ఒక సమూహాన్ని కొనివేసి, సుప్రీంకోర్టు తీర్పు అనే సిగ్గుబిళ్లతో రామాలయం నిర్మించడానికి మార్గం సుగమం చేసుకుంటున్నది. ఈ ప్రకటిత ఎజెండా మాత్రమే కాక, అర్బన్ నక్సల్స్ ఏరివేత పేరుతో భిన్నస్వరాల అణచివేత, ప్రజాస్వామ్య విలువల కూల్చివేత, అభివృద్ధి పేరుతో సంపన్న ఖనిజ నిలువలను బహుళజాతిసంస్థలకు దోచిపెట్టడం, ఒకే ఎన్నికలు, ఒకే భాష పేరుతో దేశంలోని సమాఖ్య స్వభావాన్ని, బహుళత్వాన్ని రద్దు చేయడం వంటి అప్రకటిత ఎజెండా అమలు చేయడం కూడ ప్రారంభమైంది.

ఈ సంఘ్ పరివార్ దుర్మార్గం రాజకీయమా, ఆర్థికమా, సామాజికమా, సాంస్కృతికమా, పాలనాపరమా, మనదాకా వస్తుందా అని వేరుచేసి చర్చ చేసే వ్యవధి లేదు. అన్నిటి సమాహారమైన రాజ్యాధికార, రాజకీయార్థిక, భావజాల రంగంలో పోరాడకతప్పదు. పోరాటం అనగానే అదేదో మనకు సంబంధించిన సమస్య కాదని మధ్యతరగతి బుద్ధిజీవులు దూరం జరగవచ్చు. కాని ఇవాళ భారత సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించవలసింది, సంఘ్ పరివార్ ఈ సమాజపు మౌలిక విలువలను, పునాదులను నాశనం చేయదలచుకున్నది. బహుళత్వం, భిన్న మతాల, భావజాలాల మధ్య సహనం, ప్రజాస్వామికత, ఆదానప్రదానాలు, సమాఖ్య భావన వంటి విలువల వల్లనే ఇవాళ్టి భారత సమాజం ఉనికిలో ఉన్నది. ఈ సమాజాన్ని నాశనం చేయాలని, బహుళత్వాన్ని రద్దుచేసి ఏకీకృత మత, భాషా, దోపిడీ, పీడనల రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని సంఘ్ పరివార్ కోరిక. అధికారం వల్ల ఈ కోరికను నెరవేర్చుకునే అవకాశం ఇవాళ దానికి దక్కుతున్నది. భారత సమాజంలో ఇప్పటికే ఉన్న కుల అసమానత, కుల వివక్ష, దోపిడీ, పీడన జాడ్యాల నుంచి విముక్తి చేసే పోరాటమూ, దేశ బహుళత్వాన్ని, ప్రజాస్వామికతను, సహనాన్ని, ఆదానప్రదానాలను నిలబెట్టే పోరాటమూ వేరువేరు కావు. అవన్నీ ఒకే బహుళత్వ నవభారత సమసమాజాన్ని నిర్మించడంలో భాగమని, అందువల్ల సంఘ్ పరివార్ వ్యతిరేక పోరాటం అత్యవసరమైనదీ, అనివార్యమైనదీ, విశాల ప్రజాభాగస్వామ్యంతో నిర్మించవలసినదీ అని గుర్తించడమే ఇవాళ్టి కర్తవ్యం. వీ

దొర ప్రతాపమంత మజ్దూర్ల మీదనే!

ఎర్రబస్సంటె ఇప్పుడు బుట్టిందా, అప్పుడు బుట్టిందా. పుట్టి బుద్దెరిగినకాడ్నించి ఎర్రబస్సు ఎక్కనే బడ్తిమి. గద్దె మీద ఎక్కిన ప్రతి కొత్తోడు రాంగనె రాంగనె బస్సుల రంగు బదలాయించె, పేర్లు బదలాయించె, ఇటున్న బస్సు అటేశె, కొత్త కొత్త ఊళ్లకు బస్సులేశె, డిపోలు గట్టె, బస్టాండులు గట్టె, ఆర్టీసీ దొరలకు బంగ్లలు గట్టె. ఎన్ని జరిగినా బస్సులు బోయినయా? మా చిన్నప్పుడు ఊళ్ల వాగుల్నించి ఉశికె దోడ్కబోయే లారీ మీద కూసోని పోతుంటిమి, గీ నడిమిట్ల ఆటోలొచ్చె. కాని బస్సు జాగ బస్సుదే గద. బస్సును ఇడ్శిపెడ్తమా? డైవర్లతోని కొట్లాడ్తిమి, కండక్టర్లతోని కొట్లాడ్తిమి, గని ఎన్నడన్న వాండ్ల కడుపుమీన కొడితిమా? నైటాల్ట్ బస్సంట ఊళ్లెకొస్తె డైవర్లను కండక్టర్లను అర్సుకోలేదా? బస్సులు రాకపోతె, తక్కువ బస్సులొస్తె డిపో మేనేజర్ల దగ్గరికి ఊరోల్లమంత బొయ్యి నిలదియ్యలేదా? తెలంగాణ కోసం కొట్లాడినప్పుడు ఆర్టీసీ మజ్దూర్లు గుడ బందులు పెట్టలేదా? ఇయ్యాటిదా నిన్నటిదా ఆర్టీసీ చరిత్ర. గుడ్డొచ్చి పిల్లనెక్కిరించినట్టు దొర ఇచ్చిత్రం జెయ్యబట్టె. నోట్ల బెల్లంగడ్డ పెట్టుకున్నరా ఏంది, నోరున్నోడు ఎవ్వడు మాట్లాడకపాయె. ఏందుల్లో ఈ తికమక. దొర గుడ్లురుమాలంటె ఎంతమంది లేరు. రూపాయి ఖర్చుకు పది రూపాలు వసూలు జేసె దొంగ కాంట్రాక్టర్ల మీద గుస్సా వద్దా? ఎకరాల్లల్ల గొని గజాల్లల్ల అమ్ముకుంట కోట్లకు పడిగెత్తినోల్ల మీద గుస్సా వద్దా? చిన్న పనికి పెద్ద పనికి చెయ్యి జాపుకుంట జెనిగెల తీర్గ నెత్తురు పిండుతన్న సర్కారు నౌకర్ల మీద గుస్సా వద్దా? తెలంగాణొస్తె ఇగ కొలువొస్తది, అగ కొలువొస్తది అని ఎగురుకుంట కొట్లాటల దిరిగి, ఇప్పుడు ఐదేండ్ల నుంచి ఎల్లెలుకల పండుకున్న పొల్లగాండ్లకు పని దొరకకుంట జేసినోని మీద గుస్స వద్దా?ఆంధ్రోని రోజుల కన్న అన్నాలంగ మన తెలంగాణ జనాన్ని కాల్చుక తింటన్న మన తెలంగాణ పోలీసు దొరల మీద గుస్స వద్దా? అన్ని వదిలిపెట్టి దొర బస్సుల మీదనే పడ్డడు గద, డైవర్లను కండక్టర్లను మెకానిక్కులను ఆర్టీసీ మజ్దూర్లందర్ని అరిగోస పెట్టుకుంటాండు గద. ఇంతకు ఏమడిగిండ్రయా వాండ్లు? ఏమన్న నీ బంగ్లలు ఇమ్మన్నరా, నీ జాగలిమ్మన్నరా, నీ ముల్లెలు ఇమ్మన్నరా? సర్కారు నౌకర్లతోటి సమానంగ తనఖా ఉండాలన్నరు. సర్కార్ల కలుపుమన్నరు. పని కాడ సౌలత్ జూడమన్నరు. అయ్య, గదే నేరమా బాంచెన్. గట్ల గుడ్లురిమితె ఎట్ల బాంచెన్. అస్సల్ ముచ్చట వేరే ఉన్నదట గద. బస్సులన్ని నీ దగ్గరోల్లవే నడువాలన్నవట గద. రోడ్లన్ని ఆల్లకే రాసిస్తనన్నవట గద. ఆర్టీసీకి తెలంగాణ మొత్తంల ఏడేడ జాగలుంటె ఆడాడ అమ్మి పారెయ్యటానికి కంకణం కట్టుకున్నవట గద. నివద్దె బాంచెన్. దసరా రోజు ఏదో గట్టి పని జేయుటానికి కంకణం కట్టుకోవాలె. గదే రివాజు. అయితే ఈసారి గీ కంకణం గట్టుకున్నవా? కని దొరా, ఒక్క ముచ్చట మర్శిపొయినట్టున్నవ్. దసర రోజు నువ్వొక్కనివె గాదు, ప్రతి ఒక్కలు కంకణం కట్టుకుంటరు. జమ్మిచెట్టెక్కి దాశిపెట్టిన ఇసిరెలన్ని దింపుతరు. ఇగ యుద్ధం తప్పదని బరిగీస్తరు. ఈ దసర పండుగరోజు గదే కత మొదలైనట్టున్నది. మా చిన్నప్పటి కాటికాపలోని తీర్గ నువ్వు నోట్లె నుంచి బంగారి గుండ్లు తియ్యి, గారడోని తీర్గ తాడు మీద చెంగడబింగడ ఎగురు, యుద్ధం మొదలైనాక ఏ కంకణాలు నిల్వవు. తెలంగాణది మాదండి చరిత్ర. నీకెరికె. ఎంతెంత అవ్వల్ దర్జ దొరలను గుడ ఉరికిచ్చిన రివాజు తెలంగాణది. పాపం, ప్యాదలు, ఆర్టీసీ మజ్దూర్లు ఆల్ల మీద నీ ప్రతాపం జూపకు. నాకు అడ్డు లేదని పూలహారం మెళ్ల ఏస్కోని తిర్గుతానవేమో, కాలం కలిసి రాకపోతే తాడే పామైతదనే సామెత నీకు తెలిసే ఉంటది. వీ

అమరావతిదే గతి?

విభక్త ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎక్కడ ఏర్పాటు చేయాలని ఆరు సంవత్సరాల కింద మొదలైన వివాదం, రాజధాని ఏర్పాటయిన నాలుగు సంవత్సరాల తర్వాత కూడ ఏ గమ్యానికీ చేరినట్టు కనబడడం లేదు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ విభజన జరగకముందే, విభజన ప్రయత్నాలలో భాగంగా రాజధానిని నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. 2014 ఎన్నికల్లో అధికారానికి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఆ కమిటీ సిఫారసులను పక్కనపెట్టి విజయవాడ, గుంటూరుల మధ్య అమరావతి అనే కొత్త రాజధాని నిర్మించడానికి నిర్ణయం తీసుకుని, 2015 అక్టోబర్ లో ప్రధాని నరేంద్ర మోడీ చేత శంకుస్థాపన చేయించి పని మొదలుపెట్టింది. అవసరం ఉన్నా లేకపోయినా ముప్పై వేల ఎకరాలు సేకరిస్తానని అబద్ధపు ప్రకటనలు, స్వయంగా మంత్రివర్గ సభ్యులే వందలాది ఎకరాలు కొని రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా అవతారం ఎత్తడం, రెండు పంటలు పండే విలువైన కృష్ణా నదీ తీర భూములను వ్యవసాయేతర వినియోగంలోకి బదలాయించడం, తప్పుడు వాగ్దానాలు చేసి దాదాపు ఇరవై నాలుగువేల మంది రైతులను నిర్వాసితులను చేయడం, నాలుగు సంవత్సరాలు గడిచినా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తప్ప ప్రజలకూ పాలనకూ ఏమీ మేలు జరగకపోవడం వంటి పరిణామాలతో రాజధాని నిర్మాణం ప్రహసనంగా మారింది. అప్పటికే ఒక స్థాయిలో క్రూరమైన, మరొక స్థాయిలో హాస్యాస్పదమైన, ఇంకొక స్థాయిలో గందరగోళమైన ఈ ప్రహసనంలోకి 2019 ఎన్నికలతో కొత్త అంకం మొదలైంది. తెలుగు దేశం ప్రభుత్వం దిగిపోయి వైఎస్ ఆర్ సిపి అధికారంలోకి వచ్చిన రోజు నుంచే రాజధాని మీద సందేహాలు, కొత్త రాజధాని ప్రతిపాదనలు, కొత్త రియల్ ఎస్టేట్ ఊహాగానాలు మొదలయ్యాయి. చివరికి సెప్టెంబర్ 13న ఒక రిటైర్డ్ ఐ ఎ ఎస్ అధికారి నేతృత్వంలో ఆరుగురు నిపుణుల కమిటీ వేసి, ఆరు వారాల్లో నివేదిక ఇమ్మని కోరారు. ఆ నివేదిక ఏ సిఫారసులు చేస్తుందో తెలియదు గాని ఈలోగానే మంత్రులు, అధికారులు అమరావతిలో సౌకర్యాలు సరిగా లేవనీ, అది రాజధానిగా కొనసాగడం సాధ్యమేనా అనీ అనుమానాలు వ్యక్తం చేయడం మొదలుపెట్టారు. ఈ లోగా రాజధాని విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు జోక్యం చేసుకుంది. కేవలం ఐదు వ్యాపార సంస్థలే అమరావతిలో 60 శాతం భూమి సేకరించాయనీ, ఈ కుంభకోణంలో చంద్రబాబుకు సంబంధం ఉన్నదనీ ఒక మంత్రి ఆరోపించారు. అమరావతి నిర్మాణం కోసం చేసిన ఇరవై వేల కోట్ల రుణభారం ప్రభుత్వం మీద అదనపు భారమైందని అన్నారు. నిపుణుల కమిటీ నివేదిక రాగానే రాజధానిని అమరావతిలోనే ఉంచడమా, మరొక స్థలానికి మార్చడమా నిర్ణయిస్తామని మరొక మంత్రి అన్నారు. నిపుణుల కమిటీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో పర్యటించి, పరిశీలించి నివేదిక ఇస్తుందన్నారు. అంటే మొత్తం మీద ఐదారు సంవత్సరాల తర్వాత, వేల కోట్ల రూపాయల ప్రజాధనం వ్యయం తర్వాత రాజధాని సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే లాగ ఉందన్నమాట. పాత రియల్ ఎస్టేట్ రాబందుల స్థానంలో కొత్త రియల్ ఎస్టేట్ రాబందులకు అవకాశం రాబోతున్నదన్నమాట. పాత పాలనలోనైనా, కొత్త పాలనలోనైనా ఇటువంటి తప్పుడు, స్వార్థపూరిత, ప్రజాధన దుర్వినియోగ నిర్ణయాలను అర్థం చేసుకోవలసిందీ, అడ్డుకోవలసిందీ ప్రజలే. వీ


చైనా నియంతృత్వ విధానాలపై హాంకాంగ్ నిప్పలు


- ఎ. నర్సింహారెడ్డి

1997 జూలై 1న బ్రిటన్ నుంచి చైనా హాంకాంగ్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకున్నప్పుడు 50 ఏళ్లపాటు, అంటే 2047 వరకు ఆ నగరానికి స్వయం ప్రతిపత్తిని కొనసాగిస్తామని ఆనాటి చైనా ఉప ప్రధాని డెంగ్ జియావోపింగ్ హామీ ఇచ్చారు. 'ఒకే దేశం-రెండు వ్యవస్థల' విధానాన్ని పాటిస్తామని, ఆయన హామీ ఇచ్చారు. ఈ విధానం కింద హాంకాంగ్ తన ఆర్థిక, వాణిజ్య విధానాలను తానే నిర్ణయించుకోవచ్చు. పాలనా నిర్వహణ, శాసనాధికారం, న్యాయవ్యవస్థలు హాంకాంగ్‌వే కొనసాగుతాయి. కానీ ఆచరణలో ఇదంతా నీరుగారింది. పాలన హాంకాంగ్‌దే అయినా, తాను నిర్ణయించిన వ్యక్తే దాని చీఫ్ ఎగ్జిక్యూటివ్ అయ్యేవిధంగా చైనా పావులు కదిపింది. తెరవెనుక ఉంటూ హాంకాంగ్‌కి ఉన్న అధికారాలను కత్తిరించడం ప్రారంభించింది. 2017లో కారీ లామ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ పాలనా వ్యవస్థలోని చైనా వ్యతిరేకుల్ని అనర్హులుగా ప్రకటించడం, ఉద్యమాల్లో పాల్గొనేవారికి పోటీ చేసే హక్కును నిరాకరించడం, చైనా వ్యతిరేకులుగా ముద్రపడిన వారిని అపహరించి చైనాకు తీసుకెళ్లడం వగైరాలన్నీ సాగాయి. వీటన్నింటికీ పరాకాష్టగా నేరస్తుల అప్పగింత సవరణ బిల్లు మార్చిలో రంగ ప్రవేశం చేసింది. అది చట్టమైతే ఎవరినైనా, ఏ సాకుతోనైనా చైనాకు అప్పగించవచ్చు. ఏ మాత్రం విశ్వసనీయతలేని న్యాయవ్యవస్థ రాజ్యమేలుతున్న చైనాలో నేరం రుజువైందన్న పేరిట కఠిన శిక్షలైనా విధిస్తారన్న భయముంది. అది వెనకటి కాలం నుంచి వర్తిస్తుందన్న నిబంధన ఉండడంతో హాంకాంగ్ ప్రజల సహనం నశించింది.

పర్యవసానంగా ప్రస్తుత ఉద్యమం. మార్చిలో తొలుత ఇది కేవలం చిన్న పాటి నిరసనలకే పరిమితమైంది. అది చూస్తుండగానే మహోద్యమంగా మారింది. వేలాది మందితో జరిగే నిరసనలు కాస్తా లక్షల్లోకి ఎగబాకాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే నగర విమానాశ్రయానికి పది లక్షల మంది వచ్చిపడడంతో చైనా పాలకులకు, కారీలామ్‌కు ఎటూ పాలుపోలేదు. ఆధునిక టెక్నాలజీ సాయంతో ఆందోళనకారుల కూపీ లాగి ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తే అంతా సద్దుమణుగుతుందని వారు భావించారు. అయితే నిఘా కెమెరాలు తమను గుర్తుపట్టకుండా మాస్కులు ధరించారు. పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. రబ్బర్ బుల్లెట్లు, పెప్పర్ స్ప్రే వగైరాలు వినియోగించారు. ఎంతకీ ఉద్యమం ఆగకపోవడంతో చైనాకు దిక్కుతోచలేదు. జనాగ్రహం పోటెత్తితే ఎంతటి నియంతైనా తలవంచాల్సిందేనని ఉద్యమ కారులు నిరూపించారు. తమ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కొంచెం కబళించి, చివరకు పూర్తిగా నగరాన్ని చెప్పుచేతల్లోకి తీసుకోవచ్చునుకున్న చైనాకు శృంగభంగం చేశారు. నేరస్తుల అప్పగింత బిల్లుకు వ్యతిరేకంగా ఐదు నెలలుగా సాగుతున్న నిరసనోద్యమానికి చైనా తలొంచక తప్పిందికాదు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ కారీలామ్ చివరకు వివాదస్పద బిల్లును విరమించుకున్నా, ఉద్యమం వెనుకకు తగ్గకపోవడానికి కారణం క్షీణించిపోతున్న స్వయంప్రతిపత్తి, సమీపిస్తున్న పూర్తి విలీనం. మరో 28 సంవత్సరాలలో ఒప్పందం ముగిసి, ప్రత్యేక రక్షణలు పోతే తమ పరిస్థితి ఏమిటని హాంకాంగ్ వాసులలో ఇప్పటి నుంచే ఆందోళన మొదలయింది.

వీ







❖ **దాశరథి చలనచిత్ర గీతాలు** – విమర్శనాత్మక పరిశీలన – డా. ఆరవల్లి జగన్నాథస్వామి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 324 పేజీలు, 1/8 డెమీ, రు. 250




❖ **తొలకరి చినుకులు** – కవిత్వం – అమ్జద్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ– 100 పేజీలు, 1/8 డెమీ, రు. 100




❖ **అనాచ్ఛాదిత కథ** – నవల – ఝాన్సీ కొప్పిశెట్టి – పాలపిట్ట బుక్స్ ప్రచురణ– 198 పేజీలు, 1/8 డెమీ, రు. 150,
పై మూడు ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఫ్లాట్ నెం. 2, బ్లాక్–6, ఎంఐజి–11, ఎపిఎచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500044, ఫోన్ : 040–27678430




❖ **ఆస్తి దాని పరిణామం** – పాల్ లఫార్గ్ – తెలుగు: రామారావ్ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 114 పేజీలు, 1/8 డెమీ, రు. 90




❖ **చినుకుల్లో చిరుమంటలు** – కథలు – శ్రీధర – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 200 పేజీలు, 1/8 డెమీ, రు. 150, పై రెండు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్ – 500 068, ఫోన్: 040–29884454



❖ **ఋతుసంహారం –** కాళిదాసు – తెలుగు: గొట్టుముక్కల రాధాకృష్ణరావు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 46 పేజీలు, 1/8 డెమీ, రు. 20




❖ **పసిడిమువ్వలు–పారాణి** – నటరాజ రామకృష్ణ – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 246 పేజీలు, 1/8 డెమీ, రు. 90




❖ **రాఘవరెడ్డి రచనలు** – (సావిత్రి రతివిలాపం గోపికావల్లభా పరిదేవనం) – గార్లపాటి రాఘవరెడ్డి – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 72 పేజీలు, 1/8 డెమీ, రు.30, పై మూడు ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్ర భారతి, హైదరాబాద్ – 500 004, ఫోన్ : 040–29703142




❖ **మార్క్సిజం–సాంస్కృతిక సిద్ధాంతాలు –** సంక్షిప్త పరిచయం – రావు కృష్ణారావు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ – 184 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఇ.నెం. 33–22–2, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ – 520 004, ఫోన్ : 0866–2430302




❖ **నెమరు – సి.సి. –** కలెక్షన్ ఆఫ్ రీకలెక్షన్స్ – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: విజయలక్ష్మి, ఇ.నెం. 1–19, అచ్చుతాపూర్ గ్రామం, మనిగిల్ల పోస్టు, వనపర్తి జిల్లా, మండలం, ఫోన్ : 9393711274




❖ **కచ్చీరు ముచ్చట్లు** – కాలమ్ – విజయ భండారు – హస్మిత ప్రచురణ – 126 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: భండారు విజయ, ఎచ్ఐజి, బ్లాక్ – 1, ఫ్లాట్ నెం. 10, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500044, ఫోన్ : 8801910908, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **మదర్సా మేకపిల్ల** – ఉషా ఎస్ డానీ – సాహితీ మిత్రులు ప్రచురణ – 24 పేజీలు, 1/8 డెమీ, రు. 25



❖ **అద్వంద్వం** – కవిత్వం – శ్రీరామ్ – సాహితీ మిత్రులు ప్రచురణ – 92 పేజీలు, 1/8 డెమీ, రు. 100,
పై రెండు ప్రతులకు: సాహితీ మిత్రులు, ఇ.నెం. 28–10–26, అరండల్‌పేట, విజయవాడ – 520002, ఫోన్ : 9392971359



❖ **టిక్‌టాం బుర్ర** – బాలల కథలు – అంగలకుదిటి గోవిందమ్మ – సంపాదకులు: డా. కందేపి రాణీప్రసాద్ – స్వాప్నిక్ ప్రచురణలు – 136 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: స్వాప్నిక్ పబ్లికేషన్స్, సృజన చిల్డ్రెన్ హాస్పిటల్, బస్ స్టాండ్ పక్కన, సిరిసిల్లా – 505301, ఫోన్ : 9866160378



❖ **గాంధీజీ ప్రాణరక్షకుడు బతఖ్ మియా అన్సారి** – సయ్యద్ నశీర్ అహమ్మద్ – ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్ ప్రచురణ – 24 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, సి 2, శ్రీరామ్స్ ఆర్కేడ్, అమరావతి రోడ్, ఉండవల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు – 522501, ఫోన్ : 9440241727



❖ **నిగమ శర్మ –** (నాటకం) – తెలుగుసేత: కీ.శే. ప్రఖ్య శ్రీరామమూర్తి – ప్రఖ్య ఆర్ట్ ప్రింటర్స్ ప్రై.లి. ప్రచురణ – 120 పేజీలు, 1/8 డెమీ, రు. అమూల్యం, ప్రతులకు: ప్రఖ్య ఆర్ట్ ప్రింటర్స్ ప్రై.లి., ఇ.నెం. 1–8–724/ఎ/31, వెజిటేబుల్ మార్కెట్ స్ట్రీట్, నల్లకుంట, హైదరాబాద్ – 500044, ఫోన్ : 98852 98329

ఉరికంబం మీద ఊహాగానం

తప్పుడు కేసులో ఇరికించబడి, కిందికోర్టులో మరణశిక్ష పొంది, హైకోర్టు, సుప్రీంకోర్టుల చేత నిర్దోషిగా విడుదలైన తర్వాత ప్రొ. ఎస్.ఎ.ఆర్. గిలానీ చేసిన ప్రకటన



అక్టోబర్ 24 గురువారం సాయంకాలం ఢిల్లీలో గుండెపోటుతో మరణించిన కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి) అధ్యక్షుడు, ఢిల్లీలోని జకీర్ హుస్సేన్ కాలేజి లో అరబిక్ అధ్యాపకుడు సయ్యద్ అబ్దుల్ రహమాన్ గిలానీ 2001 డిసెంబర్ 13న పార్లమెంటు మీద జరిగిన దాడి కేసులో అక్రమంగా ఇరికించబడ్డారు. హడావుడిగా జరిగిన విచారణ తర్వాత తగిన సాక్ష్యాధారాలు లేకుండానే 2002 డిసెంబర్ 18న సెషన్స్ కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది. కాని ఆయన మీద నేరం ఆరోపించడానికి సరైన సాక్ష్యాధారాలు లేవంటూ ఢిల్లీ హైకోర్టు 2003 అక్టోబర్ 29న ఆ మరణశిక్షను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును ప్రభుత్వం సవాల్ చేసినప్పటికీ సుప్రీం కోర్టు కూడ 2005 ఆగస్ట్ 4న హైకోర్టు తీర్పును ధ్రువీకరించింది. ఈలోగా బెయిల్ మీద బైట ఉన్న గిలానీపై, న్యాయవాది నందితా హక్సర్ ఇంటి నుంచి బైటికి వస్తుండగా 2005 ఫిబ్రవరి 8న గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఐదు తుపాకి గుళ్లు దూసుకుపోయినప్పటికీ బతికి బైటపడిన గిలానీ ఆ తర్వాత పౌర ప్రజాస్వామిక హక్కుల ఉద్యమంలో, కశ్మీరీ జాతి స్వయం నిర్ణయాధికార పోరాటంలో క్రియాశీలంగా పనిచేశారు. దేశవ్యాప్తంగా మేధావులు, న్యాయవాదులు, ప్రజాస్వామిక వాదులు 2008లో ఏర్పాటు చేసిన కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సిఆర్‌పిపి) అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆయన మీద ప్రభుత్వం 2016లో మరొక రాజద్రోహ నేరం కేసు బనాయించింది.

తన మీద పెట్టిన తప్పుడు కేసును దేశంలోకెల్లా అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు కొట్టివేసిన రోజున, 2005 ఆగస్ట్ 4న ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటన నుంచి ప్రధాన భాగాలు:

భారత పార్లమెంటు మీద దాడికి జరిగిన కుట్రలో భాగం ఉందని నామీద నేరారోపణ చేశారు. నన్ను అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి, ఒంటరి నిర్బంధంలో ఉంచారు. నేను ఆ నేరంతో ఏ సంబంధమూ లేని అమాయకుడిననీ, పోలీసులు నన్ను ఇరికించడానికి ప్రయత్నిస్తున్నారనీ నేను మొదటి నుంచీ చెపుతున్నాను. కాని 2002 డిసెంబర్ 18న నాకు మరణశిక్ష విధించారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు నన్ను నిర్దోషిగా విడుదల చేసింది. ఇవాళ సుప్రీం కోర్టు కూడ ఆ హైకోర్టు తీర్పును నిర్ధారించింది. సహజంగానే స్వేచ్ఛాజీవిగా ఉన్నందుకు నేను సంతోషంగా ఉన్నాను. కాని ఒక అమాయకుడు నిర్దోషిగా నిర్ధారించబడడం అంత సంబరపడవలసిన విషయమేమీ కాదనుకుంటాను. అతణ్ని అలా ఎందుకు ఇరికించారో, సాక్ష్యాధారాలే లేకుండా మరణశిక్ష కూడ ఎలా విధించారో ఆలోచించవలసిన సమయమిదే అనుకుంటాను.

ఈ సందర్భంగా నా అనుభవాల గురించి ఆలోచించడానికి, నన్ను ఎందుకు ఇరికించారని అనుకుంటున్నానో మీతో పంచుకోవడానికి ప్రయత్నిస్తాను. నేను వృత్తిపరంగా ఒక అధ్యాపకుడిని. తన అనుభవాల గురించి ఆలోచించడం, ఎటువంటి కోపమూ పగా లేకుండా ఆ అనుభవాల నుంచి సరైన పాఠాలు తీసుకోవడం ఉపాధ్యాయుడి పని అని నేననుకుంటాను. ఈ ప్రకటనలో నేను చేయదలచిన పని అదే.

కశ్మీర్ సమస్య

నేనొక కశ్మీరీని. మంచు కప్పుకున్న పర్వత సానువుల, బ్రహ్మాండమైన చినార్ వృక్షాల అద్భుత సౌందర్యం మధ్య పెరిగాను. కాని, ఇప్పుడు నేను కశ్మీర్ లోయ గురించి ఆలోచిస్తే, నాకు గుర్తుకొచ్చేది ఆ సౌందర్యం కాదు. మిగిలిన కశ్మీరీ ప్రజలందరి లాగనే నా జీవితం కూడ మా నేలను చిందరవందర చేసిన ఘర్షణతో అవిభాజ్యంగా ముడిపడి ఉంది. చిత్రహింసలకు గురైన, ఎముకలు విరిగిన తమ బిడ్డల మృతదేహాలను ఖననం చేస్తున్న విచారగ్రస్తులైన తల్లిదండ్రులను నేను చూశాను. అత్యాచారానికి గురైన స్త్రీల కన్నులలో వేదనను నేను చూశాను. తమ చిన్నారి పిల్లలను దాడుల నుంచీ గాయాలనుంచీ రక్షించలేకపోయిన తల్లిదండ్రుల నిస్సహాయతను నేను చూశాను. స్వయంగా నా పిల్లలే స్వప్నాలకు బదులు పీడకలలు కంటూ ఎదగడం నేను చూశాను.

నేనీ మాటలు ఎటువంటి ప్రతీకారేచ్ఛతోనూ రాయడం లేదు. నా వేదనకు కారణమైన పోలీసులలో, న్యాయమూర్తులలో, జైలు అధికారులలో ఏ ఒక్కరితోనూ నాకు వ్యక్తిగత వైరంలేదు. ఎందరో కశ్మీరీల దుఃఖానికీ వ్యధకూ బాధ్యత వహించవలసిన వ్యవస్థలో వారు కేవలం భాగాలు మాత్రమేనని నేననుకుంటాను. నాతరం కశ్మీరీ యువకులు అనుభవించిన బాధల కన్న నేనేమీ ఎక్కువ అనుభవించలేదు. నన్ను అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టారు. వేలాది మంది కశ్మీరీ పురుషుల విషయంలోనూ అదే జరిగింది. నన్నొక తప్పుడు కేసులో ఇరికించారు. మరెందరో కశ్మీరీల విషయంలో కూడ ఇది నిజమే. పైగా వారందరూ ఇప్పటికీ నేనుండిన జైలులోనే ఉన్నారు. దాదాపు ఒక ఏడాది పాటు నేను ఉరికంబం నీడలో బతికాను. అయితే అది నన్ను చంపడానికి జరిగిన ప్రయత్నం మాత్రమే. మరెందరో కశ్మీరీలు బూటకపు ఎన్‌కౌంటర్లలో, చివరికి ప్రజాస్వామిక భారత రాజధాని ఢిల్లీలో కూడ, చంపివేయబడినప్పుడు, బతికి బైటపడ్డానంటే నేను అదృష్టవంతుణ్నే ననాలి.

నా అనుభవం నాకు భారత ప్రజాస్వామ్యమూ, దాని వ్యవస్థలూ

ఎలా పనిచేస్తాయో సన్నిహితంగా చూసే అవకాశం ఇచ్చింది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా యుద్ధం పేరుతో పెచ్చరిల్లుతున్న మతోన్మాద ఫాసిస్టు శక్తుల విజృంభణ భారత ప్రజాస్వామ్యపు మౌలిక పునాదులను తీవ్రంగా తొలిచివేస్తున్నదని నాకనిపిస్తున్నది.

నేను జైలు నుంచి విడుదలైన రోజున నా మొట్టమొదటి పత్రికా సమావేశంలో మాట్లాడుతూ కశ్మీర్ సమస్య పరిష్కారమయ్యే వరకూ ఆ ప్రాంతంలో అర్థవంతమైన శాంతి నెలకొనబోదని అన్నాను. ఆ సమస్యకు పరిష్కారం రాజకీయ సంప్రదింపుల ద్వారా మాత్రమే దొరుకుతుందని అన్నాను. నా ప్రకటన చాల మందికి కోపం తెప్పించింది. ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉంటారని పేరు పొందినవాళ్లు కూడ కోపం తెచ్చుకున్నారు. నా సమర్థకులనూ నన్నూ "శాంతి ప్రక్రియకు విఘాతం కల్పిస్తున్నవారు" అని అన్నారు. అంటే కశ్మీర్ గురించి మాట్లాడడమే భారత-పాకిస్తాన్ శాంతి ప్రక్రియకు భంగం కలిగిస్తుందన్నమాట.

వారికి ఈ అనుమానం ఎందుకు కలుగుతున్నదో తెలియదు. భారత, పాకిస్తాన్ ల మధ్య స్నేహం నెలకొనాలని కశ్మీరీలు కూడ కోరుకుంటారు. ఆ స్నేహం లేకపోతే కశ్మీర్ లో నిజమైన అభివృద్ధే సాధ్యం కాదు. కాని అది జరగాలంటే, ముందుగా జరగవలసిందేమంటే భారత, పాకిస్తాన్ లు రెండూ జమ్ము కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోవాలి. స్వయం నిర్ణయాధికారం కోసం కశ్మీరీ ప్రజల ఉద్యమం ఏ ఒక్క వ్యక్తి, సంస్థ, పార్టీ కోరికల పర్యవసానం కాదు. ఉదాహరణకు కశ్మీర్ నుంచి తలెత్తిన నాయకులలో అతి గొప్పవాడైన షేక్ అబ్దుల్లానే తీసుకోండి. ఆయన ఆ ఉద్యమాన్ని ఎన్నో సంవత్సరాల పాటు నడిపాడు. ఆయనను జైలులో పెట్టారు. లొంగిపోయి 1975 ఒడంబడిక మీద సంతకం చేశాడు. కాని పద్నాలుగు సంవత్సరాల తర్వాత కశ్మీర్ ప్రజలు మళ్లీ ఒకసారి లేచి నిలిచారు. అన్యాయానికీ, రాజకీయాధిపత్యానికీ వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.

కశ్మీరీ ప్రజల ప్రయోజనాలనూ ఆకాంక్షలనూ పరిగణనలోకి తీసుకోకుండా భారత - పాకిస్తాన్ ఘర్షణకు శాశ్వత పరిష్కారం సాధించడం అసాధ్యం అనే నా అవగాహనను మరొకసారి ప్రకటించి నందుకు నా మిత్రులు, నా నిర్దోషిత్వాన్ని రుజువు చేయడానికి ప్రచారం చేసిన విద్యావేత్తలూ మేధావులూ కూడ ఇబ్బంది పడడం నాకు నిజంగా ఆందోళనకరంగా ఉంది.

ఇంటిలిజెన్స్ సంస్థల పాత్ర

నేను నా కేసు సంగతి కాకుండా సాధారణ సమస్యల గురించి ఎందుకు మాట్లాడుతున్నానని మీరు అడగవచ్చు. కారణమేమంటే నేను నా అనుభవాన్ని కశ్మీరీ ప్రజల అనుభవం నుంచి వేరు చేసి చూడలేను. నేను ఒక కశ్మీరీ ముస్లింను గనుకనే నన్ను పార్లమెంటు దాడి కేసులో ఇరికించారని నేననుకుంటాను. నన్ను అలా ఇరికించడంలో ఇంటిలిజెన్స్ సంస్థల చెయ్యి ఉంది.

కశ్మీర్ సమస్య ఒక రాజకీయ సమస్య. దాన్ని రాజకీయ సంప్రదింపుల ద్వారా మాత్రమే పరిష్కరించాలి గాని ఇంటిలిజెన్స్ సంస్థల ద్వారా కాదు. ఈ ఇంటిలిజెన్స్ సంస్థలు ప్రచార సాధనాల్లో తమ దుష్ప్రచారాల ద్వారా కొందరు వ్యక్తుల, కొన్ని సంస్థల ప్రతిష్ఠను పద్ధతి ప్రకారం ధ్వంసం చేశాయి. అందులో విజయం సాధించలేనప్పుడు, అవి వ్యక్తులను కొనివేయడానికి ప్రయత్నించాయి. అది కూడ పనిచేయకపోతే, తమకు లొంగని కశ్మీరీలను హత్య చేయడానికి ప్రయత్నించాయి.

ఈ ఇంటిలిజెన్స్ సంస్థలు ఎటువంటి విషపూరిత వాతావరణాన్ని సృష్టించాయంటే అవి చివరికి భారత అనుకూల నాయకత్వానికి కూడ తోటి కశ్మీరీల దృష్టిలో విశ్వసనీయత, ప్రతిష్ఠ లేకుండా చేయదలచాయి. తమ సొంత విద్రోహ పాత్రను పెంచుకోవడంలో భాగంగా అవి ఒక రాజకీయ శూన్యాన్ని సృష్టించదలచుకున్నాయి.

కశ్మీర్ లో రాజ్య విధానంలో భాగంగా ఉపయోగిస్తున్న చట్టవ్యతిరేక హత్యల, బూటకపు ఎన్‌కౌంటర్ల, విచ్చలవిడి చిత్రహింసల జాబితాలను అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు నమోదు చేస్తున్నాయి. ప్రజా సంకల్పాన్ని దెబ్బతీయడానికి ఇటువంటి పద్ధతుల్లో జరుగుతున్న ప్రయత్నాలన్నీ కూడ రాజకీయాల దివాళాకోరుతనాన్ని సూచిస్తున్నాయి. అవి అంతిమంగా భారత రాజకీయ వ్యవస్థ ప్రజాస్వామిక పునాదులకు హాని చేస్తాయి.

నన్ను ఖతం చేయడానికి కనీసం మూడు సార్లు ప్రయత్నించారు. నేను తీహార్ జైల్లో ఉండగా రెండు సార్లు, ఆ తర్వాత బైట ఉండగా 2005 ఫిబ్రవరి 8న. ఈ హత్యా ప్రయత్నాల మీద ఎటువంటి దర్యాప్తూ జరగలేదు. దర్యాప్తు జరగకపోవడానికి కారణం ఆ హత్యా ప్రయత్నాలన్నీ ఇంటిలిజెన్స్ సంస్థలు చేయించినవి కావడమేనని నేననుకుంటాను. నా సహోద్యోగులకు, న్యాయవాదులకు కూడ ఈ భయ సందేహాలే ఉన్నాయి. వారు ఫిబ్రవరి 9న పోలీసు ప్రధాన కార్యాలయం ముందర నిరసన ప్రదర్శన కూడ జరిపారు. కాని ఇంటిలిజెన్స్ సంస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచే అవకాశమే లేదు.

పోలీసుల, న్యాయవ్యవస్థ పాత్ర

న్యాయస్థానాలూ పోలీసులూ ఎలా పనిచేస్తారో దగ్గరి నుంచి తెలుసుకోవడానికి నాకొక అవకాశం వచ్చింది. తీవ్రమైన ఆందోళన కరమైన విషయమేమంటే పోలీసులు విచారణ పద్ధతులనూ, చివరికి సుప్రీం కోర్టు నిర్దేశించిన మార్గదర్శక సూత్రాలనూ కూడ ఉల్లంఘించినప్పటికీ విచారణ చట్టబద్ధమేనని న్యాయస్థానాలు అంటాయి. ఉదాహరణకు, నా అరెస్టు మెమోను పోలీసులు సృష్టించారు. నా అరెస్టు గురించి ప్రమాణం చేసి మరీ అబద్ధాలు చెప్పారు. నాకు న్యాయవాదిని అనుమతించలేదు. అరెస్టుల గురించీ, నిర్బంధం గురించీ ఉన్న రక్షణలన్నిటినీ తుంగలో తొక్కారు. నా ఇద్దరు చిన్నారి పిల్లలను కూడ అరెస్టు చేసి రోజుల తరబడి నిర్బంధంలో పెట్టుకున్నారు. నేర విచారణా పద్ధతికి సంబంధించిన మౌలిక సూత్రాలను ఇలా ధ్వంసం చేయడం చూసి సీనియర్ న్యాయవాదులు కూడ తమ ఆందోళన ప్రకటించారు.

ఢిల్లీ హైకోర్టు నా మీద కేసు కొట్టివేసి నన్ను నిర్దోషిగా ప్రకటించిన మాట నిజమే. కాని అది మరణశిక్ష విధించిన కింది కోర్టు న్యాయమూర్తిని మందలించలేదు. పోలీసులు పత్రాలను ఫోర్జరీ చేశారని, లేని ఆధారాలను కూట సృష్టి చేశారని హైకోర్టు వ్యాఖ్యానించింది. కాని ఒక అమాయక వ్యక్తిని ఇరికించినందుకు పోలీసులకు శిక్ష విధించలేదు. నేను విడుదల అయిన తర్వాత న్యాయవ్యవస్థను విమర్శించానని నా విశ్వవిద్యాలయ సహోద్యోగులు చాలమంది నన్ను తప్పుపట్టారు. ఇవాళ సుప్రీం కోర్టు కూడ నన్ను నిర్దోషిగా ప్రకటించిన తర్వాత భారత న్యాయవ్యవస్థ ఎంత స్వతంత్రమైనదో గుర్తించమని నాకు సలహా ఇస్తారేమో కూడ. నేనింకా సుప్రీంకోర్టు తీర్పు చదవలేదు. పోలీసుల గురించి, శిక్ష విధించిన సెషన్స్ జడ్జి గురించి, ప్రాసిక్యూషన్ గురించి సుప్రీం కోర్టు ఏమన్నదో నాకు తెలియదు.

కశ్మీరీ ఖైదీలు

కాని వాస్తవమేమంటే భారతదేశమంతటా ఎన్నెన్నో జైళ్లలో కశ్మీరీ ఖైదీలెందరో మగ్గుతున్నారు. తీహార్ జైల్లో ఖైదీలుగా ఉన్నవారందరూ కేసుల్లో ఇరికించబడినవారేనని నాకు తెలుసు. వారిలో కొందరికి ఇంకా చార్జిషీట్లే ఇవ్వలేదు. మరికొందరు ఏళ్ల తరబడి జైలులో వేచి చూస్తున్నప్పటికీ విచారణ ప్రారంభం కాలేదు. వారిలో ఒక్కరికి కూడ సమర్థమైన న్యాయ సహాయం అందడం లేదు. నా సహనిందితుడు మహమ్మద్ అఫ్జల్‌కు కూడ సరైన న్యాయ సహాయం అందలేదు. సక్రమమైన న్యాయ విచారణ జరిగిందనే సంతృప్తి లేకుండా ఒక మనిషికి మరణశిక్షో, యావజ్జీవ శిక్షో వేయడం సరైనదేనా? జైలులో తన మొదటి బిడ్డను ప్రసవించిన అఫ్సాన్ గురు అనుభవించిన వేదనకు ఎవరు పరిహారం చెల్లిస్తారు? రెండు సంవత్సరాలు జైలులో ఉన్న తర్వాత ఇప్పుడు ఆమెను నిర్దోషిగా ప్రకటించి కేసు కొట్టేశారు. ఇంటి గురించీ కుటుంబం గురించీ ఆమె కన్న కలలను ఈ కొట్టివేత వెనక్కి తెచ్చి ఇవ్వజాలదు. ఆమె భర్త ఇంకా జైలులో మగ్గిపోతున్నాడు. కొడుకు తండ్రి లేకుండానే జీవించవలసి వస్తుంది. ఆ శిశువు ఎలా పెరుగుతాడో ఊహించవలసిందే.

ఎంతో మంది కశ్మీరీ విద్యార్థులు జైలులో ఉన్నారు. వారి మీద నేరారోపణలూ చార్జిషీట్లూ లేక విడుదలవుతున్నారు. అలా విడుదలయ్యాక కూడ ఇంతకాలం జైలులో ఉన్నందువల్ల తమ విద్యాసంస్థలకు తిరిగివెళ్లి చదువు కొనసాగించలేరు. చదువుకుని ఏదో ఒక వృత్తిలో ఉద్యోగంలో చేరాలనే వారి ఆశలు భగ్నమైపోతున్నాయి.

ప్రచార సాధనాల పాత్ర

ప్రజాస్వామిక వ్యవస్థలను పరిరక్షించడంలో, కొనసాగించడంలో ప్రచార సాధనాలకు కీలక పాత్ర ఉందని నేననుకుంటాను. దురదృష్టవశాత్తూ నా అనుభవం మీద తెలిసినదేమంటే ప్రచారసాధనాలు ఎంతమాత్రమూ స్వేచ్ఛగా లేవు. ఇది స్వీయనియంత్రణ ఫలితమా, లేక కార్పొరేటీకరణ ఫలితమా నాకు తెలియదు.

కశ్మీర్ ప్రజల వేదనకు చాలవరకు బాధ్యత వహించవలసినది ప్రచారసాధనాలే. కశ్మీరీ ముస్లిం అంటే తీవ్రవాదులకు పర్యాయపదమనే చిత్రాన్ని ప్రచార సాధనాలు తయారు చేసిపెట్టాయి. నా అరెస్టు తర్వాత కొద్దిరోజుల పాటు నా గురించి విషప్రచారాన్ని పోలీసులు ప్రచార సాధనాల ద్వారానే నడిపారు. కోర్టులో పోలీసులు కూడ ఆరోపించని నేరాలను నాకు అంటగట్టి జీ టెలివిజన్ ఒక చిత్రాన్ని తయారుచేసి ప్రసారం చేసింది.

హత్యాప్రయత్నం తర్వాత నేను పోలీసులకు వాంగ్మూలం ఇవ్వలేదనే కారణంతో ప్రచార సాధనాల్లో నామీద దాడి జరిగింది. ఆ సమయానికి నేను నా శరీరమంతా వేరువేరు గొట్టాలతో, నా గాయాలకు ఇంకా కుట్లు పడకుండా, నోట్లో చుక్క నీరు కూడ పడకుండా ఆస్పత్రిలో పడి ఉన్నాను. ఆ సాకు చూపి నేను ఉద్దేశపూర్వకంగానే ప్రకటన ఇవ్వకుండా కాలం గడుపుతున్నానని ఢిల్లీ అధికారులు నన్ను పరీక్షించడానికి మరొక డాక్టర్ల బృందాన్ని పంపించారు. ఈ కొత్త డాక్టర్ల బృందంలో ఒక పోలీసు అధికారి కూడ ఉన్నాడు. నేనప్పటికి వాంగ్మూలం ఇవ్వగలిగిన స్థితిలో లేనని ఎఐఐఎంఎస్ డాక్టర్లు చెపుతున్నప్పటికీ ఈ కొత్త డాక్టర్ల బృందం నామీద అవమానకరమైన పరీక్షలు జరిపింది.

నా మీద హత్యా ప్రయత్నం జరిపినది స్పెషల్ సెల్ పోలీసులని నాకు అనుమానం ఉందని నేను వాంగ్మూలం ఇచ్చాక, పోలీసులు నన్ను మరొక కేసులో ఇరికించడానికి ప్రయత్నించారు. వారు నా కంప్యూటర్ హార్డ్ డిస్క్ తీసుకుపోయి దాన్ని అహ్మదాబాద్‌లోని సిఎఫ్ఎస్ఎల్ లాబరేటరీకి పంపారు. సిఎఫ్ఎస్ఎల్ నివేదిక ఏమి చెప్పిందో తెలియదు గాని, నన్ను చంపడానికి గతంలో ప్రయత్నించిన పోలీసు, ఇంటెలిజెన్స్ ఏజెంట్లే మరొక కేసులో నన్ను ఇరికిస్తారని నాకనిపిస్తున్నది. పోలీసులు నా మీద చేసిన ఆరోపణలను గుప్పించడానికి ప్రచార సాధనాలు ప్రయత్నించాయి గాని నా మీద జరిగిన దాడి వెనుక ఎవరున్నారో పరిశోధించడానికి ప్రయత్నించలేదు. నామీద జరిగిన హత్యాప్రయత్నం చోటా రాజన్, ఇంటెలిజెన్స్ బ్యూరో చేశాయని ఇటీవలనే ఒక పత్రిక రాసింది. ఇవాళ మిమ్మల్ని, ప్రచార సాధనాల ప్రతినిధులను, నేనొక ప్రశ్న అడగదలచాను. మీరు నా పట్ల న్యాయంగా ప్రవర్తించామని అనుకుంటున్నారా?

పౌర సమాజం

నా మీద కేసు కొట్టివేత కోసం జరిగిన ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న, సమర్థించిన అనేకమంది స్త్రీ పురుషులను తలచుకున్నప్పుడు నేను భావోద్వేగంతో కదిలిపోతాను. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పౌరహక్కుల కార్యకర్తలు, దేశవ్యాప్తంగా ఉన్న ఎందరో భారత పౌరులు నాకు మద్దతు ఇచ్చారు. ఎందరో నాకు శుభాకాంక్షలు తెల్పుతూ, ఆశీర్వదిస్తూ సాదరమైన, ఆర్ద్రమైన ఉత్తరాలు రాశారు.

చుట్టూ ఉన్న దురభిప్రాయాల, ద్వేషాల అడ్డుగోడలను ఛేదించుకుని డిఫెన్స్ కమిటీ దేశంలో ఎంతో మందిని చేరగలిగిందనే వాస్తవమే దేశంలో ఇంకా మనం పనిచేయడానికి తగినంత ప్రజాస్వామిక స్థలం మిగిలి ఉన్నదనడానికి చిహ్నం.

నన్ను పరిరక్షించడానికి ఒక చిన్న బృందం ఏర్పాటై, నా కేసు కొట్టివేత కోసం అఖిల భారత ప్రచారాన్ని చేపట్టింది. ఆ బృందంలో చాలమంది నాకు వ్యక్తిగతంగా పరిచయం లేరు. ఈ బృందంలోని స్త్రీ పురుషులు ఒక వ్యక్తి పౌరహక్కుల కోసం మాత్రమే పోరాడలేదనీ, మొత్తంగా భారత ప్రజాస్వామ్యం కోసం పోరాడారనీ నేననుకుంటున్నాను. ఢిల్లీ విశ్వవిద్యాలయ, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ అధ్యాపకులు నాకు న్యాయమైన విచారణ అందకపోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి బహిరంగ లేఖ రాశారు.

ఇంతకు ముందే చెప్పినట్టు, నామీద కేసు కొట్టివేత కోసం ప్రయత్నించినవారందరూ కూడ ప్రజాస్వామిక విలువల పట్ల, న్యాయం పట్ల, స్వేచ్ఛ పట్ల తమ నిబద్ధతతో పనిచేశారు. ఆ క్రమంలో వారిలో చాలమంది నాకు స్నేహితులయ్యారు. నాకు ప్రేమాదరాలను పంచారు. వారిలో ప్రతి ఒక్కరికీ, నా స్నేహితులు, సమర్థకులు, కుటుంబ సభ్యులు అందరికీ, నేను నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నామీద కేసు కొట్టివేయాలని ఎంతో మంది ఆకాంక్షించారనీ, ప్రార్థించారనీ నాకు తెలుసు. అఫ్జల్ కు, షౌకత్ కు, నాకు సెషన్స్ కోర్టు మరణశిక్ష విధించిందని తెలియగానే కశ్మీర్ లో మూడు రోజుల పాటు బంద్ పాటించారు. తోటి కశ్మీరీల పట్ల వారి సంఘీభావానికి సూచన అది. విడుదల తర్వాత నేను బారాముల్లా వెళ్లినప్పుడు అక్కడి ప్రజల ఘనస్వాగతంతో నేను కదిలిపోయాను.

జైళ్ల, చిత్రహింసల, అన్యాయాల అమానుష ప్రపంచం మధ్య కూడ తమ మానవత్వాన్ని కాపాడుకుంటున్న నా తీహార్ జైలు సహఖైదీ స్నేహితులను నేను మరవలేను. జైలులోపల నా మీద జరిగిన హత్యా ప్రయత్నాల నుంచి నన్ను కాపాడడానికి వాళ్లు తమ ప్రాణాలు పణంగా

భావోద్వేగాల కేంద్రంగా ఎన్నికలు

మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రజల మౌలిక సమస్యల గురించి మాట్లాడకుండా బిజెపి జాతీయ, హిందుత్వ భావోద్వేగాలను రెచ్చగొట్టి అధికారాన్ని నిలుపుకుందని అంటున్నారు **వై. రామచంద్రం**

మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలతో పాటు 17 రాష్ట్రాల్లో, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో 51 అసెంబ్లీ స్థానాలకు, 2 పార్లమెంట్ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చాయి. మొదటి నుంచి భావోద్వేగ రాజకీయాలపైనే ఆధారపడిన బిజెపి ఈ ఎన్నికల్లోనూ వాటినే నమ్ముకుంది. మహారాష్ట్ర, హర్యానాల్లో అధికారంలో ఉండి ప్రజలకు చేసిన 'అభివృద్ధి' పనులకు సంబంధించిన ప్రస్తావనలు లేకుండా బిజెపి నాయకుల ఎన్నికల ప్రచార ప్రసంగాలు సాగాయి. జాతీయవాదం, హిందుత్వ భావనల చుట్టే తిప్పి ప్రజలను భావోద్వేగాలకు గురిచేశారు. ఎన్నికలకు ముందు జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370, 35ఏలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి ఆ రాష్ట్రాన్ని బహిరంగ కారాగారంగా మార్చింది. సరిగ్గా ఎన్నికలకు ముందే పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికల లబ్ధికోసమే సైనిక దాడులు జరిగాయి. ఇరు రాష్ట్రాలు వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతుంటే పట్టించుకోని బిజెపి ఓట్లకోసం భావోద్వేగాలనే ముందుకుతెచ్చింది. మహారాష్ట్రలో బిజెపి కూటమి 200కు పైగా, హరియాణాలో 70కు పైగా స్థానాల్లో గెలుస్తుందని పార్టీలు, ఎగ్జిట్ పోల్స్, మీడియా అంచనా వేశాయి. కాని ఈ సారి ఆ రాష్ట్రాల ప్రజలు బిజెపి సృష్టిస్తున్న భ్రమలను పసిగట్టి అంచనాలకు భిన్నంగా ఫలితాలనిచ్చారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, వాటి తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, ఇప్పుడు ఆ రాష్ట్రాల్లో వచ్చిన భిన్న ఫలితాలు పై విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

ఎన్నికలు జరిగిన రెండు రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉంది. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలుండగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన బలం 145. ఫలితాలు చూస్తే బిజెపి 105, శివసేన 56 స్థానాల్లో గెలిచాయి. కూటమి మొత్తం 161 స్థానాలు సాధించింది. కలిసి పోటీచేసిన కాంగ్రెస్‌కు 44, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ 54 స్థానాల్లో గెలిచి మొత్తం 98 వచ్చాయి. మజ్లిస్ 2, ఇతరులు 27 స్థానాల్లో గెలుపొందారు. హర్యానాలో 90 స్థానాలకు గాను 40 బిజెపి, కాంగ్రెస్ 31, జెజెపి 10, ఇతరులు 9 స్థానాల్లో నెగ్గారు. మహారాష్ట్రలో బిజెపి-శివసేన కూటమి మెజారిటీ సాధించగా, హర్యానాలో బిజెపికి పూర్తి మెజారిటీ రాకపోవడంతో జననాయక్ జనతా పార్టీతో పొత్తుపెట్టుకొని అధికారంలోకి వచ్చింది. ఉప ఎన్నికలు జరిగిన 51 స్థానాల్లో బిజెపి 30 స్థానాల్లో గెలుపొందింది.

సాధారణంగా ఎన్నికల్లో పోటీచేసే పార్టీలు తాము ఎన్నికల్లో గెలిస్తే ప్రజలకు ఏమి చేస్తాయో చెప్పాలి. అధికారంలో ఉన్న పార్టీలైతే తాము ఈ ఐదు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఏమి చేశామో, ఇంకా ఏమి చేయాలనుకుంటున్నాయో చెప్పి ప్రజల దగ్గరకు వెళ్లాలి. ఇవేవి కాకుండా ప్రతి పార్టీ ఎన్నికల్లో గెలవడానికి ప్రజలను ప్రలోభపెట్టడానికి మద్యం, డబ్బు పంచుతున్నాయి. వాటితోపాటు ప్రజల్ని కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో విభజిస్తున్నారు. ప్రజల్లో ఉన్న విశ్వాసాలను, పేదరికాన్ని ఆసరా చేసుకొని రకరకాల ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అధికారంలో ఉన్న పార్టీలయితే అధికార దుర్వినియోగానికి పాల్పడడమనేది సాధారణ విషయంగా మారిపోయింది.

ఈ ఎన్నికల్లో బిజెపి ఐదేళ్ల పాలనాకాలంలో ప్రజలకు చేసిన పనుల గురించి ఎక్కడా మాటమాత్రంగా కూడా ప్రస్తావించలేదు. ఒకపక్క బేటీ బచావో బేటీ పఢావో అంటూనే మరోపక్క దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనల్లో బిజెపి ప్రజా ప్రతినిధులు, ఎంఎల్ఏలు, కార్యకర్తలు ఉన్నారు. అత్యాచార ఘటనలు బయటపెట్టినందుకు బాధితుల కుటుంబాన్నే చంపాలనుకున్న ఉత్తరప్రదేశ్ బిజెపి ఎంఎల్ఏ కుల్‌దీప్‌సెంగర్ దుర్మార్గం గురించి తెలిసిందే.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం తెచ్చిన వస్తుసేవల పన్ను(జిఎస్‌టి), డీమోనెటైజేషన్ వల్ల లక్షల్లో చిన్న తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. వ్యాపార రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ముంబైలో నిర్మాణ రంగం దెబ్బతినడం వల్ల ఆ రంగాన్నే నమ్ముకొని బతుకుతున్న లక్షల మంది కూలీలు రోడ్డునపడ్డారు. బ్యాంకింగ్ వ్యవస్థ కుదేలయింది. ఆర్థిక మాంద్యం వల్ల ఆటోమొబైల్ రంగ ఉత్పత్తులను కొనేవారు లేక ఉత్పత్తి ఆగిపోయింది. ఆ రంగంలో పనిచేస్తున్న లక్షల మంది కార్మికుల ఉద్యోగాలు పోయి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

ఇవేవి ఎన్నికల్లో చర్చించదగిన అంశాలుగా పాలక పార్టీ భావించలేదు. జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి నిర్ణయాన్ని మారుస్తామని దమ్ముంటే ప్రకటించాలని నరేంద్ర మోడీ ప్రత్యర్థి పార్టీలకు సవాల్ విసిరాడు. ఆర్ఎస్ఎస్ నేత సావర్కర్‌కు భారతరత్న ఇస్తామని చెప్పి దాన్ని ఏకంగా ఎన్నికల ప్రణాళికలో చేర్చడం వల్ల బిజెపి ప్రాధాన్యతలేంటో అర్థమవుతున్నాయి.

పెట్టి నన్ను ప్రమాదం నుంచి రక్షించారు. నాకు సౌకర్యాన్నీ ఓదార్పునూ ఇచ్చారు. హైకోర్టు నా మీద కేసు కొట్టివేసినప్పుడు ఖైదీలకూ నిర్బంధితులకూ సహాయం చేస్తానని వాగ్దానం చేశాను. ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ కొందరు స్నేహితుల సహాయంతో సొసైటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ డిటెయినీస్ అండ్ ప్రిజనర్స్ రైట్స్ అనే సంస్థ ఏర్పాటు చేశాను.

నా కుటుంబ సభ్యులు నాతో పాటు నిలిచి ఉండడం నా అదృష్టం. నా ఇద్దరు పిల్లలు - నుస్రత్, ఆతిఫ్ - నేను ఒంటరి నిర్బంధంలో ఉన్నప్పుడు నా నైతిక స్థైర్యాన్ని నిలబెట్టారు. వారిని సమర్థంగా రక్షించడానికి నాకు మిగిలిన ఏకైక మార్గం సత్యం కోసం, న్యాయం కోసం, ప్రజాస్వామ్యం కోసం జరిపే పోరాటానికి నా యావజ్జీవితాన్నీ అంకితం చేయడం మాత్రమే. తద్వారానే మనందరమూ కలిసి ఒక మెరుగైన ప్రపంచాన్ని నిర్మించగలం. వీ

ఈ విధంగా పార్టీలు ప్రజల రోజువారి సమస్యలను తప్పుదోవ పట్టించి భావోద్వేగాలను రెచ్చగొట్టి అధికారంలోకి వస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీ అయిన కాంగ్రెస్ తీవ్ర అవినీతిలో కూరుకుపోయి, ఐదేళ్ల కాలంలో బిజెపి విధానాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా అంతర్గత కుమ్ములాటల్లో మునిగిపోయింది. పాలక పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపలేనంత సంకట స్థితిలోకి వెళ్లింది. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు వచ్చిన స్థానాలు పాలక పార్టీ పై ఉన్న వ్యతిరేకతతో వచ్చినవే తప్ప ప్రజల మెప్పుతో వచ్చినవి కాదు.

మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో అమలుచేసిన విధానాలను పరిశీలించాలి. దేశంలో అతిపెద్దదైన పారిశ్రామిక ప్రాంతం ముంబై, అట్లాగే ఎక్కువ మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్న రైతాంగం ఉంది. రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. రైతుల రుణాలు మాఫీ చేయాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని వేల మంది రోడ్లమీదకొచ్చి వందల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. వివిధ ప్రాంతాల్లో ధర్నాలు చేశారు. ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించారు. అయినా ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. మహారాష్ట్రలో సమాచార హక్కు చట్టం కింద 2013 నుండి 2018 వరకు జరిగిన రైతుల ఆత్మహత్యలు వివరాల ప్రకారం.

సం.	మొత్తం కేసులు	అర్హత పొందిన కేసులు	అర్హత పొందని కేసులు	పెండింగ్ కేసులు	నష్టపరిహారం పొందిన రైతులు
2013	1296	665	629	2	665
2014	2039	1358	674	7	1358
2015	3263	2152	1081	30	2150
2016	3080	1768	1292	20	1768
2017	2817	1638	987	292	1611
2018	2761	1330	1050	381	1316

దేశంలో ఆర్థికంగా సంపన్నమైన మహారాష్ట్రలో ప్రధానంగా బిజెపి శివసేన కూటమి అధికారంలో ఉన్న కాలంలో జరిగిన ఆత్మహత్యలు. ఈ దేశంలో రైతులను బతికించడానికి ఆలోచించాల్సింది పోయి చనిపోయిన తరువాత వారి కుటుంబాలకు నష్టపరిహారం కోసం అడుక్కోవాల్సిన దారుణ స్థితి ఉంది. ఈ సంవత్సరం జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు మొత్తం 396 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ రెండు నెలల కాలంలో రోజుకు ఆరుగురు చొప్పున రైతులు ఆత్మహత్మకు పాల్పడిన పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉంది. రైతుల ఆత్మహత్యలు ఆగడానికి పరిష్కార మార్గాల గురించిన ప్రస్తావనే లేదు.

హర్యానాలో ఆకలిచావులు, రైతు ఆత్మహత్యలు నిత్యం కొనసాగుతూనే ఉన్నాయి. తమకు రిజర్వేషన్లు కావాలని జాట్లు చేసిన ఉద్యమంలో కొద్దిమంది మరణించారు. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. గోరక్షణ పేర దళిత, ముస్లింలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. సామూహిక లైంగిక దాడుల్లో హర్యానా దేశంలో మొదటిస్థానంలో ఉంది. చీకటిపడితే మహిళలు ఇల్లు దాడి బయటికొస్తే రక్షణలేని పరిస్థితి. సగటున రోజుకో లైంగిక దాడి జరుగుతున్న విషయాన్ని ప్రభుత్వ నివేదికలే వెల్లడిస్తున్నాయి. డేరాబాబా దురాగతాలను పెంచి పోషించారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఇతర పార్టీలను బలహీన పరచాలనే ఉద్దేశంతో ప్రత్యర్థి పార్టీల నాయకుల అవినీతి కేసులు చూపించి తమ దారికి తెచ్చుకోవాలనుకుంటుంది. అందులో భాగంగానే ఐడి, ఇడిలను ఉపయోగించి లొంగదీసుకునే ప్రయత్నాన్ని ముమ్మరం చేసింది. ఈ దాడి జాతీయ, ప్రాంతీయ పార్టీల నాయకుల మీద కూడ కొనసాగిస్తోంది. తమకు లొంగని నాయకులను అరెస్టుచేసి జైల్లో వేస్తోంది. ఒకవైపు అవినీతి నిర్మూలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి అవినీతికి అతీతం ఏమీకాదు. మధ్యప్రదేశ్‌లో మెడికల్ సీట్ల కుంభకోణం, అట్లాగే రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోళ్లలో జరిగిన కుంభకోణం ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఈ వ్యవస్థనే అవినీతిని కేంద్రంగా చేసుకొని నడుస్తున్నపుడు అవినీతి నిర్మూలిస్తామని చెప్పడమంత పచ్చి అబద్ధం మరొకటి లేదు. తాము చేసిన అవినీతి ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో బిజెపి సమాచార హక్కు చట్టాన్నే సవరించింది. బిజెపి అధికారంలోకి వచ్చాక విశ్వవిద్యాలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా మార్చి ప్రజల్ని భావజాల పరంగా కొన్ని దశాబ్దాల వెనక్కు నెట్టింది.

ముస్లింలకు వ్యతిరేకమైన ట్రిపుల్ తలాక్ బిల్లును బలవంతంగా తెచ్చింది. ముస్లింలు గోవులను చంపుతున్నారని, వాటి మాంసం తింటున్నారని ఆరోపిస్తూ దేశవ్యాప్తంగా మూక దాడులుచేసి వారి ఆర్థిక మూలాలను దెబ్బతీసింది.

ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను ఓడించి వివిధ పార్టీల తరఫున 19 మంది ముస్లిం అభ్యర్థులు గెలిచారు. ఎంఐఎంకు పెరిగిన ఓట్ల శాతం కూడా ప్రభుత్వం ముస్లిం సమూహం పట్ల వ్యవహరించిన తీరును ప్రతిబింబిస్తోంది. దీనివల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలి అది బిజెపి కొన్ని స్థానాల్లో గెలువడానికి కూడా దోహదపడింది. ఇప్పుడు ఎన్నికైన నాయకుల చరిత్రను పరిశీలిస్తే ఎక్కువ మంది తీవ్రమైన కేసుల్లో ఉన్నవారే. అందరూ కూడా కోటీశ్వరులే.

దేశలో ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ ఆర్థిక అంశాల్ని పట్టించుకోకుండా బిజెపి అధికారంలోకి రావడానికి అవసరమైన సాంస్కృతికపరమైన భూమికను రూపొందించింది. హిందుత్వ సంస్కృతిని ప్రశ్నిస్తున్న వారిపై దేశవ్యాప్తంగా హిందు మతోన్మాదులు చేసిన హేతువాదుల హత్యలు, మూక హత్యలు, నిత్యం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు హత్యలు, దళితులపై దాడులు హత్యలు, ఆదివాసి మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు హత్యలు, ఆదివాసి ప్రాంతాల్లో కిక్కిరిసిన జైళ్లు, మేధావులపై మోపబడిన తప్పుడు కేసులను విశ్లేషించుకుంటే పాలకులు దేశంలో ఫాసిజాన్ని అమలు చేస్తున్నారేది వాస్తవం. దేశాన్ని చుట్టుముట్టిన ఆర్థిక మాంద్యం, రైతుల ఆత్మహత్యలు, ముస్లిం సమూహాన్ని తీవ్ర అభద్రతలోకి నెట్టిన స్థితి ఇవన్నీ కూడా పాలకులు చేసిన దురాగతాలు, వైఫల్యాలు.

ప్రజల రోజువారి సమస్యలను పక్కదారి పట్టించడానికి దేశ ప్రధాని వేరే దేశాలకు వెళ్లి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ రోజుకో నాటకాన్ని తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నాడు. ప్రజాస్వామ్యం పేరుతో జరుగుతున్న ఎన్నికలు, ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలేదు.

ప్రజాస్వామ్యం పేర ఈ వ్యవస్థను నిలిపి ఉంచడానికి ఎన్నికలనేవి రాజకీయ పార్టీలకు ఒక లైసెన్స్‌గా ఉపయోగపడుతున్నాయి. దేశ వ్యాప్తంగా పాలకులు అమలుచేస్తున్న విధానాలు ప్రజల ప్రయోజనం కన్నా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుకూలంగానే ఉన్నాయి. దీంతో కోట్లాది ప్రజల జీవితాల్లో సంక్షోభం నెలకొంది. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ వివిధ రూపాల్లో ప్రజలు ఉద్యమిస్తున్నారు. ప్రజల తరఫున ప్రత్యామ్నాయ గొంతు వినిపిస్తున్న మేధావుల్ని నిర్బంధించారు. ఎన్నికలనే ప్రజామోదంగా భావించే పార్టీలు ఈ ఫలితాల్లో ప్రజల ఆమోదాన్ని పొందలేదు. ప్రజల్ని ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా అన్ని పార్టీలను అధికారానికి ఆమడ దూరంలోనే ఉంచారు. రాజకీయ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నాయనడానికి ఎన్నికల ఫలితాలు ఒకానొక సంకేతం.

(రచయిత వీక్షణం సహాయ సంపాదకులు) వీ

కార్మికవర్గ స్ఫూర్తిని చూపిన ఆర్‌టిసి సమ్మె

ఇప్పుడు జరుగుతున్న సమ్మె ఒక ఆర్‌టిసి కార్మికులదే కాదనీ, మొత్తం కార్మికవర్గానికి సంబంధించిందనీ, రాష్ట్రంలోని కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా ఆర్‌టిసి సమ్మెను గెలిపించాల్సిన అవసరం ఉందనీ అంటున్నారు ఎం. శ్రీనివాస్

రాజ్యాధికారానికి, ప్రభుత్వాధికారానికి మధ్య ఉన్న మౌలిక తేడాను వివరిస్తూ 'పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రభుత్వమనేది (పాలకపక్షం) మొత్తం బూర్జువ వర్గ సమిష్టి వ్యవహారాలను చక్కబెట్టే కమిటీ మాత్రమే' అని కార్ల్ మార్క్స్ పెట్టుబడిదారీ సమాజాన్ని విశ్లేషిస్తూ ప్రకటించిన చారిత్రక పత్రం కమ్యూనిస్టు ప్రణాళికలో పేర్కొన్నది. మౌలికంగా దోపిడీ స్వభావం కలిగిన ఏ వ్యవస్థలోనైనా అంటే కోట్లాది మంది శ్రమజీవుల శ్రమశక్తి దోపిడీ పైన ఆధారపడిన సమాజంలో ప్రభుత్వాలు పోషించే పాత్ర ఇదే. నేటి 'బంగారు' తెలంగాణ నిర్మాణాధినేత కేసిఆర్, ఆయన ప్రభుత్వం పోషించే పాత్ర కూడా ఇదేనన్నది మరోసారి తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆర్‌టిసి కార్మికుల సమ్మె అక్టోబర్ 5న అర్ధరాత్రి నుండి మొదలైంది. ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం, మొండి వైఖరి కారణంగా విధిలేని పరిస్థితిలో అనివార్యంగా కార్మికులు సమ్మెలోకి నెట్టబడ్డారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మె సైద్ధాంతిక నిబద్ధత, చైతన్యయుతమైన సమరశీలతతో కొనసాగుతోంది. నిషేధాజ్ఞలు, అక్రమ అరెస్టులు, అణచివేతల మధ్య మరింత పట్టుదలతో నడుస్తోంది. ఆర్‌టిసి కార్మికులు ఆరంభించిన కార్మికోద్యమం క్రమంగా సకల జనుల సమ్మెగా మారుతోంది. జెండాలు, ఎజెండాలతో నిమిత్తం లేకుండా తెలంగాణ సమాజం గర్వించే రీతిలో కార్మికులు, ఉద్యోగులు ఒక్కటేమిటి సమస్త ప్రజానీకం కదులుతోంది. ఇది కార్మికుల ఆత్మగౌరవ పోరాటమే కాదు, ఆర్‌టిసి సంస్థ ఆత్మగౌరవ పోరాటం కూడా. సామాజిక బాధ్యత నిర్వహణ కర్తవ్యంలో ఉన్న ఈ సంస్థ ఆత్మగౌరవ పోరాటమంటే తెలంగాణ సమాజ ఆత్మగౌరవ పోరాటమే. కనుక సంస్థ పరిరక్షణ ఆత్మగౌరవ పోరాటంలో ఉన్న కార్మికులకు తెలంగాణ సమాజం అండగా నిలవాలి. ప్రజలు భాగస్వాములై ఆర్‌టిసి సమ్మె ప్రజా ఉద్యమంగా సాగాలి. లాభనష్టాలతో సంబంధం లేకుండా సామాజిక బాధ్యత కలిగి సేవా దృక్పథంతో ఆర్‌టిసి సంస్థను నిర్వహించాల్సిన కెసిఆర్ ప్రభుత్వం ఆ బాధ్యతను విడనాడింది. ప్రజా రవాణా అవసరాలకు ఆటంకాలు ఏర్పడకుండా చేపట్టాల్సిన నిర్మాణాత్మక చర్యలను విస్మరించి ప్రజలను కష్టాలలోకి ఈడ్చింది. ఆర్‌టిసి కార్మికులు ఎన్నో కష్టనష్టాలను అధిగమిస్తూ, రేయింబవల్లు శ్రమిస్తూ ప్రజల సేవలో నిమగ్నమై, రాష్ట్ర ఆదాయానికి దండిగా నిలబడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, వివక్ష మౌలిక వసతుల లేమితో తీవ్ర పనిభారంతో బతుకు జీవుడా అంటూ ఉద్యోగ విధులను కార్మికులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఉద్యోగ భద్రతకు మూలమైన ఆర్‌టిసి పరిరక్షణ మనుగడకే ప్రమాదం ఏర్పడింది. కనుక ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా నాడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక ఆకాంక్షలలో భాగమైన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనే రాజకీయ డిమాండ్ ప్రాతిపదికన జరిగిన ఆనాటి ఉద్యమంలో సకల జన స్రవంతులు కలిశాయి. నాడు జరిగిన 42 రోజుల సకల జనుల ఉద్యమంలో ఆర్‌టిసి చక్రం ఆగిపోయిందీ తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల కోసమే. నేడు ఆర్‌టిసి చక్రం ఆగింది కూడా ప్రజా వనరుల పరిరక్షణ, ప్రజా రవాణా వంటి ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణ కోసమే. ఆనాటి ఉద్యమంలో వందల మంది ప్రాణత్యాగం చేస్తే, నేటి ఉద్యమంలో శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, తదితర కార్మికులు ఆత్మబలిదానం చేశారు. ప్రజా వనరులను కార్మికులు తమ శ్రమశక్తితో కూడబెట్టిన ఆర్‌టిసి స్థిరాస్తుల వంటి ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసమే ఈ ఆత్మబలిదానాలు జరిగాయి. ఆత్మ హత్యలు సూత్రరీత్యా ఆమోదయోగ్యమైనవి కావు, అంగీకరించదగినవి అంతకంటే కాదు. నాటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం కావచ్చు, నేడు ఆర్‌టిసి సంస్థ పరిరక్షణ కోసం కావచ్చు, ఈ ఉద్యమాలు స్థూలంగా తెలంగాణ ప్రజల దీర్ఘకాల డిమాండ్ల సాధనకోసమే. ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న సమ్మె వారి ఆర్థిక, సర్వీసు తదితర హక్కుల కోసం కాదు. తెలంగాణ రాష్ట్ర ప్రజా రవాణా వ్యవస్థ దశాబ్దాల కాల వ్యవధిలో కార్మికులు తమ శ్రమశక్తి ద్వారా పోగేసిన స్థిరాస్తులను దేశీయ, స్థానిక బడా కార్పొరేటు శక్తులకు, సంస్థలకు, పాలక ప్రభుత్వాధినేత అనుంగులకు కట్టబెట్టే కుట్రలకు వ్యతిరేకంగా సాగుతున్న కార్మిక మహోద్యమం ఇది.

సమ్మె చట్టవిరుద్ధం కాదు

ఆర్‌టిసి కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం 2019 ఆగస్టు తొలి వారంలోనే కార్మిక సంఘాలు ప్రభుత్వానికి, కార్మిక శాఖలకు పారిశ్రామిక వివాదాల చట్టం – 1948లోని సెక్షన్ 22 ప్రకారం డిమాండ్ల పత్రాన్ని ఇచ్చి చర్చల ద్వారా ఆ సమస్యలను పరిష్కరించుకుందామని కోరాయి. ఆర్‌టిసి కార్మికులు గత కొంత కాలంగా ఆర్‌టిసి యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఎన్నో విన్నపాలు, విజ్ఞప్తులు చేసినప్పటికీ పట్టించుకోక పోవడం వలన ఇటీవల కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సామూహిక నిరాహార దీక్షలు నిర్వహించారు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లోనైతే సమ్మెలోకి వెళతామని నాటి డిమాండ్ల పత్రంలోనే పేర్కొన్నాయి. నెలన్నర కాలంలో ప్రభుత్వం, కార్మిక శాఖలు పట్టించుకోలేదు. కనీసం గుర్తింపు సంఘంతోనైనా చర్చలు జరుపలేదు. కార్మిక శాఖ కమిషనర్ ఈ డిమాండ్లపై చర్చలు, సంప్రదింపులు వంటి ప్రయత్నాలకు కృషి చేయలేదు. ఇక రేపో, మాపో కార్మికులు సమ్మెలోకి

వెళతారనుకున్న సమయంలో చర్చల ప్రక్రియకు తెరలేపింది ప్రభుత్వం. ఉన్నత అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని నియమించి చర్చల ప్రహసనాన్ని సాగించింది. ఈ కమిటీకి ఏ విధమైన నిర్ణయాధికారం లేదు. కనీసం ఏ ఒక్క డిమాండు పైనా రాత పూర్వకంగా హామీ ఇచ్చే అధికారం కలిగి లేదు. ఆ కమిటీ జరిపిన నామమాత్రపు చర్చలు విఫలమయ్యాయి. రెండు, మూడు దఫాలుగా చర్చలు జరిపినా తొలివిడత చర్చల్లో చెప్పిన విషయాలే, అభిప్రాయాలే త్రిసభ్య కమిటీ వ్యక్తం చేస్తూ వచ్చింది. ప్రభుత్వ విధాన వైఖరిలో మార్పు కనపడలేదు. ఇక కార్మికులు విధిలేని పరిస్థితుల్లో అనివార్యంగా సమ్మెలోకి నెట్టబడ్డారు. తొలి నుంచి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే చర్చల విఫలతకు, కార్మికులు సమ్మెలోకి వెళ్లడానికి మూలకారణం. ఈ సమ్మెకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడం ద్వారా సమ్మెను విరమింపజేసే బాధ్యతను విస్మరించి ఈ సమ్మె చట్ట విరుద్ధమని రవాణా శాఖా మంత్రి పదే పదే ప్రకటించడం హాస్యాస్పదం. కానీ ఇది వాస్తవం కాదు. డిమాండ్లపై యాజమాన్యంతో సంప్రదింపులు జరుపడం, బేరసారాలు సాగించడం కార్మికుల హక్కు. కార్మిక ప్రతినిధులను ఆహ్వానించి డిమాండ్లపై చర్చించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన, కార్మిక శాఖ పైన ఉన్నది. అది విఫలమైతే కార్మికులకు ఉన్న ఏకైక రాజ్యాంగబద్ధ హక్కు సమ్మె చేయడం. ఈ ప్రయత్నాలేవీ జరగని కారణంగానే కార్మికులు సమ్మెలోకి దిగారు. సమ్మెల విషయంలో న్యాయస్థానాల గత తీర్పులెన్నో ఉన్నాయి. ఇటీవల మద్రాసు హైకోర్టు ఒక తీర్పు సందర్భంగా ఏం చెప్పిందో గమనిస్తే 'న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేయడం చట్టవిరుద్ధం కాదు. సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ప్రభుత్వాలు ఆ పనిచేయడంలో విఫలమైనప్పుడు సమ్మెలు జరిగే పరిస్థితి ఏర్పడుతోంది.' సరిగ్గా తెలంగాణ సమాజంలో ప్రస్తుతం జరిగిందీ కూడా ఇదే. 'స్వాతంత్ర్యం కోసం పోరాడడం ఎంత పవిత్రమైనదో శ్రామిక వర్గం తమ హక్కుల కోసం సమ్మె చేయడం అంతే పవిత్రమైనద'ని డా. బి.ఆర్. అంబేద్కర్ అంటాడు. ఇది చారిత్రక సత్యం. ఇవ్వాళ ఆర్‌టిసి కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెను గమనిస్తే ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం చేసిన ఉద్యమం, పోరాటం ఎంత పవిత్రమో ఆర్‌టిసి కార్మికులు నేడు తమ హక్కుల కోసం, సమాజ ప్రయోజనాల కోసం సమ్మెను చేయడం కూడా అంతే పవిత్రమైనది. అంతేకాదు, జీవించే హక్కుకు భంగం వాటిల్లినప్పుడు దానిని నిలబెట్టుకోవడానికి జరిగే ప్రయత్నాలకు భారత రాజ్యాంగం గ్యారంటీనిచ్చింది. ఆర్టికల్ 21, 19 ఈ అంశాన్నే నొక్కి చెబుతున్నాయి. ఆర్‌టిసి పరిరక్షణ అంటే సామాజిక ప్రయోజనాలతో పాటు ఉద్యోగ భద్రత కూడా. దానికి భంగం వాటిల్లినప్పుడు సమ్మె చేయడం కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కు ఇది. ఈ దృక్పథంతోనే ఆర్‌టిసి కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు. అయినప్పుడు సమ్మె చట్టవిరుద్ధం ఎలా అవుతుంది?

చరిత్ర క్రమం

సామాన్య, నిరుపేద ప్రజలకు ఆర్‌టిసి బస్సు ఒక అభయ ప్రయాణ సాధనం. ప్రజా రవాణా వ్యవస్థకు ప్రధాన ఆలంబనగా ఉన్న ఆర్‌టిసి సంస్థకు ఉన్న చరిత్ర చాలా విశిష్టమైనది. బ్రిటిష్ వలస పాలనా కాలంలో బ్రిటిష్ ఇండియా నుండి ప్రపంచ దేశాలకు విమానయానం ఒక అరుదైన విషయం. అయితే, ఈ కాలంలోనే రవాణా వ్యవస్థలో భాగమైన ప్రజా రవాణా విభాగానికి ఘనమైన చరిత్ర హైదరాబాద్ రాజ్యానికి (నిజాం సంస్థానం) ఉన్నది. హైదరాబాద్ సంస్థానంలో తొలుత విమానయానం సర్వీసులు, రైల్వేలు, రోడ్డు రవాణా సంస్థ ఒకే విభాగం కింద విజయపథంలో సమర్థవంతంగా నిర్వహించబడింది. వలస పాలకులకు ధీటుగా వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా హైదరాబాద్ సంస్థానంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే రవాణా వ్యవస్థను నిర్వహించిన ఒక భౌతిక వాస్తవం మన ముందున్నది. ఈ క్రమంలో రోడ్డు రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడంతో పాటు ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యాలను మెరుగుపరిచే ప్రక్రియలో భాగంగా రైల్వేలకు అనుబంధంగా నిజాం స్టేట్ రైల్వే (ఎంఎస్‌ఆర్) ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 1932లో రోడ్డు మెకానికల్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ (ఆర్‌ఎంటిఎస్)ను నెలకొల్పారు. ఈ సేవల నిర్వాహణకు గానూ ప్రస్తుతం ఉన్న ఇమ్లీబన్ సెంట్రల్ బస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పాత సెంట్రల్ బస్ స్టేషన్ ఆవరణలో అమెరికన్ నిపుణుల సహకారంతో ఒక సువిశాలమైన అంగర్‌ను నిర్మించారు. బ్రిటన్ నుండి దిగుమతి చేసుకున్న అత్యాధునికమైన 27 బస్సులు, 166 మంది సిబ్బందితో రోడ్డు రవాణా వ్యవస్థను మరింత పటిష్టపరిచేలా సంకల్పంతో 1936లో ప్రత్యేకంగా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఆర్‌టిడి) ఆవిర్భవించింది. తదుపరి కాలంలో పెరిగిన, పెరుగుతున్న ప్రజా రవాణా అవసరాల రీత్యా ఈ సంస్థను మరింత నిర్మాణాత్మకంగా పటిష్టపరచడానికి రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ (ఆర్‌టిఎస్)గా మార్చారు. గమనించవలసిన విషయమేమిటంటే చివరి నిజాం ఉస్మాన్ ఆలీ ఖాన్ తన తల్లి అమ్తుల్ జహేరా బేగం (ఎజెడ్) పేరుతో ఈ బస్సులను రిజిస్ట్రేషన్ చేయించాడు. హైదరాబాద్ సంస్థానాన్ని ఆక్రమిత బలవంత విలీనం సమయంలో కూడా బస్సులకు ఈ పేరుతోనే రిజిస్ట్రేషన్ కొనసాగే విధంగా భారత పాలకుల (ఇండియన్ యూనియన్) చేత అంగీకరింపజేసుకున్నాడు. బలవంతపు విలీనం తర్వాత మూడేళ్ళ వరకు ఈ విధానమే ఉంటూ హైదరాబాద్ రాష్ట్రంలో ఒక ప్రభుత్వ శాఖగా 1958 వరకు కొనసాగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించిన తర్వాత అంటే 1959లో ఎపిఎస్ ఆర్‌టిసిగా తుదిరూపం తీసుకున్నది. ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించిన ఒక సందర్భంలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మన ఆర్‌టిసి సంస్థను ఉద్దేశించి 'ఈ ఆర్‌టిసి సంస్థను నవభారతంలోని కొత్త రాష్ట్రాలన్నీ ఆదర్శంగా తీసుకోవాలి' అని సూచించాడు. అంతే కాదు, మన ఆర్‌టిసి సంస్థ దేశానికే దిక్సూచిగా నిలవడమే కాక అతి పెద్ద ప్రజా రవాణా సంస్థగా గిన్నిస్‌బుక్ రికార్డులో స్థానం సంపాయించింది. హైదరాబాద్ రాష్ట్రంలో కేవలం 27 బస్సులు, 165 మందితో ప్రారంభమైన ప్రజా రవాణా సంస్థ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో టిఎస్ ఆర్‌టిసి 2019 గణాంకాల ప్రకారం 97 బస్సు డిపోలు, 350పై చిలుకు బస్‌స్టాండ్‌లుగా విస్తరించింది. 10,460 బస్సులు కలిగి ఉండి, 49,733 మంది కార్మికులతో రోజుకు 36 లక్షల కి.మీ.లు తిరుగుతూ సుమారు 97 లక్షల మంది ప్రయాణికులను ఆయా గమ్యస్థానాలకు చేరవేస్తూ బలమైన వ్యవస్థగా ఆవిర్భవించింది.

ఆర్‌టిసి సంస్థ నష్టాలకు కారణాలేమిటి?

సేవా రంగంలో భాగమైన ఆర్‌టిసిని లాభనష్టాల దృష్టితో చూడడం సైద్ధాంతికంగా తప్పు. 'సంక్షేమ' రాజ్యంలో ప్రభుత్వం నిర్వర్తించాల్సిన

కనీస బాధ్యతను, విధులను విస్మరించిన ఫలితమే ప్రస్తుత ఈ పరిస్థితికి కారణం. నిజానికి ఆర్‌టిసి నష్టాలలో లేదు. ఇవి అసహజమైన నష్టాలు. లేదా కృత్రిమ నష్టాలు మాత్రమే. అయినా ఆర్‌టిసి సంస్థ నష్టాలకు కారణం కార్మికులు కాదు. ప్రభుత్వ విధాన వైఖరియే. ఆర్‌టిసి సంక్షోభానికి కార్మికుల వైఫల్యం కాదు, ప్రభుత్వ విధాన వైఫల్యమే. ఎందుకంటే 2014లో ఆర్‌టిసి సంస్థలో ఉన్న 57 వేల మంది కార్మికులు 125 కిలోమీటర్ల (ప్రస్తుతం 135 కి.మీ.) దూరం బస్సులు నడిపారు. ఆ తర్వాత 6 వేల మంది కార్మికులు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో ఒక్కరిని కూడా రిక్రూట్ చేయలేదు. సంస్థ నిర్వహణలో ఉండే కార్మికులలో 6 వేల మంది తగ్గితే ఆ మేరకు బస్సులు తిరిగే కిలోమీటర్లు తగ్గి ఆదాయం పడిపోవాలి. కానీ, బస్సులు తిరిగే కిలోమీటర్ల పరిధి తగ్గకపోగా పెరిగింది. ఆదాయమూ పెరిగింది. అదే విధంగా టైర్ లైఫ్ 1.64 లక్షల కిలోమీటర్ల నుండి 1.98 లక్షల కిలోమీటర్లకు పెంచారు. ప్రమాణాల రేటు కూడా లక్ష కిలోమీటర్లకు 0.08 శాతం నుండి 0.06 శాతానికి తగ్గించగలిగారు. బ్రేక్ డౌన్ రేట్లు 0.05 శాతం నుండి 0.02 శాతానికి తగ్గించారు. వాహన వినియోగం 330 కి.మీ. నుండి 340 కి.మీ.కు పెరిగింది. 50 శాతం బస్సులు కాలం చెల్లినవే. వాస్తవానికి ప్రతి రెండు రోజులకు మూడు బస్సులు స్క్రాప్‌గా మారుతున్నాయి. ప్రతినెల సుమారు 100 మంది కార్మికులు పదవీ విరమణ చేస్తున్నారు. అయినా కొత్త బస్సుల కొనుగోలుకు అనుమతి లేదు. ఉద్యోగాల భర్తీకి ఊసే లేదు. బస్సు స్టాపు నిష్పత్తి బస్సు వెనక 5.9 మంది నుండి 5.5 మందికి తగ్గింది. దీనిలో కండక్టర్లు, డ్రైవర్లు కలిపి 5.2 శాతం ఉంటే 0.36 శాతం మెకానికల్, ఆఫీసు సిబ్బంది కలిపి ఉన్నారు. ప్రస్తుతం ఆర్‌టిసి సంస్థ అసహజ లేదా కృత్రిమ నష్టాల్లో (అప్పులు) ఉన్న మాట వాస్తవమే. ఈ నష్టం 2014-15లో రూ.1964.4 కోట్లు కాగా, 2019 నాటికి ఈ అప్పు మరింత పెరిగి రూ.3,234.75 కోట్లకు చేరుకున్నది. వీటిపై చెల్లించే వడ్డీ రూ.629.49 కోట్లు. ఈ మొత్తాన్ని ఆర్‌టిసి సంస్థే చెల్లిస్తుంది. అయితే ఆర్‌టిసి సంస్థకు ప్రభుత్వం నుండి, జిహెచ్‌ఎంసి నుండి రావల్సిన బకాయిలే సుమారు 2,700 కోట్లు. వాటిలో కేవలం 720 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. అయితే ముఖ్యమంత్రే స్వయానా తప్పుడు లెక్కలతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడు. ఆర్‌టిసికి రూ. 6 వేల కోట్ల అప్పులు ఉన్నాయని చెప్పడం పచ్చి అబద్ధం. నిజానికి ఈ ఆరేండ్ల కాలంలో ఆర్‌టిసి సంస్థయే వివిధ పన్నుల రూపంలో ప్రభుత్వానికి రూ. 6 వేల కోట్లు చెల్లించింది. వీటిని మినహాయిస్తే ఆర్‌టిసి నష్టాలలోనే ఉండదు. అయినా ఆర్‌టిసి సంస్థకు నష్టాలు వస్తున్నాయంటే ఇందుకు ప్రభుత్వ విధాన వైఫల్యమే తప్ప కార్మికులు కాదు. ఆర్‌టిసి సంస్థ నష్టాలకు నిర్దిష్ట కారణాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుండి, జీహెచ్‌ఎంసీల నుండి రావాల్సిన బకాయిలు రాకపోవడం, డీజిల్‌పై అదనపు భారాన్ని ప్రభుత్వం భరించకపోవడం, మోటారు వాహనాల పన్ను, జీఎస్టీ పన్ను, టోల్‌ప్లాజా వంటి వివిధ రకాల పన్నుల నుండి మినహాయింపు లేకపోవడం, అద్దె బస్సులను అనుమతించడం, స్టేజీ క్యారేజీల నుండి ప్రయాణీకులను తరలించే ప్రక్రియను ప్రైవేటు వాహనాలను ముమ్మరంగా సాగించడం, ప్రతి మండల కేంద్రంలో ఆర్‌టిసికి స్థలాలు, గదులు ఉన్నందున కార్గో (వస్తు రవాణా) సర్వీసులు ప్రారంభించాలన్న కార్మికుల ప్రతిపాదనలను ఆర్‌టిసి యాజమాన్యం పట్టించుకోకపోవడం, లాభాలు వచ్చే రూట్లను ప్రైవేటు సర్వీసులకు పర్మిట్లు ఇవ్వడం వంటి కారణాలే స్థూలంగా ఆర్‌టిసి నష్టాలకు మూలం.

ఆర్‌టిసి బస్సులు రోజుకు సుమారు 36 లక్షల కి.మీ.లు తిరుగుతూ 7 లక్షల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తున్నాయి. అంటే ప్రతి ఏటా సుమారు 25 కోట్ల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తున్నాయి. 2014 నుండి పెరుగుతున్న డీజిల్ ధరల భారం ఆర్‌టిసి సంస్థను నష్టాల్లోకి నెట్టింది. ఉదాహరణకి డీజిల్ ధర ఒక్క రూపాయి పెరిగినా రూ.25 కోట్లు అదనపు భారం సంస్థపై పడుతుంది. ఆ విధంగా చూస్తే 2015 మే మూడవ వారంలో చివరిసారిగా బస్సు ఛార్జీలు పెంచినప్పుడు డీజిల్ రేటు లీటర్‌కు రూ.48 ఉంటే ప్రస్తుతం రూ.78కు చేరుకున్నది. డీజిల్ ధర పెరుగుదల వల్ల ఆర్‌టిసి సంస్థ సాలీనా రూ.750 కోట్లు నష్టపోతున్నది. డీజిల్‌పై అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించాలి. ఆ బాధ్యత నుండి ప్రభుత్వం తప్పించుకుంటుంది. ఈ భారాన్ని ఛార్జీల పెంపు రూపంలో పూడ్చుకోవాలి, లేదా సామాజిక బాధ్యత కలిగిన 'సంక్షేమ' రాజ్యా నిర్వాహకులుగా చెప్పుకుంటున్న ఘనత వహించిన పాలకులే భరించాలి. కానీ ఆ బాధ్యతలు విస్మరించడమే కాక కేసిఆర్ ప్రభుత్వం అరబ్ ఎమిరేట్స్, ఖతర్ ఎయిర్‌వేస్ వంటి విదేశీ ఎయిర్ లైన్స్‌లతో పాటు స్వదేశీ విమానయాన సంస్థలు వినియోగించిన విమాన ఇంధనంపై ఉన్న 16 శాతం వ్యాట్‌ను ఒక కలం పోటుతో ఒక శాతానికి తగ్గించింది. కోట్లాది మంది సామాన్య, పేద ప్రజలు ప్రయాణించే ఆర్‌టిసి బస్సులకు మాత్రం వ్యాట్ 27 నుండి 28 శాతం ట్యాక్స్‌ను వసూలు చేస్తుంది. అదే విధంగా ప్రభుత్వం ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్‌టిసి ద్వారా లాభనష్టాలతో సంబంధం లేకుండా సామాజిక బాధ్యతతో సేవలందించాలి. పబ్లిక్ సర్వీసులో ఉండి సేవలందిస్తున్న ఈ సంస్థను అన్ని రకాల పన్నుల నుండి మినహాయించాలి. కానీ అందుకు భిన్నంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్నాయి. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంధనం, టోల్‌ప్లాజా, విడి భాగాలపై సేల్ ట్యాక్స్, వ్యాట్, జీఎస్టీ తదితర పేర్లతో వందల కోట్లను ఆర్‌టిసి సంస్థ నుండి పన్నుల రూపంలో వసూలు చేస్తుంది. ప్రతి ఏటా ఇంధనం పన్ను రూ.290.66 కోట్లు, మోటర్ వాహనాల పన్ను రూ.236.18 కోట్లు, విడి భాగాల కొనుగోలుపై పన్ను రూ.150 కోట్లు, టోల్‌ప్లాజాపై రూ.60 కోట్లు, జీఎస్టీ ద్వారా రూ.100 కోట్లు ఆర్‌టిసి సంస్థ చెల్లిస్తోంది. 2014-19 మధ్య కాలంలో మోటర్ వాహనాల ట్యాక్స్ కింద రూ.1052 కోట్లు, ఇంధనంపై ట్యాక్స్ రూ.1234.61 కోట్లు, విడి భాగాలపై పన్ను రూ.750 కోట్లు, టోల్‌ప్లాజాపై పన్ను రూ. 300 కోట్లు, జీఎస్టీ రూ.300 కోట్లు చెల్లించింది. అంటే ఈ ఐదేళ్ల కాలంలో ఆర్‌టిసి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ.2 వేల కోట్లు చెల్లిస్తే ప్రభుత్వం ఆర్‌టిసి సంస్థకు రూ.710 కోట్లు మాత్రమే ఇచ్చింది.

బాధ్యత లేని బడ్జెట్ కేటాయింపులు

జాతీయోద్యమ స్ఫూర్తితో ప్రజా రవాణా వ్యవస్థను ప్రభుత్వ పరిధిలో నిర్వహించాలన్న సదుద్దేశం, సంకల్పమే వలస పాలన అనంతరం 50వ దశకంలో 'ఆర్‌టిసి యాక్టు - 1950'కు రూపకల్పన జరిగింది. ఈ యాక్టు ఆధారంగానే దేశంలో సుమారు 60 ఆర్‌టిసిలుగా ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి పరిచారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా ఒక సమాజిక బాధ్యతగా ప్రభుత్వాలు రోడ్డు రవాణా వ్యవస్థలో భాగమైన ఆర్‌టిసిలను ఆదరించాలని డా. బి.ఆర్. అంబేద్కర్ సూచించాడు. అంటే

ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడానికి, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడం, అభివృద్ధి పరచడం వంటి తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వార్షిక బడ్జెట్లలో తగినన్ని నిధులు కేటాయించాలని కూడా అంబేద్కర్ సూచించారు. గతంతో పోల్చితే ప్రయాణ అవసరాలు పెరిగాయి. ప్రజా రవాణా అవసరాలు ప్రతియేటా 15 శాతం పెరుగుతున్నాయి. సామాన్య, నిరుపేద వర్గాలకు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యానికి అందుబాటులో ఉన్న ఏకైక ప్రయాణ సాధనం ఆర్‌టిసి బస్సు మాత్రమే. కనుక దీని నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, సేవలను విస్తృత పరచడానికి అవసరమైన అభివృద్ధి ప్రక్రియకు తగినన్ని నిధులు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంటుంది. చాలా రాష్ట్రాలు తమ వార్షిక బడ్జెట్లలో తగిన విధంగా నిధులు కేటాయిస్తున్నాయి. ఉదాహరణ కేరళ, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాలు తమ వార్షిక బడ్జెట్లలో వరుసగా రు. 3 వేల కోట్లు, రు. 4,700 కోట్లు కేటాయించాయి. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆర్‌టిసికి 2014 నుండి 2019 వరకు వార్షిక బడ్జెట్లలో కేటాయింపులు నామ మాత్రంగానే ఉన్నాయి. ఈ ఐదేండ్ల కాలంలో కేటాయించినవి రు. 1360 కోట్లు కాగా, చెల్లించినవి రు. 620 కోట్లు మాత్రమే. అయితే ఆర్‌టిసి సంస్థ నుండి రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల టాక్సీల రూపంలో ప్రతియేటా వందల కోట్లను దండుకుంటుంది. ఆర్‌టిసి సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం బడ్జెట్ కేటాయింపులు పరిశీలిద్దాం. 2014-15 రు. 100 కోట్లు కేటాయించగా రు. 100 కోట్లు చెల్లించారు. 2015-16 రు. 110 కోట్లు కేటాయించగా రు. 102.5 కోట్లు చెల్లించారు. 2016-17 రు. 110 కోట్లు కేటాయించగా రు. 27.50 కోట్లు చెల్లించారు. 2017-18 రు. 520 కోట్లు కేటాయించగా రు. 260 కోట్లు చెల్లించారు. 2018-19 రు. 520 కోట్లు కేటాయించగా రు. 130 కోట్లు మాత్రమే చెల్లించారు.

కెసిఆర్ లక్ష్యం ఆర్‌టిసిని ప్రైవేటీకరించడమే!

ఆర్‌టిసి సమ్మె నేపథ్యంలో అక్టోబర్ 6న రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం పేరిట ఆర్‌టిసి ప్రైవేటీకరణకు పూనుకున్నాడు. సునీల్ శర్మ కమిటీ ఆర్‌టిసికి సంబంధించి చేసిన ప్రతిపాదనలతో కూడిన నివేదికను ఈ సమావేశంలో చర్చించారు. ఆర్‌టిసిని మూడుగా విభజించాలని సమావేశం నిర్ణయించింది. ప్రస్తుతం ఆర్‌టిసి నడుపుతున్న 10,400 బస్సులను మూడు రకాలుగా అంటే 50 శాతం బస్సులు (5200) ఆర్‌టిసి తన స్వంత బస్సులుగా ఆర్‌టిసి యాజమాన్యంలో పెట్టుకుని నడుపుతాయి. 30 శాతం బస్సులు (3100) అద్దె ప్రాతిపదికన ఆర్‌టిసి డిపోల్లో పెట్టుకుని తన పర్యవేక్షణలో నడపాలి. మరో 20 శాతం బస్సులు (2100) పూర్తిగా ప్రైవేటుకు చెందినవి. కార్మిక చట్టాల సవరణలో భాగంగా నూతనంగా వచ్చే మోటారు వాహనాల యాక్టులో రవాణా వ్యవస్థలో 20 శాతం ప్రైవేటీకరించుకోవచ్చునని చెప్పారు. కెసిఆర్ ఇచ్చే 20 శాతం ప్రైవేటు బస్సులకు ప్రైవేట్ స్టేజీ క్యారేజీగా అనుమతిని ఇస్తారు. అద్దెకు తీసుకున్న బస్సులు, స్టేజీ క్యారేజీ బస్సులు ఇతర రూట్లతో పాటు నగరంలో కూడా నడపాలి. ఆర్‌టిసి, ప్రైవేటు బస్సుల చార్జీలు సమానంగా ఉండేలా ఆర్‌టిసి నియంత్రణలో ఉంటాయి. ఇప్పటికే ఆర్‌టిసిని నష్టాల నుండి తప్పించడానికి 25 శాతం అద్దె బస్సులను తీసుకోవాలని బెంగుళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చేసిన సిఫార్సుల మేరకు 2005లో అద్దె బస్సుల నిర్వహణకు అవకాశం కల్పించారు. దీని ఆధారంగా 21 శాతం అద్దె బస్సులను ఆర్‌టిసి నడుపుతున్నది. మరో 9 శాతం అద్దె బస్సులను తీసుకుంటున్నది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఆర్‌టిసి ప్రైవేటీకరణకు పునాదులు పడ్డాయి.

90వ దశకంలో వచ్చిన నయా ఉదారవాద ఆర్థిక విధానాల పూర్వ రంగంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసిని రెండు ముక్కలు చేసి, ప్రైవేటీకరించడానికి జరిగిన తీవ్ర ప్రయత్నాలు కార్మిక ప్రతిఘటనతో వెనక్కి తగ్గాయి. చాలా కాలంగా ఆర్‌టిసిలో కార్మిక వ్యతిరేక సంస్కరణలు అమలవుతున్నాయి. శాశ్వత పనిస్వభావం కలిగిన పనిస్థలాలలో శాశ్వత ఉద్యోగులే ఉండాలన్న నియమాన్ని బుట్టదాఖలు చేసిన పాలకులు ఆర్‌టిసి సంస్థలో అంతర్గత ప్రైవేటీకరణకు తెరలేపారు. గ్యారేజీల్లో 5 వేల మంది కార్మికులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్‌టిసిలో ఉండే 42 రకాల పనుల్లో 28 రకాల పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారు. ఒక అంచనా ప్రకారం 2014లో 1400 అద్దెబస్సులు ఉంటే 2019 నాటికి అవి 2856కు పెరిగాయి. ఈ అద్దె బస్సులలో 5 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులు చెమటోడ్చి కూడబెట్టిన ఆర్‌టిసి స్థిరాస్తులను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడమో, అమ్మివేయడమో లేదా గులాబీ పార్టీ బడా బాబులకు ఇవ్వడం జరుగుతుంది. బస్సు భవన్ పక్కనే ఉన్న 10.04 ఎకరాల ఖాళీ స్థలం (సుమారు విలువ రూ. 500 కోట్లు) గులాబీ పార్టీకి చెందిన బడా నాయకుని తనయుడికి కట్టబెట్టడానికి ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటికే వరంగల్‌లో ఉన్న టైర్ ట్రేడింగ్ సంస్థకు చెందిన స్థలాన్ని (సుమారు విలువ 76 కోట్లు) టిఆర్‌ఎస్ ఎంపీకి లీజు పేరుతో కట్టబెట్టారు. కరీంనగర్‌లో ఉన్న ఆర్‌టిసి స్థలాన్ని 66 ఏండ్ల లీజుకు ప్రతిమ గ్రూపుకు ఇచ్చారు. వర్క్‌షాపును కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. ఆర్మూరు బస్టాండు స్థలం 7 వేల గజాలు స్థానిక ఎమ్మెల్యే అనుచరులకు ఇచ్చారు. హైదరాబాదులో ఉన్న ఆర్‌టిసి కళ్యాణ మండపం మెయింటెనెన్స్ ప్రైవేటు వారికే ఇచ్చారు. నిజానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ప్రయాణీకులను అక్రమంగా తరలించే ప్రైవేటు వాహనాల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ అండతో 'ఆరెంజ్ ట్రావెల్స్' వంటి ప్రైవేటు సంస్థలకు పునాది పడింది. ఈ సంస్థలు కాంట్రాక్టు క్యారేజీలకు అనుమతులు (పర్మిట్లు) తీసుకుని, స్టేజీ క్యారియర్లుగా బస్సులను తిప్పుతున్నారు. దీనివల్ల ప్రతియేటా మన ఆర్‌టిసికి రు. 800 కోట్ల ఆదాయం నష్టం వస్తుంది. ఆన్‌లైన్‌లో యథేచ్ఛగా బుకింగ్‌లు జరుగుతున్నా నియంత్రించే పరిస్థితి లేకుండా పోయింది. ఈ విధంగా ఆర్‌టిసిలో అంతర్గతంగా ప్రైవేటీకరణ చర్యలు ముమ్మరంగా అమలవుతున్నాయి. స్టేజీ క్యారేజీలలో బస్సులను నడిపే హక్కు, ప్రయాణికులను తరలించే హక్కు ఒక్క ఆర్‌టిసికే ఉన్నాయి. ప్రభుత్వ విధాన వైఖరి, ఆర్టీఏ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వల్ల ప్రైవేటు వాహనాలు స్టేజీ క్యారియర్లుగా చలామణి అవుతున్నాయి.

వేతనాలు పరిమితం - వెతలు అపరిమితం

ఆర్‌టిసిలో కార్మికుల వేతనాలు 50 వేలు ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి గోబెల్స్‌ను మరిపించే రీతిలో ప్రచారం చేస్తున్నాడు. నిజానికి

కార్మికుల వేతనాలను పరిశీలిస్తే కొత్తగా రిక్రూట్ అయ్యే కండక్టర్‌కు బేసిక్ రు. 12,610 డిఎ, హెచ్‌ఆర్‌ఎ, పిఎఫ్ కలిపి జీతం మొత్తం రు. 17,464, డ్రైవర్‌కు బేసిక్ రు. 13,070, మొత్తం కలిపి రు. 19,084, శ్రామిక్ బేసిక్ రు. 10,880 చెల్లిస్తున్నారు. పదేళ్ల సర్వీసు అనంతరం డ్రైవర్‌కు మొత్తం రు. 24,762, కండక్టర్‌కు రు. 22,865 వస్తాయి. 20 ఏండ్ల సర్వీసు తర్వాత కూడా డ్రైవర్‌కు రు. 30,856 రాగా, కండక్టర్‌కు రు. 28,682 మాత్రమే వస్తాయి. 2007 నుండి చట్టబద్ధంగా జరగాల్సిన వేతన సవరణ జరగడం లేదు. నామమాత్రంగా 44 శాతం ఫిట్‌మెంట్, 16 శాతం మధ్యంతర భృతితో సరిపెట్టారు. ఈ విషయంలోనూ తప్పుడు ప్రచారం జరుగుతోంది. రిటైర్డ్ కార్మికులకు 2018 ఏప్రిల్ నుండి సెటిల్‌మెంట్లు జరగడం లేదు. వీరికి ఇవ్వవలసిన మొత్తం డబ్బులు రు.528.55 కోట్లు కాగా సుమారు వందకోట్లకు పైగా ఇవ్వవలసి ఉంటుంది. 2019 సెప్టెంబర్ నెలకు సంబంధించిన వేతనాలు నేటికీ చెల్లించలేదు. జీతాలు చెల్లించాలని హైకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 2018 ఏప్రిల్‌లో ఖరారు కావాల్సిన వేతన సరవణ ఒప్పందం నేటికీ జరగలేదు. ఇక ఆర్‌టిసి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆసియాలోనే పెద్దది. ఈ సొసైటీ ఉద్దేశం సిబ్బంది జీతాల నుంచి నగదును సొసైటీలో జమ చేసుకుని అవసరాలకు లోన్లు మంజూరు చేయడం. అయితే ఈ సొసైటీ డబ్బు సుమారు రు. 550 కోట్లు, కార్మికుల పిఎఫ్ డబ్బులు రు. 826 కోట్లు కూడా ఆర్‌టిసి యాజమాన్యం వాడుకున్నది. దీనివలన కార్మికులకు తమ అవసరాలకు డబ్బు అందక అప్పులు చేసి, వడ్డీల బారిన పడి నలిగిపోతున్నారు. రాణిగంజ్ డిపోకు చెందిన సురేందర్‌గౌడ్ అనే కండక్టర్ తన బిడ్డ పెండ్లి కోసం అప్పుచేశాడు. సొసైటీ ద్వారా రుణం అందక, సమ్మె నేపథ్యంలో వచ్చిన సెల్ఫ్ డిస్మిస్ ప్రకటన వెరసి ఆయన ప్రాణాలను బలిగొన్నాయి.

సెల్ఫ్ డిస్మిస్ పేరిట మౌలిక హక్కులపై దాడి

'ఆర్‌టిసిలో ఇక యూనియన్లు, యూనియనిజం ఉండదు' అని కెసిఆర్ వ్యాఖ్యానించడం ఆయన రాచరికపు నియంతృత్వానికి పరాకాష్ట. ఆర్‌టిసి కార్మికులు తమకు తామే విధులకు గైర్హాజరై సెల్ఫ్ డిస్మిస్ అయ్యారు కనుక ఇక నుంచి వారు ఆర్‌టిసి ఉద్యోగులుగా గుర్తించబడరు. కొత్త నియామకాలు ఉంటాయి. కొత్తగా వచ్చేవారు ఏ యూనియన్‌లోనూ చేరమని, యూనియన్లు పెట్టమని అండర్‌టేకింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుందని కెసిఆర్ పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్రమోడీ చేసిన, చేస్తున్న కార్మిక చట్టాల సవరణ సారాంశం... కార్మికుల మౌలిక హక్కులైన సమ్మె చేసే హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు, యాజమాన్యాలతో బేరసారాలు ఆడే హక్కు లేకుండా కార్పోరేటు సంస్థలవద్ద కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికే. ఈ మార్గంలో తు.చ. తప్పకుండా ముందుకు సాగుతున్న కెసిఆర్ ఈ రకమైన వైఖరి తీసుకోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. కార్మికవర్గం శతాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న, భారత రాజ్యాంగం దాని ఆధారంగా వచ్చిన పార్లమెంటు ఆమోదం పొందిన చట్టాలు కల్పించిన హక్కులకు విరుద్ధమైనది. కార్మికుల మౌలిక హక్కులైన సమ్మె చేసే హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు ఉండొద్దని హుకూం జారీ చేయడం 1919 రౌలట్ చట్టాన్ని మరిపిస్తుంది. ఆర్‌టిసి కార్మికుల సమ్మె ప్రారంభమైన మొదటి రోజునే 48,633 మంది కార్మికులను తొలగిస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. కార్మికులు తమంతట తామే వెళ్లిపోయారు కనుక, సెల్ఫ్ డిస్మిస్ అయ్యారని రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్దేశిత ప్రకటన. వాస్తవానికి సెల్ఫ్ డిస్మిస్ అనేది భారత రాజ్యాంగంలో కానీ, దాని ఆధారంగా వచ్చిన 'ఐడి యాక్టు-1948' చట్టంలో కానీ, 'ట్రేడ్ యూనియన్ యాక్ట్ -1926' చట్టంలో కానీ లేదు. కనీసం ఆర్‌టిసి బైలాస్‌లో కూడా సెల్ఫ్ డిస్మిస్ అనే పదం లేదన్న సంగతి సిఎం కెసిఆర్‌కు సోయిలో లేకపోవడం ఆశ్చర్యమేమీ కాదు. నిజానికి చరిత్ర పరిణామ క్రమంలో సెల్ఫ్ డిస్మిస్ అవుతూ వచ్చిందీ, కాబోయేదీ కూడా పాలకవర్గాలే. ఈ దళారీ పాలకవర్గం ఏ వర్గాలకైతే ప్రాతినిధ్యం వహిస్తున్నాయో ఆ వర్గాలు పెట్టుబడిదారీ వర్గం కావొచ్చు, భూస్వామ్య వర్గం కావొచ్చు సెల్ఫ్ డిస్మిస్ అవుతూ వచ్చాయి. అవుతాయి కూడా. కెసిఆర్ ఇందుకు మినహాయింపు కాదు. కానీ, అంతిమంగా కార్మికవర్గం ఏనాడూ సెల్ఫ్ డిస్మిస్ కాలేదు. కారు కూడా. ఇది చరిత్ర నిరూపించిన సత్యం. ప్రజా రవాణా సంస్థ ప్రజా జీవితంలో అత్యంత కీలకమైన కారకం. మనిషికి గాలి, నీరు, ఆహారం ఎంత అత్యవసరమో రవాణా వ్యవస్థ కూడా అంతే ముఖ్యమైనది. మనిషి దైనందిన జీవితంలో నిరంతరం అవసరమైన కారకాలు ఇవి. ఆధునిక మానవుడి జీవన యానంలో రవాణా వ్యవస్థ అవిభాజ్యమైనది. కనుక ప్రభుత్వాలు సామాజిక బాధ్యతకలిగి సేవా దృక్పథంతో నిర్వహించాల్సిన ప్రజా రవాణా వ్యవస్థ ఆర్‌టిసి. దాని విస్తరణకు, అభివృద్ధికి నాణ్యమైన సేవలు అందించడానికి అవసరమైన నిధులను తమ వార్షిక బడ్జెట్లలో విధిగా కేటాయించాలి. లాభనష్టాలతో నిమిత్తం లేకుండా ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలి. 'స్వాతంత్ర్యం కోసం పోరాడడం ఎంత పవిత్రమైనదో శ్రామిక వర్గం తమ హక్కుల కోసం సమ్మె చేయడం అంతే పవిత్రమైనద'ని డా. బి.ఆర్. అంబేద్కర్ అంటాడు. ఇది చారిత్రక సత్యం. ఇవ్వాళ ఆర్‌టిసి కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెను గమనిస్తే ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం చేసిన ఉద్యమం, పోరాటం ఎంత పవిత్రమో ఆర్‌టిసి కార్మికులు నేడు తమ హక్కుల కోసం, సమాజ ప్రయోజనాల కోసం సమ్మెను చేయడం కూడా అంతే పవిత్రమైనది. ఈ దృక్పథంతోనే ఆర్‌టిసి కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు.

అయితే ఈ సందర్భంగా సమ్మె యెడల కేసిఆర్ వైఖరితో సమ్మె హక్కు, సంఘం హక్కుల భవిష్యత్ ఏమిటనే ప్రశ్న ముందుకు వస్తోంది. ఏ కారణాల రీత్యానైనా ఒకవేళ ఆర్‌టిసి సమ్మె కనుక విఫలం అయితే రాష్ట్రంలోని ఉద్యోగులు, ఇతర కార్మికుల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందనే చర్చ కొనసాగుతున్నది. ఆర్‌టిసి రంగంలో కావచ్చు, ఇతర రంగాలలో కావచ్చు అనుభవము, ఒక స్థాయి కలిగిన కార్మికులు సకల జనుల సమ్మెకు సిద్ధం కావాలి. యావత్ తెలంగాణ సమాజం ఈ ఉద్యమంలో భాగస్వాములు కావడానికి సిద్ధం కావాలి. ఈ కర్తవ్యాల నిర్వహణకై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు తగిన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజాసంఘాలు, అసోసియేషన్లు తదితర అన్ని రకాల సంస్థలు తెలంగాణ మలిదశ ఉద్యమం లాంటి ఉద్యమానికి సిద్ధం కావాలి. కార్మిక నాయకుల నుండి దీనికి సంబంధించిన ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబట్టుకోవలసిన అవసరం నేడు ఎంతైనా ఉంది. తెలంగాణ ప్రజల దీర్ఘకాల ఆకాంక్షలు, ప్రయోజనాలను కాపాడాలని, ఆర్‌టిసిని పరిరక్షించుకోవాలని ఆర్‌టిసి

ప్రపంచ బ్యాంక్ కనుసన్నల్లో మోడీ, కెసిఆర్

***'కేంద్ర కార్మిక చట్టాల సవరణల్లో భాగంగానే తెలంగాణ ఆర్‌టిసిని ప్రైవేటీకరించే' కుట్రలకు వ్యతిరేకంగా ఆర్‌టిసి కార్మికులు నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారని అంటున్నారు* రామటెంకి అశోక్**

అక్టోబర్ 5 నుండి టిఎస్ ఆర్‌టిసి కార్మికులు నిరవధిక సమ్మెలోకి అనివార్యంగా వెళ్లవలసి వచ్చింది. అంతకు ముందు రోజు ముఖ్యమంత్రి కెసిఆర్, ప్రధాని మోడీలు ఢిల్లీలో ఏకాంత చర్చలు జరుపుకున్న విషయం మనందరికీ విధితమే. ఈ భేటీ ప్రపంచ బ్యాంక్ కనుసన్నల్లో మోడీ, కెసిఆర్‌లు ఆర్‌టిసి కార్మికులపై, మద్దతునిస్తున్న రాజకీయ పార్టీలపై, ప్రజా సంఘాల నాయకులపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారు. 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించిన మోడీ ఆదేశాలు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ తుచ తప్పకుండా అమలుపరుస్తూ, తన మిత్రత్వాన్ని చాటుకుంటున్నాడు.

ప్రపంచ బ్యాంక్ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు అజెండా ఫర్ ఎకనామిక్ రిఫార్మ్స్ పత్రంలో, తర్వాత కుదిరిన ఒప్పందాల లోనూ ఆర్‌టిసిని ప్రైవేటీకరించాలని బహిరంగంగానే ఆదేశించిన సందర్భం మరువలేం. కాకపోతే ఆర్‌టిసిని ప్రైవేటీకరించడం అంటే రాష్ట్ర వ్యాప్తంగా గల ఒక లక్ష కార్మిక కుటుంబాలు వీధుల పాలు చేయడం అవుతుంది గనుక, రాజకీయంగా ఇది 'సున్నితమైన చర్య' గనుక ఆ పని జాగ్రత్తగా చేయండని ప్రపంచబ్యాంక్ సన్నాయి నొక్కులు నొక్కి ఉండవచ్చు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని 48 వేల మంది కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెలోకి వెళ్లిన సందర్భానికి ముందు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి కెసిఆర్‌ల భేటిని కూడా మనం ప్రపంచ బ్యాంక్ కుట్రలో భాగంగానే చూడాలి తప్ప మరొటి కాదు.

'బస్సు చక్రం ప్రజా ప్రగతికి చిహ్నం' అనే మాటని చూడనివారు, విననివారు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉండకపోవచ్చు. ఈ సంస్థ 1950 రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ యాక్ట్ ప్రకారం, 1958 జనవరి 11న పుట్టింది. ఆర్‌టిసి సంస్థ ప్రస్తుతం తాను ఎందుకు పుట్టానో అనే ఆవేదనలో ఉండడమే కాకుండా, దాని పుట్టుకనే మరిచిపోతున్నట్టున్నది. ఆర్‌టిసి పుట్టుకకు కారణమైన 'చట్టం' ప్రయాణికుల రవాణా బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదేనని పేర్కొనగా, ప్రస్తుతం ఆర్‌టిసి మాత్రం ఆ బాధ్యతను ఏ విధంగా వదిలించుకుందామా అనే ప్రయత్నాలు చేస్తున్నది. కాకపోతే ఈ లక్ష్యాల తారుమారు ఆర్‌టిసి దగ్గర మాత్రమే మొదలు కాలేదు.

కేంద్ర స్థాయిలోనే 1980లలో బస్సుల నిర్మాణ కంపెనీలు రావాణాను ప్రభుత్వ రంగం నుండి తప్పించాలని ఒత్తిడి మొదలుపెట్టి, 1988 మోటారు వాహనాల చట్టానికి సవరణలు తెచ్చేలా చేశాయి. ప్రైవేట్ వాహనాలకు అన్ని మార్గాలలోనూ అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలకు పోటీలోనే ప్రజలకు మేలైన రవాణా సేవలు అందుతాయని కొత్త భాష్యాలు మొదలయ్యాయి. ఈలోగా 1990లలో మన రాజకీయార్థిక విధానాలను 'ప్రపంచ బ్యాంకు' నేరుగా శాసించడం మొదలయ్యింది. ఆ క్రమంలోనే వాదనలు ముందుకు సాగి మొదట 'లాభాలు' వచ్చే రూట్లన్నీ ప్రైవేట్ రంగానికి, నష్టాలు వచ్చే రూట్లన్నీ ప్రభుత్వ రంగానికి అప్పగించడం జరిగింది. ఆ తర్వాత నష్టాలు వచ్చే రూట్లలో అంటే ప్రధానంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల రూట్లలో 'బస్సులు' నడపడం దండగ అనీ, అందువల్ల ఆ బస్సులు రద్దుచేసి అక్కడి డిపోలను కూడా రద్దు చేయాలని, ఆ తర్వాత ఆర్‌టిసి ఉద్యోగ కార్మికులను తొలగించడమో, ఖాళీ అయిన స్థానాలను నింపకపోవడమో చేయాలని ఒకదాని తర్వాత ఒకటి ఆదేశాలు, చర్చలు జరుగుతూ వస్తున్న క్రమాన్ని చూస్తున్నాం.

'అధికారిక చిహ్నంలో' ఏమి రాసుకున్నప్పటికీ దశాబ్దాలుగా పాలకుల దృష్టిలోనూ, ఆర్‌టిసి యాజమాన్యం దృష్టిలోనూ ప్రజా ప్రగతి అంటే

కార్మికులు తమ శక్తి మేరకు పోరాడుతూనే ఉన్నారు. సమ్మె పరిష్కారం దిశగా కెసిఆర్‌ను రప్పించడానికి వారి శక్తే సరిపోయే పరిస్థితి నేడు కనిపించడం లేదు. నేడు ఆర్‌టిసి కార్మికులు ఓడిపోతే, రేపు ఏ ఒక్క రంగంలోని కార్మికులకూ యాజమాన్యాలతో బేరమాడే శక్తి లేకుండా పోతుంది. యూనియన్‌లో చేరబోమని అండర్ టేకింగ్‌లు అడిగిన ముఖ్యమంత్రి గెలిస్తే, రేపు అనేక చోట్ల ఇవే అండర్ టేకింగ్‌లు అడిగే ప్రమాదమూ లేకపోలేదు. అదే జరిగితే దాదాపు వంద సంవత్సరాల క్రితం సాధించిన ట్రేడ్ యూనియన్ హక్కు, సమ్మె హక్కులకు ప్రమాదం ఏర్పడగలదు. అందుకే ఈ సమ్మె నేడు ఒక్క ఆర్‌టిసి కార్మికులదే కాదు, మొత్తం కార్మిక వర్గానికి సంబంధించినది. రాష్ట్రంలోని కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా ఆర్‌టిసి సమ్మెను గెలిపించాల్సిన ఆవశ్యకత ఉంది.

కెసిఆర్ వైఖరి ఇలానే కొనసాగితే మరో సకలజనుల సమ్మెకు సిద్ధం కావాల్సి రావచ్చును. ఉద్యోగ, ఉపాధ్యాయులతో సహా సింగరేణి, విద్యుత్ తదితర అన్ని రంగాల కార్మికులు సకల జనుల సమ్మెకు సిద్ధం కావాలి. ఈ కర్తవ్యాల నిర్వహణకై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు తగిన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజా సంఘాలు, అసోసియేషన్లు, తదితర అన్ని రకాల సంస్థలు తెలంగాణ మలిదశ ఉద్యమంలాంటి ఉద్యమానికి సిద్ధం కావాలి. కనుక సకల జనులు యావత్ కార్మికవర్గం సహకారంతో మరింత సమరశీలత, క్రియాశీలత, ప్రతిఘటనా తత్వాన్ని పెంపొందించడం ద్వారా నిర్మాణాత్మకమైన మహా ఉద్యమంగా ఆర్‌టిసి సమ్మె ముందుకు సాగవలసి ఉన్నది.

(రచయిత ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

వీ

నిర్వచనం మారిపోయింది. ప్రస్తుతం వారి దృష్టిలో ప్రజలు అంటే 'ప్రైవేట్ బస్సు' యజమానులు. వారికి లాభాలు చేకూర్చి వారి ప్రగతి సాధించడమే ఆర్‌టిసి పని. ఆ పనిలో తమ బస్సు చక్రాల గాలి తామే తీసుకునే దివాళాకోరు విధానాలకు పాలకులు, ఆర్‌టిసి యాజమాన్యం సిద్ధపడ్డారు. ఇప్పుడు ఆర్‌టిసి యాజమాన్యం కొత్తగా వేలల్లో బస్సులు అద్దెకు తీసుకోవాలనే నిర్ణయానికి రావడం, టెండర్లు పిలిచే ప్రయత్నాలకు పూనుకోవడం, ఆర్‌టిసి కార్మికులు, కార్మిక సంఘాలు ఆందోళనకు దిగడం ఈ నేపథ్యంలోనే చూడాలి. ఆర్‌టిసిని కార్మికులు ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రథమ డిమాండ్‌ను, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, ఆర్‌టిసిని ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ నిరవధిక సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చింది.

ఆర్‌టిసి సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు ప్రైవేట్ బస్సుల యజమానుల నుండి బస్సులను అద్దెకు తీసుకోవాలని ఆర్‌టిసి యాజమాన్యం ఆలోచించడం దశాబ్దాల క్రితమే మొదలయ్యింది. నిజానికి మెరుగైన సేవల కోసం ఎక్కువ బస్సులు కావాలంటే ఆర్‌టిసియే కొత్త బస్సులు కొనుక్కోవచ్చు. లేదా ప్రభుత్వం రాయితీలు ఇచ్చి, రుణాలిచ్చి బస్సులు కొనిపించవచ్చు. కానీ ప్రైవేట్ బస్సు యజమాన్యాలకు, బస్సుల తయారీదారులకు, వాహనాల ఫైనాన్సింగ్ సంస్థలకు 'లాభాలు' సమకూర్చడం కోసం మాత్రమే పాలకులు ఈ విధానాలను మొదలు పెట్టారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం అనే ప్రకటిత లక్ష్యం పైకి చూడడానికి చాలా ఉదాత్తంగా కనబడుతుంది గానీ, దాని వెనుక ఉన్న కారణాలు చూడాలి.

రాష్ట్రంలో ప్రైవేట్ రవాణా సంస్థలను ఏర్పాటు చేసుకున్న భూస్వాములకు, రాజకీయ ముఠా నేతలకు లాభాలు చేకూర్చి పెట్టడం ఈ విధానపు అసలు లక్ష్యం. రవాణా ధనయజ్ఞం 1980లలో మొదలై 1990ల తర్వాత ప్రపంచ బ్యాంక్ ఆదేశాలతో మరింత వేగం పుంజుకున్నది. ఈ రవాణా ధనయజ్ఞ లబ్ధిదారులకు రాజకీయ పార్టీల పట్టింపులు కూడా ఏమీ లేవు, ఉండవు. 'దోచుకున్నోడికి దోచుకున్నంత' వెసులుబాటు పాలక ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి.

ఇప్పుడు ఆర్‌టిసి దగ్గర సుమారు పది, పదకొండు వేల బస్సులు ఉన్నాయని అంచనా. కానీ వాటిలో కనీసం 3 వేల బస్సులు మరమ్మత్తుల అవసరంతోనో, పాతపడిపోయో, పనికి రాకుండాపోయే ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పాతవాటి స్థానంలో కొత్త బస్సులు కొన్ని కొనాల్సి ఉంటుందనే చెప్పవచ్చు. కాగా పెరుగుతున్న జనాభా రవాణా అవసరాల కోసం ప్రతియేటా ఆర్‌టిసి కొత్త బస్సులు కొనవలసి ఉంటుంది. కొత్త బస్సులు కొనడం అంటే ఆ మేరకు డిపోల సంఖ్యను, గ్యారేజీల సంఖ్యను, షెడ్, వర్క్‌షాప్‌ల సంఖ్యను పెంచవలసి ఉంటుంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రవాణా సంస్థలలో ఉన్న నిష్పత్తి ప్రకారం చూసినా ప్రతి బస్సుకు ఏడుగురు కార్మికులను – (డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లు, మెకానిక్‌లు) కొత్తగా పనిలోకి తీసుకోవలసి ఉంటుంది. అవన్నీ ప్రభుత్వ ఉద్యోగాలు కాబట్టి అందులో తప్పనిసరిగా దళితులకు, ఆదివాసులకు, వెనుకబడిన కులాలకు, మహిళలకు రిజర్వేషన్లు కల్పించవలసి ఉంటుంది. అంటే ప్రస్తుతం ప్రభుత్వం కొత్తగా 'పదివేల' కొత్త ఉద్యోగాల కల్పన జరపాల్సి ఉంటుంది. అందులో కనీసం 'ఐదువేల' ఉద్యోగాలు వెనకబడిన వర్గాలకు ఇవ్వాల్సి ఉంటుంది.

ఆర్‌టిసిలో కార్మిక సంఘాల ప్రాబల్యం హెచ్చుగానే ఉంటుంది గనుక ఆ మేరకు కార్మిక ఉద్యమం కూడా పెరుగుతుంది. ఈ అన్ని బెడదల నుంచి తప్పించుకునేందుకు ఆర్‌టిసి యాజమాన్యం, ప్రభుత్వ పాలకులు తమకు ఏ బాదరబందీ లేకుండా ఎవరో బయటి వాళ్లకు బస్సులను అప్పజెబితే సరిపోతుందనే భావనతో ముఖ్యమంత్రి కెసిఆర్ ఆర్‌టిసిని ప్రైవేట్‌పరం చేయ చూస్తున్నాడు. ప్రజా ధనాన్ని దోచిపెట్టడమే, లూటీ చేయడమే పరమావధిగా తన క్రియలను కొనసాగిస్తున్నాడు.

ప్రైవేట్ బస్సు యజమానుల ప్రయోజనాలు, బస్సుల నిర్మాణ సంస్థల ప్రయోజనాలు, పాలకుల ప్రయోజనాలు మొత్తంగా ప్రపంచ బ్యాంక్ ఆదేశాలు కలగలసిపోయి మన రాష్ట్రంలో అద్దె బస్సుల విస్తరణ పెరిగిపోతున్నది. ఆ క్రమంలోనే ప్రజా సేవ లక్ష్యాలు శిథిలమవుతున్నాయి. ప్రజాధనం దోపిడీ అవుతున్నది. ఈ పరిణామాలను ఆర్‌టిసి కార్మికులు నిశితంగా పసిగట్టి – ప్రజా రవాణాను, ఆర్‌టిసిని కాపాడుకోవాలని, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలనే దృఢ సంకల్పంతో నిరవధిక సమ్మె చేపట్టారు.

టిఆర్‌ఎస్ ప్రభుత్వం, ఆర్‌టిసి యాజమాన్యంల కుట్రలను కార్మికులు వ్యతిరేకిస్తున్నారంటే అదేదో వారి సొంత సమస్య మాత్రమే కాదు, నిజానికి వారికన్నా ఎక్కువగా ఈ సమస్య రాష్ట్ర ప్రజలదిగా భావించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థదిగా, యావత్ తెలంగాణ సమాజానిదిగా భావించాలి.

ఇత్యాధి విషయాలను పెడచెవిన పెట్టిన ముఖ్యమంత్రి కెసిఆర్ మొండిగా, కర్కషంగా వ్యవహరించడం తగని చర్య. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ రక్త తర్పణలు, ఆత్మబలిదానాలు కొనసాగుతున్నాయంటే – కెసిఆర్ నియంత పాలనకు బొందపెట్టే రోజు దగ్గర పడిందిగా అర్థం చేసుకోవచ్చు. సిఎం కెసిఆర్ ఆర్‌టిసి కార్మికుల పట్ల పూర్తి అహంకార ధోరణితో ఉండడమే కాకుండా, పుండు మీద కారం జల్లే మాటలు మాట్లాడుతున్నాడు. ఆర్‌టిసి ఒకవైపు అట్టుడికిపోతుంటే – చర్చలు జరపకపోగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఆ స్థాయిలో ఉంటూ చేయడం అనేది – కావాలనే సిఎం కెసిఆర్ హింసను ప్రేరేపిస్తున్నట్లుగా భావించాల్సి వస్తుంది.

ఆర్‌టిసి కార్మికులు గుండాయిజం చేస్తున్నారని, చర్చలు, గిర్చలు ఉండబోవని, సాయంత్రం ఆరు గంటలకల్లా విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు కోల్పోతారని, సెల్ఫ్ డిస్మిస్‌లకు గురవుతారని, ఎస్మా ప్రయోగిస్తాననే అహంకారపూరిత వ్యాఖ్యానాలతో ఆర్‌టిసి కార్మిక కుటుంబాలు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. ఆవేదన చెందుతూ ఆత్మహత్యలు, గుండెపోటులతో మరణిస్తుంటే – హుజూర్‌నగర్‌లో గెలుపే లక్ష్యంగా కోట్లాది రూపాయలను కుమ్మరిస్తూ, అధికార యంత్రాంగ దుర్వినియోగానికి పాల్పడడమే కాకుండా, ఇసిని ఉపయోగించుకొని ఎన్నికల్లో లబ్ధిపొంద చూడడం అవివేకం, అసందర్భం.

'హర్తాళ్లు, సమ్మెలు జాన్తానై' అనే బెట్టుకు పోకుండా – రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారంగా కార్మికులతో చర్చలు జరిపి, వారి డిమాండ్ల పరిష్కారం దిశగా అడుగులు వేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ గారిని యావత్ తెలంగాణ ప్రజలు కోరుతున్నారు. ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన 'నిరవధిక సమ్మె' ఆందోళనకు విస్తృత ప్రజా సహకారం ఉందనేది కెసిఆర్ గుర్తెరగాలి. మిలియన్ మార్చ్‌లు, సకల జనుల సమ్మెలు తెలంగాణ సమాజానికి కొత్త కాదనేది గమనించుకోవాలి.

కార్మికవర్గం ప్రపంచ బ్యాంక్ కుట్రలను ఛేదిస్తూ... ఆర్‌టిసి సమ్మె విజయవంతం అయ్యేంతవరకూ పోరాట పటిమను కొనసాగిద్దాం!

(రచయిత ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి) వీ

కాగ్ హెచ్చరిక - తీరు మారని తెలంగాణ

తెలంగాణ బడ్జెట్‌లో ఆర్థిక చెల్లింపులు, రాబడిలో అంచనాలకూ, వాస్తవాలకూ మధ్య తీవ్రమైన వ్యత్యాసాలు ఉంటున్నాయని కాగ్ హెచ్చరించినా ప్రభుత్వం తన విధానాలను మార్చుకునే ఎలాంటి చర్యలను చేపట్టడం లేదని అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

భారతదేశపు ప్రజాస్వామ్య పరిరక్షణకు సుప్రీంకోర్టు, కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌లు నాలుగు మూలస్తంబాలు. ఈ నాలుగు రాజ్యాంగ బద్ధ సంస్థల్లో అత్యంత ముఖ్యమైన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అని డా. బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నారు. ఇది ప్రజా జీవితంలో పారదర్శకతను, సంభావ్యతలను తీసుకొస్తుందనే ఉద్దేశంతో ఏర్పాటైంది. భారత రాజకీయాలలో పాలకుల జవాబుదారీ తనాన్ని ఇది నిర్ధారిస్తుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశ పరిపాలన నియంత్రణ కొరకు 1858లో అకౌంటెంట్ జనరల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. 1860లో సర్ ఎడ్వర్డ్ డ్రమ్మండ్ మొదటి ఆడిటర్ జనరల్‌గా నియమించారు. అనంతరం 1866 నుండి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా మారింది. 1919 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం ఈ పదవి సర్వ స్వతంత్రంగా మారింది. 1935 భారత ప్రభుత్వ చట్టం దీనిని మరింత బలపరిచింది. ఈ సంస్థ అకౌంట్స్, ఆడిట్లు వివరణాత్మకంగా 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చే వరకు విధులు నిర్వహించింది. స్వాతంత్ర్యానంతరం 1949లో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 148 నుండి 151 వరకు దీని విధులు, అధికారాలను పొందుపరిచినారు. ఆర్టికల్ 148 ప్రకారం రాష్ట్రపతి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను నియమిస్తారు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను సంక్షిప్తంగా 'కాగ్' అని పిలుస్తారు. కేంద్ర రాష్ట్రాలకు కాగ్ ఒకటే ఆడిటర్‌గా పనిచేస్తుంది. 1958లో కాగ్ అధికారులను జమ్ముకశ్మీర్ వరకు విస్తరించినారు. 1971 చట్టం ప్రకారంగా కాగ్ అకౌంటింగ్ విధుల నుండి విముక్తి కాబడి కేవలం ఆడిటింగ్ విధులనే నిర్వహిస్తుంది. 1990 నుండి మరింతగా ఆధునీకరించబడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పార్లమెంటు, శాసన సభలు ఓటు వేసిన ఖర్చులను మాత్రమే ఖర్చు చేయాలనే నిబంధనలున్న ప్పటికీ, గీత దాటిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఆర్థిక అవకతవకలకు కొన్నింటికి శిక్షలు పడ్డ సందర్భాలున్నాయి. వేటు వేసిన ఖర్చులు మించలేదని లేదా వేసిన వాటికి భిన్నంగా ఉండకుండా నివేదికను తయారు చేసే యంత్రాంగం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్. ఇది ప్రభుత్వ ఖాతాల నుండి సంఘానికి హితుడిగా వ్యవహరిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయ వ్యయాలను, కాంటిజెన్సీ ఫండ్ నుంచి తీసిన ధనం వ్యయాన్ని ప్రభుత్వ రంగ సంస్థల, అన్ని ప్రభుత్వ విభాగాల ఖాతాలను, కన్సాలిడేట్ ఫండ్ నిధులను, ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్య ఖర్చులతో పాటు గోదాముల నిల్వలను కూడా ఆడిట్ చేయవచ్చు. ఈ ఖర్చులు చట్టబద్ధంగా నిర్దేశిత అధికారి ద్వారా జరిగింది లేంది పరిశీలిస్తుంది. అందువల్ల ఇది దేశానికే సుప్రీం ఆడిటర్‌గా పనిచేయాలని రాజ్యాంగంలో సూచించబడింది.

ఆధునిక భారతావనిలో అవినీతి అన్ని రంగాలతో పాటు ప్రభుత్వాలలో ఆక్టోపస్‌లా విస్తరిస్తున్న నేపథ్యంలో నిజానికి ఈ అవినీతి విస్తృత స్వభావాన్ని కాగ్ మాత్రమే అప్రమత్తం చేయాలి. పెరిగిన ప్రభుత్వ ఖర్చులకు చట్టబద్ధత ఉన్నదా లేదా నిశితంగా పరిశీలించాలి. ఈ ఖర్చులన్ని ప్రజలందరి సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పొదుపుగా చేసిందా లేదా అధికారంలో ఉన్న పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం పిడికెడు మంది ప్రయోజనాలు దాగి ఉన్నాయా అని పరిశీలించాలి. అసంబద్ధ విధానాల వలన ఒనగూరే నష్టాలను ఏకరవు పెట్టాలి. స్థూలంగా అంచనాలకు, వాస్తవాలకు మధ్య అంతరాన్ని గుర్తించి సలహా లేదా ఆక్షేపణ పూర్వకంగా నివేదిక రూపంలో వెల్లడించాలి. ఈ నివేదిక అత్యంత ప్రమాణికమైంది. రాష్ట్రంలో ఈ నివేదిక గవర్నర్ ద్వారా శాసనసభకు అందుతుంది. ఇది ప్రభుత్వాలకు గైడ్‌గా, స్నేహితుడిగా, తత్వవేత్తగా పనిచేయాలి. ఈ నివేదిక ప్రభుత్వాల డొల్లతనాన్ని, ప్రగల్భాలను కుండలు బద్దలు కొట్టాలి. ఇలా చేయనప్పుడు అది కాగ్ స్ఫూర్తికే విరుద్ధం.

తెలంగాణ ప్రభుత్వంలోని అవకతవకలను గుర్తించిన కాగ్ నివేదిక

తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాలు చివరి రోజున 2018 మార్చ్‌తో అంతమైన ఆర్థిక సంవత్సరపు రాష్ట్ర ద్రవ్య వ్యవహారాల మదింపు నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ నివేదికలో పలు అంశాల్లో ప్రభుత్వం అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు సంబంధించి రెవెన్యూ మిగులు, ద్రవ్యలోటు, రెవెన్యూ రాబడి, మూలధన వ్యయం వంటి కీలకమైన అంశాల్లో ప్రభుత్వం చెపుతున్న లెక్కలు వాస్తవం కావని, వ్యత్యాసాలను గణాంకాలతో సహా కాగ్ బట్టబయలు చేసింది. రెవెన్యూ మిగులు రు. 3459 కోట్లు, ద్రవ్యలోటు రు. 26,700 కోట్లుగా బడ్జెట్ కేటాయింపులుగా చూపించినారు. ఈ పద్దులు శాసన విహితమైన నిధులకు జమకట్టలేదు. రాయితీలను రుణాలుగా వర్గీకరించిన కారణంగా రెవెన్యూ మిగులును రు. 3743.73 కోట్లుగా చూపించినారు. ద్రవ్యలోటును రు. 954.60 కోట్ల మేర తగ్గించి చూపించినారు. వాస్తవానికి రు. 284.74 కోట్ల రెవెన్యూ లోటును రు. 27,654.60 కోట్ల ద్రవ్యలోటు ఉన్నట్లుగా 'కాగ్' గుర్తించింది. రెవెన్యూ రాబడి బడ్జెట్ అంచనాలతో పోలిస్తే రు. 24,259 కోట్లు తగ్గింది. క్యాపిటల్ వ్యయం రు. 23,902 కోట్లు మాత్రమే 2016-17 సంవత్సరంతో పోలిస్తే రు. 9,469 కోట్లు అంటే 28 శాతం తగ్గింది. ఇది బడ్జెట్ అంచనాలకన్నా తక్కువ అని కాగ్ వెలికితీసింది. రాబడిని ఎక్కువగా చూపించి ఖర్చును తక్కువగా చూపినందుకు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆక్షేపణ చేసింది.

రీడిజైనింగ్ పేరుతో లెక్కకు మించిన ప్రాజెక్టు వ్యయాలు

కాగ్ ప్రధానంగా ప్రాజెక్టుల వ్యయంపై తీవ్ర విస్మయానికి గురైంది. వ్యయం అంచనాలకు ఊహలకు మించి ఉంటుందని స్పష్టం చేసింది. 2018 మార్చ్ నాటికి రాష్ట్రంలో 36 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. 19 ప్రాజెక్టుల విషయంలో తొలి అంచనా వ్యయం రు. 41,201 కోట్లు కాగా, మూడు నుండి పదకొండు సంవత్సరాల జాప్యం కారణంగా మూడు రెట్లుగా ప్రాజెక్టుల వ్యయం రు. 1,32,928 కోట్లకు పెరిగినట్లు కాగ్ గుర్తించింది. ఈ ప్రాజెక్టుల మీద నేటివరకు దాదాపుగా సగం అనగా రు. 70.758 కోట్లు ఖర్చు అయినా అవి ఏ ఒక్కటి నేటికి పూర్తిగా వినియోగంలోకి రాలేదు. సాగునీటి ప్రాజెక్టుల ఆర్థిక ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించనులేదు. సాగునీటి రంగం మీద పెడుతున్న భారీ పెట్టుబడుల వల్ల ఏర్పడిన ప్రయోజనాల మధింపును, వాటి ఫలితాలను ప్రభుత్వమే సంకలనం చేయాలని ఒకవైపు మార్గ నిర్దేశనం చేసింది. మరొక వైపుగా ఈ పెరిగిన ఖర్చులు అనారోగ్యకరమని కాగ్ తీవ్రమైన అభ్యంతరకరమైన వ్యాఖ్య చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కింద రు. 1500 కోట్లు భూసేకరణ కొరకు వినియోగించినారని, ఇది నిబంధనల ప్రకారం కాదని కాగ్ ఆక్షేపించింది.

అప్పులను తప్పుగా చూపిన తెలంగాణ రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సూచించిన బడ్జెట్ కంటే ఖర్చు అధికంగా చేసిందని కాగ్ నివేదికలో వెల్లడించింది. ఈ అదనపు ఖర్చుల వల్ల అప్పులు క్రమంగా సంవత్సర సంవత్సరానికి పెరుగుతున్నాయని గుర్తించింది. తెలంగాణ రాష్ట్రం అప్పులు రు. 1,42,918 కోట్లు కాగా, రెవెన్యూ రాబడిలో వడ్డీ చెల్లింపులు 12.9 శాతం పెరిగింది. ఈ పరిస్థితి రాష్ట్రానికి ఆందోళనకరమని కాగ్ సర్కార్ తీరును ఆక్షేపించింది. 14వ ఆర్థిక సంఘం నిర్దేశించిన 8.31 శాతం పరిమితి కన్నా రాష్ట్రం అధికంగా వడ్డీలు చెల్లించరాదని కాగ్ తేల్చి చెప్పింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆవిర్భావ బడ్జెట్ మొదలుకొని నేటివరకు ప్రవేశపెట్టిన ప్రతి బడ్జెట్ వెనుక దాగిన, దాచిన వివరాలు బట్టబయలు చేసి మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వ విధానంలో బడ్జెట్‌లో అవకతవకలు, అసంబద్ధ విధానాలను మార్చుకోని తీరుపై మరోమారు కాగ్ కడిగిపారేసింది. పించను చెల్లింపులు 2016-17తో పోలిస్తే 32 శాతం పెరిగింది. రాష్ట్ర రెవెన్యూ ఖర్చులలో ఇవి శాతంగా లెక్కిస్తారు. దీనితో ఖర్చుల భారం క్రమంగా పెరుగుతుంది. ప్రభుత్వం తెలంగాణ అవిర్భావం నుండి మార్కెట్ నుంచి తీసుకునేరుణాల మీద అధికంగా ఆధారపడడంతో వడ్డీల కారణంగా చెల్లింపులు పెరిగాయి. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ద్రవ్య బాధ్యతలను లెక్కగట్టేందుకు వాటిని తీర్చే సామర్థ్యాన్ని అంచనా వేసుకునేందుకు భవిష్యత్ అవసరాల ఆధారంగా అధ్యయనం చేపట్టాలి. ఈ అధ్యయనం భవిష్యత్‌లో తీసుకునే రుణాలకు సంబంధించి ప్రమాదవకాశాలను ఈ అధ్యయనం తెలియజేయాలని కాగ్ హెచ్చరించింది. ఈ హెచ్చరిక రాష్ట్ర ప్రభుత్వం మీద వస్తున్న విమర్శలకు బలమైన నిర్ధారణగా కనబడుతుంది. ఈ నివేదిక పరిశీలనా కాలంలో రు. 28,171 కోట్లు అధిక వ్యయం జరిగిందని కాగ్ ఆధారాలతో బయట పెట్టింది. ఇక నుంచి రాష్ట్ర శాసనసభ అనుమతించిన కేటాయింపులకు మించి ఆర్థిక శాఖతో సహా స్వయంగా నియంత్రణ అధికారులెవరు ఎక్కువ ఖర్చు చేయరాదని కాగ్ సిఫారసు చేసింది.

ప్రభుత్వ శాఖల పనితీరుపై పెదవి విరిచిన కాగ్

ఒకవైపు కొన్ని రంగాలలో శాసనసభ అనుమతించకుండా పెద్ద మొత్తంలో అధిక వ్యయం జరుగుతుండగా మరోవైపు శాసనసభ అనుమతితో కేటాయించిన మొత్తాలను ఖర్చు చేయకుండా మిగిలిన నిధులున్నాయి. నేటికి రు. 58,614 కోట్లు కేటాయించి ఖర్చు చేయకుండా ఉన్నాయని కాగ్ గుర్తించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై కాగ్ పెదవి విరిచింది. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులేమో కొన్ని శాఖలకు ఘనంగా ఉండగా నిధుల విడుదల నామమాత్రమే. మరికొన్ని శాఖలు కేటాయించిన నిధులు వాడుకోలేకపోవడాన్ని కూడా కాగ్ తప్పు పట్టింది. ఆర్ అండ్ బి, ఉన్నత విద్య, వైద్య ఆరోగ్యం, పురపాలన, గృహ నిర్మాణ, గిరిజన సంక్షేమం, బిసి సంక్షేమం, భారీ, మధ్యతరహా నీటి పారుదల వాణిజ్య పరిశ్రమల శాఖలు నిధులు వాడుకోకపోవడంతో మురిగిపోయాయని కాగ్ తేల్చింది. ఒక కెసిఆర్ కిట్ పథకం మాత్రం 100 శాతం లక్ష్యం సాధించిందని కాగ్ ప్రశంసించగా, మిగిలిన అన్ని పథకాలు లక్ష్యాలను సాధించలేక పోయాయని కాగ్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పథకంలో ఘోరంగా విఫలమైంది. లబ్ధిదారుల లక్ష్య సాధన సున్నాగా గుర్తించింది. ఇక నిధులు ఖర్చుపెట్టని శాఖల్లో మున్సిపల్ శాఖ అగ్ర స్థానంలో ఉన్నట్లు గుర్తించింది. నిధులు సద్వినియోగం చేసుకోకుండా నిధులను పొదుపు చేశారని ఈ శాఖను కాగ్ ఎద్దేవా చేసింది. నిధులు వాడుకోకపోవడం వల్ల ప్రభుత్వ పథకాల అమలు లక్ష్య సాధనలో వెనుకబడ్డాయని, దీనితో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారని కాగ్ తెలిపింది.

నిధులు పూర్తి స్థాయిలో వాడుకోని శాఖలు (రు. కోట్లలో)

క్ర. సం.	శాఖపేరు	బడ్జెట్	వ్యయం	నిధులు (శాతం)
1.	ఆర్ అండ్ బి	6,317	3,500	45
2.	ఉన్నత విద్య	2,217	1,411	36
3.	వైద్య ఆరోగ్య	6,447	4,521	30
4.	మున్సిపల్	4,613	1,528	67
5.	హౌజింగ్	4,715	2,489	47
6.	గిరిజన సంక్షేమం	7,643	4,895	36
7.	బిసి సంక్షేమం	5,331	2,866	46
8.	నీటి పారుదల	22,331	11,236	50
9.	వాణిజ్య పరిశ్రమలు	1,562	733	53

ఆర్థిక ఇబ్బందుల్లో ప్రభుత్వం

ఆర్థిక నిర్వహణ కోసం ప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఇబ్బందిని ఎదుర్కొందని కాగ్ నివేదికే వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం ఆర్‌బిఐ నిబంధనలకు లోబడి ఆర్థిక నియంత్రణ బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బిఎం) ఫైనాన్సియల్ రెగ్యులేషన్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ పరిధిలో

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 7 రోజులు ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లి నిధులు సమకూర్చుకున్నట్లు తేలింది. ఓవర్ డ్రాఫ్టుకు వెళ్లడం ద్వారా రు. 765 కోట్లు ప్రభుత్వం సమకూర్చుకుందని చెప్పింది. 127 రోజుల పాటు (వేస్ అండ్ మీన్స్) రోజువారి ఖర్చుల కోసం వెళ్లిందని, దీని ద్వారా రు. 10,789 కోట్లు సమకూర్చుకుందని కాగ్ ప్రకటించింది. మరో 204 రోజుల పాటు రిజర్వు బ్యాంక్ ఇచ్చే స్పెషల్ విత్‌డ్రాయిల్ సౌకర్యాన్ని వాడుకొని రు. 11,278 కోట్లు తెచ్చుకుందని చెప్పింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఓడీ వేస్ అండ్ మీన్స్ స్పెషల్ విత్‌డ్రాయిల్ సౌకర్యాన్ని వినియోగించుకొని దాదాపు రు. 22 వేల కోట్లు రాబట్టుకొని ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టినట్లు వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం గతంతో పోలిస్తే 2017–18 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక నిర్వహణలో భాగంగా జరిగే కొన్ని తప్పనిసరి సర్దుబాట్లు, పద్దుల మార్పుల వంటి అంశాలను ఆర్థిక అవకతవకలను కాగ్ తప్పు పట్టింది. దీంతో ప్రభుత్వ అంచనాలకు ఆదాయానికి పొంతన లేదని స్పష్టమవుతుంది.

ప్రభుత్వం సమీక్షించుకోవాల్సిన అంశాలు

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగి 2017–18 నాటికి నాలుగేళ్లు పూర్తి అయినా క్యాపిటల్ పద్దులలో ఉన్న రు. 1,51,349.67 కోట్లు రుణాలు, అడ్వాన్సు పద్దుల్లో ఉన్న రు. 28,099.68 కోట్ల మొత్తాల పంపకం పూర్తి కావాల్సి ఉంది. షెడ్యూలు 9 ప్రకారం మొత్తం 91 సంస్థల విభజన జరగాల్సి ఉందని, ఇందుకోసం ఏర్పాటైన నిపుణుల కమిటీ 86 సంస్థలు విభజన చెందినట్లు సిఫారసు చేసింది. పునరావృతం అవుతున్న అధిక ఖర్చులకు కారణాలను రాష్ట్ర ప్రభుత్వం విశ్లేషించుకోవాలని సూచించింది. ఇక నుండి ప్రభుత్వంలో అనాలోచితంగా పునరావృతం అవుతున్న ఖర్చులను సమీక్షించుకోవాలని కాగ్ సలహానిచ్చింది. ఇప్పటికే ఉన్న ఆర్థిక వ్యయాలన్నింటిని వీలైనంత త్వరగా క్రమబద్ధీకరించుకోవాలని కోరింది. విద్య, వైద్యం, ఆరోగ్య, సాంఘిక సంక్షేమ విభాగాలను సమర్థవంతంగా ముందుకు తీసుకుపోవాలని హెచ్చరించింది. స్వయం పాలక సంస్థలు, ఆథారిటీలను తమ ఆర్థిక పద్దులను నిర్ణిత సమయంలో సమర్పించడానికి చర్యలు తీసుకోవాలని కాగ్ మార్గదర్శనం చేసింది.

సిపిఎస్ కోసం ఉద్యోగుల మూల వేతనం కరువు భత్యం కింద 10 శాతం చందాల రూపంలో వసూలు చేస్తుంది. దీనికి సమానమైన మొత్తాన్ని మ్యాచింగ్ గ్రాంట్‌గా ప్రభుత్వ వాటాగా జమచేయాలి. కాని దీనిని అమలు చేయడం లేదని, ఇది రాబోయే రోజులలో ప్రభుత్వాలకు భారంగా మారుతుందని కాగ్ హెచ్చరించింది. నేటికి ప్రభుత్వ ఉద్యోగులకు రు. 141.79 కోట్ల బకాయి పడిందని, ప్రభుత్వం తన తప్పులను సరిదిద్దుకోకపోతే సిపిఎస్ మూలనిధి దివాళాకు దారితీసి చివరకు చందా దారుల ప్రయోజనాల ఈ పథకం స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని, ఇట్టి మొత్తాలను జమచేయాలని ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది.

జలమండలి (మెట్రో వాటర్ బోర్డు), ఎచ్ఎండిఎ లాంటి స్వయం ప్రతిపత్తి గల సంస్థల్లో వార్షిక పద్దులను సమర్పించడంలో జాప్యం జరుగుతుందని కాగ్ ఆక్షేపించింది. ఈ సంస్థల్లో అత్యవసర ఖర్చుల కోసం రు. 280.45 కోట్లు ఖజానా నుంచి వితరణ చేసినామని చెప్పినప్పటికీ అందుకు సంబంధించిన బిల్లులు మాత్రం ప్రభుత్వానికి అందజేయకపోవడాన్ని కాగ్ తప్పుబట్టింది. నిర్దిష్టమైన గడువులోగా బిల్లులు సమర్పించకపోవడం ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘించడమేనని కాగ్ నివేదిక స్పష్టం చేసింది.

పన్నుల వసూళ్లలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం ముందుంది. ఒకవైపు ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తూ, మరోవైపు వేల కోట్లు అప్పులు తెస్తున్నారు. ఈ మొత్తం సొమ్మును సీట్లే లక్ష్యంగా ఓట్ల కోసం కోట్లు ఖర్చుపెడుతున్నారు. ఆర్థిక క్రమశిక్షణపై ప్రజలకు నీతులు వల్లించడమే కాదు, పాలకులు కూడా పాటించాలని కాగ్ మార్గ నిర్దేశనం చేసింది. ఖజానాలోని ప్రతి పైసా ప్రజోపయోగానికి, రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఖర్చు చేయాలి, ప్రణాళికా బద్ధంగా ప్రాధాన్యత క్రమంలో వెచ్చించాలని కాగ్ హెచ్చరించడమంటే ఈ ప్రభుత్వం తప్పక తనకు తాను సమీక్షించుకోవాలి. ఈ నేపథ్యంలో సంక్షేమం, సమగ్రాభివృద్ధి రెండు ముందుకు సాగినప్పుడే రాష్ట్ర ప్రగతి పథంలో ముందుకు సాగుతుంది. అందుకు ఆర్థిక క్రమశిక్షణ విషయంలో దృఢ వైఖరి అవలంబించాలని కాగ్ సూచించింది. కాగ్ నివేదికలు ప్రభుత్వాలకు రుచించకపోవచ్చు గాని, ప్రజల విస్తృత ప్రయోజనాల కోసం కాగ్ నిష్పాక్షికంగా వ్యవహరిస్తుందనేది ప్రభుత్వాలు గుర్తించాలి.

కాగ్ ఒళ్లంతా కళ్లు చేసుకొని ప్రతి అంశాన్ని తన డేగకళ్లతో పరిశీలించినా అవినీతి అక్రమ విధానం, పాలకుల వక్ర విధానం పలు రూపాలుగా స్వరూపాన్ని మార్చుకొని అరచేతిలో నీళ్లలా కాగ్ కంట పడకుండా తప్పించుకొని జారిపోతూనే ఉన్నాయి. దీన్ని గుర్తించడానికి కాగ్‌కి ఉన్న శక్తి సామర్థ్యాలు సరిపోవడం లేదన్నది యథార్థం. అది తన నిరంతర నిఘా యంత్రాంగాన్ని విస్తృత పరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికి ఇంకా ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యపు ఆడిట్ చేస్తున్న వాస్తవాలను గుర్తించలేకపోతుంది. ఏ సమాచారమైన ప్రాధాన్యత క్రమంలో ఏడు రోజులల్లో ఆడిటర్లకు అందజేయాల్సి ఉంటుంది. అది విఫలమైతే విభాగాధిపతులు ఆలస్యానికి కారణాలను విధిగా తెలపాల్సి ఉంటుంది. కాగ్ తన వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంది. ఆడిట్ చేసి అయిపోయినదానికి పంచనామా చేసి పత్రికలకు రిపోర్టులు అందజేసి, ప్రతిపక్షాలకు కాగితపు కత్తులు అందించినంత మాత్రాన ఒరిగే ప్రయోజనమేమి లేదు. ఇది వాస్తవం కాబట్టి ప్రభుత్వ నిధులు ప్రజా ప్రయోజనాల రీత్యా ప్రణాళికబద్ధ ఖర్చుకు ఎలా వ్యవహరించాలో పూర్వ నివేదికల ఆధారంగా ముందుగా మార్గనిర్దేశాలను జారీచేసే సాహసం చేయాలి. అలా వ్యవహరించనపుడు ప్రభుత్వ తీరును ఎండగట్టాలి. అలాగే సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, జిఎస్‌టి అమలు వంటి వాటిని ఆడిట్ చేయడానికి తనకు తాను సిద్ధం కావాలి. ప్రభుత్వాల పద్దుల చల్య పరీక్ష చేయడానికి బిగ్ డేటా నేపథ్యంలో 'కాగ్'లో డెటా ఎనలిటిక్స్‌తో కలిసి పటిష్ట పనితనానికి శ్రీకారం చుట్టాలి. విశ్వతనీయత నిరూపణకు నిలబడాలి. ప్రభుత్వాలు కూడా 'కాగ్' నివేదికలను కాగితపు పులుల గాండ్రింపులుగా భావించకుండా, అవి ప్రణాళిక పత్రాలుగా భావించి అసంబద్ధ విధానాల ప్రక్షాళనకు పదం కదపాలి. లోపాలను సమీక్షించుకోవాలి. బాధ్యతతో ప్రజాధనానికి జవాబుదారీగా వ్యవహరించాలి. అప్పుడే 'కాగ్' నివేదికలకు విలువ ఉంటుంది. ప్రభుత్వాల నిబద్ధత నిగ్గుతేలుతుంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ) వీ

వ్యవసాయ మార్కెట్ల పనితీరు - ఒక అనుభవం

ప్రభుత్వాధికారులు, దళారులు కుమ్మక్కయి వ్యవసాయ మార్కెట్లలో రైతులను ఎలా వేధిస్తున్నారో స్వీయానుభవాన్ని వివరిస్తున్నారు **చెరుకుమల్లి కృష్ణ**

రాత్రి మా దగ్గర పొలంలో పనిచేసే వ్యక్తికి ఫోన్ చేసి భోజనం చేసినవా అని అడిగిన సందర్భంలో తను "మామయ్య గారూ రేపయినా మన పెసలు కాటా అయ్యేలా చూడండి, ఇప్పటికే రెండు రోజులు అయ్యింది మనం మార్కెట్‌కి వచ్చి, ఇక్కడ రేపు కూడా కాటా కాదు అంటున్నారు" అన్నాడు. దానికి సమాధానంగా నేను రేపు కచ్చితంగా అయ్యేలా చూద్దామన్నానే కానీ, నాకు కూడా ఒకమూలన అనుమానమే. దానిఫలితమే తెల్లవారు జామున 3 గంటలకు మెలుకువ. నిద్రపట్టక ఆలోచనల పరంపర.

వ్యవసాయం మీద ఆసక్తిలో భాగంగా 23 ఎకరాల పెసరు వేసి, అష్టకష్టాలతో మొత్తం మీద 50 బస్తాల పెసలు కైలు చేయగలిగినాను. అప్పటి నుండి మొదలయింది అసలు కథ. మార్కెట్‌లో వాటిని అమ్మేది ఎట్లా? బయట వ్యాపారస్తుల దగ్గర విచారించగా క్వింటాల్ ధర రు. 5,000-5,500 అని సమాచారం. సరే గవర్నమెంటు మద్దతు ధర ఏమైనా ప్రకటించి ఉంటుందేమోనని నెట్‌లో వెతకగా రు.7050 అని చూశాను. కానీ ఆ ధరకు ఏ వ్యవసాయ మార్కెట్‌లో కొంటున్న దాఖలాలు లేవు. ఎందుకు అంటే రైతుల దగ్గర ఉన్న పెసలు మొత్తం వ్యాపారస్తుల దగ్గరకు వెళ్తేగాని పైవారి లాభాలు చేకూరవు.

వారం రోజుల తర్వాత సరే ఎవరికైనా అమ్మేద్దామని నిర్ణయించుకొని, తెలిసిన మిత్రుడి ద్వారా ఒక గుమస్తాకు ఫోను చేయగా, సార్ వైరా మార్కెట్ యార్డ్‌లో పెసలు కొంటున్నారు, మీరు అక్కడకు వెళ్లి ఏమైనా మ్యానేజ్ చేసుకుంటే రు.7050 ధర వస్తది సార్, అక్కడికి వెళ్లండి అని సలహా ఇచ్చాడు.

ఇక అప్పుడు మొదలైనవి మార్కెట్‌లో అమ్మే ప్రయత్నాలు. గతంలో ఉన్న అనుభవాలు, పేపర్లలో చూసే వార్తలతో వ్యవసాయ మార్కెట్ల మీద ఉన్న భయం కొద్ది, మార్కెట్లో తెలిసిన వాళ్లెవరైనా ఉన్నారా ఆలోచించి, గతంలో నాకు పత్తి అమ్మిపెట్టడానికి సహాయపడిన తెలిసిన మార్కెట్ సెక్రటరీకి ఫోన్ చేసిన. దానికి సమాధానం 'మార్కెట్‌లో వీలుకాదు, నాకు తెలిసిన సేటు ఉన్నాడు, అతనికి చెప్తాను, అక్కడకు వెళ్లండి' అని సలహా. కానీ నేను ఎట్లయిన మద్దతు ధరకు నా పెసలు అమ్మి, నా వ్యవసాయాన్ని లాభసాటి అని నిరూపించాలని నాకోరిక. ఎట్లా దీనికి పరిష్కారమని ఆలోచిస్తూ వైరా పట్టణంతో సంబంధాలున్న మిత్రుడి దగ్గరకు వెళ్లి, 'సార్ వైరా మార్కెట్ యార్డ్‌లో తెలిసినవాళ్లెవరైనా ఉన్నారా. పెసలు అమ్మాలి' అన్నాను. నా అదృష్టం కొద్దీ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మిత్రుడికి బాగా తెలిసినతను. వెంటనే మాజీ చైర్మన్ గారికి చేసిన ఫోన్‌తో నాకు భరోసా వచ్చింది. కావలసిన ధ్రువపత్రాలు తీసుకొని మార్కెట్ రమ్మని మాజీ చైర్మన్ గారు అభయమిచ్చారు. కానీ నాకు ఒకమూలన భయంతో రెండు మూడుసార్లు ఫోన్ చేశాను. వెంటనే పని అయిపోతుంది అని 'అన్న నాకు బాగా కావల్సిన వాడు, మీకు ఒక్క రోజులోనే పని పూర్తి అయ్యేలా చూస్తాను, రెండు మూడు రోజుల నుండి వర్షాలవల్ల కాటాలు కాలేదు. నేను సాయంకాలం మార్కెట్‌కు వెళ్లి పరిస్థితి చూసి ఫోన్ చేస్తాను, అప్పుడు రండి' అన్నాడు.

ఇక కావల్సిన పేపర్ల కోసం వేట మొదలైంది. ధ్రువపత్రం మోడల్ తెప్పించుకొని, స్వయానా దానిని టైపు చేసి, ప్రింట్ తీసుకొని అగ్రికల్చర్ ఆఫీసర్ వద్దకు వెళ్లగా సదరు ఆఫీసర్ వెంటనే సంతకం చేసినారు.

ఇక అసలు సిసలైన రెవిన్యూ వి.ఆర్.ఒ. సంతకం అవసరం. నాకు గత అనుభవాల దృష్ట్యా రెవిన్యూ ఆఫీసు వెళ్లడం ఇష్టంలేక నేను కార్‌లోనే ఉండి నా సహాయకుణ్ని 'వాడు ఏమైనా అడిగితే ఇవ్వు' అని వి.ఆర్.ఒ. వద్దకు పంపాను. సంతకం చేయించుకొని నవ్వుతూ వస్తూంటే 'ఏంటిరా విషయం' అని అడిగాను. 'ఏదో ప్రేమతో దసరా పండుగకు గారెల కోసం పెసలు కావాలట వి.ఆర్.ఒ. కి' అన్నాడు. మా మధ్య నవ్వులు. ఏమి చేయలేని ప్రతి సందర్భంలో మా మధ్య నవ్వులే మమ్ముల్ని రిలాక్స్ చేస్తాయి.

అలా ఆ రోజు పత్రాలు సరిచేసుకొని, ట్రాక్టర్‌లోకి పెసలు లోడ్ చేసుకొని, చైర్మన్ ఫోన్ కోసం ఎదురుచూపులు. నేను రెండు మూడుసార్లు ఫోన్ చేశాక రాత్రి 9 గంటలకు సదరు చైర్మన్ నుండి ఫోన్, ఒక్క రింగ్‌కే ఫోన్ ఎత్తిన నాకు, రేపు ఉదయం 7 గంటలకల్లా మార్కెట్ రమ్మన్న మాట కొద్దిగా ఊరటనిచ్చింది.

తెల్లవారి (శనివారం) ఉదయమే మార్కెట్ చేరుకున్న మాకు ఏమి చేయాలో అర్థం కాక, మరీ ఉదయం పూట ఫోన్ చేస్తే బాగుండదని అలానే గంట ఉండిపోయి చివరికి 9 గంటలకి సదరు చైర్మన్ గారికి ఫోన్ చేశాను. మొత్తం ఎన్ని క్వింటాళ్ళు, పేపర్ల గురించి వివరాలు తెలుసుకొని, 'మొదటి షెడ్లో నాలుగు కుప్పలుగా పోయండి, ఒక్కో రైతు దగ్గర 15 క్వింటాళ్లకన్న ఎక్కువ తీసుకోర'న్న సలహామేరకు, మార్కెట్‌లో తోటి రైతుల అనుభవ సలహాతో నాలుగు కుప్పలుగా పోసిన మాకు ఎదురు చూపుల పరీక్ష మొదలైంది. మార్కెట్లలో జరిగే లావాదేవీల గురించి తెలుసుకుందామన్న ఆసక్తితో మార్కెట్ మొత్తం కలయ తిరుగుతున్న నాకు టి.వి. లలో చూస్తున్న, పేపర్లలో చదువుతున్న వార్తలకు సాక్ష్యాలు కనిపించాయి.

నాలుగైదు రోజుల క్రితం మార్కెట్‌కు వచ్చి కాటాలు కాక, కాటా అయినా లారీలో లోడ్ అయ్యేంతవరకు రైతులదే బాధ్యత అనడంతో అక్కడే ఉండిపోయిన రైతులు. మార్కెట్లో షెడ్లన్నీ పెసల బస్తాలతో నిండి ఉన్నాయి. కానీ రైతులు మాత్రం మొత్తం మీద 20 నుండి 25 మంది మాత్రమే ఉన్నారు. అసలు విషయం ఏమిటంటే 70 శాతం పెసలు దళారీలవని తెలిసింది. వ్యాన్ల కొద్దీ పెసలు వస్తూనే ఉన్నాయి. వాటి వెంట నలుగురైదుగురు వ్యక్తులు మోటారు సైకిళ్లపై చక్కర్లు కొడుతున్నారు. వాళ్లు దళారులు, వారి గుమ్మాస్తాలు అని తెలిసింది. నేను కార్‌లో

రావడం చూసిన దళారుల గుంపు 'కొనుగోళా సార్' అని అడిగినారు. నాకు ఒకింత ఆశ్చర్యం వేసింది. నన్ను వాళ్ల గుంపుగా భావించినందుకు. 'లేదండి, నేను రైతుని' అన్నాను. తర్వాత నా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంభాషణలో నేను వారిలో కొందరి వివరాలు తెలుసుకోగలిగినాను.

అందులో ఒకతను పక్క రాష్ట్రం ఆంధ్రకు చెందిన పెనుగోలను, మరొకతను నందిగామకు చెందినతనుగా తెలిసింది. దాంతో వారిని 'వేరే రాష్ట్రం కదండి, ఇక్కడ ఎలా అమ్మకం సాధ్యం' అని నేను అడగ్గా, లేదులెండి ఇక్కడ రైతుల పేర్లతోనే వచ్చానన్నాడు.

ఇంతలో గేటు దగ్గర గొడవ జరుగుతుండడంతో నేను అటుగా వెళ్లాను. తెలిసిన విషయం గత రెండు రోజులుగా లోడింగ్‌కు లారీలు పెట్టకపోవడంతో, లారీని వేరే పని నిమిత్తం వెళ్లకుండా గేట్లు మూసి గొడవ చేస్తున్న రైతులు. మొత్తం మీద చర్చలతో ఒక అర్ధ గంట తర్వాత లోడింగ్ వచ్చిన లారీలో లోడు వేసే సీరియల్‌లో రైతుల మధ్య గొడవ మొదలైంది. దానికి లోడింగ్ చేయిస్తున్న ఉద్యోగులు జోక్యం చేసుకొని పరిష్కరించకుండా వాళ్ల చావు వాళ్లే చస్తారులే అని చూస్తున్నారు.

నేను సాయంత్రం వరకు మార్కెట్‌లో పూర్తిగా కలయతిరుగుతున్నాను. మధ్యలో ఒకమేస్త్రీ వచ్చి 'మీ సరుకు బాగలేదండీ, సార్ జల్లెడ వేయమంటారా' అన్నాడు. సరే చూద్దాంలే అనుకున్నాను. ఉదయం నుంచి నన్ను గమనిస్తున్న ఉద్యోగి ఒకతను 'నన్ను మీరూ వ్యాపారమా' అని ప్రశ్నించాడు. లేదండి, రైతుని అని బదులిచ్చాను. అయ్యో నేను వ్యాపారం అనుకున్నాను, రైతు అంటే ఈ రోజే కాటా వేయించే వాడిని, సరుకు చూద్దాం పదండి అన్నాడు. నేను కొద్దిగా ఆశ్చర్యానికి, అనుమానానికి లోనయ్యాను. ఏంటీ నాకు ఈ ప్రత్యేక గుర్తింపని. సరకు చూసిన తర్వాత సదరు ఉద్యోగి 'సోమవారం పొద్దున్నే కాచుకుకూర్చోండి. నేను చెబుతాను మా వాడికి (నాణ్యత చూసే ఉద్యోగి) ఒక రెండో, మూడో వేలు ఇవ్వండి పనైపోతుంద'ని ఒకింత సానుభూతిని వలకపోశాడు. ఇదంతా గమనిస్తున్న, వారం రోజులుగా మార్కెట్ చుట్టూ తిరుతున్న పక్క రైతు సదరు ఉద్యోగి వెళ్లగానే, 'వీళ్లంతా ఇంతే, ఎట్లా డబ్బులు గుంజుదామాని ఆలోచన మాత్రమే' అని బాధనంత వెళ్లబుచ్చాడు. రైతుని మానసికంగా మొదట బలహీన పరచడానికి రకరకాల పనులు, మాటలు. నీ సరుకు బాగాలేదు, కాగితాలు సరిగా లేవు, అక్కడి వెళ్లు, ఇక్కడికి వెళ్లు, రేపురా, మాపురా అంటూ విసిగించి రైతు మార్కెట్‌కు రాకుండా చేయడమే వాళ్ల లక్ష్యం. అలా అయితేనే దళారులకు, మార్కెట్ ఉద్యోగులకు, అధికారులకు జేబులు నిండే పండగ.

సదరు ఉద్యోగి చెప్పినట్లుగానే సోమవారం పొద్దున్నే కాచుకు కూర్చుందామని మార్కెట్ బయలుదేరాను. దారిలో అన్నయ్య వాళ్ల అబ్బాయి ఫోన్ చేసి, 'పెసలు మార్కెట్ వాళ్ల కొనుగోళ్లు ఈ ఒక్క రోజేనంట, పేపరుకు ఇచ్చారు చూశావా' అని అడిగాడు. అప్పుడు గానీ పూర్తిగా అర్థం కాలేదు వాళ్ల అసలు ఆలోచన. గత రెండు రోజులు రైతులను సరుకు తేవద్దని బోర్డు పెట్టి, దళారుల సరుకుతో పూర్తిగా మార్కెట్ నింపి, ఈ రోజు పేపరు ప్రకటన. ఎంతో పక్కా ప్రణాళిక ప్రకారం చేశారు. ఉదయం మొదలవ్వాల్సిన కొనుగోళ్లు మధ్యాహ్నం వరకు మొదలు కాలేదు. రాత్రి నుండి వచ్చిన సుమారు 150 మంది రైతులు అధికారి రాకకోసం ఎదురుచూపులు. గోడౌన్‌లో నిన్న లోడ్ చేసిన సరుకు దిగుమతి చేసుకోకుండా ఆపాడని, అందుకే కొనుగోళ్లు ఆగాయని తెలిసిన రైతులు గౌడౌన్ దగ్గరకు వెళ్లారు. అక్కడ నాణ్యత పరిశీలన ఉద్యోగి గోడౌన్ ఉద్యోగితో మంతనాలు చేస్తున్నాడు. మమ్మల్ని చూసిన సదరు నాణ్యత పరిశీలన ఉద్యోగి మా దగ్గరకు వచ్చి 'చూశారా, మీరేమో సరకు ఎలా ఉన్నా కొనండి అని బలవంతం చేస్తారు, ఇక్కడేమో వీళ్లు సరుకు బాగాలేదని కిరికిరి చేస్తారు. ఇప్పుడు వీళ్లకు ఇచ్చేది ఎవరు ఇవ్వాలి' అని మమ్మల్ని ప్రశ్నించాడు. మేమంతా మూకుమ్మడిగా గోడమ్ ఉద్యోగి దగ్గరకు వెళ్లి ఏమిటి విషయం అని అడిగినాం. దానికి ఆయన మాకు, మా పైవాళ్లకి వాట్సప్‌లో ఏయే వ్యానుల్లో ఎవరెవరి సరుకు వచ్చిందో ఫొటోలు వస్తున్నాయి. వీళ్లేమో సరుకంతా పాస్ చేస్తుంటారు అని బదులిచ్చాడు. దీని మొత్తం సారాంశమేమిటంటే ఇద్దరికీ వాటాల పంపకం కుదరకపోవడమే. ఇద్దరు ఉద్యోగులు పావుగంట ఏకాంత మంతనాల తర్వాత కుదిరిన ఒప్పందం మేరకు గోడౌన్‌లోకి దుగుమతి మొదలైంది.

ఈ పంపకాల ఒప్పందం పూర్తయి, అంతా సర్దుమణిగిన తర్వాత కొనుగోళ్ల అధికారి తీరిగ్గా వచ్చి కొనుగోళ్లు ప్రారంభించాడు. వరుసలో చూసుకుంటూ, కొన్ని క్వాలిటీ పాస్ చేస్తూ, కొన్ని రిజెక్ట్ చేస్తూ ఉన్నారు. రిజెక్ట్ అయిన రైతులు అధికారి వెంట తిరుగుతూ బతిమిలాడుతున్నారు. అధికారి ఏమాత్రం కనికరం లేకుండా విసుక్కుంటున్నాడు. అలా నా వంతు వరకు వచ్చిన అధికారి నా పెసలు చూసి 'ఇవి ఎవ్వరివి' అని కాస్తంత పెచ్చు స్వరంతో అడిగాడు. 'నావే సార్ అంటూ బదులిచ్చాను'. 'సరుకు బాగాలేదు. రిజెక్ట్ చేస్తున్నాను' అన్నాడు. వెంటనే నేను 'ఎందుకు సార్? నా సరుకు ఏమైంది? ఎందుకు రిజెక్ట్ చేస్తున్నారు' అని కాస్తంత గట్టిగానే అడిగాను.

ఇంతలో గత పదిహేను రోజులుగా కురుస్తున్న వర్షాలలో ఈ పెసలను ఆరబెట్టటంలో నాకంటే ఎక్కువ బాధననుభవించిన తను కడుపుమండిపోయి నాలుగు రోజుల కింద ఖరీదు చేసిన లాట్ నుండి శాంపిల్ తెచ్చి వాటిని అధికారికి చూపిస్తూ, 'వీటికంటే మావి ఏ రకంగా నాసిరకంగా ఉన్నాయి?' అంటూ సదరు అధికారిని గట్టిగా కేకలు వేస్తూ నిలదీశాడు. 'కొంటే అన్నీ కొనండి, లేదా ఖరీదులు అన్నీ ఆపండి' అని నేను భీష్మించు కూర్చోవడంతో సదరు అధికారి ఖరీదులు నిలిపివేసి ఆఫీసుకు వెళ్లిపోయాడు. తోటి రైతులు ఒక్కరిద్దరు మినహా అందరు దీనికి మద్దతు తెలిపారు.

ఇలా మూడు నాలుగు పర్యాయాలు సదరు అధికారి రైతులు బతిమిలాడితే రావడం, నేను ఆపడం జరిగింది. దాదాపు రెండు గంటలపాటు ఈ తతంగంతో మార్కెట్ పూర్తిగా నిలిచిపోయింది. కేవలం పైసల కోసం ఈ నాటకాలాడడంలో సిద్ధహస్తులైన అధికారులకు, రైతులకు మధ్య గొడవలేపి వాళ్లపని ముగించుకోవడం కొరకు ఒకరిద్దరు రైతులను నాపైకి ఉసికొల్పి తిరిగి ఖరీదులు మొదలు పెట్టారు. అసహనానికి గురవుతున్న కొందరు రైతులను గమనించిన నేను ఈసారి ఆపడానికి వెళ్లలేదు.

ఇంతలో నలుగురైదుగురు రైతులు వచ్చి 'అన్నా చాలా లాట్‌లు రిజెక్ట్ చేస్తున్నాడు, ఎవరితోనైనా మాట్లాడన్న' అని అడిగారు. నేను మళ్లీ వెళ్లి 'కొంటే అందరివి కొనండి, లేదా ఆపేయండి' అని నిలదీశాను. కాస్త రైతుల మద్దతు పొందడంతో అధికారి సహ ఉద్యోగి ఒకతను (మామూళ్ల వసూళ్లలో ఇతనే దిట్ట) 'మేము కొనుగోళ్లు ఆపం, ఇంతే చేస్తాం, ఏం చేస్తావో చేసుకో', అంటూ ఒకింత విసురుగా మీదకు వస్తూ కేకలు వేశాడు.

నాలో పట్టుదల పెరిగి, ఏదైనా చేయాలి, ఎట్లాని ఆలోచిస్తూ గతంలో

రివర్స్ టెండరింగ్ - పోలవరం గట్టెక్కేనా?

***పోలవరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న కారణంతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన రివర్స్ టెండరింగ్ ప్రక్రియ వల్ల ప్రాజెక్ట్ నిర్మాణం పనులు జరుగుతాయా అని ప్రశ్నిస్తున్నారు* బి.ఎస్.రాజు**

నదులెన్ని వంకలు తిరుగుతాయో అన్ని వంకలు తిరుగుతూనే ఉంది పోలవరం ప్రాజెక్టు. దీని కథ ఇప్పటిది కాదు. 1941లోనే దేశానికి స్వతంత్రం రాకమునుపే పోలవరం ఆనకట్ట ఆలోచన మొదలైంది. అప్పటి నుండి ఈనాటికి కూడా ఈ ఆనకట్ట కథ ముగింపుకు రాలేదు. ఈ ప్రాజెక్టు ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉంది. ఆదిలో ఎల్.వెంకటకృష్ణ అయ్యర్ అనే నీటిపారుదల నిపుణుడు పోలవరం సమీపంలో గోదావరిపై రిజర్వాయర్ నిర్మించాలానే ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదనను కూలంకషంగా పరిశీలించాక ఒక నివేదికను రూపొందించారు. ఈ ప్రాజెక్ట్‌కు రామపాదసాగర్ అని పేరు పెట్టారు. అప్పట్లో దీని అంచనా వ్యయం రు.129 కోట్లు. విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల అవసరాలకు నీటి తరలింపు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల సాగు, తాగు నీటి అవసరాలను తీర్చడం, విజయవాడ నుంచి గుండ్లకమ్మ వరకు మరో 143 కిలోమీటర్ల కాలువ నిర్మించడం అప్పట్లో ఈ ప్రాజెక్టుకు పెట్టుకున్న లక్ష్యాలు. పోలవరం ఎన్నో అభ్యంతరాలను, అవరోధాలను అధిగమిస్తూ ఎట్టకేలకు జాతీయ హోదాను సాధించింది. అయినప్పటికీ అనుకున్నట్టు ప్రాజెక్టు నడక సాగడం లేదు. అన్నీ ఒడిదుడుకులే. రాజకీయ పార్టీల ఆశ్రిత కాంట్రాక్టర్ల కుమ్ములాటల్లో, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ పాచికల్లో పడి నలుగుతూనే ఉంది. వీరికి ఈ ప్రాజెక్ట్ కామధేనువుగా మారింది. వీరంతా జేబులు నింపుకుంటూనే ఉన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులైన ముంపు గ్రామాల ప్రజలు కష్టాలపాలై దిక్కులేని వారయ్యారు.

ఈ ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో 276 గ్రామాలు, ఛత్తీస్‌గఢ్‌లో 4, ఒడిశాలో 8 గ్రామాలు ముంపుకు గురవుతాయి. 3427.52 ఎకరాల అటవీ భూమి మునిగిపోతుంది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో ముంపుకు గురవుతున్న మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. అవి భద్రాచలం రెవిన్యూ డివిజన్‌లోని కూనవరం, వర రామచంద్రాపురం, చింతూరు, భద్రాచలం మండలాలు.. పాల్వంచ రెవెన్యూ డివిజన్‌లో వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గంపాడు మండలాలు.

చివరికి ఇప్పుడు పోలవరం ప్రాజెక్ట్‌ను మొదట్లో రామపాదసాగర్ నిర్మించాలని ప్రతిపాదించిన ప్రాంతానికి 2 కిలోమీటర్ల ఎగువన నిర్మిస్తున్నారు. 2,454 మీటర్ల పొడవైన ఎర్త్-కమ్-రాక్ ఫిల్ డ్యాం, 1,128 మీటర్ల పొడవైన స్పిల్వేలు వీటిలో భాగం. 181.50 కిలోమీటర్ల పొడవుగల ఎడమకాలువ నిర్మించి తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తారు. అలాగే విశాఖపట్నం నగరానికి తాగు నీరు ఇవ్వనున్నారు. ఈ కాలువను జలరవాణాకు కూడా ఉపయోగించనున్నారు. 174 కిలోమీటర్ల పొడవుగల కుడికాలువను నిర్మించి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో దాదాపు 3 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తారు. 80 టిఎంసిల గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలిస్తారు. 960 మెగావాట్ల సామర్థ్యం గల జలవిద్యుత్ ప్రాజెక్టును నిర్మించడం కూడా దీని లక్ష్యం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 2017 ఆగస్ట్‌లో పోలవరానికి సంబంధించి కొత్త అంచనాలను సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి)కి సమర్పించింది. 2013-14 ధరల ప్రకారం ప్రాజెక్ట్ బడ్జెట్ రు. 58,319 కోట్లకు చేరినట్లు కేంద్రానికి ఆంధ్రప్రదేశ్

ఉన్న చిరు పరిచయంతో స్థానిక ఎంఎల్ఎ, ప్రభుత్వంలో తెలిసిన మిత్రుడికి ఈ విషయాన్నంతా వివరించి, రైతులకు న్యాయం జరిగేలా చూడమని కోరాను. వారు వెంటనే స్పందించి, పరిష్కారంగా సదరు అధికారిని ఎంఎల్ఎ క్యాంప్ ఆఫీసుకు పిలిపించారు.

ఇది తెలుసుకున్న మేము ఇరవై మంది రైతులం క్యాంప్ ఆఫీసుకు వెళ్లి ఎంఎల్ఎను కలిశాం. ఎంఎల్ఎ చొరవతో చివరకు రైతులను ఇబ్బంది పెట్టకుండా అందరి పెసలు కొనాలని సదరు అధికారికి సూచన చేశారు. అధికారి ఈగో దెబ్బతినడంతో ఖరీదులు మొదలైన రెండు గంటల తర్వాత గాని నావరకు రాలేదు.

అలా ముగిసింది నాపెసల అమ్మకం.

దీనికి కొసమేరుపేమిటంటే సదరు అధికారి బాహాటంగా 'మేమైతే సరుకు పాస్ చేస్తున్నాం గాని, గోడౌన్‌లో సరుకు దింపుకోవడానికి ఒక ఐదు వేలు ఇవ్వాల'ని నిస్సిగ్గుగా హుకుం జారీచేసి వెళ్లిపోయాడు.

రైతులను వేధించి, మార్కెట్ వైపు చూడకుండా చేసి, దళారులకు ఏ విధంగా సహకరిస్తారో నాకు ఈ నాలుగు రోజులు పూర్తిగా ఇక్కడ ఉంటేకాని అర్థం కాలేదు. కోట్ల రూపాయల అవినీతికి, ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి నిలయాలుగా మార్కెట్లు, రైతులను పీల్చుకుతినే రాక్షసులుగా యంత్రాంగం ఎలా మారిందో అర్థమయింది.

ఇలా ఉంటే రైతుకు వ్యవసాయం పండగ అవుతుందా? ప్రభుత్వాలు సదుద్దేశంతో రైతులకు అందించే మద్దతు ధరలు, సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలు దళారులకు, కింది, పై అధికారుల జేబులు నింపుకోవడానికే తప్ప, లబ్ధిదారులకు చేరడం లేదు. దీనికి కారణం లబ్దిదారులు ప్రశ్నించకపోవటమా? యంత్రాంగ లోపమా? సరియైన ప్రణాళిక లేకపోవటమా? ఏది ఏమైనప్పటికీ సాగులో కీలకమైన మార్కెట్ వ్యవస్థని ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ప్రస్తుతం రెవిన్యూ వ్యవస్థ ప్రక్షాళన చేస్తున్న ప్రభుత్వం, మార్కెట్ వ్యవస్థని కూడా ప్రక్షాళన చేయవలసి ఉన్నది. ఎప్పటికైనా రైతుకు వ్యవసాయం పండగ కావాలని ఆశిద్దాం.

(రచయిత రైతు) వీ

ప్రభుత్వం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ సమర్పించిన కొత్త అంచనా వ్యయానికి సీడబ్ల్యూసీ ఆమోదం లభించాల్సి ఉంది. మొత్తం వ్యయంలో ఒక్క పునరావాసానికే రు. 32,000 కోట్లు అవుతాయని అంచనా. ఇది నిజంగా నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకే ఖర్చుపెడతారని గ్యారంటీ ఏమీలేదు.

2014లో పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్ట్‌గా గుర్తించారు. జనవరి 2017 నాటికి పోలవరంపై పెట్టిన ఖర్చు రు. 8,898 కోట్లని చెబుతున్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన అనంతరం, 2014 మార్చ్ నుంచి 2017 జనవరి వరకు ఖర్చుపెట్టిన నిధులు రు. 3,349.70 కోట్లని అంటున్నారు. 2014 మార్చి నుంచి 2017 జనవరి నాటికి పోలవరం అథారిటీ ద్వారా కేంద్రం ఇచ్చిన నిధులు రు.2,916.54 కోట్లు. పోలవరం నిర్మాణానికి అయ్యే నిధులను నాబార్డు కేంద్రానికి రుణంగా ఇస్తుంది. వీటిని పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ద్వారా ఖర్చు చేస్తున్నారు. 2014 జనవరి 1 నాటి అంచనాల ప్రకారమే ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా భరిస్తామని కేంద్రం తెలిపింది. అంటే ఈ అంచనాల కన్నా అదనంగా ఖర్చు అయితే దానిని రాష్ట్రమే భరించాలి.

ఇపుడు ఆంధ్రలో చంద్రబాబు హయాం అంతమై జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వైఎస్సార్ పార్టీ పాలన సాగుతోంది. కొత్త ముఖ్యమంత్రి నవరత్నాల మ్యానిఫెస్టోతో ఘనవిజయం సాధించాడు కాబట్టి అదే తన గీత, ఖురాన్, బైబిల్ అని నిత్యం చెబుతున్నాడు. ఇందులో చంద్రబాబు పాలనలో జరిగిన అవినీతి కుంభకోణాల బండారం, ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో కాంట్రాక్టర్లతో కుమ్మక్కు ఇత్యాది ప్రజా ధన దోపిడీ బయట పెట్టడం ఒకటి. ఇపుడు దేశమంతా జరుగుతున్న రాజకీయ క్రీడ ఇదే! పాత ప్రభుత్వాలపై కొత్త ప్రభుత్వాలు తిరమరుగైతే తిరిగి అవే ఆరోపణలు, సిబిఐ ప్రయోగాలు. ఓడిన పార్టీల్లో దిగడి ఉన్న, ప్రజాధనంతో కోట్లకు పడగలెత్తిన, దోపిడీ తిమింగలాలను చేతులు మెలేసి తమవైపు లాక్కోవడాలు ఇదే పార్లమెంటరీ ప్రబుద్ధ నీతి, మన దేశ ప్రజాస్వామ్యం వర్థిల్లుతున్న రీతి.

ఇపుడు జగన్‌మోహన్ రెడ్డి పోలవరాన్ని రివర్స్ టెండరింగ్ ప్రక్రియ పేరు మీద కొత్త కాంట్రాక్టరుకు అప్పచెబుతున్నాడు. అంటే ఇదివరలో చంద్రబాబు ప్రభుత్వం తనకనుకూలమైన పద్ధతిలో తనకు ఇష్టులైన వారికి పోలవరం పనులను అధిక ధరలకు అప్పచెప్పాడని, అలా చేయడం ద్వారా వెనక నుండి కాంట్రాక్టరునుండి కోట్ల లబ్ది పొందాడని, అందుచేత పాత టెండర్‌ను రివర్స్ చేసి తిరిగి కొత్త టెండర్ ప్రక్రియ చేపట్టి ప్రజాధనం ఆదా చేయవచ్చని ఒక నిర్ణయానికి వచ్చి రివర్స్ టెండర్ ప్రక్రియను చేబడుతున్నామని జగన్ ప్రభుత్వం వాదన. ఈ పద్ధతి పాటించడం ద్వారా రు. 628 కోట్ల ప్రజాధనం ఆదా అయిందని చెబుతున్నారు.

ఇదివరకటి చంద్రబాబు ప్రభుత్వం నవయుగా సంస్థ కిచ్చిన వెలకన్నా రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ద్వారా 12.6 శాతం తక్కువ ధరకు తెలంగాణా రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టును వేగవంతంగా నిర్మించిన మేఘా ఇంజనీరింగ్ ఆఫర్ ఇచ్చిందని అందుచేత నవయుగ స్థానంలో ఈ మేఘా సంస్థకు పోలవరం మేజర్ పనులన్నిటినీ అప్పచెబుతున్నట్లు జగన్ ప్రభుత్వం ప్రకటించింది. అసలు ఈ రివర్స్ టెండరింగే ఓ పెద్ద కుంభకోణమని ఇది జగన్ రివర్స్ ధనజన యజ్ఞమని చంద్రబాబు అండ& కో అభియోగం.

ఆంధ్ర ఎసెంబ్లీ ఎన్నికల్లో జగన్ పార్టీకి ఆర్థిక ధన్నుగా తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, మేఘా ఇంజనీరింగ్ కంపెనీని పిలిచి ఆనాడే కుదిరిన ఒప్పందం ప్రకారమే ఇదంతా జరిగిందని చంద్రబాబు అండ్ కంపెనీ అంటోంది. కేంద్రంలో బిజెపి ఈ వ్యవహారంపై గుర్రుగానే ఉంది. ఒకసారి కుదిరిన ఒప్పందాలను ప్రభుత్వాలు మారినప్పుడల్లా తిరగదోడితే దేశంలో పెట్టుబడులు పెట్టేవాళ్లు భయపడి పారిపోతారని పసలేని వాదనను కేంద్రం ప్రచారం చేస్తోంది.

దేశంలో ఓ టెండరింగ్ పద్ధతి అంటూ ఉంది కాబట్టి రివర్స్ టెండరింగ్ అనేది అక్రమమని, పద్ధతి అతిక్రమణ అని అనడం ఒక ఎత్తు. పెట్టుబడులు రావనే వాదనలో పసలేదు. నిజంగానే కాస్ట్-బెనిఫిట్ మదింపు వేసి ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం ప్రాజెక్టు కాస్టు మితిమించి కాంట్రాక్టరుకు లాభాలు సమకూరుస్తుందని తేలినప్పుడు, ఇది ఒక తటస్థ నిపుణుల సంస్థ ద్వారా నిర్ధారణ అయితే పాత టెండర్‌ను తిరగదోడి, రివర్స్ చేసి కొత్త బిడ్లు పిలవడంలో తప్పు లేదు. అయితే ఇది కేంద్రం చెయ్యాల్సిన పని. ఎందుకంటే ఇది జాతీయ ప్రాజెక్టు. సొమ్ము సమకూర్చాల్సింది కేంద్రం.

రాష్ట్రం కేంద్రానికి అన్ని లెక్కలతో ప్రజాధనం దుర్వియోగమౌతున్నదని సోదాహరణంగా, ఘంటాపథంగా వివరించి ఓ తిరుగులేని పత్రం సమర్పిస్తే కేంద్రం కాదనలేని స్థితిలో పడుతుంది. అప్పుడు కూడా కేంద్రం తోసి రాజంటే న్యాయ పోరాటం, ప్రజా పోరాటం ఉండనే ఉంటుంది. అలాకాక ఇరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల అలాయి-భలాయిలో భాగంగా భారీ ప్రాజెక్టుల్లో అవకతవక నిర్ణయాలకు పోతే, ఒకవేళ ఆ నిర్ణయం నిజంగా ప్రజాహితమైనదే అయినా, ప్రజా ధనాన్ని ఆదా చేసేదే అయినా, ఇప్పుడున్న దక్షిణాది ప్రాంతీయ సంస్థానాల దురాక్రమణ అనే కలుషిత రాజకీయ వాతావరణంలో ఆంధ్రప్రజలే పెద్దఎత్తున నష్టపోతారు.

బ్రిటిష్ వారిపాలనలో మన దేశంలో కట్టిన ప్రాజెక్టులు, నిర్మాణాలు చాల పకడ్బందీగా, నాణ్యతా ప్రమాణాలతో అవినీతి రహితంగా జరిగినట్లు అప్పట్లో పెద్దవాళ్లు చెబుతుండేవారు. ఆ ప్రయోజెక్టులు, నిర్మాణాలు ఇప్పటికీ పటిష్ఠంగా ఉడడం మనం చూస్తున్నాం.

దేశం స్వాతంత్ర్యం సంపాయించుకున్నాక అన్ని ప్రాజెక్టుల నిర్మాణాల్లోనూ కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులూ, ఇంజనీర్లు, దళారులు కుబేరులయ్యారు. అంతేగాక వీరంతా దేశ రాజకీయాలను శాసించే దశకెదిగారు. ప్రోజెక్టులంటే ప్రధానంగా వీరి లబ్ధికే ననే భావన ప్రతి భారతీయుడి మనసులో నాటుకుపోయింది. ప్రజాస్వామ్యం పేర, ప్రజాభివృద్ధి పేర ఈ తతంగమంతా నిరాఘాటంగా కొనసాగుతూనే ఉంది. పేరు ప్రజలదేనైనా ఇందులో వారి ప్రమేయం శూన్యం. వారి పర్యవేక్షణ అన్నది అంతకన్నా శూన్యం.

అందుచేత ఇప్పుడు జగన్ చేపట్టిన పోలవరం రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ద్వారా పోలవరం ప్రాజెక్టు ఇప్పటికైనా గట్టెక్కేనా? అనుమానమే! దీన్నికేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తుందా? మోకాలడ్డకుండా సొమ్ము సమకూరుస్తుందా? ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలపై పట్టు సాధించాలనే బలీయమైన ఆకాంక్షకు పోలవరం ప్రాజెక్టు బలైపోకుండా రూపు దిద్దుకుని గట్టెక్కుతుందా? ఈ రివర్స్ టెండరింగ్ ప్రక్రియ ద్వారా ప్రజాధనం ఆదాఅవుతున్నదనే అంశాన్ని , కేంద్రం పరిగణనలోనికి తీసుకుని, సొమ్ము సమకూర్చి పోలవరాన్ని గట్టెక్కిస్తుందని, ప్రాజెక్టు వేగవంతంగా పూర్తై ఆంధ్ర ప్రజలకు అందుబాటులోనికి వస్తుందని ఆశిద్దాం!

(రచయిత శ్రామిక నేస్తం సంపాదకులు) వీ

సంక్షోభంలో ఆంధ్రప్రదేశ్ చిన్న పరిశ్రమలు

దేశ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంద్య ప్రభావం వల్ల ప్రధానంగా ఆటోమొబైల్‌రంగంలో ఉత్పత్తి ఆగిపోయి, ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న పరిశ్రమలు మూయడంతో లక్షల మంది కార్మికులు నిరుద్యోగులయ్యారని అంటున్నారు **వై. వెంకటేశ్వర్లు**

దేశంలో అమలవుతున్న ఆర్థిక మాంద్యం ప్రభావం ఆటోమొబైల్ రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తే, భవన నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. కోట్లాది మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఈ రంగం పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల మూలంగా ఇటుక, సిమెంటు, ఇనుము, ఇసుక మొదలగు రంగాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఈ రంగాల్లో పనిచేస్తున్న వారు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు.

రాష్ట్రంలో ఇటుక పరిశ్రమకు ప్రసిద్ధి అద్దంకి ఈ ప్రాంతం నుండి ప్రకాశం జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాలకు అద్దంకి ఇటుక వెలుతుంది. రాష్ట్రంలో ఏర్పడ్డ ఇసుక సంక్షోభంతో పాటు దేశంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం ప్రభావం భవన నిర్మాణ రంగం మీద గణనీయంగా పడింది. దీనితో ఇటుక కొనుగోలు చేసేవారే కరువయ్యారు.

గత ఏడాది 1000 ఇటుకల ధర రు. 6,500 వరకు ఉండగా ప్రస్తుతం రు. 4,500 లకు పడిపోయింది. ఒక ఇటుక రు. 2 చొప్పున తగ్గింది. రెండేళ్ల క్రితం 1000 ఇటుకల ధర రు. 8,500ల వరకు ఉండగా ఇటీవల ధరలు తగ్గడం స్పష్టంగా కనబడింది. ఈ నేపథ్యంలో అద్దంకి, తిమ్మాయిపాలెం ప్రాంతాలలో 70 ఇటుక బట్టీలు ఉన్నాయి. గత ఏడాది ఇళ్ల నిర్మాణం ఎక్కువగా ఉండడంతో ఇటుక తయారీ ఎక్కువగా జరిగింది. పలువురు ఇటుక బట్టీ యజమానులు అప్పులు చేసి మరీ పెద్ద ఎత్తున ఇటుకలు తయారు చేశారు. దీనితో సరాసరి ఒక్క బట్టీలో 10,000,00 ఇటుకలు తయారు చేశారు. ఒక్క అద్దంకి ప్రాంతంలోనే 6 కోట్ల ఇటుక నిల్వలు ఉన్నాయి.

రాష్ట్రంలో పలు ప్రాంతాలలో భారీ ఎత్తున ఇటుక బట్టీలలో కోట్లాది ఇటుకలు నిల్వ ఉన్నాయి. దీంతో ఇటుక బట్టీ యజమానులు రోజు రోజుకు ధరలు తగ్గించి అమ్ముకునేందుకు సిద్ధపడుతున్నారు. ఇటీవల వరకు 1,000 ఇటుకల ధర రు. 5,000 ఉండగా ప్రస్తుతం మరింత తగ్గి రు. 4,000 వరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. 10 లక్షల ఇటుకల తయారీకి సుమారు 40 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. తయారు అయిన ఇటుక నెలలోపు అమ్మకాలు జరిగితే 1,000 ఇటుకలకు రు. 500 నుండి రు. 1,000 చొప్పున బట్టీల యజమానులకు ఖర్చులు పోను లాభం ఉంటుంది.

ప్రస్తుతం ధరలు మరింత తగ్గడంతో లాభం మాట ఎలా ఉన్నా కనీసం అసలు ధరవస్తే చాలు అన్న విధంగా అమ్మకాలు చేస్తున్నారు. ఒక నెల రోజులు అమ్మకాలు ఆగితే 10 లక్షల ఇటుకలు తయారు చేసే బట్టీ యజమానికి సరాసరి వడ్డీ కింద నెలకు ఒక లక్ష రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అదే నాలుగు నెలలు ఇటుక నిల్వలు పేరుకుపోతే 5 లక్షల రూపాయల అదనపు భారం పడుతుంది. దీనితో అప్పులు తెచ్చి ఇటుకలు తయారు చేసిన బట్టీ యజమానులు మరింత నష్టపోతున్న పరిస్థితి ఏర్పడింది.

సుమారు 10 వేల మంది కూలీలు ఇక్కడ ఉపాధి కోల్పోతున్నారు. దీనికి తోడు ఇసుక తవ్వకాలు రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంతో ఉన్న కాస్త పనులు పూర్తిగా కోల్పోయి భవన నిర్మాణ రంగం పీకల్లోతు ఊబిలోకి కూరుకుపోయింది. అక్టోబర్ నెలలో మరలా ఇటుకల తయారీ ప్రారంభించవలసి ఉన్న నేపథ్యంలో నిల్వ ఉన్న ఇటుక అమ్మకాలను కొనేవారు లేక పడరాని పాట్లు పడుతున్నారు. ఇటుకలు అమ్ముడుపోకపోతే తిరిగి ఇటుక ఉత్పత్తి చేయడం సాధ్యం కాదు.

పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన ఆర్థిక సంక్షోభం కింద ఇటుక పరిశ్రమల యజమానులు కూడా నలిగిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది బట్టీ యజమానులు ఇటుక తయారు చేయడానికి వెనుకాడుతున్నారు. దేశంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు ఋణాలు ఇస్తామని ప్రకటించినా, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచుతామని ప్రకటించినా, ఇటుక బట్టీలు సంక్షోభం నుండి బయటపడ లేకపోతున్నాయి.

నిత్యం పల్నాడులో సిమెంటు, సున్నపు లారీలతో క్షణం తీరిక లేకుండా తిరిగే లారీలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. గుంటూరు జిల్లా, పిడుగురాళ్లలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 360 సున్నపు బట్టీలు ఉన్నాయి. 25 వేల మంది కార్మికులతో నిత్యం సున్నపు బట్టీలు ఉత్పత్తి కొనసాగిస్తూ, ఇక్కడ తయారయిన సున్నం అనేక ప్రాంతాలకు సప్లై చేస్తూ పెద్ద ఎత్తున యజమానులు లాభాలు గడిస్తున్నారు. ఇటీవల దేశంలో ఏర్పడిన ఆర్థిక మాంద్యం ప్రభావం వల్ల 200లకు పైగా సున్నం బట్టీలు మూసివేశారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి వలస కూలీలు వచ్చి పిడుగురాళ్ల చుట్టు పక్కల అద్దె ఇళ్లలో ఉంటూ సున్నపు బట్టీలలో కూలీలుగా వేలాది మంది జీవనం వెళ్లదీస్తున్నారు. బట్టీలలో పనిచేసే కార్మికులకు చట్టబద్ధమైన జీతాలు లేవు, గుర్తింపు లేదు. ప్రమాదాలు జరిగినా తూతూ మంత్రంగా యజమానులు విదిలించే పదో, పరకో మినహా ఎలాంటి ప్రయోజనం లేదు. బట్టీలలో నిత్యం పనిచేయడం ప్రమాదంతో కూడుకున్న జీవితం.

పిడుగురాళ్లలో సున్నపు బట్టీల నిర్మాణం జరిగి సుమారు 50

సంవత్సరాలు అవుతున్నది. నాటి నుండి ఉత్పత్తి జరుగుతున్నా ఇక్కడ పనిచేసే కార్మికుల వివరాలు సేకరించడం, ప్రమాద నివారణకు యజమానులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో పరిశీలించడం కార్మిక శాఖ చేయకుండా యజమానుల శాఖగా మారడం వలన నామ మాత్రపు జీతాలతో కూలీలు తమ జీవితాలు గడుపుతున్నారు.

ఇక్కడ తయారు అయిన సున్నం గోడలకు వేయడానికి, బ్రిక్స్ బిళ్లలకు, చేపలకు, పేపరు మిల్లులకు, బెల్లం, షుగర్, మెడిసిన్, పెయింట్స్‌లలో, ఇంకా అనేక రకాలుగా ఉపయోగిస్తారు. నిత్యం దుమ్ము, ధూళితో సున్నం బట్టీలలో పనిచేస్తున్న కార్మికులకు హెల్మెట్, రెయిన్‌కోట్లు, గ్లౌస్, మాస్కులు, బూట్లు, కళ్లజోళ్లు, బెల్లం, కొబ్బరినూనె మరికొన్ని వస్తువులు కార్మికులకు పనిచేసే సమయములో ఇవ్వకపోవడం వలన కార్మికులు అనేక రకాల జబ్బులు వస్తున్నాయి.

కిడ్నీ వ్యాధులు, గ్యాస్టిక్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, నెమ్ము, నడుము నొప్పులు లాంటివే కాక కళ్లకు రాళ్లు తగిలి గుడ్డివారుగా మారడం, చేతులు విరగడం, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి చివరకు ప్రాణాలు కోల్పోవడం సహజంగా మారింది. పిడుగురాళ్ల పట్టణంలో సున్నపు బట్టీలే కాక అనేక రాళ్ల క్వారీలు ఉన్నాయి. వీటిలో వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు.

తాపీ మేస్త్రీలు, ముఠా కూలీలు, ఆటో కార్మికులు సుమారు 50 వేల మందికి పైగా వివిధ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా పల్నాడులో సిమెంటు ఫ్యాక్టరీలు, ఇసుక క్వారీలతో కలిపి మొత్తం లక్ష మందికి పైగా కార్మికులు ఉండి గుంటూరు జిల్లాలోనే అత్యధిక ఆదాయం కలిగిన పల్నాడు ప్రాంతంలో క్వారీలలో పనిచేస్తున్న కార్మికులకు ప్రత్యేకమైన సౌకర్యాలు కాని, ఇ.ఎస్.ఐ. హాస్పిటల్ కాని లేకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వెల్లడిస్తోంది.

వాచ్‌మెన్‌లు కట్టుబానిసలలాగా ఎప్పుడూ సున్నపు బట్టీలను కనిపెట్టుకొని ఉండి కార్మికులకు పనిముట్లు సప్లై చేయడం, రిపేరులు చేయడం, యజమానులకు సేవలు చేయడం, బట్టీలకు కాపలా కాయడం లాంటి పనులు చేస్తున్న వీరికి నెలకు వచ్చే జీతం రు. 2,200 మాత్రమే.

సున్నపు బట్టీల ఖర్చుల వివరాలు (కార్మికులకు) :

తెల్లరాయి టన్ను కొట్టడానికి రు. 110; 20 టన్నుల బొగ్గు అన్‌లోడ్ చేస్తే రు. 550; చెక్కరాయి టన్ను కొట్టడానికి రు. 75; సూర బొగ్గు అన్‌లోడ్ చేస్తే టన్నుకు రు. 70; నల్ల రాయి టన్ను కొట్టడానికి రు. 90; బొగ్గు కొట్టడానికి టన్నుకు రు. 125; 16 టన్నుల బొగ్గు అన్‌లోడ్ చేస్తే రు. 450; బట్టీలలో సున్నపురాయి లాగి గ్రేడ్ చేసి గోతాలలోవేసి లోడ్ చేసినందుకు రు. 390.

రెండు సంవత్సరాలకు ఒకసారి నామమాత్రంగా కార్మికుల కూలీ రేట్లు పెంచుతారు. కార్మికులను భాగస్వాముల్ని చేయకుండా యజమానులు, రాజకీయ నాయకులు కలిసి కూలీ రేట్లు పెంచి దళారుల ద్వారా బట్టీలలో ప్రకటిస్తారు.

పెట్టుబడి, లాభం

ఒక టన్ను రాయికి రు. 800, టన్ను బొగ్గుకు రు. 10,000, కరెంటు రోజుకు రు. 100, రోజుకు 2 టన్నుల బొగ్గు, 2 టన్నుల రాయి ఉత్పత్తి చేస్తే 10 టన్నుల సున్నం వస్తుంది. టన్ను సున్నం రు. 5,400, 10 టన్నుల సున్నం రు. 70,000, బట్టీ పెట్టుబడి రు. 30 లక్షలు, రోజుకు వడ్డీ రు. 2,000, యజమాని జీతం, అతని కుటుంబ ఖర్చులు తీసివేసినా కార్మికుల నుండి అదనపు విలువ సుమారు రోజుకు రు. 40,000 యజమానులకు మిగులుతుంది. సున్నపు బట్టీలలో పనిచేసే కార్మికులకు చట్టబద్ధమైన గుర్తింపు లేదు. ప్రమాద బీమా సౌకర్యం లేదు. దుమ్ము, ధూళి అరికట్టడానికి చర్యలు లేవు. దీనివల్ల పిడుగురాళ్ల పట్టణం చుట్టుపక్కల గ్రామాల రైతుల, కూలీల, పంట భూములు కూడా పొల్యూషన్ బారిన పడి దెబ్బతింటున్నాయి.

అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ నాయకులు సున్నం బట్టీలమీద, ఇసుక క్వారీలు, రాళ్ల క్వారీలమీద పెత్తనం చేస్తూ, అందరూ కలిసి చట్ట ఉల్లంఘనకు పాల్పడుతూ కార్మికుల అదనపు విలువను, శ్రమను దోచుకుంటున్నారు. ప్రస్తుతం దేశంలో ఏర్పడిన సంక్షోభాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని నామమాత్రంగా ఇచ్చే కూలీ రేట్లు కూడా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు యజమానులు లాభాలు వచ్చినంతకాలం సున్నపు బట్టీలు నడిపి తరువాత నష్టాల వంకతో బట్టీలు మూసివేసి కార్మికులకు ఉపాధి లేకుండా చేస్తున్నారు.

ప్రభుత్వాలు పరిశ్రమలకు ప్రకటించే రాయితీలతో కార్మికులకు ఎలాంటి ఉపయోగము లేదు. ఆఖరికి సున్నపు బట్టీలకు సప్లై అవుతున్న బొగ్గును బ్లాక్‌లో అమ్ముకుంటున్నారు. ఇసుక క్వారీలు, రాళ్ల క్వారీలు మూత పడడం వలన పల్నాడులో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. గతంలో రోజుకు కె.సి.పి. సిమెంటు రెండువేల టన్నుల మార్కెట్ చేస్తే ఇప్పుడు ఐదు వందల టన్నులకు పడిపోయింది. రోజుకు వంద లారీలు సప్లై చేసే శ్రీ చక్ర 15 లేక 20 లారీలు మాత్రమే సప్లై చేస్తుంది. ఇంకా అనేక సిమెంటు ఫ్యాక్టరీలు సంక్షోభంలో కూరుకు పోతున్నాయి. ఒకటి దేశ ఆర్థిక మాంద్యం, మరొకటి రాష్ట్రంలో ఇసుక సంక్షోభం. ఈ రెండూ కలిసి రాష్ట్రాన్ని కుదిపేస్తున్నాయి.

కార్పొరేట్లకు 1,45,000 కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటించిన పాలకులు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే చర్యలు మాత్రం తీసుకోలేదు. చిన్న వ్యాపార సంస్థలకు, రైతాంగానికి నామమాత్రపు రాయితీలు ప్రకటిస్తున్నారు. రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఒకవైపు జరుగుతుంటే మరోవైపు ఎలాంటి ప్రభుత్వ సహాయం లేక చిన్న వ్యాపార సంస్థల యజమానులు ఆత్మహత్యలు చేసుకోవలసిన పరిస్థితి నేడు ఏర్పడింది.

ప్రధాని నరేంద్రమోడీ, అమిత్‌షాలకు కార్పొరేట్ దిగ్గజాలయిన అంబానీ, ఆదానీ మినహా వేరేవాళ్లు కన్పించడం లేదు. అందువలన దేశంలో ఉన్న లక్షలాది చిన్న వ్యాపార సంస్థలు మూతపడుతున్నాయి. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడానికి నేడు పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద దోపిడీ విధానాలే కారణం. నేడు చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలు తమ మనుగడ కోసం కార్మికులు, కర్షకులు, కూలీలు తమ ఉపాధి కోసం, హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం) వీ

చందనది కులోన్మాద హత్యే

కులాంతర వివాహాల వల్ల జరుగుతున్న హత్యలకు మూల కారణమైన కులాన్ని మరుగు పరుస్తూ వాటిని పరువు హత్యలుగా ప్రచారం చేసి అగ్రకుల దురహంకారం బయటపడకుండా చూస్తున్నారని అంటున్నారు ఎం.కె.కుమార్

కుల హత్యలను పరువు హత్యల పేరుతో ప్రచారం చేస్తున్నారు. తద్వారా అగ్రకుల దురహంకారం ఎక్కువగా లేదని చెప్పడానికి హిందూమత ప్రేమికులు ప్రయత్నిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు వేరే కులాల వారిని ప్రేమించడం ఇష్టంలేకపోవడం వల్లే వాళ్లు పిల్లలను చంపుతున్నారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ హత్యలకు మూల కారణం కులమనే ప్రాథమిక అంశాన్ని కావాలనే మరుగున పరుస్తున్నారు. ఈ కుల హత్యలు భిన్నమైన వైరుధ్యాలను ముందుకు తీసుకువస్తున్నాయి. ప్రేమికులను విడదీయడం అందరూ చేస్తున్నదే. అన్ని మతాల్లోనూ ఉన్నదే. క్రిస్టియన్, ముస్లీం మతాల్లో లేని కులాలు హిందూ మతంలో ఉండబట్టి కుల హత్యలు ఎక్కువయ్యాయి. వేల సంవత్సరాలుగా ఉన్న కుల కట్టుబాట్లను కులాంతర వివాహాలు బద్దలు చేయడానికి ప్రయత్నిస్తాయి. కుల ఆధిపత్యాన్ని కాపాడుకుంటూ వస్తున్న శక్తులు వీటిని ఆపడానికి ప్రయత్నిస్తాయి. అగ్రకులంలో పుట్టిన మనుషులు కుల దురహంకారాన్ని పాటించాల్సిందిగా వ్యవస్థే నిర్దేశిస్తుంది. లేనిపక్షంలో వాళ్లు గ్రామాల నుండి మానసిక బహిష్కరణకు గురవుతారు. కుల ఆధిపత్య జీవితంలో భద్రంగా జీవిస్తున్న మనిషికి మానసిక బహిష్కరణని తట్టుకోవడం అసాధ్యమవుతుంది. అతనిలో ఉన్న నీరసపు చైతన్యం అతన్ని చంపడానికి, లేదా చావడానికి సిద్ధం చేస్తుంది. తమాషాగా ఆ చావుని సమాజం హర్షిస్తుంది.

కులాంతర వివాహాలు గ్రామాల్లో ఉద్రిక్తతలను రేపుతాయి. కులం రుచి తెలిసినప్పటికీ ప్రేమకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న యువత ప్రాణాలను పోగొట్టుకోవలసి వస్తుంది. కులాంతర వివాహాలు చేసుకున్న 99 శాతం మంది గ్రామాల నుండి వెళ్లిపోవాల్సి వస్తుంది. లేనిపక్షంలో వారిపై మూకదాడులు జరుగుతున్నాయి. ఈ మూకదాడులు సాక్షాత్తు కన్నవారే బంధువులతో కలిసి చేస్తున్నారు. వీరికి అగ్రకులాల ప్రజలందరీ సామాజిక ఆమోదం ఉంది. కూలాంతర వివాహాన్ని కాదని సొంత పిల్లలనే చంపుకున్న వాళ్లు కుల గోడలను కాపాడే వీరులుగా చెలామణి కాబడుతున్నారు. నిజానికి కులాంతర వివాహాలు సామాజిక సమానతను సాధించడానికి ఉపయోగపడే అంశాల్లో ముఖ్యమైనవి. మతం, కులం పట్టించుకోకుండా యువత ప్రేమించుకుంటోంది. ఈ ప్రేమలో పరిపక్వత ఉందా లేదా అనే అంశాన్ని పక్కన పెడితే ఆ ప్రేమను పెద్దలు తమ చేతుల్లోకి తీసుకోవడం హర్షనీయం కాదు. ప్రేమించిన పాపానికి యువత ఏకంగా తమ ప్రాణాలనే కోల్పోవలసి వస్తోంది. మరోవైపు కుల దురహంకారంతో హత్యలు చేస్తున్న పెద్దలు తమ జీవితాన్ని జైలుపాలు చేసుకుంటున్నారు. మొత్తంగా ఇరు కుటుంబాలు ఒక జీవితానికి కావలసిన పెను సంక్షోభాన్ని చనిపోయేంతవరకు మోస్తూనే ఉంటాయి.

చిత్తూరు జిల్లా, కుప్పం మండలం శాంతిపురం రెడ్లపల్లెకు చెందిన వెంకటేష్, అమరావతి దంపతులకు చందన(17) రెండో కుమార్తె. వీళ్లు బిసి సామాజిక వర్గానికి చెందినవారు. కుప్పం డిగ్రీ కళాశాలలో చందన మొదటి సంవత్సరం చదువుతోంది. 11 నెలల తర్వాత ఈమెకు మైనారిటీ తీరుతుంది. పక్కనే ఉన్న ఒడ్డుమడి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, పద్మమ్మ కుమారుడైన ప్రభు అలియాస్ నందకుమార్ (19)ను ఈమె ఇష్టపడింది. ప్రభు కుప్పంలోని ద్రావిడ వర్శిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఏడాదిగా వీరిద్దరు ప్రేమించుకున్నారు. ప్రభు దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి. వీరి ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలియడంతో చందన తల్లిదండ్రులు ప్రభును తీవ్రంగా మందలించారు. ప్రభు దళితుడని చందన జోలికొస్తే చంపేస్తామని హెచ్చరించారు. ఇద్దరు కలిసి బతకాలనుకున్నారు. గ్రామంలోనే ఉంటే ప్రేమించుకోవడం కష్టం అవుతుందని భావించారు. సెప్టెంబర్ 10న ఇద్దరు వీరి సొంత గ్రామాల నుండి ఎవ్వరికీ చెప్పకుండా కుప్పం వచ్చారు. అక్కడ సమీప బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడే రాత్రి పడుకున్నారు. సెప్టెంబర్ 11న తిరుపతికి వచ్చి తిరుపతి గంగమాంబ ఆలయంలో వివాహం చేసుకున్నారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. ఇది తెలుసుకున్న చందన తండ్రి వెంకటేష్, బంధువులు, గ్రామ పెద్దలను కుప్పానికి తీసుకెళ్లాడు. అప్పటికే కుప్పానికి వచ్చిన చందన, ప్రభు అలియాస్ నందకుమార్‌ను తీవ్రంగా దూషించి, అతన్ని గ్రామానికి పంపించేశారు. కుప్పం నుండి సెప్టెంబర్ 12న వెంకటేష్ చందనను ఇంటికి తీసుకొచ్చాడు. ప్రభు కూడా చేసేదేమి లేక తన స్వగ్రామమైన ఒడ్డుమడికి వచ్చేశాడు. అదే రాత్రి చందన ఉరేసికొని ఇంట్లో చనిపోయిందని తల్లితండ్రులు, బంధువులు భోరుమని ఏడ్చారు. మరుసటి రోజు ఆదివారం చందన మృతదేహాన్ని తల్లితండ్రులు, బంధువులు కలిసి కాల్చేశారు. అస్థికలను చెరువులో కలిపేశారు. చందన మృతి అనుమానాస్పదంగా ఉందనే ప్రచారం గ్రామంలో పొక్కింది. గ్రామ విఆర్‌ఓ చెంగ్రాయులు చందన మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌పి తక్షణమే స్పందించి డిఎస్‌పి ఆరిపుల్లా ఆధ్వర్యంలో విచారణ చేపట్టమని ఆదేశించడంతో పోలీసుల రంగప్రవేశం జరిగింది. దీంతో ఇరువర్గాలు కేసులు పెట్టుకున్నాయి. చందన చనిపోవడంతో భయపడి శ్రీనివాసులు, తన కొడుకు ప్రభును తీసుకుని ఊరొదిలి పారిపోయాడు. ఇరు కుటుంబాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. చందన మృతికి ప్రభునే కారణమని చందన తండ్రి

పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాడు. పోలీసులు ప్రభు తల్లిని విచారిస్తే, చందన తండ్రి, బంధువులు బెదిరించడం వల్లే తన భర్త, కొడుకు ఇల్లొదిలి పారిపోయాడని ఎదురు కేసు పెట్టింది.

చివరకు పోలీసులు వాస్తవాలను బయటపెట్టారు. రెడ్లపల్లె చందన మృతి హత్యేనని తేల్చారు. వాస్తవాలలోకి వెళితే వెంకటేష్ అన్న వరమూర్తి కుమార్తె కూడా కులాంతర వివాహం చేసుకుంది. దీనివల్ల బంధువుల్లోను, గ్రామంలోను వారు తలెత్తుకోలేకపోయారు. కుప్పం నుండి చందనను ఇంటికి తీసుకొచ్చిన తర్వాత వెంకటేష్ చందనను తీవ్రంగా కొట్టాడు. తన కూతురు చనిపోయినా ఫర్వాలేదు కాని కులం తక్కువ వాడితో సంసారానికి పంపించడానికి వెంకటేష్ ఏ మాత్రం సిద్ధంగా లేడు. కూతురు గొంతుకు తాడు బిగించి హత్య చేశాడు. భార్య అమరావతితో కలిసి ఇంట్లోని దూలానికి ఉరి వేసుకున్నట్టు చిత్రీకరించాడు. అదే రోజు రాత్రి చందన మృతదేహాన్ని సొంత పొలంలోనే కాల్చి బూడిద చేశారు. బూడిదను సైతం వదలకుండా గోనె సంచుల్లో తీసుకెళ్లి కర్నాటక సరిహద్దుల్లో ఉన్న కేసనబల్ల అనే చెరువులో కలిపేశారు. చందన శవాన్ని కాల్చడంలో వెంకటేష్‌కు, అతని భార్య అమరావతి, అన్న మునిరాజు, బంధువు వెంకటాద్రి తమ సహకారాన్ని అందించారు. దళితున్ని తన కుమార్తె పెళ్లి చేసుకుందనే ఒకే ఒక్క కారణంతో చందన తండ్రి తన కూతురును చంపేశాడు. ఇది ముమ్మాటికి కులోన్మాద హత్యే. అగ్రకుల దురహంకారం బిసి సామాజిక వర్గంలోను బలంగా స్థిరీకరించబడి ఉంది.

ప్రేమ వివాహాల్లో పరిపక్వత లేదని తల్లితండ్రులు వాదిస్తున్నారు. అందుకు పిల్లలకు నచ్చచెప్పే ధోరణిలోనే తల్లిదండ్రులు వ్యవహరించాలి. కూలాంతర వివాహాలు ఏకంగా కులాల మధ్యనే మంటలను రాజేస్తున్నాయి. పెట్టుబడి ప్రపంచీకరణను తీసుకొచ్చింది. ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోయింది. దేశాల మధ్యే ఎల్లలు చెరిగి పోతున్నాయి. అయినా కులాల మధ్య సరిహద్దులు రాను, రాను మరింత పటిష్టంగా తయారవుతున్నాయి. ముఖ్యంగా దళితులు దేశంలోనే ఉన్నా వారి చుట్టూ కులవివక్ష కంచె బలంగా నాటారు. అగ్రకులాల్లో జరుగుతున్న కులాంతర వివాహాలలో చిన్న, చిన్న ఘర్షణలు జరుగుతున్నాయి. కాని హత్యలు జరగడం లేదు. దళితుడు తనకన్నా ఎక్కువ కులానికి చెందిన అమ్మాయిని ప్రేమించే అర్హతను కోల్పోతున్నాడు. అగ్ర కుల అమ్మాయి ప్రేమించినా ఆ ప్రేమని పొందాలంటే దళితుడు ఏకంగా ప్రాణాలనే కోల్పోవాల్సి వస్తుంది. పెట్టుబడి సంబంధాలు పట్టణాల్లో ప్రవేశించినంత వేగంగా పల్లెలో ప్రవేశించలేదు. పట్టణాల్లో కుల వివక్ష కొత్త రూపాలను సంతరించుకుంటోంది. పల్లెల్లో భూస్వామ్య తరహా కులపెత్తనం ఇంకా కొనసాగుతూనే ఉంది. దళితులపై అంటరానితనమనే నిప్పు రాజేయబడుతూనే ఉంది. తల్లితండ్రులు తమ అమ్మాయి తమ కన్నా ఎక్కువ కులపు అబ్బాయిలను ప్రేమిస్తే కొద్దిపాటి ఘర్షణతో రాజీ పడుతున్నారు. అదే అట్టడుగు కులమైన దళితులను ప్రేమిస్తే గ్రామంలో తలెత్తుకోలేక పోతున్నామని కన్నవాళ్లు కుల దురహంకారాన్ని చూపుతున్నారు.

చిత్తూరు జిల్లాలోని ఊసరపెంట, ఏర్పేడు, రెడ్లపల్లె ఘటనల్లో ఆడపిల్లలు దళిత యువకులను ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. ఊసరపెంట గ్రామానికి చెందిన దళిత యువకుడ్ని, అదే గ్రామానికి చెందిన అగ్రకుల యువతి పెళ్లిచేసుకుంది. ఊరిని వదిలి ఎవ్వరికీ తెలియకుండా కాపురం పెట్టారు. గర్భం దాల్చడంతో ప్రసవం కోసం గ్రామంలోని అత్తింటికి వచ్చింది. కళ్ల ఎదుటే దళితుడితో గర్భం చేయించుకుని తిరగడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోయారు. ఊరందరు చూస్తుండగానే ఆ అమ్మాయిని బైక్‌లో తీసుకెళ్లారు. తర్వాత చంపేశారు. ఏర్పేడులో దళిత యువకుడు బిసి వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. యువతి బంధువులు ఏకంగా ఆ దళిత యువకుడి ఇంటిపై దాడి చేశారు. అందర్నీ చావ కొట్టి చంపినంత పనిచేశారు. ఇప్పుడు రెడ్లపల్లె. నిజానికి చందన మైనరు. కనీసం మైనారిటీ తీరని అమ్మాయిని ప్రేమించిన అతను తీసుకెళితే కిడ్నాప్ కేసు పెడతారు. ఆ విధంగా వెంకటేష్ కేసు పెట్టిఉంటే పోలీసులే చందనను తీసుకొచ్చి ఇంటిలో అప్పజెప్పేవారు. అయినా కూతురు దళితుడ్ని ప్రేమించడమనే అంశం అత్యంత ప్రాధాన్యతగా తండ్రికి కనబడింది. దళితుడ్ని ప్రేమిస్తే, కన్నకూతరైనా బతికే అర్హత లేదని చందన తండ్రి భావించాడు.

పరువు కోసమే చందనను హత్య చేశారని సమాజంలోని అగ్రకుల ఆలోచనాపరులు వ్యాఖ్యానించారు. కూతుర్ని స్వంత ఆస్తిగా భావించే వెంకటేష్, చందనను నేనే చంపించానని పోలీసులతో చెప్పాడు. వెంకటేష్ తన కూతురు మైనర్‌ని, ఆమెను ప్రేమ పేరుతో ప్రభు మా నుండి దూరం చేశాడని, ఆ ఆవేదనని తట్టుకోలేక చంపేశానని చెప్తున్నాడు. చందనది ఒక హత్యగానే న్యాయస్థానం చూస్తుంది. ఆధారాలతో న్యాయస్థానంలో నిరూపించగలిగితే హత్యకు తగ్గ శిక్ష పడుతుంది. అంతేకాని, ఆ హత్య పరువు కోసం చేసాడా, కూతురు కోసం చేశాడా, కులం కోసం చేశాడా అనే ఆలోచన న్యాయస్థానానికి ఉంటే బాగుండును. కూతురు ఇష్టప్రకారం పెళ్లి చేసుకోకూడదని, తండ్రి ఇష్టప్రకారమే తను నడుచుకోవాలని తండ్రి అనుకుంటాడు. భర్త ఇష్టప్రకారం భార్య నడుచుకోవాలని భర్త అనుకుంటాడు. తండ్రి, భర్త ఇద్దరు పురుష అహంకారంతోనే ప్రవర్తిస్తారు. అందుకే స్త్రీకి స్వేచ్ఛ లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో ఫెమినిస్టులు స్త్రీకి లైంగిక స్వేచ్ఛ కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంటి నుండి బయటకు తండ్రి, లేదా భర్త అనుమతి లేకుండా మహిళ బయటకి రాలేని పరిస్థితి ఉంది. రాజకీయ నాయకులు, మఠాధిపతులు సైతం మహిళ బయటకు రావాలంటే ఎవరో ఒక పురుషుడ్ని వెంట తీసుకెళ్లాలని హెచ్చరిస్తున్నారు. పైగా అతను ఆమె బంధవు అయి ఉండాలని షరతు పెడుతున్నారు. తద్వారా అత్యాచారాలను, లైంగిక దాడులను ఆపవచ్చని వారు భావిస్తున్నారు. చందన తండ్రి, తన కూతురు స్వతంత్రంగా ఆలోచించలేని స్థితిలో ఉందని, ఆమెకు మంచి చెడ్డలు తెలియవని, తానే కూతురు భవిష్యత్తు గురించి ఆలోచించగలనని భావించాడు. అసలు తన జీవితమే తన కోసమేనని ఆలోచించాడు. అందుకే జైలు కెళతానని తెలిసినా హత్య చేశాడు. మరోవైపు చందన, ప్రభులు తమ వైవాహిక జీవితాన్ని ఎంతో ఆనందంగా మలుచుకోవాలని, కలకాలం సుఖంగా జీవించాలని కలలు కన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద దాడులు, పరువు హత్యలు, కుల హత్యలు, కుల వివక్ష పెరిగిపోతున్నాయనే వాదన అన్ని వర్గాల నుండి వినిపిస్తోంది. దేశంలో రాజ్యాంగం బదులు మనువాద భావజాలమే పాలన చేస్తుందనే ఆరోపణలు ఎక్కువయ్యాయి. కులాంతర

వివాహాలను చేసుకుంటున్న వారికి ప్రభుత్వం ప్రోత్సాహాలు కల్పిస్తోంది. కాని సమాజంలో కింది కులాల పట్ల జరుగుతున్న వివక్షను ప్రభుత్వాలు నిలువరించలేక పోతున్నాయి. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కొరవడడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోంది. సామాజిక చైతన్య కార్యక్రమాలను ప్రభుత్వాలు ప్రోత్సహించడం లేదు. చందన తండ్రి చేసిన పని న్యాయమని, లవ్‌జీహాద్ మాదిరి, దళితులు అగ్రకుల మహిళలను పథకం ప్రకారమే ప్రేమ పేరుతో వేధించి పెళ్లిళ్లు చేసుకుంటున్నారని అగ్రకుల మేధావులు అంటున్నారు.

దళితులపై దాడులు జరిగినపుడు మెజారిటీ సమాజం మౌనపు ఆమోదాన్ని ఇస్తుంది. ఇది దళితుల సమస్యగానే చూడడం సమాజానికి అలవాటయింది. మైనరు వయసులో ఆడపిల్లకు సరైన జ్ఞానం ఉండదని, చదువుకునే వయసులో పెళ్లి గురించి, మంచి భవిష్యత్తుకు సంబంధించి సరైన నిర్ణయం తీసుకోలేరని తండ్రుల వాదన. ఆర్థిక అంతరాలను మించి సమాజంలో కుల ప్రభావం వెల్లూనుకుని ఉంది. ఈ విషయాన్ని పోలీసులు అసలు పట్టించుకోవడం లేదు. పరువు హత్యలు అనేవి మీడియా వాడుతున్న మాట. కుల హత్యలు అనేది కుల సంఘాలు వాడుతున్న మాట. ఇది కులోన్మాద హత్య అని కమ్యూనిస్టులు వాడుతున్న మాట. ఇటువంటి హత్యల వెనుక సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలు ఉంటాయి. ఆర్థికంగా ప్రభు స్థితిమంతుడు కాదు. అలాగే చందన తండ్రి ధనికుడు కాదు. ఒకవేళ ప్రభు ఆర్థికంగా స్థితిమంతుడు అయివుండినా, అతను దళితుడు కాబట్టి ఈ హత్య జరిగివుండేదని కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. హర్యాణా, ఉత్తరప్రదేశ్‌లో ఇటువంటి కుల హత్యలు ఎక్కువగా జరిగేవి. అవి తెలుగు రాష్ట్రాలకు వ్యాపించాయని అనుకుంటే పొరపాటు. ఇక్కడ కుల హత్యలు జరుగుతున్నా ప్రధాన స్రవంతి మీడియా పట్టించుకోవడం లేదు. కుల నిర్మూలన జరగడానికి కులాంతర వివాహాలు అత్యవసరం. వర్గ నిర్మూలనతో పాటు జమిలిగా కుల నిర్మూలన జరగాల్సిన అవసరం ఉంది. కులాంతర వివాహాలు జరగాలంటే ప్రేమ పెళ్లిళ్లు జరగాలి. ఒక్క ప్రేమ వల్లే కులాంతర వివాహాలు జరుగుతాయి. పెద్దలు ఎటువంటి పరిస్థితుల్లోను కులాంతర వివాహాలకు ఒప్పుకోరు. కులాంతర వివాహాలు జరగాలని ఉద్యమాలు రావడం వల్లే కేంద్ర ప్రభుత్వం 1974లోనే పెళ్లి చేసుకున్నవారిలో ఒకరు దళితులైతే రు. 50,000 పారితోషికం ప్రకటించింది. 2017 నుండి దాన్ని రు. 2.50 లక్షలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సమాజమే వైరుధ్యాలతో కూడి ఉంది. వ్యవస్థలోని అన్ని అంశాల్లో అసమానత రాజ్యమేలుతోంది. అసమానతలకు గురౌతున్న పురుష సమాజమే, తనపై ఆధారపడ్డ మహిళలను మరింత అసమానత్వానికి గురిచేస్తోంది. ఓటు మాత్రమే అన్ని కులాలను ఐక్యం చేస్తుందని ప్రజాస్వామ్య పాలకులు చెపుతుంటారు. అది రాజకీయ ఆధిపత్య వ్యవస్థను తమపై పెత్తనం చేసుకొమ్మనే సాధికారతను ఇస్తుంది. ఓటు వల్ల అధికార మార్పిడి మాత్రమే జరుగుతుందని చాలామంది భావిస్తున్నారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ తనకన్న కింది కులాల ప్రజలను శతాబ్దాలుగా అవమానిస్తూనే ఉంది. వారిపై వివక్షను ప్రదర్శిస్తూనే ఉంది. ప్రేమకు కులం లేదు. మతం లేదు. అసమానతలు లేవు. సమాజంలో వివక్షకు గురౌతున్న కింది కులం వ్యక్తిని చందన ప్రేమించింది. పెద్దలు అంగీకరించక పోవడంతో అతనితో కలిసి జీవితాన్ని పంచుకోవడానికి కన్నవారిని, ఇంటిని వదిలి వచ్చేసింది. వ్యవస్థీకృతమైన హింసలో భాగంగా ఈ హత్య జరగలేదు. చందన తండ్రిని ఒక నేరస్థుడిగానే చట్టం చూస్తోంది. ఇది కుల దురహంకార హత్యగా చూడడం లేదు. ఈ వైరుధ్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది. ఒక పేద అగ్రకుల యువకుడ్ని చందన పెళ్లి చేసుకుని ఉంటే ఈ హత్య జరిగేది కాదు. అగ్రకులస్థులు ఉన్నతులుగా, కింది కులాల వారిని తక్కువ వారుగా చూసే సంస్కృతిని మార్చాల్సిన అవసరం ఉంది. కులపిచ్చి ఎంతవరకు పోయిందంటే, తన కులం వాడు తప్పు చేసినా అతన్ని వెనకేసుకు రావడం ఎక్కువయింది. హక్కులు, ప్రజాస్వామిక భావనలు యువతను నిష్కల్మషమైన ప్రేమ వైపు నెడుతున్నాయి. యువతే కులాంతర వివాహాలను చేసుకుంటోంది. మనువాద సంప్రదాయాలను బద్దలు కొట్టడానికి యువత ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంది. కులాలు వృత్తుల్లో ఉన్నప్పుడు కులేతర పెళ్లిల్లు ఎక్కువగా జరిగాయి. పారిశ్రామిక కార్ఖానాలు వ్యక్తి స్వేచ్ఛకు అధిక ప్రాధాన్యతను ఇచ్చాయి. సామ్రాజ్యవాదం వ్యక్తికి అధిక ప్రాధాన్యత, గౌరవం, హక్కులు ఇస్తూ, సామూహిక, సామాజిక, ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తోంది. మత వైషమ్యాలను, కుల అంతరాలను ఎక్కువగా పెంచి పోషిస్తోంది రాజకీయ రంగమే. ఓట్ల కోసం ఈ తంతును చేస్తున్నారు. చందనది పరువు హత్య కాదు. కుల దురహంకార హత్యే. దాంతో పాటే దీని వెనుక ఉన్న ఆర్థిక కారణాలు, సామాజిక కారణాలను అర్థం చేసుకున్నప్పుడే ఇటువంటి హత్యలు జరుగకుండా నివారించే ప్రయత్నం చేయెచ్చు.

(రచయిత పౌరహక్కుల సంఘం సభ్యులు) వీ

వచ్చే సంచికలలో...

- బలహీనమవుతున్న సమాచార హక్కు చట్టం - చిమ్మె జాన్ బర్నబాస్
- కార్పోరేట్లకు రెడ్ కార్పెట్ - డా. ఎ. పున్నయ్య
- హిందీ భాషా వివాదాలు - అపోహలు - లంకా పాపిరెడ్డి
- పదునెక్కిన సినీ తెలంగాణం - డా. సుంకరి సత్యం

నిర్బంధంలో ప్రజా సంఘాలు

ప్రజాసంఘాల నాయకులను, కార్యకర్తలను మావోయిస్టులతో సంబంధాలున్నాయనే కారణం చూపుతూ అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధిస్తున్నారనీ, ఈ అణచివేతలకు వ్యతిరేకంగా అన్ని ప్రజాసంఘాలు కలిసి ఉద్యమించాలనీ అంటున్నారు **లక్షణ్ గడ్డం**

'నాన్న వచ్చాడు మమ్మీ! లేచి తలుపు తీయి!' అని అర్ధరాత్రి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచిన లెనినాకు తలుపు తెరిచినా నాన్న కనబడకపోయేసరికి నిరాశతో 'నాన్నను పోలీసులు ఎత్తుకు పోయారు. వాళ్లను లెంపల మీద కొట్టాలి' అంటూ గొణుకుతూ చాలాసేపు కళ్లు తెరిచే పడుకుంటుంది లెనినా మద్దిలేటి రెండేళ్ల కూతురు. వచ్చీరాని మాటలతో ఎప్పుడూ నాన్న ముచ్చట్లే చెబుతుంది.

కెసిఆర్ మనవడితో సాయంత్రాలు సరదాగా గడుపుతున్నాడు. తెలంగాణలో కష్టాలొకరివి, సౌఖ్యాలు మరొకరివి. తెలంగాణ కోసం ఈ ఇద్దరు కలిసే కొట్లాడారు.

రాష్ట్రంలో పోలీసుల అరాచకత్వం పెరిగిపోతున్నది. గద్దల్లా వాలిపోయి అమాయకులను తన్నుకుపోతున్నారు. ఇంటికి లేకుండా, ఉద్యమానికి లేకుండా మాయం చేస్తున్నారు. రైలును ఎక్కబోయిన వాళ్లను రైలుకు కాకుండా, గమ్యానికి కాకుండా ఇనుపకాళ్లతో తన్నుకు పోతున్నారు. ఆటోలో వెళుతున్న వాళ్లను అటకాయించి గుంజి జీపులో వేసుకుని అది ఎటుపోతుందో అంతుబట్టని మానసిక అలజడికి గురిచేస్తున్నారు. బైకుపై రోడ్డెక్కితే పక్కనే నడుస్తున్న జీపులోంచి చాకచాక్యంగా బైకుతాళాలు లాక్కుని ఆగిన వెంటనే మనిషిని జీపులోకి లాక్కుని అపహరించుకు పోతున్నారు. బయటికెళ్లిన మనిషి పోలీసుల చేతిలో పడకుండా తిరిగి వస్తాడనే నమ్మకం తెలంగాణలో లేదు. ఇంట్లో ఉన్నవాళ్లు సైతం ఏ క్షణంలో పోలీసులు తలుపులు బాదుతారోనని క్షణ క్షణం భయకంపితుల్ని చేస్తున్నారు. మఫ్టీలో వస్తారు. వారు పోలీసులని బాధితులు భావించాలి. బాధ్యతాయుతమైన ప్రజా సంఘాల నాయకుల అరెస్టులు ఈ పద్ధతిలో జరుగుతున్నాయి. ఈ విధానం ఏ చట్టంలో క్రోడీకరించబడింది. చట్ట ప్రకారం నడుచుకోవాల్సిన బాధ్యత పోలీసులకు లేదా? చట్టాలను అమలు పర్చాల్సిన వాళ్లు చట్ట వ్యతిరేకంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు! మిగతా ప్రభుత్వోద్యోగుల్లాగా సాధారణ దుస్తుల్లో పనిచేసినట్టయితే మరి వీరికి ఖాకీ యూనిఫాం ఎందుకు ఇచ్చినట్లు?

మహబూబ్‌నగర్ టౌన్‌లో ఓ ధర్నాలో పాల్గొన్న పులిగ నాగరాజు అక్టోబర్ 4న సాయంత్రం సొంతూరు గద్వాల వెళ్లడానికి మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. రైలు కోసం ఎదురుచూస్తూ స్టేషన్‌లో సెల్‌ఫోన్ చార్జి పెట్టి అక్కడే కూర్చున్నాడు. ఆకస్మికంగా చుట్టు ముట్టిన మూకను మీరెవరు అని అడిగేలోపే కౌగిట్లో బిగించి క్షణాల్లో జీపులో పడేసుకుని వెళ్లిపోయారు. అప్పటికైతే ఆ వచ్చిన వాళ్లెవరైందీ తెలియదు. ఎక్కడికి తీసుకెళుతున్నారో తెలియదు. మేం ఎవరమో నీకు చెప్పాలా? స్టేషన్‌లో పడేసి తొక్కుతుంటే మేం ఎవరైంది తెలుస్తది నీకు. నీవు ఏం చేస్తున్నావో మాకు తెలియదా? నీకు మావోయిస్టులతో సంబంధాలు న్నాయి అన్నారు. అప్పుడు అర్థమైంది తనను ఎవరు ఎందుకు పట్టుకుపోతున్నారో. ఇటు తన మహబూబ్‌నగర్ మిత్రులకు కాకుండా, అటు ఇంటికి చేరకుండా పోలీసుల చేతికి చిక్కాడు. ఇప్పుడు తను జనాభా లెక్కల్లో లేని మనిషి. పోలీసుల రికార్డుల్లో కూడా లేని మనిషే. కుటుంబీకులకు చెప్పలేనంత మానసిక క్షోభ. కుటుంబీకులు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత చట్టపరంగా పోలీసుల పైన ఉంది గదా! మరెందుకు విస్మరించినట్లు? పోలీసులు చట్టాలను పేద వర్గాలకు ఒకరీతిన, సంపన్న వర్గాలకు మరొక రీతిన ఎందుకు వర్తింపజేస్తారు? ప్రజా సంఘాలు ఆందోళనకు దిగితే సుమారు 40 గంటల తర్వాత గద్వాల పోలీసులు న్యాయ స్థానంలో ప్రవేశపెట్టారు. ప్రజల స్వేచ్ఛను హరించే అధికారం పోలీసులకు ఏ చట్టాలిచ్చాయి? తమ ఇష్టా రాజ్యంగా ప్రవర్తించడం వలన ప్రజల ప్రాథమిక హక్కులు, రక్షణ ప్రమాదంలో పడింది. ప్రభుత్వంపై ఆగ్రహం మరింత పెరుగుతుంది.

నాగరాజుతో పాటు బండారి మద్దిలేటిని, వైనమోని బలరాంను, కంతి జగన్‌ను, చుక్కల శిల్పను నిందితులుగా చేర్చారు. పోలీసుల ఆరోపణల ప్రకారం వీరందరు కలిసి నేరపూరిత కుట్రపన్ని ప్రజాస్వామిక బద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రభుత్వాన్ని కూలదోసే కుట్రకు పాల్పడుతున్నారు. అందుకు గాను వీరికి మావోయిస్టులతో సంబంధాలున్నాయి. మావోయిస్టులకు రిక్రూట్‌మెంట్ చేస్తున్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారు. వీళ్లలో జగన్, శిల్ప, మద్దిలేటి హైదరాబాద్‌లో ఉంటారు. బలరాం పెబ్బేరులో ఉంటాడు. వీళ్లంతా గద్వాలను కేంద్రం చేసుకుని యువకులను మావోయిస్టులుగా మారుస్తున్నారనడం హాస్యాస్పదంగా ఉంది.

సామాజిక సంఘర్షణలో కొంతమంది చైతన్యవంతులై సమాజ మార్పు కోసం సొంతంగా స్పందించి తిరుగుబాటు బాటవచ్చునేమో కాని, ఒకరు తయారు చేస్తే తయారయ్యే ప్రక్రియ కాదది. ఈ పరిణామానికి ఇతరులను బాధ్యులుగా చేసి బాధించడం న్యాయం కాదు. ఇతరుల ప్రోత్సాహంతో ఎవరూ పోలీసులవ్వరు. అది సొంత నిర్ణయలో భాగమే. అనుమానాల ఆధారంగా విద్యార్థి, యువకుల భవిష్యత్తును చిద్రం చేయడం సమర్థనీయం కాదు.

మహబూబ్‌నగర్ జైల్లో ఉన్న నాగరాజును ములాఖత్ ద్వారా పలకరించడానికి మద్దిలేటి, బలరాం, రాజు, రేణుక అక్టోబర్ 6న జైలు కెళ్లారు. పలకరించి ఇంటికి వెళుతున్న ఆటోను అటకాయించి బలరాం, రాజులను లాగి జీపులో వేసుకుని వెళ్లిపోయారు. తమ ఉనికిని వెల్లడించారు. పోలీసులని బాధితులు భావించాలి. పైగా ఈ పని ఈ మధ్య పోలీసులే ఎక్కువగా చేస్తున్నారు. పోలీసులకు, గూండాలకు మధ్య రేఖ చెదిరిపోతుంది. జీపులోనే శాంపిల్ టార్చర్ మొదలు పెట్టారు. మొదట రాజును మద్దిలేటిగా భావించిన పోలీసులు కాదని తెలియడంతో

భూత్‌పూర్ చౌరస్తాలో వదిలేశారు. అసలైన మద్దిలేటి కోసం తీవ్ర అన్వేషణ మొదలు పెట్టారు.

అక్టోబర్ 8న దసరా పండుగ రోజున అడిక్‌మెట్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో నివసిస్తున్న మద్దిలేటి ఇంటిపై పోలీసులు దాడి చేశారు. 40 మంది మఫ్టీలో వచ్చిన వాళ్లను చూసి మద్దిలేటి సహచరి చంద్రకళ పోలీసులే అనుకున్నది. పండగ అని కూడా చూడకుండా ఉదయం ఆరు గంటలకే దిగారు. విధి నిర్వహణ మీద పోలీసులకు ఎంత మక్కువో! ఇంత చొరవను అన్నిచోట్లా ప్రదర్శిస్తే దేశం ఎంత బాగుపడేదో! ధమధమ తలుపులు కొట్టే చప్పుడు. చంద్రకళ ఉలిక్కిపడింది. మద్దిలేటి ఇంట్లో లేదు. రెండేళ్ల కూతురు లెనినా తనను హత్తుకుని ఒడిలో వెచ్చగా పడుకుంది. తను కదిలితే పాప నిద్ర భంగమవుతది. ఒకవైపు నిలకడ లేకుండా తలుపుల బాదుడు శబ్దం. ఎవరూ అంటే బాదుడు శబ్దమే సమాధానం. డోరు ఒక్కటే కాక గ్రిల్ కూడా ఉన్న భరోసాతో మెల్లిగా లెనినాను పక్కకు జరిపి భయపడుతూ, కళ్లు నలుచుకుంటూ తలుపు తెరిచింది. కనబడుతున్నవి ఎన్నడూ కపడని ముఖాలే. గ్రిల్ తెరవలేదు. విరగ్గొడతామంటే భయపడి తెరిచింది. గభాలున ఓ పది మంది లోపలికి వచ్చి వెంటనే సెల్‌ఫోన్ లాక్కున్నారు. సోదాలు చేస్తున్నారు. ఇల్లంత చిందరవందరైంది. పుస్తకాలు, పెన్‌డ్రైవ్‌లు, ల్యాప్‌టాప్, సర్టిఫికెట్‌లు మూటలు కట్టారు. ఇవన్ని ఎక్కడి నుండో పట్టుకొచ్చిన వస్తువులు, అవి పెట్టి ఇక్కడ దొరికినట్లు ఫోటోలు తీసుకున్నారు. కనీసం సర్టిఫికెట్లు ఇవ్వమని అడిగితే నేనెవరో తెలుసా గద్వాల ఎస్ఐని అంటూ తుపాకి తీసి కాల్చేస్తానన్నాడు. నీ భర్త మద్దిలేటికి మావోయిస్టులతో సంబంధాలున్నాయి, గాన్నెందుకు పెళ్లి చేసుకున్నావని ఉచిత సలహా ఇచ్చాడు.

ఆ రోజు పండగ కావడంతో మీడియా అందుబాటులో లేదు. ఎట్టకేలకు వి6 ఛానల్ వస్తుందని తెలియగానే హడావిడిగా వెళ్లిపోయారు. విషయాన్నంతటిని పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు హోం మంత్రిని కలిసి వివరించారు. ఇక ముందు ఇలాంటి అరెస్టులుండవని మంత్రి హామి ఇచ్చిన 24 గంటలలోపే జగన్‌ను అరెస్టుచేశారు.

డా. జగన్ ఉస్మానియా యూనివర్సిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పాఠాలు బోధిస్తున్నాడు. ప్రొఫెసర్‌గా మంచి పేరు తెచ్చుకున్నాడు. విద్యార్థులు విలక్షణమైన అధ్యాపకునిగా గౌరవిస్తారు. తన ప్రవృత్తి రచనా వ్యాసంగం అయినందున విప్లవ రచయితల సంఘంలో బాధ్యుడుగా ఉంటున్నాడు. 'స్టూడెంట్ మార్చ్' మాస పత్రికకు సంపాదకుడుగా వ్యవహరిస్తున్నాడు. అన్నీ మంచి లక్షణాలే ఉంటే అతను తప్పకుండా మావోయిస్టు అవుతాడని వరంగల్ పోలీసులు నమ్ముతారు. డా. జగన్ విషయంలో జరిగిందదే. దళిత వర్గాల నుంచి వచ్చిన మొదటి తరం తాత్కాలిక ఉద్యోగి. పోలీసులు అరెస్టు చేసి భవిష్యత్తును తుడిచిపెట్టారు.

అక్టోబర్ 10న ఉదయం తన సహచరిని ఆబిడ్స్ మహబూబియా కాలేజీలో దింపి సాయంత్రం వచ్చి తీసుకెళతానని చెప్పి తన బైక్‌పై వెనుదిరిగాడు. విద్యానగర్‌లో పక్కనుంచే వచ్చిన జీపులోంచి చేతులు చాచి చాకచక్యంగా బైకు తాళాలు లాక్కుని బండి ఆగిపోగానే అమాంతం ఎత్తుకొని జీపులో వేసుకొని వెళ్లిపోయారు. ఇది చట్టబద్ధమైన పద్ధతేనా అని మేధావులు అడుగుతున్నారు. ఈ పద్ధతిని బట్టి వీళ్లు ఘనత వహించిన మన తెలంగాణ పోలీసులు అనుకోవాలి. ఎక్కడ ఉంచి చిత్రహింసలకు గురిచేశారో కాని సాయంత్రం తార్నాకలోని అతని ఇంటికి తీసుకువచ్చారు. ఇల్లంతా సోదాలు జరిపి గందరగోళం వస్తువులన్నీ మూట గుట్టుకున్నారు. ల్యాప్‌టాప్ ఎక్కడా? మా తమ్ముడు దగ్గరుందని చెప్పాడు జగన్. అయితే ఫోన్ చేసి సన్మాన్‌కు తీసుకురమ్మని చెప్పించారు. సన్మాన్ దగ్గర పొంచి ఉన్న పోలీసులు ప్రణయ్ ల్యాప్‌టాప్‌తో రాగానే మీదపడి రెక్కలు విరిచిపట్టి లాక్కుని వెళ్లిపోయారు. దాన్ని ఇంట్లో పెట్టి ఫోటో తీసి ఇంట్లోనే దొరికినట్లుగా రుజువు తయారు చేశారు. జగన్ కళ్లకు గంతలు కట్టి తీసుకొచ్చారు. అలాగే తీసుకెళ్లారు. ఇక ముందు ఇలాంటి అరెస్టులుండవని మీరు మాటిచ్చిన 24 గంటల్లోపే మరో అరెస్టు జరిగిందని హోం మంత్రికి చెప్పాలనుకుని ఫోన్ చేస్తే ఎత్తలేదు. బహుశా మేం ఎందుకు చేస్తున్నామో ఆయనకు తెలిసి పోయిందేమో. అయితే హోం మంత్రిగా ఆయన నిస్సహాయతేంటో మాకు తెలిసిపోయింది.

మద్దిలేటి కోసం తీవ్రంగా వెతుకుతున్న పోలీసులు తెలంగాణ ప్రజా ఫ్రంట్ కార్యాలయం బాగ్‌లింగంపల్లిలో ఉన్నట్లు తెలుసుకుని అక్టోబర్ 15న ఉదయం దాడిచేసి తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణను, తెలంగాణ విద్యార్థి వేదిక అధ్యక్షులు మద్దిలేటిని మహారాష్ట్ర నెంబర్ ప్లేట్ ఉన్న వాహనంలో తీసుకుపోయారు. చిక్కడపల్లి స్టేషన్‌కు తీసుకెళుతున్నామన్నారు. కాని గద్వాలకు తీసుకెళ్లారు. ఈ అయిదుగురిని మహబూబ్‌నగర్ జైలులో నిర్బంధించారు. రిమాండ్ డైరీలో అదనంగా రేణుకను, మెంచు రమేష్‌ను చేర్చారు. ఇంకా ఎంతమందిని చేర్చుతారో వేచిచూడాలి.

అక్టోబర్ 19న అయిత అనిల్ కుమార్‌ను, దాసారపు సురేష్‌ను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. వాళ్లిద్దరితో పాటు మొత్తం 45 మందిపై ఉపా చట్టం, పబ్లిక్ సెక్యూరిటీ చట్టాన్ని ప్రయోగించారు.

ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల మీద ప్రభుత్వాన్ని నిలదీసే గొంతులను సహించేది లేదని ప్రభుత్వం విధానంగా పెట్టుకున్నది. ప్రతిపక్ష పార్టీలను కొనేసింది. మేధావులను సంలీనం చేసుకున్నది. కనుక ఇప్పుడు ప్రజా సంఘాల మీద విరుచుకుపడుతుంది. కావున 23 ప్రజా సంఘాలను అనుబంధ సంస్థలుగా, నిషేధిత సంస్థలుగా ప్రకటించింది. అరెస్టులకు పూనుకుంటున్నది. ప్రజా సంఘాల నాయకులెవ్వరు కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డవారు కాదు. ఎలాంటి కేసులు నమోదు అవ్వలేదు. ప్రభుత్వ అణచివేత విధానంలో భాగంగా గొంతులు నొక్కుతున్నారు.

నిజానికి ఈ సంఘాలన్నీ కలిసి తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతంగా నడిపిస్తేనే తెలంగాణ సాకారమయింది. సాధించుకున్న తెలంగాణలో విద్య ప్రైవేటీకరించొద్దని, కెజి టు పిజి ఉచిత విద్య అందరికీ అందాలని తెలంగాణ విద్యార్థి వేదిక పోరాటం చేసింది. తెలంగాణ అధికార యంత్రాంగం, అభివృద్ధి ఫలాల్లో అందరి భాగస్వామ్యం ఉండాలని, సామాజిక తెలంగాణగా రూపుదిద్దుకోవాలని ప్రజా సంఘాలు పోరాడుతున్నవి.

ఎంతటి నిర్బంధ పరిస్థితిలోనైనా ప్రజా సంఘాలు, ప్రజలు ఏకమై ఐక్య ఉద్యమాలు జరిపి నిరంకుశ ప్రభుత్వాలను నిలదీయాలి. అక్రమ అరెస్టులు, జైలు నిర్బంధాలు, నిషేధాలు లేని స్వేచ్ఛాయుత సమాజం కోసం పోరాడాలి. అక్రమంగా అరెస్టు చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వంపై వత్తిడి తెద్దాం.

(రచయిత అధ్యక్షులు పౌరహక్కుల సంఘం) వీ

సైనిక దిగ్బంధంలో కశ్మీర్

జమ్మూ కశ్మీర్ గురించి బయటి ప్రపంచానికి ప్రభుత్వం చెపుతున్న అబద్ధాలకు భిన్నంగా అక్కడి ప్రజాందోళనలను, అభద్రతను, శ్మశాన శాంతిని వివరస్తున్నారు ఎ. నర్సింహారెడ్డి

జమ్మూ కశ్మీర్ కేవలం ఒక భౌగోళిక ప్రాంతమే కాదు. అక్కడ ప్రజలు శతాబ్దాలుగా సంఘర్షణల నడుమ జీవిస్తున్నారు. సుదీర్ఘ కాలం నుండి బాధలు అనుభవిస్తున్న ప్రజలు వాళ్లు. వాళ్లకు తమ బాధలు వ్యక్తీకరించే హక్కులుండాలి. వాళ్ల భావప్రకటన స్వేచ్ఛ మీద ఆంక్షలు, నియంత్రణ ఉండకూడదు. వాళ్ల ఆకాంక్షలకు సమాధానం హింస కాకూడదు. బల ప్రయోగం ద్వారా ఒక జాతి హక్కులను, ఆకాంక్షలను అణచివేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఘర్షణ లేని కశ్మీర్‌ను వాళ్లు కోరుకుంటున్నారు. వాళ్లు అనిశ్చితత్వంతో, భయంతో బతుకుతున్నారు. మూడు దశాబ్దాలుగా నిరంతర కర్ఫ్యూలు, హర్తాళ్లు, ప్రదర్శనలు, హత్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం కశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తి, 370 అధికరణ రద్దు, రాష్ట్రాన్ని రెండుగా విభజించడం వంటి చర్యలతో మండుతున్న పుండు మీద కారం చల్లింది. ఒక జాతి మనోభీష్టానికి భిన్నంగా మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అన్యాయం, అమానవీయం, అసహజం. అలా చేస్తే ఫలితాలు భయంకరంగా ఉంటాయి

.

మోసపోయామన్న మనస్తాపంతో కశ్మీరీయులు

ఆగస్టు 5 తర్వాత కశ్మీర్‌లో ఏమి జరుగుతున్నది? అక్కడి ప్రజల జీవన స్థితిగతులెలా ఉన్నాయి? 370వ అధికరణం రద్దు చేసి రెండున్నర మాసాలు గడిచిపోయింది. రోడ్లు నిర్మానుష్యంగానే ఉంటున్నాయి. ఎక్కడ చూసినా ఉక్కు శిరస్త్రాణాల భద్రతా బలగాల బూట్ల చప్పుళ్లు వినవస్తున్నాయి. సామాన్య ప్రజానీకం మీద ఆంక్షలు ఉన్నాయా? అవేవీ లేవని ప్రభుత్వం చెబుతున్నది. అయితే మరి ఎందుకు రోడ్ల మీద ప్రజలు కనిపించడం లేదు? జన సమూహాలు కాని, ప్రజా సంఘాలు కాని బంద్ పిలుపులు ఇవ్వడం లేదు. లేదా సమ్మె పిలుపులూ లేవు. అయినా అక్కడంతా ఆందోళనకర వాతావరణమే నెలకొని ఉన్నది. కశ్మీరీల విషయాలు బయటికి రావడానికి అవకాశాలు లేవు. ప్రత్యక్ష పిలుపులు లేకుండానే ఎవరికివారు స్వచ్ఛందంగా తమకి తాము కర్ఫ్యూ విధించుకున్నట్టు అర్థమవుతున్నది. ఎందుకలా చేస్తున్నారన్న ప్రశ్న సహజంగానే బయటి సమాజంలో ఉదయిస్తుంది.

ఆర్టికల్ 370 రద్దయిన వెంటనే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కశ్మీర్లో పర్యటించారు. ఆయన అక్కడి సామాన్య ప్రజానీకంతో మమేకమై స్థానిక మనోగతం తెలుసుకున్నట్టు చెప్పారు. అక్కడి ప్రజలంతా ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తున్నారని కితాబిచ్చారు. ఆయన జనంతో కలిసిన సందర్భాలు, సంఘటనలు చూస్తే అదేమంత సంతోషదాయక విషయంగా అనిపించలేదు. తిరిగిన ప్రతిచోట నలుగురైదుగురు లేదా మహా అయితే పది పదిహేను మందితో మాత్రమే ఆయన మాట్లాడిన దృశ్యాలు ప్రసార మాధ్యమాల్లో కనిపించాయి. దాన్ని జనసమూహంతో మమేకమైనట్టు భావించలేము. ఆయన కశ్మీర్ భద్రతా బలగాలకు మార్గదర్శకాలు ఇచ్చారు. మిలిటెంట్లను ఏరివేయాలని ఆయన హుకుం జారీ చేశారు. అక్కడి వాస్తవ స్థితికి ఆయన ప్రకటనకు పొంతన లేదనిపిస్తోంది. మొత్తం మీద అక్కడ ఒక అవాంఛనీయ వాతావరణం అలుముకుని ఉన్నట్టు కనిపిస్తున్నది.

370వ అధికరణాన్ని రద్దు చేసినందుకు కశ్మీరీలు ఆగ్రహంగా ఉన్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడాన్ని వారు ఏమాత్రం జీర్ణించుకోలేక పోతున్నారు. రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేయడం తమను తృణీకరించడమేనన్న భావనతో ఉన్నారు. లడఖ్ అభివృద్ధికి కశ్మీరీలు మోకాలడ్డు పెట్టారన్న అసత్య ప్రచారాన్ని తెరమీదికి తెచ్చి చివరకు ఇలా చీల్చినట్టు వారు తమ ఆగ్రహాన్ని వ్యక్తీకరిస్తున్నారు. తాము మోసపోయామన్న మనస్థాపంతో ఆవేదన చెందుతున్నారు. అందుకే కశ్మీరీలు తమకు తాముగా మౌన నిరసన వ్యక్తం చేస్తున్నట్టు కనిపిస్తున్నదని అక్కడికి వెళ్లొచ్చినవారు అంటున్నారు. పార్లమెంటులో 370 అధికరణం రద్దు బిల్లుపై ఏ ఒక్క పార్టీ పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడాన్ని కశ్మీరీలు జీర్ణించుకోలేక పోతున్నారు. రాజకీయ పార్టీలన్నీ కలిసి తమను ఒంటరివాళ్లను చేశాయని బాధపడుతున్నారు.

ప్రతిపక్ష పార్టీలు కశ్మీర్లో పరిస్థితి గురించి నామమాత్రం ఆందోళన వ్యక్తం చేశాయి. అక్కడ పర్యటించాలని పలువురు భావించినా ప్రభుత్వ ఆంక్షల కారణంగా సాధ్యం కాలేదు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ వెళ్లినా విమానాశ్రయం నుంచి వెనక్కి పంపిన సంఘటన తెలిసిందే. చివరకు సిపిఎం నాయకుడు సీతారాం ఏచూరి తన పార్టీ సహచరుడిని పరామర్శించేందుకు సుప్రీంకోర్టు అనుమతి తీసుకుని వెళ్లి రావాల్సి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ కూడా ఒకసారి భంగపడి చివరకు సుప్రీంకోర్టు అనుమతితో కశ్మీర్‌లో అడుగుపెట్టారు. ఆయన అక్కడ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన వ్యక్తం చేస్తున్న అభిప్రాయం ప్రకారం జనజీవన స్థితిగతులు ఏమాత్రం సవ్యంగా లేవు. అయినా కేంద్రం తీసుకున్న నిర్ణయాలు ఉపసంహరించు కోవాలని ఉద్యమాలు చేయడంలేదు.

రెండున్నర మాసాలు గడిచినా జనజీవనం యథాతథ స్థితికి రాకపోవడమే ప్రజాస్వామిక వాదులకు ఆందోళన కలిగిస్తున్నది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎప్పటికప్పుడు తప్పుడు ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. కశ్మీర్లో మాజీ ముఖ్యమంత్రుల దగ్గర నుంచి అమాయక పిల్లల దాకా గృహనిర్బంధాల్లోను, కారాగారాల్లోను ఉండడమే విషాదం. ఆ నిశ్శబ్దంలో దాగున్న కశ్మీరీ ప్రజల కంఠశోషని వినిపించేదెవ్వరు... వినేదెవ్వరు!! మాట్లాడడానికి అవకాశం లేకపోతే ప్రత్యామ్నాయం వెతుక్కుంటారు. ఆ క్రమంలో అది ఉద్యమంగా మారుతుంది. స్వేచ్ఛగా ఉండాల్సిన ప్రజల్ని ఎంతోకాలం బోనులో శాశ్వతంగా నిర్బంధించడం ఎవరికీ సాధ్యం కాదు.

నిర్బంధంలో రగిలిపోతున్న కశ్మీర్

కశ్మీర్‌లో ఎలాంటి నిర్బంధం లేదని నమ్మబలుకుతున్న అమిత్‌షా కశ్మీరీ నేతల ఇళ్లను జైళ్లుగా మార్చడంపై ఏమంటారు? కశ్మీర్‌లో షట్‌డౌన్ చేసిన ఇంటర్‌నెట్, మొబైల్ ఫోన్లను ఎందుకు పునరుద్ధరించరు? ప్రధాన బజార్లు, షాపులు ఎందుకు మూతపడ్డాయి? ప్రభుత్వ బడులు తెరచినా, విద్యార్థులు ఎందుకు రావడం లేదు? ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరు చాలా తక్కువగా ఉండడానికి కారణమేమిటి? సాయంత్రం ఎనిమిది గంటల తరువాత ఇళ్లలో విద్యుద్దీపాలు వెలుగడానికి వీల్లేదని ఆంక్షలు పెట్టిందెవరు? అర్ధరాత్రి వేళ ఇళ్ల తలుపులు తట్టి కశ్మీరీ పౌరులను భయభ్రాంతులకు గురి చేయడం, యువకులను చిత్రహింసలకు గురిచేసే అధికారం భద్రతాదళాలకు ఎవరిచ్చారు? వీటికి కేంద్ర హోం మంత్రి సమాధానం చెప్పకుండా కశ్మీర్‌లో నిర్బంధం లేదనడం వాస్తవాన్ని మసిబూసి మారేడుకాయ చేయడమే తప్ప మరొకటి కాదు.

ఇళ్లల్లో భద్రపరుచుకున్న పప్పులు, తిండిగింజల్లో కిరసనాయిల్ కుమ్మరించడం వంటి చర్యలను ఏ నాగరిక సమాజమూ హర్షించదు. ఇటువంటి అమానుష చర్యలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ భావనలను ఒక వైపు కాలరాస్తూ, మరొకవైపు నవ కశ్మీర్‌ను నిర్మిస్తాం, భూతల స్వర్గంగా మార్చేస్తామంటారు. స్వర్గం కావాలని వారేమీ అడగడం లేదు. రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, న్యాయం, చట్టాలు, ఒప్పందాలు అమలు చేయాలని మాత్రమే అడుగుతున్నారు. కమ్యూనికేషన్స్, రవాణా వ్యవస్థలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఎంతో సముచితమైన ఈ డిమాండ్లను అంగీకరించడానికి ప్రభుత్వం ససేమిరా అంటున్నది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేయడంతో కశ్మీర్ లోయలో ప్రధాన పత్రికలు ఇప్పటికీ ప్రచురణకు నోచుకోవడం లేదు. కశ్మీర్‌లో పరిస్థితిపై రాజకీయ నాయకులు, రచయితలు, మేధావులు, కళాకారులు, హక్కుల కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు ఇప్పటికే ప్రధానికి బహిరంగ లేఖలు రాశారు. లోయలో నిర్బంధానికి వెంటనే స్వస్తి పలికి, సాధారణ పరిస్థితిని పునరుద్ధరించాలని కోరినా మోడీ ప్రభుత్వంలో కొంచెమైనా చలనం లేదు.

స్తంభించిన పౌర జీవనం

కశ్మీర్‌లోయలో పౌరజీవనం స్తంభించింది. ఫలితంగా అక్కడి ప్రజలకు వైద్య సేవలు కొరవడ్డాయి. కశ్మీర్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చెలరేగినప్పుడు పోలీసులు ఆందోళన కారులపై పెల్లెట్ల వర్షం కురిపించగా గాయపడిన వారు గృహ వైద్యంపైనే ఆధారపడవలసి వచ్చింది. కర్ఫ్యూ, నిషేధాజ్ఞల వల్ల వైద్యులను సంప్రదించడం కష్టసాధ్యంగా మారింది. అనేక ప్రాంతాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల కశ్మీరీలకు ఆరోగ్య సంరక్షణ సుదూర స్వప్నంగా పరిణమించింది. ఆగస్టు 5 తర్వాత వాణిజ్య కార్యకలాపాలూ నిలిచిపోవడంతో ఆర్థిక పరిస్థితి క్షీణిస్తోంది. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, ట్రాన్స్‌పోర్టర్లు, షికారా (పడవ) నడిపేవారికి పనిలేక కుటుంబ పోషణ భారంగా మారింది. అట్టడుగు వర్గాల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మరోవైపు కశ్మీర్ బోర్డు ఎగ్జామ్స్ దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థుల్లో ఆందోళన పెరుగుతోంది. "పాఠశాలలు తెరుచుకోలేదు. ఇంటర్నెట్ వసతి లేదు. సిలబస్ ఇంకా పూర్తి కానేలేదు. మా భవిష్యత్తు ప్రమాదంలో పడింది" అని విద్యార్థులు వాపోతున్నారు.

ఫరూఖ్ అబ్దుల్లా నిర్బంధం

జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి నేషనల్ కాన్ఫరెన్స్ సీనియర్ నేత ఫరూఖ్ అబ్దుల్లాను ప్రజా భద్రతా చట్టం కింద కేంద్ర ప్రభుత్వం నిర్బంధంలోకి తీసుకోవడం భారత రాజ్యాంగ, న్యాయ సంవిధానానికి మాయని మచ్చగా మిగులుతుంది. ఆగస్టు 5 నుంచి ఈ 81 సంవత్సరాల ఈ వయోవృద్ధుడిని గృహ నిర్బంధంలో ఉంచారు. కానీ ఆయన ఎక్కడున్నదీ చెప్పాలంటూ తమిళనాడుకు చెందిన ఎండిఎంకె అధినేత వైగో హెబియస్ కార్పస్ పిటిషన్‌తో సుప్రీంకోర్టు తలుపులు తట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఫరూఖ్‌పై ప్రజా భద్రతా చట్టాన్ని ప్రయోగించింది. ఈ చట్టం కింద అదుపులోకి తీసుకున్న ఏ వ్యక్తినైనా 3 నెలల నుంచి రెండేళ్ల వరకు బెయిలు లేకుండా నిర్బంధించవచ్చు.

కశ్మీర్ రాజకీయ ప్రతినిధులను పూర్తిగా తృణీకరిస్తున్నట్లు కేంద్రం స్పష్టంగా సంకేతాలు పంపుతున్నది. కశ్మీర్ రాజకీయాల్లో పాలుపంచుకో నీయకుండా జమ్మూ కశ్మీర్ నాయకులను నిరంకుశ చట్టాలతో అడ్డుకుంటున్న కేంద్రం మునుపటి జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని తన అంతర్గత వలసగా మార్చుకునే వైపుగా పయనిస్తోంది. దీనిపై కేంద్రం అనుమానాస్పద వైఖరిని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తన ఉజ్వల ప్రతిష్టను మరుగుపర్చుకుంది. ఆగస్టు 6న, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ప్రసంగిస్తూ, ఫరూఖ్ అబ్దుల్లాను అరెస్టు చేయడం కాని, నిర్బంధంలోకి తీసుకోవడం గాని జరగలేదని ప్రకటించారు. పైగా, ఫరూఖ్ తన అభీష్టం ప్రకారం తన స్వగృహంలోనే ఉంటున్నారని షా పేర్కొన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే కశ్మీర్‌లో రాజకీయ ప్రక్రియకు కేంద్రం పూర్తిగా తలుపులు మూసేసింది. సిపిఎం నేత నుంచి నేషనల్ కాన్ఫరెన్స్, నేషనల్ కాంగ్రెస్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ కేడర్లను, నాయకులను ఒక్కుమ్మడిగా నిర్బంధించడాన్ని ఈ అంశమే స్పష్టపరుస్తుంది.

స్టాండ్ విత్ కశ్మీర్ పేరుతో ఐరాసకు లేఖ

కశ్మీర్... మంచుకొండలూ, కుంకుమపువ్వూ, భూతల స్వర్గం– అది నిన్నటి మాట. వర్తమాన భీభత్సం, ఎడతెగని దుఃఖం, ఎల్లెడలా అలుముకున్న అమానవీయ విషాదం–ఇది నేటి దృశ్యం. జమ్మూ కశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిపై విద్యావేత్తలు, పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ నెలకొన్న ప్రతిష్టంభనను వెంటనే తొలగించాలని అమెరికా, దక్షిణాఫ్రికా, జర్మనీ, హాంకాంగ్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, సింగపూర్, యుఎఇ, టర్కీ, కెనడా, ఖతార్ సహా అనేక దేశాలకు చెందిన ప్రఖ్యాత యూనివర్సిటీలకు చెందిన 400 మంది విద్యావేత్తలు ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలికి 'స్టాండ్ విత్ కశ్మీర్' పేరుతో లేఖ రాశారు. కమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించాలని, మీడియాపై ఆంక్షలను తొలగించాలని వారు లేఖలో పేర్కొన్నారు. ఎలాంటి సంప్రదింపులూ లేకుండా 70 ఏండ్ల నాటి ఆర్టికల్ 370, 35ఏను భారత ప్రభుత్వం రద్దుచేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

'ఆలోచనలు, భావ ప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛపై దాడి కొనసాగుతున్నది' అని లేఖలో పేర్కొన్నారు. కశ్మీర్‌లో ప్రతిష్టంభనను వెంటనే తొలగించాలి. నిర్బంధంలో ఉంచిన వారిని వెంటనే విడుదల చేయాలి, మీడియా సంస్థలకు భయానక పరిస్థితులు లేకుండా పనిచేయనివ్వాలని వారు డిమాండ్ చేశారు. 'బెదిరింపు, సెన్సార్‌షిప్, ప్రతీకారం' వంటి చర్యలకు పాల్పడకుండా స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పించాలని కోరారు. "స్వేచ్ఛ, గౌరవం, న్యాయ సూత్రాలు వంటి

నైతిక భావాలకు కట్టుబడి ఉన్న అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే భారతదేశం ఇలా నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని మేం ఆమోదించలేక పోతున్నాం" అని లేఖలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

జైళ్లల్లో చిన్నారులు– ఆందోళనలో తల్లిదండ్రులు

కశ్మీర్‌లో ఏం జరుగుతున్నదో ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఐదుగురు మహిళా సామాజిక వేత్తలు– అనీరాజా, కవల్‌జిత్ కౌర్, పంఖురి జహీర్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ), పూనమ్ కౌశిక్(ప్రగతిశీల మహిళా సమితి), సైదా హమీద్ (ముస్లిం ఉమెన్స్ ఫోరమ్)లతో కూడిన బృందం ఐదు రోజుల పాటు (సెప్టెంబర్ 17 నుంచి 21 వరకూ) శ్రీనగర్, షోపియాన్, పుల్వామా, బండీపురాల్లోని 17 గ్రామాల్లో పర్యటించి, పరిస్థితులను క్రోడీకరిస్తూ 'ఉమెన్స్ వాయిస్' పేరిట ఒక నివేదిక విడుదల చేసింది. నల్లటి కొండల మీద విస్తరించిన మంచు, సానువుల్లోనుంచి ప్రవహిస్తూ స్తంభించిన హిమానీ ప్రవాహాలే కాదు. ఆ తెల్లటి స్తబ్ద జలపాతాల్లో ఒక నెత్తుటి పాయ కూడా ఉందని ఆ నివేదిక ప్రపంచానికి వెల్లడించింది.

కశ్మీరీలు తీవ్ర నిర్బంధంలో ఉన్నారనీ, కనీస హక్కులకు నోచుకోని దుస్థితిలో బతుకులీడుస్తున్నారనీ ఆ బృందం పేర్కొంది. రాత్రికిరాత్రి చిన్నపిల్లలను ఇంటి నుంచి ఎత్తుకెళుతున్నారని వివరించింది. ఆ పిల్లలు తిరిగి వస్తారో లేదోనని తల్లులు తీవ్ర మనోవేదనతో రోజులు వెళ్లదీస్తున్నారని తెలిపింది. పిల్లల కోసం స్టేషన్‌కు వెళితే నోటీసు బోర్డులపై పెట్టిన 'రాళ్లురువ్వే మూకల' జాబితాలో పేరులేకపోతే రు. 60 వేల పూచీకత్తు కట్టి విడిపించుకు వెళ్లాలని పోలీసులు చాలా నిర్దయగా చెబుతున్నారని, మహిళలు చిత్ర హింసలకు గురవుతున్నారని నివేదిక తెలిపింది. ఇప్పటి వరకూ కశ్మీర్‌లో 13వేల మంది యువకులను అక్రమంగా అరెస్టు చేశారు. బండిపోరా ప్రాంతంలో ఒక బాలిక దీపం వెలుగులో చదువుకుంటుంటే, భద్రతా సిబ్బంది ఆమెను అడ్డుకోవడమే గాక, ఆమె తండ్రిని, సోదరుడిని బలవంతంగా లాక్కెళ్లారు. రాత్రి ప్రార్థన ముగియగానే సరిగ్గా ఎనిమిది గంటలకల్లా దీపాలు ఆర్పివేయాలన్న సైనిక నిబంధన కశ్మీరీల జీవితాల్లో చీకట్లు చిమ్ముతోంది.

మగవాళ్లు చీకటి పడిన తర్వాత బయటకు వెళితే తిరిగి వస్తారన్న నమ్మకం లేకుండా పోయింది. అందువల్ల ఆడవాళ్లు నిత్యావసరాల కోసం రోడ్లమీదకు అనివార్యంగా రావాల్సి వస్తున్నది. దీంతో వారు సైనికుల వేధింపులకు గురవుతున్నారు. ఈ బృందం వివిధ ప్రాంతాలు, గ్రామాల్లో పర్యటించి వైద్యులు, ఉపాధ్యాయులు, రైతులు, మహిళలు, కూలీలు, పోలీసులను కలుసుకుని వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై విస్తృతంగా చర్చించింది. కశ్మీరీలు తీవ్ర భయాందోళనలు, బాధలు, కష్టాలు, కన్నీళ్ల మధ్య జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారని ఆ బృందం వెల్లడించింది. అక్కడ మానవ హక్కులు మృగ్యమయ్యాయని నిర్ధారించింది. చివరకు వైద్య సౌకర్యాలు కూడా సక్రమంగా అందని దారుణ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంది. తక్షణమే జైళ్లలో మగ్గుతున్న పిల్లలను విడుదల చేయడం, అన్ని కేసులనూ ఉపసంహరించడం, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం, ఆర్టికల్ 370, 35ఎలను పునరుద్ధరించడం వంటి పలు డిమాండ్లను బృందం సభ్యులు చేశారు.

ఆచార్యులు, విద్యార్థుల మనస్తాపం

150 మందికి పైగా ఉన్నత విద్యా సంస్థల ఆచార్యులు, విద్యార్థులు కశ్మీర్ లోయలో కొనసాగుతున్న కమ్యూనికేషన్ దిగ్బంధనం వల్ల రాష్ట్రంలోని విద్యా సంస్థలపై దాని తదనంతర ప్రభావం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ ఒక ప్రకటనపై సంతకాలు చేశారు. యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్ వివిధ దేశాల్లో ప్రతిష్ఠాత్మక సంస్థల నుండి వచ్చే అనేక మంది పండితులకు, శాస్త్రజ్ఞులకు గమ్య స్థానంగా ఉంటోంది. ఈ పరిశోధకులు, వారి విద్యార్థులు – ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా, మిగిలిన ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి ఉన్నారని ఆ ప్రకటన పేర్కొంది. కశ్మీర్ నివాసులందరికీ తమ గోడు వినిపించుకునే హక్కు ఉన్నప్పటికీ, విద్యా విషయక సంస్థల్లోని పరిస్థితి గురించి మా ఆందోళనను వ్యక్తం చేయాలనుకుంటున్నాం.

పరిశోధకులు, విద్యార్థులు ఇప్పుడు ఇంటర్నెట్ నుండి బయటి ప్రపంచం నుండి వేరు పరచబడి ఉన్నారు. యూనివర్సిటీకి చెందిన డొమైన్ (వెబ్‌సైట్) (యుఒకె, ఇండియా.ఇన్) గూగుల్ అన్వేషణ ఫలితాల నుండి అదృశ్యమైపోయింది. మరికొన్ని ఇతర విద్యా సంస్థలు (సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీనగర్ ఇతరత్రాలు కొన్ని ఉన్నాయి. ఈ విద్యా సంస్థల దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేసి, కశ్మీరీ విద్యా విషయక సమాజ సభ్యులకు కోల్పోయిన ఈ వారాలన్నిటినీ త్వరితంగా భర్తీ చేసుకునేందుకు అన్ని విధాలా ఆదుకునేందుకు అవకాశం ఉన్న అన్ని రకాల చర్యలు చేపట్టాల్సి ఉంది. ఈ ప్రకటనపై 158 మంది సంతకాలు చేశారు.

కశ్మీర్‌లో మీడియాపై సెన్సార్ షిప్

కశ్మీర్ లైఫ్, కశ్మీర్ టైమ్స్, గ్రేటర్ కశ్మీర్, కశ్మీర్ ఏజ్, అబ్జర్వర్, రైజింగ్ కశ్మీర్... మొదలైన దిన పత్రికలు, ఇతర టివి వార్తా ఛానల్స్, వెబ్ పోర్టల్స్ చీకటి రోజుల్ని అనుభవిస్తున్నాయి. కేంద్రం విధించిన సెన్సార్‌షిప్‌కు విలవిల్లాడుతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్ని, వార్తల్ని తెలిపేందుకు ప్రభుత్వ అధికారుల అనుమతి ఉండాల్సిందే. లేదంటే వేధింపులు, నిర్బంధాలు విధిస్తున్నారు. ఆగస్టు 5 నుంచి కశ్మీర్‌లో పరిస్థితులు తారుమారు అయ్యాయి. పౌరులే కాదు, పాత్రికేయులు సైతం స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు. టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలు, సామాజిక మాధ్యమం, మొబైల్ ఫోన్లు పనిచేయటం ఆగిపోయి 60 రోజులవు తోంది. కేవలం ప్రభుత్వ అధికారులు మాత్రమే మీడియాకు బ్రీఫింగ్స్ ఇస్తున్నారు. ప్రెస్ నోట్లను విడుదల చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులెవరూ మీడియాతో మాట్లాడకుండా వారి వారి ఇండ్లల్లోనే ఖైదు చేశారు.

"ప్రపంచ వ్యాప్తంగా ఏం జరుగుతోందో మాకు తెలుస్తోంది. కానీ, ఇక్కడ... కశ్మీర్‌లో ఏం జరుగుతోందో తెలియడం లేదు. ఏ వార్తా పత్రిక చదివినా, అందులో అంతర్జాతీయ వార్తలే ఉంటున్నాయి" అని శ్రీనగర్‌వాసి అజీజ్ అహ్మద్ వాపోయాడు. ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేయడంతో, వార్తా వెబ్‌పోర్టల్లన్నీ 'బ్లాంక్' అయిపోయాయి. ఈ చర్యను వ్యతిరేకిస్తూ 'కశ్మీర్ టైమ్స్' ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనురాధా భాసిన్ సుప్రీం కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. శ్రీనగర్ నుంచి పత్రికను నడపలేని పరిస్థితి వచ్చిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కచ్చితత్వంతో కూడిన వార్తలు ఇవ్వాలంటే, స్థానిక రాజకీయ, అధికార వర్గాలతో పత్రికా రిపోర్టర్లు నిత్యం మాట్లాడాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్లు పనిచేయక పోవడంతో రిపోర్టర్లు వార్తల్ని సేకరించలేకపోతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది.

షబ్నమ్ హష్మి బృందం నివేదిక

కశ్మీర్‌లోని పరిస్థితులపై మీడియాను ఉపయోగించుకుని ప్రభుత్వం చెబుతున్న కథనాలకు భిన్నంగా కశ్మీర్‌లో వాస్తవ పరిస్థితులు ఉన్నాయని సామాజిక కార్యకర్త షబ్నమ్ హష్మి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై కశ్మీర్ కోపంతో, అవమానంతో రగిలిపోతోందని తమ బృందం పరిశీలనలో తేలిందని తెలిపారు. కశ్మీరీ ప్రజలు రోజువారీ జీవితంలో కోల్పోతున్న వాటిని, వారు పొందుతున్న భావోద్వేగాలను వెల్లడిస్తూ అక్కడి వాస్తవ పరిస్థితులపై షబ్నమ్ హష్మి బృందం 76 పేజీల నివేదికను రూపొందించింది. కశ్మీర్‌లోని రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, వర్తకులు, రవాణా రంగానికి చెందిన వారు, పండ్ల వ్యాపారులు, టాక్సీ యూనియన్లు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, ఇంజనీర్లు, మేధావులు, ఉద్యోగులు, రచయితలు, రైతులు, జర్నలిస్టులు, కశ్మీర్ పండిట్లు, సిక్కులు, క్రిస్టియన్లు, మహిళలు ఇలా అన్ని వర్గాలకు చెందిన దాదాపు 350 మందిని షబ్నమ్ హష్మి బృందం కలుసుకుని వివరాలు సేకరించింది.

శ్రీనగర్ నుండి బారాముల్లా వరకు, అనంతనాగ్ నుండి బద్గామ్, జమ్ము వరకు తాము కలిసిన ప్రతి ఒక్కరూ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారని తెలిపారు. కశ్మీర్‌లో పౌర స్వేచ్ఛను అణిచివేస్తూ సైనికుల మోహరింపు, ప్రధాన స్రవంతిలో ఉన్న రాజకీయ నాయకులతో పాటు వేర్పాటు వాదుల అరెస్టు, కమ్యూనికేషన్‌ను దిగ్బంధించడం తదితరాలన్నీ రాష్ట్రంలో చోటు చేసుకున్న కొత్త పరిస్థితులను ప్రశాంతంగా ఉంచాయని, అత్యధిక మంది ప్రజలు సంతోషంగా ఉన్నారని అసత్య కథనాలను జాతీయ మీడియాను ఉపయోగించుకుని భారత ప్రభుత్వం ప్రజలలోకి తీసుకెళ్లింది. దీనికి భిన్నంగా, పూర్తి వ్యతిరేకంగా కశ్మీర్‌లో పరిస్థితులు ఉన్నట్లు తాము తెలుసుకున్నామని నివేదికలో తెలిపారు.

కశ్మీర్‌లో హింస జరగలేదన్నది అవాస్తవమని అన్నారు. శాసనోల్లంఘనం ప్రతిరోజూ జరిగింది. భారత ప్రభుత్వం తమని తిరస్కరించింది, మోసగించిందన్న అభిప్రాయంలో కశ్మీరీలు ఉన్నారని షబ్నమ్ అన్నారు. కశ్మీర్ భయాందోళనల్లో చిక్కుకుంది. వేధింపులు, అరెస్టులు, కఠినమైన ప్రజా భద్రత చట్టం కింద యువకుల నిర్బంధాలకు సంబంధించిన అంశాలెన్నో ఇక్కడ చోటుచేసుకున్నాయి. కశ్మీర్ ప్రజలు భయాందోళనల్లో ఉన్నప్పటికీ ఈ దాష్టీకాన్ని ధిక్కరిస్తూ, దుకాణాలను మూసివేయించారు. మిలిటెంట్లు, వేర్పాటువాదులు, రాజకీయ నాయకుల పిలుపు మేరకు కాకుండా భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఆ ప్రభుత్వం తీసుకున్న చర్యకు ప్రతిఘటనగా దుకాణాలను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారని నివేదికలో షబ్నమ్ తెలిపారు.

నిరసనగా ఐఎఎస్ అధికారుల రాజీనామాలు

కశ్మీర్‌లో నెలకొన్న అప్రకటిత అత్యవసర పరిస్థితికి నిరసనగా కేరళకు చెందిన కన్నన్ గోపినాథన్ 2012 బ్యాచ్ ఐఎఎస్ అధికారి ఆగస్టు 21న రాజీనామా చేశారు. జమ్మూ కశ్మీర్‌లో పౌరహక్కులపై ఆంక్షలకు నిరసనగా ఆయన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 9న జమ్మూ కశ్మీర్‌కు చెందిన షా ఫైజల్ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు కారణం జమ్మూ కశ్మీర్‌లో అధ్యక్ష పాలన విధించడమేనని తెలిపారు. తమిళనాడుకు చెందిన శశికాంత్ సెంథిల్ 2009 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అక్టోబర్ మొదటివారంలోనే రాజీనామా చేశారు. ఆయన రాజీనామాకు కారణం కూడ జమ్మూ కశ్మీర్ విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయమేనన్నది గమనార్హం. 2011 బ్యాచ్‌కి చెందిన మరో ఐఎఎస్ అధికారి కషిష్ మిట్టల్ కూడ అక్టోబర్ మొదటి వారంలోనే రాజీనామా చేశారు. నీతి ఆయోగ్‌లో అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్న తనను అరుణాచల్‌ప్రదేశ్‌కు బదిలీ చేయడానికి నిరసనగా సెప్టెంబర్ 24న రాజీనామా చేస్తున్నట్లు బల్వీందర్ మిట్టల్ తెలిపారు.

వీరందరి రాజీనామాల వెనుక ఒకే ఒక బలమైన కారణం ఉంది. అదే కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ ఎగురవేసిన తిరుగుబాటు బావుటా, ముఖ్యంగా జమ్మూ కశ్మీరులో ఆర్టికల్ 370 అధికరణని ఏకపక్షంగా రద్దుచేయడం అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధంగా భావించి వీరు తమ ఉద్యోగాలను వదులుకున్నారు. ప్రతిభావంతులైన యువ ఐఎఎస్ అధికారులు వరుసగా తమ ఉద్యోగాలకు రాజీనామాలు సమర్పించి వెళ్లిపోతున్న నేపథ్యంపై ప్రసార భారతి మాజీ సిఇఓ జవహర్ సర్కార్ ఇటీవల ఘాటుగా వ్యాఖ్యానించారు. దేశం నియంతృత్వం దిశగా ప్రయాణించడానికి నిరసనగా వారు రాజీనామాలు చేస్తున్నట్టుగా అనిపిస్తున్నదని సర్కార్ తెలిపారు.

శ్రీనగర్‌లో మహిళల ఆందోళన

ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ శ్రీనగర్‌లో పలువురు మహిళా సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు అక్టోబర్ 15న నిరసన ప్రదర్శన చేపట్టారు. శాంతియుతంగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనపై ప్రభుత్వ బలగాలు నిమిషాల వ్యవధిలోనే ఉక్కుపాదం మోపాయి. కవరేజీకి వెళ్లిన మీడియా సిబ్బందిని అడ్డుకున్నాయి. అక్టోబర్ 14న పోస్టు పెయిడ్ మొబైల్ సేవల పునరుద్ధరించిన నేపథ్యంలో కొద్దిసేపు ఆంక్షలు సడలించగా శ్రీనగర్‌లోని లాల్ చౌక్ సమీపంలోని ప్రతాప్ పార్కు వద్ద మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా సోదరి సురియా, ఆయన కుమార్తె సఫియా నేతృత్వంలో కొందరు మహిళలు శాంతియుతంగా 370 అధికరణ రద్దుకు నిరసన తెలియజేశారు. 'దేశానికి అబద్ధాలు చెప్పడం ఆపండి', 'ప్రాథమిక హక్కులను గౌరవించండి', 'అమ్మకానికి కశ్మీరీ వధువులెవ్వరూ లేరు' అని రాసివున్న ప్లకార్డులు చేబూని కేంద్ర ప్రభుత్వానికి నిరసన తెలిపారు.

ఈ దిగ్బంధం, నిర్బంధం కశ్మీరీలను మరింత దూరం చేసేందుకు దోహద పడుతుందే తప్ప దగ్గరికి చేర్చదనే వాస్తవాన్ని గుర్తించాలి. సైనిక పదఘట్టనలు, బోసిపోయిన పాఠశాలలు, కొనుగోళ్లు లేక డీలాపడి పోయిన పండ్ల షాపులు కశ్మీర్‌లో సాధారణ పరిస్థితి నెలకొంటోందని చెప్పే రుజువులు కానేకావు. రెండున్నర మాసాల క్రితం ప్రపంచం ఊహించని తీవ్ర చర్య తీసుకున్నాక, నేటివరకు కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌లో దెబ్బతిన్న ప్రజల మనోభావాలను చల్లబర్చడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. ఈ నేపథ్యంలో భారత్ నుంచి కశ్మీరీల పరాయీకరణ మరింత పెరిగింది. ముస్లిం కశ్మీర్‌పై ప్రస్తుతానికి విజయం సాధించానని కేంద్రం కలలు కంటున్నప్పటికీ ప్రస్తుత 'ప్రశాంత వాతావరణం' కశ్మీరీల ఆమోదానికి సంకేతం అనుకుంటే మాత్రం అంతకుమించిన తప్పిదం మరొకటి ఉండదు. కశ్మీరీలను ఎంత కాలం ఈ దుర్భరావస్థలో కొనసాగిస్తే అంత ప్రమాదమనే సత్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు! కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు తిరిగి నెలకొల్పాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి నిజంగా ఉంటే అక్కడ రెండున్నర నెలలుగా కొనసాగుతున్న నిర్బంధాన్ని వెంటనే ఎత్తివేయాలి. జైళ్లలో ఉన్న రాజకీయ నేతలను, హక్కుల కార్యకర్తలను బేషరతుగా విడుదలజేయాలి. పౌరులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులన్నిటినీ పునరుద్ధరించాలి.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

ఒకే భాష - ఒకే దేశం - ఒక స్వార్థం

భిన్న సంస్కృతులు, విభిన్న భాషల సమ్మేళనమైన భారతదేశంలో ఏక భాషా విధానానికి బిజెపి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోందనీ, హిందీని బలవంతంగా రుద్దడం రాజకీయ అహంకార దుర్మార్గమేననీ అంటున్నారు **పబ్బతి వెంకటేశ్వర్లు**

భాష పరస్పర భావ వినిమయ సాధనం. అది సామాజిక, సాంస్కృతిక వైజ్ఞానిక ప్రగతి వాహిక. భాషలో సంస్కృతి, నైతిక, ఆధ్యాత్మిక విషయ సంపత్తి ప్రతిబింబిస్తుంది. అందుకే సమాజ వ్యవహారాలను నిర్వహించే భాషను సాంస్కృతిక, సామాజిక వారసత్వ విషయంగానే పరిగణించాలి. కనుక ఏ ప్రాంతపు భాషనైనా విధిగా గౌరవించి తీరాలి. ఇది భాషా శాస్త్రవేత్తల మౌలిక సిద్ధాంతం. అయితే భిన్న మతాలు, విభిన్న కులాలు, భిన్న భాషలతో పాటు అనేక సామాజిక అంతరాలున్న భారతావని భిన్నత్వంలో ఏకత్వంగా కొనసాగుతున్నప్పటికీ, మౌఖికంగా జాతీయ భాష అని పేర్కొంటున్న ఒక భాషను జాతీయ భాషగా రుద్దడానికిఅనేక సందర్భాలలో పాలకులు చేసిన ప్రయత్నం ఎన్నోసార్లు విఫల ప్రయత్నంగానే మిగిలిపోయింది. ఇటీవల కేంద్ర హోం మంత్రి మరోసారి ఒకే భాష – ఒకే దేశం అనే నినాదంతో భాషా వివాదపు తేనె తుట్టెను కదిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ నినాదాన్ని ముందుకు తీసుకు రావడంలోనూ, ఈ ఏక సూత్రత వెనుక దాగియున్న బూటకపు జాతీయవాద ప్రయోజనాలు ఏమిటో చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లౌకికవాద భారతదేశంలో ఏక భాషా విధానం అనుసరణీయం కాదు. ఎందుకంటే ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో యునెస్కో ప్రకటించిన భాషా చిత్రం ప్రకారం ఒకే భాషకు అధిక ప్రాధాన్యం ఇస్తుండడంతో, మైనారిటీ భాషలుగా ఉన్న స్థానిక భాషలు అంతరించి పోవడమే గాక, ఆ జాతి సంస్కృతి, సంప్రదాయాలన్నీ కనుమరుగు అవుతున్నట్లు గుర్తించడం జరిగింది. అయితే భిన్న సంస్కృతుల, విభిన్న భాషా సమ్మేళనమైన భారతదేశంలో ఈ ఏక భాషా విధానం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో గ్రహించాల్సిన అవసరం ఉంది.

హిందీ భాష అమలు – ఆంతర్యం

ఇటీవల కేంద్ర పాలకవర్గాలు ఒకే భాష–ఒకే దేశం పేరుతో హిందీ భాషను జాతీయ భాషగా గుర్తించాలని, హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాలని చెప్పే ప్రయత్నం చేయడం మొదలు పెట్టారు. రాజ్యాంగం ప్రకారం నేటికి 22 భాషలు అధికారింగా గుర్తించినా హిందీని పాలనా భాషగా చేయడం కోసం, హిందీని మిగిలిన భాషలకన్నా మిన్నగా చేయడం కోసం జరిగిన పోటీలో ఒక్క ఓటు మెజారిటీతో హిందీ అధికార భాషగా, ఇంగ్లిష్ అనుసంధాన భాషగా అవతారమెత్తాయి. అంతేగాని హిందీ జాతీయ భాషగా గుర్తించబడలేదన్న విషయాన్ని గ్రహించాలి. బ్రిటిష్ ఇండియా కాలం నుండి నేటికీ ఆంగ్లం అనుసంధాన భాషగా కొనసాగుతున్నప్పటికీ, హిందీని అధికార భాషగా అంగీకరించని దక్షిణాది రాష్ట్రాలు, భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణ అనంతరం తమ ప్రాంతీయ భాషను అధికార భాషగా, మాతృభాషగా అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నాయి.

నిజానికి స్వతంత్ర భారత తొలినాళ్లలోనే రాధాకృష్ణన్ కమిషన్ హిందీ భారతదేశంలో మైనారిటీగా ఉందని, అది దక్షిణాది భాషలపై ఆధిపత్యం కలిగి లేదని అభిప్రాయపడింది. అనంతర కాలంలో త్రిభాషా సూత్రం అమలులోకి వచ్చినప్పటికీ హిందీయేతర రాష్ట్రాల్లో హిందీని బలవంతంగా నేర్చుకోవాలనే ఆలోచనను తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో త్రిభాషా సూత్రంలో భాగంగా హిందీని అమలు చేయాలనుకున్నా అటు ఉత్తర భారతంలోను, ఇటు దక్షిణ భారతదేశంలో త్రిభాషా సూత్రం అమలుకు నోచుకోలేకపోయింది. అందుకే అప్పటి నుండి ఇప్పటికీ అవకాశం దొరికినప్పుడల్లా ఆధిపత్య భావజాలంతో హిందీ జాతీయ భాష అని, దాన్ని అందరూ నేర్చుకోవాలని, బలవంతంగా రాష్ట్రాలపై రుద్ది, దక్షిణాది రాష్ట్రాలపై ఆధిపత్యం కొనసాగడానికి భాషను ప్రధాన ఆయుధంగా వాడుకునే దృక్పథంతో అధికారంలో ఉన్న ఉత్తరాది ఆధిపత్యం ఉన్న ప్రభుత్వాలు పట్టు వదలకుండా ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

2017లో జాతీయ విద్యా విధానంపై వేసిన డా. కస్తూరీ రంగన్ కమిటి 2019లో తన నివేదికలో హిందీయేతర భాష మాట్లాడే రాష్ట్రాలన్నీ హిందీ తప్పనిసరిగా నేర్చుకోవాలని ముసాయిదా పత్రంలో పేర్కొంది. ఎప్పటి నుండో దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయ, భాషా ఆధిపత్యం కోసం ఎదురుచూస్తున్న ప్రస్తుత కేంద్ర పాలకులకు ఈ సాకుతో అన్ని రాష్ట్రాల్లో దీన్ని ఎలాగైనా అమలు చేయాలన్న భావన బలపడింది. తమకేమాత్రం రాజకీయ అధికార స్థానం లేని దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేయడానికి, ప్రత్యక్ష రాజకీయాలతో పాటు, పరోక్ష భాషా భావజాలంతో, స్థానిక ఆధిపత్యం కోసం తహతహలాడుతున్న పాలకులు, ఈ ముసాయిదా పత్రం ఒక అస్త్రంగా ఉపయోగపడింది. దాంతో మరోసారి పాలకులు హిందీ భాసా వివాదానికి తెరతీశారు. దీంతో ఒక్కసారిగా ఐదు దశాబ్దాల క్రితం నాటి హిందీ భాషా వ్యతిరేక పోరాట జ్ఞాపకాలు దక్షిణాది రాష్ట్రాల్లో మరోసారి ముందుకొచ్చాయి. ముసాయిదాలో పేర్కొన్నట్లు, పాలకుల ఆలోచనలను పసిగట్టిన తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించడమే గాక, పూర్వపు నిరసనలకు తిరిగి ఊపిరి పోస్తామని, భాషాధిపత్య ధోరణికి తలవంచేది లేదని తెగేసి చెప్పడంతో జాగ్రత్తపడ్డ కేంద్ర పాలక వర్గాలు అది ముసాయిదా మాత్రమేనని, ఎవరి మీదా బలవంతంగా రుద్దమని, అది విద్యార్థి ఇష్టమని చెప్పి అల్లర్లు చెలరేగకుండా చూసుకుంది. కాని అంతరంగంలో హిందీని జాతీయ భాష పేరుతో అమలు చేయాలన్న ఆశ చావలేదు.

ఒకే భాష – ఒకే దేశం – ఒక దురుద్దేశం

ఇటీవల సెప్టెంబర్ 14న జరిగిన హిందీ దివస్ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖా మంత్రి 'భారతదేశం అనేక భాషలకు నిలయమని, ప్రతి భాష దేనికదే స్వంత గుర్తింపు కలిగి ఉన్నదని, ప్రపంచ వ్యాప్తంగా భారతదేశానికి ఒక గుర్తింపుగా ఒకే భాష కలిగి ఉండడం అవసరమని,

అది అందరినీ ఐక్యంగా ఉంచగలుగుతుందని, ఎక్కువ మంది మాట్లాడే భాష హిందీ అని, హిందీని అందరూ నేర్చుకోవాలి' అని తమ మనస్సులోని మాటను బయటపెట్టారు. దీంతో సహజంగానే హిందీయేతర రాష్ట్రాల్లో ఒక అలజడి బయలుదేరింది. ఒక్కసారిగా, అమిత్‌షా వ్యాఖ్యలతో బాజాపా యేతర రాజకీయ పార్టీలన్నీ గొగ్గోలు పెట్టాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు తీవంగ్రా వ్యతిరేకించాయి. రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, సినీ ప్రముఖులు దీన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించడం జరిగింది. మనం అన్ని భాషలను గౌరవించాలి. వాటి సంస్కృతులను గౌరవించాలి. మనం చాలా భాషలు నేర్చుకోవచ్చు, కాని మాతృభాషను మరిచిపోకూడదు. దేశవ్యాప్తంగా హిందీని తద్వారా బిజెపిని విస్తరించడానికి ప్రయత్నిస్తున్నాయని విపక్షాలు విరుచుకు పడ్డాయి. దీంతో ఖంగుతిన్న హోం మంత్రి తానెప్పుడూ ప్రాంతీయ భాషలపై హిందీని రుద్దాలని అనలేదని, మాతృ భాషతో పాటు హిందీని కూడా నేర్చుకోవాలని అన్నానని, తాను కూడా గుజరాత్ నుండి వచ్చానని గొంతు సవరించుకున్నారు. అయినా అప్పటికే బిజెపి ఏం చేయాలనుకుంటుందో, ఏం చేయబోతుందో తెలుసుకున్న రాజకీయ పక్షాలు, మేధావి వర్గం దీన్ని ఎండగట్టింది.

కస్తూరీ రంగన్ కమిటీతో చెప్పించినా, హిందీ దివస్ సందర్భంగా మాట్లాడినా బిజెపి అంతరాన్ని, దాని ఉద్దేశాన్ని సులువుగానే అంచనా వేయవచ్చు. హిందీ భాషా మాట్లాడే రాష్ట్రాల్లో మొదటి నుండి బిజెపి బలంగానే ఉంటూ వస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు గాని, దాని అనుబంధ సంఘాలు గాని, ఆయా రాష్ట్రాల్లో ప్రభావవంతంగా ఉండడం వాటి అండదండలు బిజెపికి అందడంతో ఉత్తరాదిన బలమైన రాజకీయ పార్టీగా ఎదిగి తిరుగులేని ఆధిపత్యంతో రాజ్యమేలుతోంది. దేశాన్ని ఏలడానికి ప్రధాన కారణం ఈ ఉత్తరాది రాష్ట్రాల పాత్రే కీలకం. ఈ రాష్ట్రాలన్నింటిలో కామన్‌గా కనిపించేది హిందీ భాష కావడం గమనార్హం. ఆంగ్ల భాషకు ప్రత్యామ్నాయ భాషగా హిందీని మలచలేకపోయినప్పటికీ, ఇంగ్లిష్ ప్రభావాన్ని అంగీకరిస్తూనే, రాష్ట్రాల్లోని ప్రాంతీయ భాషల మీద ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి రాజకీయ అధికార దాహమే ప్రధాన కారణమన్నది యథార్థం.

భారతదేశ ప్రజల మధ్య ఐక్యతను సాధించాలంటే, అందరూ విధిగా హిందీని నేర్చుకోవాలనుకోవడం సరియైంది కాదు. భాష మాత్రమే ఐక్యతను తీసుకొస్తుందంటే ఎంతో గొప్ప చరిత్ర కలిగిన భారతదేశంలో అనేక భాషల మూలంగా ఎప్పుడో విచ్ఛిన్నం కావాల్సి ఉంది. కాని అప్రతిహతంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ, అద్భుతమైన సౌభ్రాతృత్వం గల దేశంగా నిలబడింది. నిజానికి ఒకే భాష మాట్లాడుతున్న ప్రజల్లోనే అనేక మాండలికలున్నాయి. ఒకే ప్రాంతంలో నివసించే ప్రజల్లోనే అనేక భాషలు మాట్లాడేవారున్నారు. అలాగే వివిధ మతస్తులున్నారు. ఏనాడైనా ప్రజల మధ్య విద్వేషాలు రగిలినవి అంటే అవి మతపరమైనవే కానీ భాషా పరంగా జరిగిన గొడవలు కావు. ఒకటి, అరా ఏవైనా జరిగినా అవి రాజకీయ నాయకుల చేత ఉసిగొల్పబడ్డవే. చరిత్రలో మత యుద్ధాలు జరిగాయి కానీ, భాషా పోరాటాలు ఎప్పుడూ జరుగలేదు. కాబట్టి ఒకే భాష మాత్రమే ఐక్యతను తెస్తుందనేది అబద్ధం. హిందీ భాషను జాతీయ భాషను, ఐక్యతా భాష పేరుతో మంత్రి చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగే సరికి తాను ఒకే భాష ఒకే దేశం లాంటి మాటలు మాట్లాడలేదని, తన ఉద్దేశం ఇంగ్లిష్‌కు వ్యతిరేకంగా హిందీ భాష నేర్చుకోవాలని అన్నానని అన్నారు. అయితే ఇది కూడా సరియైనది కాదు.

గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఆంగ్ల భాష ఇవాళ ప్రపంచ భాషగా మారిపోయంది. ప్రపంచంలోని అన్ని భాషలకు అనుసంధాన భాషగా ఆంగ్ల భాష తప్ప మరొకటి లేదు. 'ప్రపంచాన్ని దర్శించాలంటే ఆంగ్ల భాషా గవాక్షం నుంచి చూడాలి' అన్న నెహ్రూ గారి అభిప్రాయాన్ని బట్టి ఆంగ్ల భాషా ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. మనదేశంలో కేవలం 26 శాతం మాత్రమే హిందీని మాతృ భాషగా మాట్లాడతారు. 43 శాతం మంది భారతీయులు మాత్రమే హిందీని ఒక భాషగా మాట్లాడతారు. హిందీ భాష మాట్లాడే వారిలో 40 శాతం మంది హిందీ కాకుండా ఇతర మాతృభాషలు మాట్లాడుతారు. ఐక్యత చేస్తుందని చెప్పిన హిందీ భారత చరిత్రలో గాని, స్వాతంత్రోద్యమ చరిత్రలో గాని ప్రజల్ని ఒక్కతాటిపైకి తీసుకొచ్చిన సంఘటనల్లో దీని పాత్ర ఎక్కడా ఏమాత్రం కనపడలేదు. స్వాతంత్రోద్యమం ఉధ్రృతలూగడానికి పంజాబీ, బెంగాలీ, మరాఠీ, తెలుగు, తమిళ భాషలు తమ ప్రభావాన్ని చూపాయి. వందేమాతరమని నినదించిన బెంగాలీ, తిలక్ మరాఠీలో నినదించిన స్వాతంత్రం నా జన్మహక్కు, ఉర్దూలో భగత్‌సింగ్ నినాదం ఇంక్విలాబ్ లాంటివన్నీ హిందీయేతర భాషా నినాదాలే. ఎక్కడా హిందీ తనదైన ముద్రవేసినట్లు కనపడదు. అసలు హిందీ లిపియే దాని స్వంతం కాదు. ఉర్దూ, సంస్కృతం, పంజాబీల కలయిక నుండి ఏర్పడిన చేవనాగరి లిపి. అంతేగాక దక్షిణాది భాషలకున్న సుసంపన్న చరిత్ర హిందీకి లేదు. మరి ఎందుకు ఈ ప్రయత్నాలు. హిందీని జాతీయ భాషగా తీసుకు రావాలన్న భావనలోనే ఓ కుట్ర దాగి ఉంది. అంటే పైన చెప్పినట్లు దక్షిణ భారతదేశం, ఈశాన్య భారతదేశంపై హిందీ వంకతో పాగా వేయడానికే కాక, తమ స్థానానికి డోకా లేకుండా, తమ భావజాలాన్ని విస్తృత పరుచుకోవడానికే అని చెప్పక తప్పదు. అధికార కార్యకలాపాల్లో కూడా బిజెపి అధికారంలోకి వచ్చినాక హిందీ వాడకం బాగా పెరిగిపోయింది. హోంమంత్రి ప్రకారమే 'నోట్ ఫైల్స్' హిందీలోనే తయారు చేయాలి, అలాగే సోషల్ మీడియా ప్రకటనల్లో కూడా హిందీని వాడాలన్న ఆదేశాలు వెళ్లాయి. అంతర్గత వ్యవహారాలన్నీ హిందీని విస్తృతంగా వాడాలన్న కాంక్ష బిజెపి ప్రభుత్వంలో విస్తృతంగా కనపడుతున్నది. హిందీని జాతీయ భాషగా నిలపడానికి తీవ్రంగా వివిధ రూపాల్లో తన ప్రయత్నాన్ని చేస్తూనే ఉంది. హిందీ భాష పేరుతో అన్ని రాష్ట్రాల్లో తమను తిరుగులేని శక్తిగా నిలుపడానికి అన్ని స్థాయిల్లో తన కృషి కొనసాగిస్తూనే ఉన్నది. భాషా పెత్తనం సరియైనది కాదు. ఇది ఇతర భాషలకు గొడ్డలి పెట్టుగా మారే ప్రభావం ఉంది.

భిన్న సంస్కృతులకు ఆలవాలమైన ఈ దేశంలో భాషా వైవిధ్యాన్ని అపురూపంగా కాపాడుకోవాలి. ప్రతి మైనారిటీ భాషను కాపాడుకోవాలి. బహుళ భాష విధానం ద్వారానే విద్యా బోధన సాగాలి. కేవలం ఒకే భాష అది గొప్పదైనా సరే దాని ద్వారానే విద్యా విధానం ఉండాలనడం సరియైనది కాదు. ప్రజల మధ్య ఒక అనుసంధానతను కూర్చే భాష, భావ ప్రసార మాధ్యమంగా ఉంటూ, సామాజిక సంబంధాలు మెరుగు పడడానినికి అవకాశమిచ్చేది ఉండాలి. సర్కారియా కమిషన్ చెప్పినట్లు మాతృ భాష కాని ప్రజల మీద హిందీని లేదా మరొక ప్రత్యేక రాష్ట్ర భాషను బోధనా మాధ్యమంగా ప్రవేశపెట్టడం విపరీత పరిణామాలకు దారితీస్తుంది. అలాగే 'అన్ని కష్టాలకూ భాషా దురభిమానమే కారణం కానీ, ఏ ఒక్క భాషా వ్యవహర్త కాదని' చెప్పింది. కాబట్టి భాషా దురభిమానం మనుషుల మధ్య అనైక్యతకు దారితీస్తుంది. రాజకీయ ఆధిపత్యం కోసం ఐక్యతా పేరుతో జరిగే అనైక్యత చర్యలు దేశంలో చిచ్చును రాజేయవచ్చు. కాబట్టి అప్రమత్తులై ఉండాల్సింది అంతిమంగా ప్రజలే.

(రచయిత డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్) వీ

స్వేచ్ఛా వ్యాపారం - ప్రజలపై ఆర్థిక దాడి

ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యంలోని ఒప్పందాల్లో భాగంగా స్వేచ్ఛా వ్యాపారం పేరుతో దిగుమతులపై సుంకాలు తొలగించడంతో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక, నిరుద్యోగ సమస్య పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు **డా కొల్లా రాజమోహన్**

ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఇపి) పేరున మన దేశంపై ఆర్థిక దాడికి ప్రణాళికలు రచిస్తున్నారు. ట్రాన్స్ పసిఫిక్ పార్టనర్‌షిప్ (టిపిపి) ఒప్పందాలు విఫలమైన తరువాత 'ఆర్సెప్' (ఆర్‌సిఇపి) అనే కొత్త ఒప్పందాల కోసం బడా కంపెనీలు ప్రయత్నాలను 2012 సంవత్సరం నుండి ప్రారంభించాయి. మొదటి సమావేశం కాంబోడియా దేశంలో ప్రారంభమయింది. అప్పటి నుండి ఇప్పటి వరకూ 30 సార్లు 16 దేశాల ప్రతినిధులు కూర్చుని చర్చలు సాగిస్తూనే ఉన్నారు. చివరిసారిగా 2019 అక్టోబర్ 12-13 తేదీలలో 16 దేశాల మంత్రులు సమావేశమై, మరల నవంబర్ 4న సమావేశమౌదామని నిర్ణయించుకున్నారు.

'ఆర్సెప్ (ఆర్‌సిఇపి)' అంటే ఏమిటి? ఎవరెవరున్నారు? ఆసియన్ గ్రూపుకి సంబంధించిన 10 దేశాలైన బ్రూనే, కాంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాంలతో పాటుగా మరొక 6 దేశాలు కూడా ఈ ఒప్పందం కొరకు ప్రయత్నం చేస్తున్నాయి. ఇందులో ఇండియాతో పాటుగా చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలున్నాయి.

ఈ చర్చల్లో సరుకుల ఎగుమతులు-దిగుమతులు, దిగుమతి సుంకాల విషయాలే కాకుండా అనేక ముఖ్య విషయాలైన మేధో పరమైన హక్కులు, సేవారంగం, విదేశీ పెట్టుబడులు, ఈ-కామర్స్, టెక్నికల్ సహకారం, వ్యాపార పోటీలు, కస్టమ్స్ సుంకాలపై ఒప్పందాల కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు రహస్యంగా జరుగుతున్నాయి. పారదర్శకంగా లేవు. ఈ ఒప్పందం వలన తీవ్రంగా ప్రభావితమయ్యే వ్యవసాయ, పరిశ్రమ రంగాల ప్రతినిధులతో కూడా చర్చలు లేవు. చర్చలను పరిశీలిస్తామన్న కేరళ ప్రభుత్వ కోర్కెను కూడా నిరాకరించారు.

ఈ ఒప్పందం వలన ఏం జరుగుతుంది?

దిగుమతి సుంకాలను క్రమేపీ జీరో స్థాయికి అనగా ఈ 16 దేశాల మధ్య వ్యాపారానికి దిగుమతి సుంకాలు లేకుండా చర్యలు తీసుకుంటారు, స్వేచ్ఛా వాణిజ్యాన్ని సాగిస్తారు. దిగుమతి సుంకాలు లేనందువలన అతిపెద్ద దేశాలైన చైనా, ఇండియా, ఆస్ట్రేలియాలతో పాటుగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జపాన్, దక్షిణ కొరియాలు, అభివృద్ధి చెందుతున్న వియత్నాం, లావోస్ లాంటి దేశాలు కూడా స్వేచ్ఛగా పన్నులు లేకుండానే ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు చేసుకోవచ్చు. ముఖ్యంగా, జనాభాలో అతి పెద్ద దేశాలైన చైనా, ఇండియాల మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య గ్రూపుగా రూపొందే అవకాశం ఉంది. ఈ 16 దేశాల జనాభా ప్రపంచ జనాభాలో 45 శాతం ఉంటుంది. ప్రపంచ వాణిజ్యంలో 40 శాతం ఉంటుంది. ప్రపంచ జిడిపిలో 25 శాతం ఉంటుంది. సరుకులు, సేవలు, మదుపు అన్నీ స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చని చెప్తున్నారు. సేవల విభాగంలో కొద్దిమంది సాంకేతిక నిపుణులకు ఉద్యోగాలు దొరికే అవకాశాలు పెరుగుతాయంటున్నారు. విపరీతమైన పోటీని ఎదుర్కొని కూడా మన వారు కొన్ని ఉద్యోగాలు పొందవచ్చుంటున్నారు. అయితే మన సరుకులను ఎగుమతులు చేసి ఇతర దేశాలలో అమ్ముకొనే సత్తా మన దగ్గర ఉన్నదా?

మనదేశం ఎగుమతులు ఎలా ఉన్నాయి? దిగుమతులు ఎలా ఉన్నాయి? ఎగుమతుల, దిగుమతుల వ్యాపారంలో మనదేశానికి మిగులు ఉన్నదా? లోటు ఉన్నదా? ఈ ఒప్పందం వలన భారతదేశానికి ముఖ్యంగా వ్యవసాయ రంగానికి జరిగే మేలు లేక కీడును సమగ్రంగా అంచనా వేయాలి.

ఆహార ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలు, పాలు, నిలవ ఉండడానికి వీలుగా డబ్బాలలో పెట్టే టిన్డ్ ఫుడ్ విదేశాల నుండి వెల్లువగా మన మార్కెట్‌ను ముంచెత్తితే మన వ్యవసాయం పరిస్థితి ఏమిటి? రైతులు పోటీని తట్టుకోగలరా? ఆస్ట్రేలియా, చైనా, వియత్నాం, మయన్మార్ దేశాల నుండి వచ్చే ధాన్యం, గోధుమల దిగుమతులను తట్టుకుని మన రైతులు గిట్టుబాటు అయ్యే వ్యవసాయం చేయలేరు.

పప్పు ధాన్యాలు 2 కోట్ల 30 లక్షల టన్నుల పంట పండినా గత సంవత్సరం 56 లక్షల టన్నులను దిగుమతి చేశారు. శనగలు కోల్డ్ స్టోరేజీలలో మూలుగుతున్నాయి. ఇంకా దిగుమతి సుంకాలు లేని శనగలు చౌకగా దిగుమతయితే పంటను ఎవరు కొంటారు. ఐ.టి.సి. లాంటి పేపర్ మిల్లులు సుబాబుల్, జామాయిల్ కర్రను కొనకుండానే, ఆస్ట్రేలియా నుండి డైరెక్టుగా కాగితపు గుజ్జును దిగుమతి చేసుకుంటున్నారు. దిగుమతి సుంకాలు లేనపుడు పరిస్థితి ఊహకందదు. శ్రీలంక నుండి దిగుమతయ్యే యాలాకలు, మిరియాల వలన కేరళ వ్యవసాయం కుదేలవుతుంది.

ఫిలిప్పీన్స్, ఇండోనేషియాల నుండి కొబ్బరి నూనె, కొబ్బరి దిగుమతుల వలన గోదావరి జిల్లాల రైతులు, కేరళ రైతులు గట్టి పోటీని ఎదుర్కోవలసి ఉంటుంది. వేరుశనగ సాగు చేసే అనంతపూరు రైతుల పరిస్థితి ఏమిటి. ఆయిల్ ఫామ్, సన్ ఫ్లవర్ సాగు చేసే రైతులు దిగుమతుల ప్రవాహాన్ని తట్టుకోగలరా. వియత్నాం, ఇండోనేషియాల నుండి రబ్బరు దిగుమతుల వలన రబ్బర్‌ను తీసే రైతులు వీధిన పడే ప్రమాదం ఉంది. ఆస్ట్రేలియా నుండి బాదం పప్పు దిగుమతి ద్వారా మన దేశం

లాభపడలేదు, కానీ, ఆస్ట్రేలియా దేశం బాదం పప్పుల ఎగుమతుల ద్వారా గత శతాబ్దంలో ఐదింతల లాభం చేకూరిందని, గత వారం ఢిల్లీ వచ్చిన ఆస్ట్రేలియా వాణిజ్య మంత్రి సిమాన్ బర్మిలా గ్రాహమ్ తెలిపారు.

పాల డైరీలు ఏమవుతాయి? పాలపై బతికే రైతులు ఏమవ్వాలి? ఈ ఏడాది 176 మిలియన్ టన్నుల పాల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తి దారుగా మనదేశం నిలిచింది. కురియన్ లాంటి మహనీయుల నాయకత్వంలో పాల సహకార సంఘాలు దినాదినాభివృద్ధి పొందాయి. సామాన్య రైతులకు చేయూతనిచ్చాయి. సహకార రంగానికే ఆదర్శంగా నిలిచాయి. ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గేకొద్దీ, ప్రభుత్వ జోక్యం పెరిగేకొద్దీ సహకార సంఘాల అస్తిత్వమే ప్రశ్నార్థకమైంది.

పాలు, పాల పదార్థాల ఉత్పత్తిలో విశేష అనుభవం, చేతినిండా పెట్టుబడులు, ఆధునీకరణ ఉన్న ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పాల ఉప్పత్తుల దిగుమతులను మన రైతులు తట్టుకోగలరా – అమూల్, విజయ డైరీలు నడపడం కష్టమౌతుంది. పాలను అమ్ముకొని జీవించే 15 కోట్ల మంది జీవితాలు చిన్నాభిన్నమౌతాయి. అయితే యూనియన్ మినిస్టర్ గిరిరాజ్ సింగ్ పాడి పరిశ్రమను 'ఆర్సెప్'లో చేర్చవద్దన్నారు. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలలో పశువులకు వేసే దాణాలో జంతువుల మాంసం, ఎముకల ప్రొటీన్ ఉంటున్నందున ఆ పాలను మనం అంగీకరించ మన్నారు.

ఆహారాన్ని దిగుమతి చేసుకోవడమంటే, నిరుద్యోగాన్ని కొని తెచ్చుకోవడమే. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల పాల ఉత్పత్తుల దిగుమతుల వలన పాల ఉత్పత్తిదారుల పరిస్థితి దారుణంగా మారుతుంది. దిగుమతి సుంకాలు తగ్గించిన దేశాలన్నీ నికరంగా ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నాయి. లక్షలాది వ్యవసాయ కుటుంబాలు ధ్వంసం అయ్యాయి. ఇప్పటికే నిరుద్యోగ భారం మితిమీరి ఉంది. వ్యవసాయ రంగంలో కూడా నిరుద్యోగం ఇంకా పెరిగితే పెను ప్రమాదం దాపురిస్తుంది.

సేవా రంగంలో ఉద్యోగాలు పెరుగుతాయా? జనాభాలో యువజనుల సంఖ్య పెరుగుతున్న కాలంలో నిరుద్యోగాన్ని కొని తెచ్చుకోవడం ఆత్మహత్యా సదృశ్యమవుతుంది. సేవా రంగంలో సమాన అవకాశాల వలన మన యువతకు అ దేశాలలో ఉద్యోగాలు లభిస్తాయని ఆశ చూపుతున్నారు. పరిశ్రమలలో యంత్రాల వినియోగం పెరిగి ఉద్యోగాల సంఖ్య తగ్గుతున్నది. రోబోట్లు, మెకనైజేషన్ వలన కార్పొరేట్ కంపెనీలకు ఉద్యోగుల అవసరం తగ్గుతున్నది. ఉన్న ఉద్యోగులనే తొలగిస్తున్నారు. అమెరికాతో సహా ప్రతి దేశమూ రక్షణ చర్యలను తీసుకుంటున్నది. పెట్టుబడిదారీ సంక్షోభాన్ని తట్టుకోలేక గిలగిల లాడుతున్నాయి. మనదేశ పరిస్థితి భిన్నంగా లేదు.

పరిశ్రమల రంగం

దేశీయ పరిశ్రమలలో చిన్న పరిశ్రమలు క్రమేపీ మూత పడుతున్నాయి. భారీ పరిశ్రమలను ప్రభుత్వమే నష్టాల బాటలోనికి నెట్టి, ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తున్నది. చైనా నుండి దిగుమతయ్యే సైకిళ్లను సైకిల్ పరిశ్రమ తట్టుకోగలదా? మోటార్ సైకిల్ అమ్మకాలను మన దేశ ఉత్పత్తి దారులు పెంచుకోగలుగుతారా? భారత ఆటోమొబైల్ సంస్థ అధ్యక్షులు శ్రీ రాజన్ వధేరా, విదేశాల నుండి కార్లు తయారయి వస్తే ఇక్కడ ఫ్యాక్టరీలలో మేమేం చేయాలని ప్రశ్నించాడు. 50 మిలియన్ డాలర్ల విలువ గల గుడ్డలు చైనా టెక్స్ టైల్ ఫ్యాక్టరీ గోడౌన్లలో (వస్త్ర పరిశ్రమ) మూలుగుతున్నాయి. చైనా–అమెరికా వాణిజ్య వైరాలవలన సరుకుల నిల్వలు పెరుగుతున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూపు సీనియర్ అధికారి, శ్రీ కిరణ పాండ్య ప్రకారం, చైనా సరుకులకు ఇండియా లాంటి భారీ మార్కెట్ కావాలన్నారు. దక్షిణ గుజరాత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీ పునీత్ ఖిమాసియా, టెక్స్టైల్ పరిశ్రమను 'ఆర్ సెప్'లో చేరిస్తే లక్షలాది మంది పవర్ లూమ్ కార్మికులు నిరుద్యోగు లవుతారన్నారు.

టెక్స్టైల్ రంగంపై (వస్త్ర పరిశ్రమ) 'ఆర్సెప్' ప్రభావం వలన స్పిన్నింగ్ జిన్నింగ్ మిల్లులు నష్టాల బాటపట్టే ప్రమాదం ఉంది. పత్తి అవసరం కూడా తగ్గుతుంది. పేటెంట్ చట్టం, మేథో సంపత్తి హక్కులవలన ఫార్మారంగం ఎగుమతులు ప్రభావితమవుతాయి. జనరిక్ మందులకు కూడా తప్పనిసరిగా క్లినికల్ ట్రయల్స్ డేటా తప్పనిసరి అనే నిబంధనల వలన, వాటి ఎగుమతులు తగ్గిపోతాయి. చైనా మన దేశం నుండి ఇనుప ఖనిజాన్ని తీసికెళ్లి, దేశ దేశాలకూ ఉక్కుతో తయారయిన ఉత్పత్తులను ప్రపంచవ్యాపితంగా మార్కెట్ చేసుకుంటుంది.

మన విశాఖ ఉక్కుకు సొంత కేప్టివ్ మైన్స్ లేవు. విశాఖ ఉక్కుకు ఆర్థిక మాంద్యం దెబ్బ ఇప్పటికే తగిలింది. 7 లక్షల టన్నుల ఉక్కు నిల్వలు గోడౌన్లలో ఉన్నాయి. ప్రభుత్వ సంస్థ కాబట్టి సవతి తల్లి ప్రేమ చూపి ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. అటువంటి పరిశ్రమలు చైనా, ఆస్ట్రేలియాలు ఉక్కుని దంపింగ్ చేస్తే ఆ పోటీని విశాఖ ఉక్కు పరిశ్రమ ఎదుర్కోగలదా? ఎదుర్కొని భారత ప్రజలను రక్షించగలవని అనుకోవడం దురాశే.

దేశీయ తయారీ పరిశ్రమల శక్తిని పెంచాలి. ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలి. దేశీయ మార్కెట్లో మన సరుకులను అమ్ముకోగలగాలి. ముందు మన మార్కెట్ను స్థిరీకరించుకోవాలి. అసమాన పోటీకి తలపడి దేశ సంపదను విదేశాలకు అప్పచెప్పి దేశ ప్రజలు దివాళా తీసే చర్యలు ప్రమాదం.

ఎగుమతుల దిగుమతుల పరిస్థితి ఇపుడు 16 దేశాలకు భారత్ ఎగుమతుల విలువ 6,613 కోట్ల డాలర్లు, 16 దేశాలకు భారత్ దిగుమతుల విలువ – 17,461 కోట్ల డాలర్లు. ఎగుమతుల దిగుమతులలో భారత దేశానికి లోటు–10,848 కోట్ల డాలర్లు. 10 వేల కోట్ల డాలర్ల లోటుతో 16 దేశాలతో మన ప్రజలకు ఉపయోగపడే వాణిజ్యం చేపట్టగలమా?

మన పాలనా చరిత్ర దిగుమతుల విధానాల దివాళ చరిత్రగానే ఉంది. పెద్ద పెద్ద కంపెనీలకు, ముఖ్యంగా కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే ఈ ఒడంబడిక ప్రజలను ఇంకా దారిద్ర్యంలోకి నెట్టుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ కన్నా ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం మరింత ప్రమాదమైంది. ఒప్పందాలు రూపొందక ముందే అడ్డుకోవడం అవసరం. రైతులు, రైతు సంఘాలే కాకుండా భారతదేశ విశాల ప్రజానీకం ఈ ప్రజా వ్యతిరేక ఒప్పందాన్ని వ్యతిరేకించాలి.

(రచయిత నల్లమడ రైతు సంఘం) వీ

పుస్తకం నేరానికి సాక్ష్యమవుతుందా?

వార్ అండ్ పీస్ నీ దగ్గర ఎందుకుంది అని ఒక నిందితుణ్ని ప్రశ్నించిన ముంబై హైకోర్టు న్యాయమూర్తిని ఉద్దేశించి

ఎ.జి. ఫిలిప్ *రాసిన బహిరంగ లేఖ*

లియో టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' (యుద్ధము శాంతి) చదివిన వారు, వాళ్ల ద్వారా విని, చదవాలనుకున్నవారు, తమ తమ వ్యక్తిగత గ్రంథ సంచయంలో ఆ క్లాసిక్‌ను రాజకీయ (రాజనీతి) గ్రంథంకన్నా తాత్విక గ్రంథంగా భావించారు. అందరూ మీ అభ్యంతరకర వ్యాఖ్యపట్ల ఎందుకు స్పందించారంటే టాల్‌స్టాయ్ ఆ గ్రంథాన్ని యుద్ధాన్ని తాత్విక స్థాయిలో నిరసించి సమాజంలో శాంతి నెలకొల్పాలని ప్రతిపాదించడానికి రాశాడు. ఆయన అన్ని రకాల హింసను ఖండించాడు. నిరసించాడు. మీరు ఆయన రాసిన 'దైవ రాజ్యం నీలోనే ఉంది – కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ వితిన్‌యు' అనే పుస్తకం తప్పకుండా చదవాలి. మహాత్మాగాంధీని ఎంతగా ప్రభావితం చేసిందంటే ఆయన దక్షిణాఫ్రికాలో తాను నెలకొల్పిన ఆశ్రమానికి ఆ గొప్ప రష్యన్ రచయిత పేరు పెట్టాడు. గాంధీజీ అహింసకు సంబంధించిన తన ఆలోచన చాలవరకు ఈ పుస్తకం నుంచే ఏర్పరుచుకున్నాడు.

ఈ పుస్తకం శీర్షిక బైబిల్ నుంచి తీసుకున్నాడు టాల్‌స్టాయ్. హింసను ఎదుర్కోవడానికి అహింసా ప్రబోధాన్ని జీసస్ క్రీస్తు బోధనల నుంచి స్వీకరించాడు.

ఒక చెంపపై కొడితే మరొక చెంప చూపమన్న క్రీస్తు బోధనను హింసను రద్దుచేయడానికి స్వీయ రక్షణ కూడ ప్రతీకార రూపంలో ఉండరాదు అని వివరిస్తాడు టాల్‌స్టాయ్. క్రీస్తు బోధనలకు పరిమితార్థంలో భాష్యాలను కూడ టాల్‌స్టాయ్ నిరాకరించాడు. "నువ్వు చంపకూడదు" అని టెన్ కమాండ్‌మెంట్స్ దేవుని బైబిల్‌లో రాసి ఉన్నా నువ్వు మనుషులనెట్లా చంపగలవు అని ప్రశ్నిస్తాడు.

కల్పనేతర సాహిత్యంలో నన్ను ప్రభావితం చేసిన పుస్తకాలలో ఇది (కింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ వితిన్‌యు) ఒకటి. ఇది నాకు బైబిల్‌ను ఎంతో లోచూపుతో అర్థం చేసుకోవడానికి దోహదం చేసినంతగా నేను చదివిన ఇంకే పుస్తకమూ చేయలేదు. ఇది రష్యాలో నిషేధించబడింది. అందువల్ల అచ్చు....? జర్మనీలో ప్రచురింపబడింది. కళాకారుడుగా విఫలమైన అడాల్ఫ్ హిట్లర్ ఆలోచనలతో ఇందులోని భావాలు కొట్టుకుపోక ముందరి సందర్భమది.

ఇంతకూ ఇప్పుడు స్పష్టమైన విషయం (?) ఏమిటంటే (ఎందుకంటే బొంబాయి హైకోర్టు జస్టిస్ కొత్వాల్, కేవలం 'వార్ అండ్ పీస్' అని మాత్రమే అనలేదు, టాల్‌స్టాయ్ పేరు తీసుకుని విదేశాలతో యుద్ధాల గురించిన పుస్తకం అనే మాట కూడ అన్నాడు. అపుడది టాల్‌స్టాయ్ యుద్ధము–శాంతిని ఉద్దేశించినట్లే–అను) మీరు తీర్పుకు సంబంధం లేకుండా వాదన సందర్భంగా చేసిన (ఓబిటర్ డిక్టమ్ – అనుషంగిక వ్యాఖ్య – ఇది ఒక లాటిన్ పదబంధం ప్రసంగవశాత్తు–అని) అంతగా తెలియని భారతీయ గ్రంథం గురించి. న్యాయ శాస్త్రం తెలుసుకోదలుచుకున్న వారి కోసం వివరించాలంటే, వాదనలు వింటున్న సందర్భంగా న్యాయమూర్తి కొన్ని సాధారణ వ్యాఖ్యలు చేస్తాడు. వాటిని ఓబిటర్ డిక్టమ్ అంటారు. ఒక్కొక్కసారి తీర్పులో కూడ అటువంటి వ్యాఖ్యలు ఉండవచ్చు. అవి తీర్పుగా కాకుండా తీర్పులోని వాదనలకు బలంచేకూర్చేవిగా న్యాయమూర్తి భావించినవని మాత్రమే అనుకోవాలి.

ఇంతకూ మీరు ప్రస్తావించిన పుస్తకం బిశ్వజిత్‌రాయ్ సంకలితం చేసిన 'వార్ అండ్ పీస్ ఇన్ జంగల్ మహల్–పీపుల్, స్టేట్, అండ్ మావోయిస్ట్స్' నాకు ఆన్‌లైన్‌లోకి వెళ్లి ఆ పుస్తకం గురించి తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. అమెజాన్ ఆ పుస్తకాన్ని పరిచయం చేసిన తీరు నాకు చాల సంతోషాన్ని కలిగించింది. "ఈ పుస్తకంలో వ్యాసాలు మేధావులు, విద్యావేత్తలు, క్రియాశీల కార్యకర్తలు, శాంతి చర్చలు జరిగి శాంతి నెలకొనాలని చేసిన ప్రయత్నాలను ప్రభుత్వ శిష్టవర్గ 'అభివృద్ధి' విధానాలు, పార్లమెంటరీ పార్టీల ద్వంద్వ నీతి, మావోయిస్టుల తప్పులు ఎట్లా విఫలం చేసాయో విశ్లేషిస్తాయి" అని అమెజాన్ పరిచయం చేసింది. నాకు వెంటనే ఈ 548 పేజీల పుస్తకం తెప్పించుకోవాలనిపించింది. కాని దాని వెల రు. 1999 చూసి వెనక్కు తగ్గాను. అది చవకవచ్చే కిండిల్ పుస్తకం కూడ కాదు. నావంటి జర్నలిస్టు అది ఎట్లా కొనగలడు. నేనీ లేఖ ఎందుకు రాస్తున్నానా అని మీరు ఆశ్చర్యపడవచ్చుగా మీరు టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' గురించి కాదు 'న్యాయమైన ప్రశ్న' వేసింది అని వివరించినాక కూడ ఎందుకు రాస్తున్నానని అడగవచ్చు. అయినా ఈ లేఖ రాయడానికి అవసరమైన తగినన్ని కారణాలు ఉన్నాయి. ముద్దాయి పుస్తక సంచయంలో 2,000 పుస్తకాలు ఉన్నాయని, అవి ఏవీ ప్రభుత్వం చేత నిషేధింపబడినవి కావని స్పష్టం చేశాడు. నా స్వీయ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల గురించి నేనా వాగ్దానం చేయలేను.

నా దగ్గర చదవడం కష్టమైన సాల్మన్ రష్దీ 'ది సటానిక్ వర్సెస్', గుజరాత్ ప్రభుత్వం ఒకప్పుడు నిషేధించిన గాంధీ మీద రాసిన పుస్తకం ఉన్నాయి. నా దగ్గర ఇండియాలో నిషేధింపబడిన డి.ఎచ్.లారెన్స్ 'లేడీ చాటర్లీస్ లవర్' కూడ ఉన్నది. 'అబ్సీనిటీలా' (అశ్లీల (సాహిత్య నిషేధ) చట్టం) కింద పెంగ్విన్ బుక్స్ వాళ్లు కోర్టులో దావా వేసి గెలిచాక అది బ్రిటన్‌లో మాత్రమే అమ్మవచ్చునని తీర్పు వచ్చింది. వివేకవంతులకు ఆ పుస్తకం ఇబ్బంది కలిగించింది. ఎందుకంటే అది ఒక శ్రామికవర్గ పురుషుడు శిష్టవర్గ స్త్రీతో పెట్టుకున్న శారీరక (భావోద్వేగ) పూరిత లైంగిక సంబంధాన్ని వర్ణిస్తుంది. లైంగిక చర్యను విడమరచి వివరిస్తుంది. ఆ రోజుల్లో అచ్చువేయడానికి వీలులేని నాలుగు అక్షరాల శబ్దాలను ప్రయోగిస్తుంది.

నా దగ్గర సుప్రసిద్ధమైన మహర్షి వాత్స్యాయన 'కామసూత్ర' కూడ ఉంది. చర్చిలో గానీ, అకడమిక్‌లలో గానీ ఆ పుస్తకం చూస్తే కూడ ఇబ్బందిపడే వాళ్లుంటారు.

నాతో పోలిస్తే ఈ కేసులో నిందితుడు వర్నన్ గోన్‌సాల్వెస్ సాధువువలె కనిపిస్తున్నాడు. ఎందుకంటే ఆయన ఒక్క నిషేధింపబడిన పుస్తకం కూడ కలిగిలేడు. అతని మీద ఆరోపణలు ఏమిటో నాకు తెలియదు. అతన్ని ప్రభుత్వం 'అర్బన్ నక్సల్' అంటుందని మాత్రం తెలుసు ఆ కేసులోని ఔచిత్యం గురించి నేను రాయడం ఎంతమాత్రం ఉచితం కాదు.

గోన్‌సాల్వెస్ చట్టం ప్రకారం ఏదైనా నేరం చేసి ఉంటే, చట్టం ఉద్దేశించిన గరిష్ఠ శిక్ష విధించే అధికారం మీకుంది. నా అభ్యంతరమల్లా ఒకరి దగ్గర ఉన్న పుస్తకాలు, రచనలు ఆ వ్యక్తి నేర బుద్ధికి నిదర్శనమని ఆరోపించే పోలీసు చర్య.

నేను 1960లలో పతనంతిత్తా గ్రంథాలయం నుంచి తీసుకొని చదివిన చేగువేరా 'బొలీవియన్ డైరీ'తో పొందిన సంభ్రమాశ్చర్యాలు నాకిప్పటికీ జ్ఞాపకమున్నాయి. నేనే మొదటి వాణ్ణి కాకపోవచ్చు కాని, ఆ పుస్తకం వచ్చిన కొత్తలోనే చదివిన వాళ్లలో నేనొకణ్ణి. అణచివేసే స్వభావమున్న శిథిలం కావాల్సిన శక్తులు ఇంకా అధికారాన్ని పట్టుకొని వేళ్లాడుతుంటే వాటిని పదవీచ్యుతులను చేయడానికి ఆమోదించబడిన మార్గాలలో లాటిన్ అమెరికా విప్లవాలకు ఈ పుస్తకం మాగ్నాకార్టా వంటిది. నేనింకా చదివినా కొద్దీ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రజల ప్రాథమిక హక్కుల అధ్యాయం నిజమైన మాగ్నాకార్టా అనిపించింది.

ఇదిగో ఈ ప్రాథమిక హక్కులు అర్బన్ నక్సల్స్ అని పిలవబడుతున్న వారికి నిరాకరింప బడుతున్నాయి. అవును పోలీసులకు ఏ నిందితుని దగ్గరైనా ప్రమాదకరమైన (నేరం రుజువు చేయదగిన) సమాచారం కోసం వెదికే హక్కు పూర్తిగా ఉన్నది. కాని అతని స్వీయ గ్రంథాలయంలో పెట్టుకున్న పుస్తకమో, తన ఐ ప్యాడ్‌లోకో పర్సనల్ కంప్యూటర్‌లోకో డౌన్‌లోడ్ చేసుకున్న ఆర్టికలో (రచనో) నేర (క్రిమినల్) సంబంధమైన ఆరోపణలకు సాక్ష్యం కాజాలదు.

మీరు ఎప్పుడైనా ఇఫ్తెఖాన్ గిలానీ గురించి విన్నారా? అతడు ఢిల్లీలో ఉన్న కశ్మీరీ జర్నలిస్టు. అతడు మీ నగరం నుంచి ప్రచురింపబడుతున్న ప్రధాన స్రవంతి వార్తాపత్రిక డిఎన్‌ఎకు పనిచేశాడు. ఆయనను అరెస్టు చేసి జైల్లో చాల నెలలపాటు నిర్బంధించారు. ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం ఆయనను విడుదల చేసింది. ఆయన చేసిన ఒకే ఒక్క నేరం ఏమిటో తెలుసా? అతడు కశ్మీరీ 'వేర్పాటువాద' నాయకుడు సయ్యద్ అలీ షా గిలానీ కూతురును పెళ్లిచేసుకున్నాడు.

అఫ్జల్‌గురును ఉరి తీయగానే అతణ్ణి అరెస్టు చేశారు. అతనికి వ్యతిరేకంగా పోలీసులకు ఏ సాక్ష్యాధారాలూ లభించలేదు. వాళ్లకు లభించిన సాక్ష్యమల్లా ఆయన వృత్తిపరమైన అవసరాల కోసం ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న కొన్ని ఆర్టికల్స్, కొన్ని పటాలు. ఆయనను కొన్ని నెలల తరువాత విడుదల చేసినప్పటికీ అతని యువ సహచరి, పిల్లలు ఈ కాలమంతా అనుభవించిన మనోవేదన గురించి బాధ్యులెవరినీ శిక్షించలేదు.

ఇప్పుడు జ్ఞానం వేళ్ల కొసల మీద లభ్యమవుతున్నది. ఒక ముతక బాంబును ఎట్లా తయారు చేయాలో నేను తెలుసుకోవాలంటే నేను చేయవలసిందల్లా గూగుల్ గురువును సంప్రదించడమే. అతడు అదెట్లా తయారు చేయాల్లో నాకు ఎంతో నైపుణ్యంతో వివరిస్తాడు. నేనాపనికి పూనుకుంటే మాత్రం నా కాలో, చెయ్యో పేలిపోతుంది.

సైద్ధాంతిక జ్ఞానం కాదు, ఆచరణమనిషిని పరిపూర్ణం చేస్తుంది. కాని పోలీసులకు ఈ విషయంలో భిన్నాభిప్రాయం ఉన్నట్లున్నది. మీరు ఇస్రో (ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ సైంటిస్ట్ ఎస్. నంబి నారాయణ గురించి వినే ఉంటారు. మాల్దీవ్‌లకు చెందిన అక్షరాస్యురాలు మాత్రమే అయిన మహిళ ద్వారా పాకిస్తాన్‌కు క్రయోజనిక్ ఇంజన్ టెక్నాలజీ (ఘనీభవింపచేసే మిశ్రణం తయారు చేసే సాంకేతిక విజ్ఞానం) అందజేశాడన్న ఆరోపణలపై కేరళ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అది ఒక ప్రహసన ప్రాయమైన నిరర్థక కేసు. కాని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆయనను ఇటీవల నిర్దోషిగా ప్రకటించేదాకా ఆయన ఎన్నో దశాబ్దాలు వేధింపులకు, వేదనకు గురయ్యాడు.

అతని మీద ఆరోపణ ఏమిటి? అతడు క్రయోజనిక్ ఇంజన్ రహస్యాలు పాకిస్తాన్‌కు అందజేశాడని. అతణ్ణి ఏ న్యాయమూర్తి ముందర హాజరు పరచారో, ఆయన ఓపికతో విన్నట్లయితే ఆ న్యాయమూర్తి అప్పటి కప్పుడే ఆ కేసు కొట్టేసి అతణ్ణి విడుదల చేసేవాడు. ఎందుకో తెలుసా?

పోలీసులు ఆరోపిస్తున్నట్లు కొన్ని చిత్ర ఉల్లేఖనాల ద్వారా క్రయోజనిక్ ఇంజన్ టెక్నాలజీని సరఫరా చేయడం సాధ్యంకాదు. ప్రభుత్వం కొన్ని సంవత్సరాల పాటు సహకరించే (నిర్వహించే) ప్రాజెక్టులో 2,000 మంది శాస్త్ర వేత్తలు, సాంకేతిక శాస్త్ర వేత్తలు నిమగ్నమయి కలిసి పనిచేస్తే తప్ప అటువంటి అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని పొందడం సాధ్యంకాదని నారాయణన్ తన స్వీయ చరిత్రలో వివరిస్తాడు. ఇంకొక విధంగా చెప్పాలంటే మీరు ఒక ఐ ఫోన్‌ను విప్పి ఒక డుప్లికేట్ (ఐ ఫోన్)ను తయారు చేయలేరు. అది సాధ్యమే అయితే, మనమే మన స్వంత ఎఫ్-16 తయారుచేసుకొని ఉండేవాళ్లం. ఇదంతా నిజమే అయినా, ఆ శాస్త్రవేత్త అంత సుదీర్ఘకాలం క్షోభను అనుభవించాల్సి వచ్చింది.

ఓరియంట్ ఎక్స్‌ప్రెస్‌లోనో, కాథెడ్రల్‌లోనో ఎక్కువగా హత్యల గురించి అభివర్ణించే డజన్ల కొద్దీ డిటెక్టివ్ నవలలు నేను చదివి ఉంటే, అవి ఆధారంగా నాకు హత్య ఉద్దేశం ఉన్నదని పోలీసులు భావించడం సులభం. కాని సత్యం ఏమిటంటే నేను ఒక కోడి పిల్లను కూడ చంపలేను. అది రోస్ట్ చేసి నాకు టేబిల్ మీద తినడానికి పెడితే చాల ఇష్టంగా తింటాను కావచ్చు.

నేను చెప్పదలుచుకున్నది ఏమిటంటే పుస్తకాలు కలిగి ఉండడం ఆ పుస్తకాల్లోని భావాలతో ఆమోదం ఉందని చెప్పడానికి ఆధారమైన సాక్ష్యం కాజాలదు.

నా లైబ్రరీలో బైబిల్, ఖురాన్, రామాయణం పక్కపక్కనే ఉన్నాయి. అవి పరస్పరం అట్లా ఉంచినందుకు నిరసన తెలుపుతున్నట్లు నాకు చిన్న శబ్దం కూడ వినరావడం లేదు. ఆ పుస్తకాలను అట్లా ఉంచడం తప్పని ఎవరైనా అనవచ్చు. అది అన్నవాళ్ల సమస్య. నాకు సంబంధించింది కాదు. ఇండియాలో ఎవరి పర్సులోనైనా, జేబులోనైనా నకిలీ కరెన్సీ నోటు ఉండడం నేరమని మీకు తెలుసని ఆశిస్తాను. నరేంద్రమోడీ రద్దు చేసిన 500 లేదా 1000 రూపాయల నోటు కలిగి ఉండడం కూడ నేరమే.

మీరు, న్యాయమూర్తిగా, మీ దగ్గర ఎప్పుడూ నకిలీ నోటు లేదని చెప్పగలరా? ఇటీవలి రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రిపోర్టు ప్రకారం నకిలీ 500 రూపాయల కరెన్సీ నోట్ల సంఖ్య 12 శాతం పెరిగింది. అటువంటి పరిస్థితుల్లో మీ దగ్గరా, నా దగ్గరా కూడ మనకు తెలియకుండానే ఒక నకిలీ నోటు దొరికితే మనం చేయగలిగిందేమీలేదు.

హౌడీ మోడీ ప్రచారాడంబరమే

మోడీ అమెరికా పర్యటనలో ప్రచారాడంబరాన్ని ప్రదర్శించాడనీ, ఇందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా సహకరించాడనీ, అయితే ఇది కేవలం ప్రచార ఆర్భాటమే తప్ప దేశానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదనీ అంటున్నారు **సతీష్ బైరెడ్డి**

అమెరికాతో స్నేహం చేయడానికి ఏ దేశం అయినా ఉత్సాహంగానే ఉంటుంది. శక్తివంతమైన మిలిటరీ వ్యవస్థ, అత్యున్నత శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచ వనరులపై ఆధిపత్యం, అన్నిటికీ మించి అత్యాధునిక ఆయుధ సంపత్తి వెరసి ప్రపంచ అధిపత్యం. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత కీలకం, వ్యూహాత్మకం అని చెప్పబడిన ప్రాంతాలలో అమెరికా తన సైనిక స్థావరాలను నిర్వహిస్తున్నది. అంత శక్తివంతమైన దేశంలో అదీ ఆ దేశ అధ్యక్షుడితో సరిసమానంగా కలసి వేదికమీద కనిపించాలని ప్రపంచ దేశాల నేతలు ఉత్సాహ పడుతుంటారు. అలా కనిపించడంలో తమకు 'శత్రువు' అనుకున్న దేశాలకు మేము 'ఇది' అనే సంకేతాలు ఇవ్వడం, ప్రాంతీయంగా ఆధిపత్యాన్ని చూపించడం, అంతర్గతంగా తమ దేశంలో రాజకీయ ప్రాబల్యం కోసమో చేస్తూ ఉంటారు.

ఇప్పటి వరకు భారతదేశ ఏ ప్రధాని తిరగనన్ని దేశాలు పర్యటించిన మోడీకీ అమెరికా అధ్యక్షుడు అంటే అదో అద్భుత అవకాశం. నిరంతరం తనకు తాను ప్రచారంలో నిండి ఉండడంలోను, ప్రచార్భాట కార్యక్రమం చేపట్టడంలోను మోడీ అందరి కంటే ముందుంటాడు. అమెరికాలో టెక్సాస్ రాష్ట్రంలో హూస్టన్ నగరంలో 'హౌడీ మోడీ' (హలో మోడీ) పేరుతో సెప్టెంబర్ 22న 50 వేలకు పైగా భారతీయులను సేకరించి భారతదేశంలో తన ప్రభుత్వం సాధించిన 'ప్రగతి'ని నోరారా చెప్పుకున్నాడు.

నిజమే సాధించిన అభివృద్ధిని, ఫలితాలను ప్రపంచానికి చెప్పుకుంటే తప్పు ఏమి లేదు కదా! ఇంత పెద్ద హంగామా చేస్తేనే అభివృద్ధిని చాటుకునే వీలు ఉంటుందా? అసలు ఏదో చరిత్రను మలుపు తిప్పే పరిణామం ఏదో చోటు చేసుకోబోతున్నట్టు మో(మీ)డియా దేశంలో ప్రచారం చేసింది. దీనికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రావడం మోడీని ప్రస్తుతించడం వల్ల ఒక చారిత్రక సంఘటనగా ప్రచారం జరిగింది.

అమెరికాలో బిజెపి, సంఘపరివార్‌కు అనుకూలంగా ఉండే శక్తులు టెక్సాస్ ఇండియా ఫోరం పేరుతో మిలియన్ల కొద్దీ డాలర్లు వెచ్చించి మరీ ఈ సదస్సును నిర్వహించింది. హౌడీ మోడీ పేరుతో అట్టహాసంగా నిర్వహించిన ఈ సభలో దేశానికి ఏమోగానీ మోడీకి మాత్రం బాగానే ప్రచారం లభించింది! భారతదేశ ఘనతను ప్రపంచానికి చాటి చెప్పడం, గొప్ప ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఎలుగెత్తడం కోసమే ఈ ప్రవాస సదస్సు అని నిర్వాహకులు ప్రచారం చేశారు. రెండు దేశాల ప్రభుత్వాధినేతలు హాజరైనప్పటికీ మోడీ కేంద్ర బిందువుగా ఈ ఆర్భాటాన్ని

పుస్తకాల విషయంలోకే మళ్లీ వద్దాం. పుస్తకాల ప్రచురణకు సంబంధించిన నియమాలను నిర్ధారించే చట్టాలు ఉన్నాయి. ప్రతి ప్రచురణకర్తకు కాపీరైటు చట్టం, అశ్లీల (సాహిత్య నిషేధ) చట్టం తెలిసి ఉండాలని చట్టం భావిస్తుంది. ఏ పుస్తకమైనా చట్టబద్ధంగా దేశంలో ప్రచురింపబడినట్లయితే, సాధారణ ప్రజానీకానికి అది కొనుక్కొని, చదివి, నచ్చితే ప్రచారం చేసే హక్కు కూడ ఉంది.

నక్సలిజం మీద అకడమిక్ చర్చ అంత అంగీకారయోగ్యం కాదని ప్రభుత్వం భావించినట్లైతే, వెంటనే ఆ పుస్తకాలన్నిటినీ నిషేధించాలి. అందుకోసం అది ఆ పుస్తకాలన్నీ చదవడానికి చాలామందిని వినియోగించాల్సి ఉంటుంది. వాళ్లు ఆ పుస్తకాలన్నీ చదివి, నిషేధించ దగినవని సిఫారసు చేయాల్సి ఉంటుంది. ఇది కనీసం చాలామందికి ఉద్యోగాలిస్తుంది.

ఎమర్జెన్సీ (1975 జూన్ 26-1977 మార్చ్ 23) కాలంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రభుత్వ వ్యతిరేక భావాలను, వార్తలను అణచివేయాలని చూసింది. హిట్లర్ పాలన, అది 'దిగజారిన కళ'గా భావించిన చిత్ర లేఖనాల (పెయింటింగ్స్)ను కూడ కాల్చివేసింది. ఆ అడుగుజాడల్లో ప్రభుత్వం నడచుకునేదాకా ప్రజలు తాము ఎంచుకున్న పుస్తకాలు కొని, చదివి, సంచయం చేయనివ్వండి.

నిన్న నేను కేరళ క్లబ్‌లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 సెక్షన్ పై చర్చలో పాల్గొన్నాను. నేను అది రద్దుచేయడం ప్రభుత్వ అనుచితచర్య అని భావించాను. జమ్మూ కశ్మీర్ ప్రజలకు ప్రభుత్వం చట్టబద్ధంగా చేసిన వాగ్దానాన్ని ప్రభుత్వమే దురుద్దేశ పూర్వకంగా కావాలని రద్దు చేయడంగా భావించాను. అందువల్ల నన్నెవరయినా జాతివ్యతిరేకి అనవచ్చు. నేను మాట్లాడగానే మాట్లాడిన నాతోటి వక్త దాన్ని సాహసోపేతమైన నిర్ణయం అన్నాడు. డెబ్బై ఏళ్ల తర్వాత ఈ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నందుకు అభినందించాడు. మేమిద్దరమూ పరస్పర భిన్న వైఖరులు ప్రదర్శించి నందుకు అక్కడున్న వాళ్లు (సభలో ఉన్నవాళ్లు) ఎవరూ తప్పుగా భావించలేదు. అదే ప్రజాస్వామ్య సారం. కలిసి జీవించే శక్తి.

రాజ్యానికి ఎవరి ఫ్రిడ్జిలో గొడ్డు మాంసం ఉందో చూసే అధికారం ఇస్తే (హర్యానా ప్రభుత్వం గోవధ నిషేధ చట్టానికి అటువంటి సవరణ చేయాలని భావిస్తున్నది), ఒక వ్యక్తి కంప్యూటర్‌రో ఆ వ్యక్తి ఏం చదివిందో/చదివాడో పరీక్షించే అధికారం ఇస్తే అది ఎక్కడికి దారితీస్తుందంటే–మీ వంటి న్యాయమూర్తి ఒక వ్యక్తి ఆలోచన సరిగా ఉందో లేదో తీర్పు ఇవ్వాల్సిన కాలం కూడ వస్తుంది. అందుకు మీకు సహాయం చేయడానికి ఆలోచనల మీద నిఘా పెట్టే (థాట్) పోలీసు ఉంటాడనుకోండి!

(లీఫ్‌లెట్ సౌజన్యంతో)

(రచయిత సీనియర్ జర్నలిస్ట్. అమర్త్యసేన్ నెలకొల్పిన ప్రాతీచి ట్రస్ట్‌కు అధ్యక్షుడుగా పనిచేశాడు) వీ

ప్రదర్శించారు. అయితే దీంట్లో బయటకి ప్రచారమైన లక్ష్యాల కంటే అసలు ప్రయోజనాలు వేరే ఉన్నాయని కాస్త ఈ సదస్సు జరిగిన తక్షణ నేపథ్యంలోకి తొంగిచూస్తే అవగతం అవుతుంది. 'భారత్ మే సబ్ అచ్చా హై' అని మోడీ ప్రసంగం ప్రారంభం అయింది.

గత కొద్ది నెలలుగా దేశ ఆర్థికస్థితి మాంద్యంలోకి జారుకోవడం, మోటారు వాహనాల తయారీ రంగంలో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోవడం, జిడిపి గతంలో ఎన్నడూ లేనివిధంగా కనిష్ట స్థాయికి పడిపోయింది. బ్యాంకుల కుంభకోణాలు, ఉపాధి ఉద్యోగ లేమి, వ్యవసాయ రంగ సంక్షోభం దేశ ఆర్థిక స్థితిని కుదిపేస్తోంది. దీంతో పాటు తక్షణంగా కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370 ఆర్టికల్ రద్దు చేయడమే కాకుండా మొత్తం కాశ్మీర్‌నే బహిరంగ జైలుగా మార్చివేసి బయటి ప్రపంచంతో ఎటువంటి సంబంధాలు లేకుండా చేయడం, హక్కుల ఉల్లంఘనకు పాల్పడడం, భయానక నిర్బంధంలో మొత్తం లోయంతా సైనిక స్థావరంగా మార్చడంతో ప్రపంచ దేశాలు ముఖ్యంగా అమెరికా కూడా 'ఆందోళన' వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఇది పాకిస్థాన్‌తో తలెత్తిన సమస్యగా చూపించడం, కాశ్మీర్‌పై ప్రభుత్వ చర్యను సమర్థించ కుంటే దేశద్రోహంగా ముద్రవేయడం తారాస్థాయికి చేరుకున్నాయి. తన హిందుత్వ జాతీయవాద రాజకీయాలను మరింతగా ప్రజల మీద రుద్దే నేపథ్యంలోనే హౌడీ మోడీ జరిగింది.

మరోవైపు డోనాల్డ్ ట్రంప్ రెండవసారి అధ్యక్షుడిగా పోటీ చేయబో తున్నాడు. గడచిన ఎన్నికల్లో అమెరికాలో నివసించే ఓటు హక్కు ఉన్న భారతీయులు ట్రంప్‌కు ఓటు వేయలేదు. ప్రచార వ్యయాన్ని కూడా డెమొక్రాట్స్‌కి సమకూర్చినంతగా ట్రంప్‌కి అందివ్వలేదు. పైగా చైనాతో వ్యాపార ఘర్షణ తీవ్రం కావడం, చైనా మార్కెట్ కుంచించుకపోవడం, భారత్‌తో వ్యాపారలోటు మరీ ఎక్కువగా ఉందన్న అసంతృప్తితో ఉన్న ట్రంప్ దాన్ని పూడ్చుకోవాలనే మంచి అదనుకోసం ఎదురు చూస్తున్నాడు. హార్లీ డేవిడ్సన్ మోటార్ సైకిళ్ల లాంటి అత్యంత ఖరీదైన దిగుమతుల మీద సుంకం తగ్గించేందుకు ఇదే సరైన వేదికగా కలిసి వచ్చింది. పాలకవర్గ పరస్పర ప్రయోజనాల కోసమే ఈ భారీ హంగామా చోటుచేసుకున్నది.

టెక్సాస్ రాష్ట్రాన్ని ఎంచుకోవడంలో కూడా ఒక లక్ష్యం ఉన్నది. అమెరికాకు స్వాతంత్రం వచ్చిన కొత్తలో ఈ ప్రాంతం మెక్సికో దేశంలో భాగంగా ఉన్నది. కాలక్రమంలో అది అమెరికాలో విలీనం అయింది. ఆ విలీనం ఎంత సహేతుకమైనదో భారత్‌లో కాశ్మీర్ అంతర్భాగం అని చెప్పడం అలాంటిదే అని చెప్పడం కోసం కూడా ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్టు స్పష్టమవుతున్నది. కానీ కాశ్మీర్‌పై తీసుకున్న చర్యపై దేశంలో ప్రజలు కాశ్మీర్ మాదే అనే జాతీయ భావన కంటే కాశ్మీర్ ప్రజలు మేము భారత్‌లో అంతర్భాగమని చెప్పడం అతి ప్రధానం అవుతుంది. ఈ అంశాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తు విదేశీ వేదిక పైన తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ హౌడీ మోడీ ద్వారా అమెరికా భారత్‌ను సమర్థిస్తున్నట్లు, ఎక్కువ విలువ ఇస్తున్నట్టు ప్రపంచానికి ప్రత్యేకించి పాకిస్తాన్‌కి చెప్పాలనుకున్నాడు మోడీ. కాని అన్నింటికంటే అమెరికా తన ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యతనిస్తుంది అన్న విషయం మోడీకి తెలియంది కాదేమో! సరిగ్గా అదే సమయంలో కార్పొరేట్ ప్రపంచానికి మోదాన్ని ఇచ్చే కార్పొరేట్ టాక్స్ కట్స్ కూడా భారీ స్థాయిలో ప్రకటించారు.

మోడీ తన ఉపన్యాసంలో భారతదేశ అస్థిత్వానికి భిన్నత్వమే పునాది అంటూ ఇక్కడేదో ఆయన ప్రభుత్వం, పార్టీ భిన్నత్వాన్ని ఎంతో గౌరవించే స్థాయిలో ఉన్నట్టు చెప్పుకొచ్చాడు. సరిగ్గా అదే సమయంలో అమిత్ షా హిందీని జాతీయ భాషగా విస్తరింప చేయాలని మాట్లాడుతున్నాడు. భిన్నత్వాన్ని ఏ మాత్రం గౌరవించని పార్టీ, దాని సంఘం దేశాన్ని అఖండ హిందూ భారత్‌గా మార్చాలనే ఎజెండాను మాత్రం బయట ఎక్కడా ప్రస్తావించలేదు మోడీ! దేశంలో అంతర్గతంగా ఒకటి జరుగుతుంటే అంతర్జాతీయ యవనిక మీద ఆదర్శోపన్యాసాలు వల్లించడం హాస్యాస్పదంగా ఉంది.

ఈ సదస్సులో భాగంగానే అనేక కార్పొరేట్ సిఇఒలను కలిసి మా దేశంలో మార్కెట్‌ను మరింతగా విస్తరించుకోండి అని స్వాగతించాడు. అన్నిటికీ మించి ఏ ప్రధాని, ప్రభుత్వాధినేత విదేశీ ఎన్నికల్లో ఏ పార్టీ, ఏ వ్యక్తి గెలవాలని కోరని విధంగా అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అని మళ్లీ వచ్చేది ట్రంప్ సర్కార్ అని ఆయన అక్కడి భారతీయ ఓటర్లను ఆయనకే ఓటు వేయాలనేలా ప్రచారం చేశాడు. అట్లా అది ట్రంప్ కోసం మోడీ పేరుతో ఎన్నికల ప్రచార సభను తలపించింది.

నిజానికి ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఎక్కువగా అభద్రతకు గురైంది భారతీయులే. ఇరాన్‌లో జరిగిన అణు ఒప్పందం నుండి వచ్చిన అమెరికా ఆ దేశంపై మరిన్ని ఆర్థిక ఆంక్షలు విధించడమే కాకుండా విధిగా అన్ని దేశాలు ఆ ఆంక్షలను అమలు చేయాలని శాసించడంతో తలొగ్గిన దేశాల్లో ఇండియా కూడా ఒకటి. ఆ దేశం నుండి దిగుమతి చేసుకుంటున్న చమురు నిలిచిపోవడంతో అంతర్జాతీయంగానే కాక దేశీయంగా కూడా ఇంధన ధరలకు రెక్కలు వచ్చాయి. దాని ఫలితంగా దేశంలో అనేక రంగాలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొన్నాయి. ప్రధానంగా అసంఘటిత రంగం విలవిలలాడి పోయింది.

ఏ రకంగా ట్రంప్ విధానాలు భారతదేశ ప్రయోజనాలను నెరవేర్చలేక పోయినవి అయినా అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అనడంలో ఔచిత్యం ఏమిటి? మోడీకీ, మోడీ పార్టీకి ఏమైనా ప్రయోజనాలు నెరవేరాయేమో కానీ దేశ ప్రజలకు ఒరిగింది, ఒరిగేది శూన్యం. దేశం నుండి లక్షలాదిగా గల్ఫ్ దేశాలకు వెళ్లి ఎడారి బతుకులు బతుకుతున్న వారిని ఎప్పుడైనా పరామర్శించిందా అంటే లేదనే చెప్పాలి. గల్ఫ్ దేశాలలో నివసించే భారతీయులు అనేకమంది మోసానికి గురయ్యో, అవగాహనా రాహిత్యం తోనో అక్కడి చట్టాలు ఉల్లంఘించారనే నేరంతో జైళ్లలో మగ్గుతున్న వారిని ఆయా దేశాలు పర్యటించినప్పుడు అడిగింది లేదు ఆరా తీసింది లేదు. బహుశా వారిని 'అన్యులు' అని అనుకోవడం వల్లనేమో!

మోడీ ఇటువంటి పటాటోపాలు అన్ని ఎక్కువగా యూరప్, పాశ్చాత్య దేశాలకు వెళ్లినప్పుడే బాగా ప్రదర్శించి, ఎడారి దేశాలకో, ఆఫ్రికా దేశాలకో వెళ్లినప్పుడు ఇలాంటి ప్రదర్శనలు చేయడనే విషయాన్ని కూడా గమనించాలి. ఇతర దేశాలతో సూత్రబద్ధమైన వైఖరితో కూడిన, దేశ ప్రయోజనాల కనుగుణమైన సంబంధాలు ఉండేలా విదేశీయానం, విధానం ఉండాలి తప్ప స్వదేశంలో రాజకీయ ప్రయోజనాల కోసం కాకూడదు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

స్వచ్ఛ భారత్‌లో రక్తపు మరకలు

***ఈ దేశంలో కూడు, గూడు, గుడ్డ, సామాజిక గుర్తింపులేని అట్టడుగు కులాల దళిత పిల్లలను 'స్వచ్ఛ భారత్'లో బహిరంగ మలవిసర్జన చేశారన్న కారణంతో అగ్రకుల శక్తులు చంపేశాయని అంటున్నారు* కె. మహేష్**

ఆనాడు పవిత్రత పేరుతో అంటును ఆపాదించినా.. ఈనాడు 'స్వచ్ఛ' అనే పద ప్రయోగంతో మలవిసర్జన అంటూ విరుచుకుపడుతున్నా.. అప్పుడూ ఇప్పుడు బలయ్యింది, బలవుతోంది మాత్రం అట్టడుగువర్గాలే. ఇంట్లోకి కాదు, కనీసం నడి ఊరిలోకి ప్రవేశించాలన్నా పంచములు, శూద్రులకు నాడు అమానుష షరతులు అమలయ్యాయి. అపవిత్రత అంటూ అంటును అంటగట్టారు. ఊరి బయటే ఉంచి సేవ చేయించు కున్నారు. ఇప్పుడు.. వారు గీసిన నాగరిక హద్దుల్లో మసులుకోవట్లేదని దాడులకు తెగబడుతున్నారు. చంపేస్తున్నారు.

ఒక్కసారిగా నష్టపోయి.. ఇల్లు వాకిలి కుదువపెట్టుకుని పేదరికంలోకి దిగజారలేదు. వేల ఏండ్లుగా తమ ఉనికి కోసం పోరాడుతున్నవారు. ఉండేందుకు ఆవాసమే లేనివాళ్లకు ఇప్పుడు మరుగుదొడ్డి తప్పనిసరిగా కలిగి ఉండాలి. దాన్నే వినియోగించాలి. తినడానికే ఆహారంలేక కడుపు మాడిపోతుంటే.. ఆహారం కన్నా మరుగుదొడ్డే ప్రధానం చేసేశారు. 2011 లెక్కల ప్రకారం దేశంలో 18 లక్షల మంది ప్రజలకు ఉండేందుకు ఇల్లు లేదు. దేశంలో యేటికేడు సంపద కొంత మంది దగ్గర కేంద్రీకృతమవుతూ వస్తుండగా.. పేదల సంఖ్య మరింత పెరిగే అవకాశమే ఉన్నది. 117 దేశాలతో రూపొందించిన ఆకలి సూచీ జాబితా(2019)లో భారత్ 102వ స్థానంలో ఉన్నదంటేనే దేశంలో అన్నార్తులెంతమంది ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

తరతరాలుగా మలాన్ని నెత్తిమీద మోస్తూ ఎత్తిపారేస్తున్న కులాలు ఇప్పటికీ ఉన్నాయి. సెప్టిక్ ట్యాంకుల్లో దిగి విషవాయువులు పీల్చి ప్రాణాలు విడుస్తున్నవారు ఎందరో. సుప్రీంకోర్టు మందలించినా.. వారి(స్కావెంజర్స్, పారిశుధ్య కార్మికులు) రక్షణ కోసం, పరిహారం, పునరావాసం కోసం సర్కారు తీసుకున్న చర్యలు శూన్యం. స్వచ్ఛ భారత్ కింద ఇంటికో మరుగుదొడ్డి నిర్మాణ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న సర్కారు.. అందులోని మలాన్ని ఎత్తేసేందుకు ఓ వ్యవస్థను మాత్రం ఏర్పాటు చేయలేదు. ఈ మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు మళ్లీ వీరినే పంకిలంలోకి బలవంతంగానైనా దింపుతారన్న విశ్లేషణలున్నాయి. వ్యాధులు ప్రబలకుండా, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం అవసరమే. కానీ, వాటి కోసం కొందరు తమ జీవితాలు ఫణంగా పెట్టాల్సిరావడం, మరికొందరు ప్రాణ హానిని ఎదుర్కోవడమే ఇక్కడ అభ్యంతరకరం.

స్వచ్ఛ భారత్ నినాదం బహిరంగ మలవిసర్జనను ఒక నేరంగా పరిగణించే స్థాయికి తీసుకెళ్లింది. నరేంద్ర మోదీ సర్కారు స్వచ్ఛ భారత్ మిషన్ ప్రకటించినప్పటి నుంచి మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలపై ఒత్తిళ్లు పెంచారు. కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు, రేషన్ సరుకుల్లో కోత విధించారు. ఓ మేరకు నిర్మాణాలు పూర్తయిన తర్వాత.. వాటి వినియోగం అనుకున్నంతగా లేదు. దీంతో ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బకొట్టే వ్యూహాన్నీ అమలు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో బహిరంగంగా మలవిసర్జన చేస్తున్నవారి(మహిళలు సహా) ఫొటోలు తీసి అవమానించడం. అందరిముందు అసభ్యంగా తిట్టిపోయడం లాంటివి కొందరు మోదీ సర్కారు భక్తులు, అధికారులు కలిసి చేశారు. రెండేండ్ల క్రితం రాజస్థాన్‌లో బహిరంగ మలవిసర్జన చేస్తున్న మహిళ ఫోటో తీసేందుకు యత్నించిన కొంతమందిని ఓ సామాజిక కార్యకర్త అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన ఆ బృందం సదరు సామాజిక కార్యకర్తను కొట్టి చంపేసిన ఘటనే ఇందుకు నిదర్శనం. బహిరంగ మలవిసర్జన కొట్టి చంపేయదగ్గ నేరంగా ముందుకు రావడం శోచనీయం(ఏ నేరానికైనా చంపేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు). తాజాగా, మధ్యప్రదేశ్‌లోనూ ఇద్దరు పిల్లలపై ఇదే కారణంతో దాడి చేసి చంపేశారు.

'స్వచ్ఛత'ను పాటించలేదని ఇద్దరు పిల్లలపై దాడి

మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాలో దళిత కులాలకు చెందిన ఇద్దరు పిల్లలు(11 ఏండ్ల బాలుడు, 12 ఏండ్ల బాలిక) ఆరుబయట మల విసర్జన చేశారని ఉన్నతవర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసి చంపేశారు. సెప్టెంబర్ 25న తెల్లవారుజామున భావఖేడి గ్రామంలో ఈ ఘటన జరిగింది. మరణించిన ఆ పిల్లల కుటుంబాలు నివసించేందుకే ఇల్లు లేదు. మరుగుదొడ్డితోపాటు ఇల్లు కోసమూ దరఖాస్తు చేసుకుందా కుటుంబం. కానీ, రెండు దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. అటువంటి కుటుంబానికి చెందిన పిల్లలు తమ తాత ఇంటికి వెళుతూ మధ్యలో వారి భూమిలోనే మలవిసర్జన చేశారు. 'వాళ్లేం పాపం చేశారు. అతి సహజమైన విషయమే కదా మల విసర్జన' అని బాలుడి తండ్రి మనోజ్ వాల్మిక్ ఆవేదన చెందడంలో ఏ దోషమూ లేదు కదా. వ్యవసాయ కూలీలైన వాల్మిక్ కుటుంబానికి రెండున్నర బిగాల భూమి ఉండేది. దాన్ని అక్కడ ఆధిపత్య కులాలకు చెందిన కొందరు లాగేసుకున్నారు. ఆ ఊరిలోనూ కులవివక్ష బుసలు కొడుతున్నది. ఊరిలోని చేతిపంపు దగ్గరా నీటి కోసం ఈ దళిత కుటుంబీకులు కనీసం రెండు గంటలైనా ఎదురుచూడాల్సి వస్తుండేది. అందరు నీటిని తీసుకెళ్లాకే వీరు చేతిపంపు దగ్గరకెళ్లాలి. బడిలో వాల్మిక్ పిల్లలను సహ విద్యార్థులతో బెంచీలపై కూర్చోనిచ్చేవారు కాదు. మధ్యాహ్నం భోజనంలోనూ వీరు వేరుగా కూర్చోవాలి. ఇలాంటి వివక్ష ఉంటే తమ పిల్లల్ని పాఠశాలకు ఎలా పంపాలని వాల్మిక్ ప్రశ్నిస్తున్నాడు. ఆ బడిలో చదువు మానేసిన అతని పెద్ద కూతురు ఇప్పుడు అదే పాఠశాలలో మరుగుదొడ్లు కడుగుతున్నది. తరగతి గదులు, వరండాలను ఊడిచే పని చేస్తున్నది. ఇటువంటి దుర్భర పరిస్థితులున్న వారు, దైనందిన జీవితం కోసమే పోరాటం చేస్తున్నవారు.. కనీస అవసరాలు పక్కనపెట్టి నాగరికత, ఆధునికత అంటూ భూమి విడిచి గాలిలోకి ఎగరలేరు కదా. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడ్డ ఈ వర్గాల అభివృద్ధికి పాటుపడితే.. అంతరాలు

వ్యవస్థాగత దృక్పథానికి చెల్లు చీటి

వ్యవస్థాగత దృక్పథం, వర్గ దృక్పథానికి బదులుగా వ్యక్తిగత దృక్పథానికి ప్రాధాన్యత ఇచ్చే ప్రయత్నం జరుగుతోందనీ, ఇది విప్లవాత్మక ప్రత్యామ్నాయాల వైపు యువత దృష్టి మళ్లకుండా చేసే ప్రయత్నమనీ అంటున్నారు **కొండూరి వీరయ్య**

2019 సంవత్సరానికి గాను నోబెల్ బహుమతి భారతీయ సంతతికి చెందిన అభిజిత్ బెనర్జీ, అతని సహచరి ఎస్తేర్ ఈస్థర్ డఫ్లోకులను వరించింది. ఈ ఆర్థికవేత్తలు పేదరిక నిర్మూలనకు గల అవకాశాల్లో కొత్త కోణాన్ని వెలుగులోకి తెచ్చినందుకు ఈ బహుమతి ప్రదానం చేస్తున్నట్లు నోబెల్ కమిటీ ప్రకటించింది. సామాజిక మాధ్యమాల్లో ఈ ఇరువురు కలిసి రాసిన పేదల 'అర్థశాస్త్రం: ప్రపంచ దారిద్ర్యాన్ని నిర్మూలించడంలో విప్లవాత్మక ప్రత్యామ్నాయం' అన్న పుస్తకం గురించి విస్తృతమైన చర్చ మొదలైంది. నోబెల్ బహుమతి ప్రకటించిన కమిటీ కూడా 'ఈ పరిశోధకుల ప్రయోగాలు విస్తృతమైన ప్రపంచ పేదరిక సమస్యను జాగ్రత్తగా రూపొందించిన నిర్దిష్ట ప్రయోగాల ద్వారా తగ్గించడానికి కావల్సిన విధాన సూచనలు అందించింది' అని పేర్కొంది. అందువల్ల ఈ పుస్తక సారాంశాన్ని పాఠకులకు పరిచయం చేయడంతో పాటు నోబెల్ కమిటీ సదరు మార్గాలు సూచించిన రచయితలను ఎంపిక చేయడం వెనక ఉన్న కోణం గురించి కొన్ని అభిప్రాయాలు పంచుకోవడానికి ఈ వ్యాసం ఉద్దేశించబడింది. దాంతో పాటు సమకాలీన ప్రపంచ ఆర్థిక పరిణామాల నేపథ్యంలో ఈ తరహా పరిశోధనలకు నోబెల్ బహుమతి రూపంలో పాలకవర్గాల ఆమోదం తెచ్చిపెట్టడం వెనక ఉన్న రాజకీయ ప్రయోజనాల గురించి కూడా ఈ వ్యాసంలో చర్చించనున్నాను.

ఈ పుస్తకం మొదటి అధ్యాయంలో అనేక సమస్యల సమాహారంగా పేదరికాన్ని చూడాలి. పేదరికాన్ని నిర్మూలించాలంటే ఈ సమస్యలను విడివిడిగా ముందు పరిష్కరించుకోవాలి. పలువురు ఆర్థికవేత్తలు దారిద్ర్య కూపాన్ని పలురకాలుగా వర్ణించారు. ఈ రచయితలు మాత్రం 'అంతగా పెట్టుబడులు పెట్టలేని వారికి ఆదాయాలు లేదా సంపద పెంచుకునే మార్గం పరిమితంగా ఉండి ఎంతో కొంత పెట్టుబడులు పెట్టగలిగిన వారి సంపద పెంచుకునే అవకాశాలు మెరుగ్గా ఉండడాన్ని పేదరిక కూపంగా నిర్వచించవచ్చు. పేదరిక నిర్మూలనకు రాండమైజ్డ్ కంట్రోల్ ట్రయల్స్ పద్ధతి మెరుగైన ప్రత్యామ్నాయ మార్గం' అని వివరించారు.

రెండో అధ్యాయం నిజంగా వంద కోట్ల మంది ఆకలితో ఉన్నారా అన్న ప్రశ్నార్థకంతో మొదలవుతుంది. అయితే కొన్ని పరిస్థితుల్లో ఆహార కొరత సమస్యగానే ఉన్నప్పటికీ ఆధునిక సమాజంలో దారిద్ర్యం పెరగడానికి ఆహారం కొరత దోహదం చేయడం లేదు అన్న నిర్ధారణతో మొదలవుతుంది. అయితే బాలింత తల్లులకు, పసిపిల్లలకు పౌష్టికాహారం అందుబాటులో లేకపోవడానికి వారి భవిష్యత్తు పేదరికంలో మగ్గడానికి మధ్య సంబంధం ఉంటుందని రచయితలు అభిప్రాయపడ్డారు. రచయితలు నిర్వహించిన రాండమైజ్డ్ కంట్రోల్డ్ ట్రయల్స్ పద్ధతిలో బాలింతలకు ఐయొడిన్ పెంచే ఆహార పదార్థాలు, పిల్లలకు డివార్మింగ్ మాత్రలు అందించడం ద్వారా ఎక్కువ ఫలితాన్ని సాధించవచ్చని రచయితలు వివరిస్తారు. వేతనాలకు, పేదరికానికి మధ్య సంబంధం లేదని కాకపోతే తక్కువ వేతనాలు పొందుతున్న వాళ్లు రక్తహీనతకు

సమసిపోయాక వీరూ అన్ని రకాల లక్ష్యాల్లో మిగితా వారితో కలిసి సమ ఉజ్జీలుగా పోటీపడగలరు. బహిరంగ మల విసర్జన రహిత దేశంగా అక్టోబర్ 2న మోడీ ప్రకటించినప్పటికీ.. అందరికీ టాయిలెట్లు అందుబాటులోకి రాలేవని కథనాలు, నివేదికలు వస్తూనే ఉన్నాయి. కాగా, మరికొన్ని చోట్లా మరుగుదొడ్లు నిర్మించుకున్నప్పటికీ వాటిని వినియోగించనివారు చాలామందే ఉన్నారు. బిహేవియరల్ చేంజ్‌కు మరికాస్త సమయం పట్టవచ్చునేమో. కానీ, దీని పేరు మీద దాడులకు దిగడం, తీవ్రంగా స్పందించడం సహించరానిది..

మధ్యప్రదేశ్‌లో ఆ ఘటన జరిగిన రోజే స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమానికిగాను బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ నుంచి గ్లోబల్ గోల్ కీపర్ అవార్డును ప్రధాని మోడీ స్వీకరించారు. అవార్డు స్వీకరిస్తూ ఆయన చేసిన ప్రసంగంలో ఓ కామెంట్ నాకు ఆసక్తిగా అనిపించింది. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి క్యాంపెయిన్‌ను తాను చూడలేదని ప్రధాని చెప్పుకొచ్చారు. స్వచ్ఛ భారత్ క్యాంపెయిన్‌ను తమ ప్రభుత్వం ప్రారంభించిందేమో కానీ, ప్రజలే తమ కంట్రోల్‌లోకి తీసుకున్నారని వ్యాఖ్యానించారు. ఔను. బహుశా ఇలాంటి క్యాంపెయిన్, ఈ విధంగా అమలు చేయడం మరెక్కడా జరిగి ఉండకపోవచ్చు. ప్రజల్లోని ముఖ్యంగా సామాజిక, ఆర్థిక అంతరాలను తొలగించేందుకు పూనుకోకుండా.. ఇలాంటి స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ రహిత దేశం అంటూ చేపట్టే కార్యక్రమాలకు విరివిగా ప్రచారం కల్పించడం ఇక్కడే జరిగిందేమో మరి. ఆ కార్యక్రమాలు తప్పని కాదు. కానీ, వాటి కంటే ముఖ్యమైన సమస్యలుండగా.. వాటిని వదిలిపెట్టడమేమిటన్నది ప్రశ్న. పాలకులు ప్రజల సర్వెంట్లు. పాలక పక్షాల తప్పిదాలను, అసంబద్ధ నిర్ణయాలను ప్రశ్నించడం ప్రజల హక్కు. ప్రతిపక్షాలు మిన్నకుండినప్పుడు ప్రజలపై ఆ బాధ్యత మరింత పెరుగుతుంది. అంతేకానీ, పాలక పక్షాలకు మూఢ భక్తులుగా వ్యవహరిస్తూ.. వారేమీ చేసినా సమర్థించడం, విభేదించినవారిపై విరుచుకుపడడం ఎలా సమంజసమవుతుంది? పాలకులకు కార్యకర్తలుగా ఉండాల్సిన అవసరం లేదు. కానీ, కొందరికి సర్కారును విమర్శించడం కూడా మింగుడుపడడం లేదు. సర్కారు ప్రతి ఐదేండ్ల కోసారి మారుతుంది. దేనికీ అంటిపెట్టుకుని ఉండాల్సిన పనిలేదు. మంచిని తప్పక స్వీకరిస్తూ.. తప్పిదాలను వేలెత్తి చూపుతూ.. ప్రజాస్వామ్య దేశంలో నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా కచ్చితంగా పోరాడాల్సిందే.

(రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్టు) వీ

లోనయ్యే ప్రమాదం ఉందని మాత్రం విశ్లేషిస్తారు ఈ నోబెల్ బహుమతి గ్రహీతలు. అదే సమయంలో పౌష్టికాహారం కోసం ప్రభుత్వాలు వెచ్చించే నిధులు ఎంతో కాలం తర్వాత గానీ (ఈ పిల్లలు పెద్దవాళ్లు అయి ఆర్థికోత్పత్తిలో భాగస్వాములు అయ్యాక గానీ) ఫలితాన్ని ఇవ్వడం లేదన్న ఆందోళన ఈ పరిశోధనాత్మక గ్రంథంలో వ్యక్తమవుతుంది.

ఈ పరిస్థితుల్లో ఆరోగ్యరంగంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఎక్కువ ప్రయోజనాలు సాధించవచ్చని రచయితలు ప్రతిపాదిస్తారు. ఆరోగ్యానికి, పేదరికానికి మధ్య ఉన్న సంబంధాన్ని చర్చించడం మూడో అధ్యాయంలో ముఖ్యాంశం. దుర్భర దారిద్ర్యంలో ఉన్న ప్రజలు ఆరోగ్య సమస్యల కారణంగా పేదరికంలో కూరుకుపోతున్నారు. అనారోగ్యంతో ఉన్న పిల్లలు బడికి వెళ్లేది తక్కువ. బడికి వెళ్లరు కాబట్టి చెప్పుకోదగ్గ ఉద్యోగాలు, మెరుగైన ఆదాయాలకు వీరు దూరమవుతారు. మరోవైపున ఆరోగ్యం గురించిన సరైన అవగాహన లేకపోవడంతో ఎక్కువ మందులు రాసే డాక్టర్‌ను మంచి డాక్టర్‌గా చూడడానికి ప్రజలు అలవాటు పడుతుంటారని ఈ రచయితలు తమ ప్రయోగాల్లో గుర్తించారు. రోగం ముదిరాక చికిత్సకు వెళ్లడం కంటే రోగం ముదరకముందే జాగ్రత్తలు తీసుకోవాలని రచయితలు సూచిస్తారు. అయితే రోగం ముదరకముందే నియంత్రణ వైద్య సేవలు అనేక కారణాల రీత్యా ప్రజలకు అందుబాటు లోకి రావడం లేదని, స్థానిక ఆసుపత్రులు మూసేయడమో, వాక్సినేషన్ పట్ల అవగాహన రాహిత్యమో, నియంత్రణ చికిత్సలు అమలు చేయడానికి కావల్సిన కనీస పరిజ్ఞానం తెలిసి ఉండకపోవడమో కారణాలుగా ఉన్నాయని ఈ పరిస్థితుల్లో సరైన సమయంలో సరైన చికిత్సలు అందుబాటులోకి తేవడం ద్వారా పేదలు వైద్యంపై పెట్టే ఖర్చును నియంత్రించవచ్చన్నది ఈ రచయితల నిర్ధారణ.

ప్రజలందరికీ విద్యావకాశాలు అందుబాటులోకి రాకపోవడానికి పాఠశాలలు లేకపోవడం కాదనీ, కాకపోతే విద్యా వ్యవస్థలో నాణ్యత లేకపోవడం, విద్యార్థులు మధ్యలోనే బడి మానేయడం వంటివి ముఖ్యమైన సమస్యలుగా ఉన్నాయని రచయితలు అభిప్రాయపడ్డారు. పేద దేశాల్లో ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావడంతో ప్రమాణాలు మెరుగ్గా ఉంటున్నాయన్నది వీరి పరిశీలన. సంపన్న దేశాల్లో నిర్దిష్ట వయసు వచ్చే వరకు విద్యార్థులు బడికి వెళ్లాలన్న నియమం అమలవుతోందనీ, అయితే వెనకబడిన దేశాల్లో అటువంటి నిబంధనలు అమలు చేయడం అసాధ్యమని అంచాకు వచ్చిన వీరు ఈ వెనకబడిన దేశాల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అనసరించాలని సూచిస్తారు. నగదు బదిలీ పథకం అటువంటి ప్రత్యామ్నాయాల్లో ఒకటని, పిల్లలు బడికి వెళ్లినంత కాలం ఏటా వచ్చే ఆర్థిక ప్రయోజనాలు (నగదు బదిలీ పథకం ద్వారావచ్చే మొత్తం) గురించి తల్లితండ్రులకు అవగాహన కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు మధ్యలో బడి మానేయకుండా జాగ్రత్తపడొచ్చన్నది రచయితల పరిశోధనలో తేలిన విషయం.

చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్న అభిప్రాయం ఎక్కువ మందికి ఉన్నదనీ, అయితే ఎక్కువ మంది సభ్యులున్న కుటుంబాల్లో జీవన ప్రమాణాలు పడిపోయాయని చెప్పేందుకు ఉదాహరణలేమీ లేవని ఈ రచయితలు వెల్లడిస్తారు. అంతటితో ఆగలేదు. దుర్భర దారిద్ర్యంలో ఉన్న కుటుంబాలు ఎక్కువమంది పిల్లలను కంటే ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. ఈ పిల్లలు పెద్దయ్యాక కార్మికులుగా మారితే ఎక్కువమంది ఉన్న కుటుంబానికి ఎక్కువ ఆదాయం వస్తుంది కాబట్టి పేదరికం కూపం నుండి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నది రచయితల తర్కం. అదే సమయంలో పటిష్టమైన సామాజిక భద్రత వ్యవస్థలు అమల్లో ఉంటే పెద్ద కుటుంబాల ద్వారా ఎక్కువ ఆదాయాలు సంపాదించాలన్న ఆలోచన కుటుంబ యజమాను లకు ఉండదని, కాబట్టి గర్భనిరోధక సాధనాలను ప్రోత్సహించడానికి బదులు సామాజిక భద్రతను పటిష్టం చేయాలన్నది రచయితల తర్కానికి మరో కోణం. అయితే అనేక దేశాల్లో యువతీ యువకులకు గర్భనిరోధక సాధనాలు అందుబాటులో ఉంచకూడదన్న చట్టాలు, సాంప్రదాయాలు అమల్లో ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని, తద్వారా యువతీ యువకులు గర్భధారణను వాయిదా వేసుకునే అవకాశాలు అందుబాటులో ఉంచాలని సిఫార్సు చేసిన ఆర్థికవేత్తలకు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నోబెల్ బహుమతి దక్కడం ఆర్థికవేత్తల స్థాయి ఇంతగా పతనం అయ్యిందా లేక నోబెల్ బహుమతి విజేతలను ఎంపిక చేసే మేధావుల బృందం స్థాయి ఇలాంటి ఆర్థికవేత్తల స్థాయికి పతనమైందా అన్న సందేహం కలుగుతోంది.

సంక్షోభాలకు పేదలకు మధ్య ఉన్న సంబంధాన్ని కొత్తకోణంలో మనముందుంచుతున్నారు ఈ అర్థశాస్త్ర నోబెల్ విజేతలు. బహుశా పోరాడితే పోయేదేమీ లేదు అన్న మార్క్స్ పిలుపు నుండి స్ఫూర్తి పొందినట్లున్నారు. అప్పటికే దారిద్ర్య కూపంలో కూరుకుపోయిన కుటుంబాలకు ఆర్థిక సంక్షోభాల వల్ల అదనంగా వచ్చే ఇబ్బందులేమీ ఉండవన్నది ఈ పరిశోధకుల ప్రయోగాల్లో రుజువు అయింది. అయితే ఇలాంటి కుటుంబాలను దెబ్బతీసేది హఠాత్తుగా కుటుంబంలో ఒకరికి నయం కాని రోగం రావడం, దానికి ఆసుపత్రుల చుట్టూ పరిగెత్తడం వంటి సంక్షోభాలేనని రుజువు చేయడానికి పలు దేశాల్లో పేద కుటుంబాలపై ప్రయోగాలు చేశారు ఈ ఆర్థికవేత్తలు. పేదల కుటుంబ ఆదాయాలు నిలకడగా లేకుండా పోతున్నాయని, అందువల్ల ఈ కుటుంబాలు వైవిధ్యభరితమైన ఆదాయన వనరులను జీవనోపాధి మార్గాలుగా ఎంచుకోవడం ద్వారా ఆర్థిక సంక్షోభాలు, అకాల అవసరాల బారి నుండి బయటపడేందుకు అవకాశం ఉంటుందని నోబెల్ గ్రహీతలు తమ పరిశోధనల ద్వారా గుర్తించారు. అయితే అలా అనేక పనులు చేయాల్సి రావడంతో ఈ కుటుంబాలకు వృత్తి నైపుణ్యం తగ్గిపోతుందని కూడా రచయితలు గుర్తించారు. సంక్షోభంలో ఉన్న పేదల కుటుంబాలు నిరంతరం మానసిక ఉద్వేగాలకు ఒత్తిళ్లకు లోనవుతారని, ఫలితంగా వారు పని చేసే చోట్ల ఉత్పత్తి మందగిస్తోందని కూడా గుర్తించారు. ఈ పరిస్థితుల నుండి బయట పడడానికి ప్రభుత్వమే రాయితలతో కూడిన జీవిత బీమా పథకాలు రూపొందించాలన్నది వీరి సిఫార్సు.

పేదలకు ఇచ్చే రుణాలపై ఎక్కువ వడ్డీలు ఎందుకు ఉంటాయన్న విషయాన్ని కొద్దిగా వివరించడానికి రచయితలు ఈ ప్రయోగాల ద్వారా ప్రయత్నం చేశారు. తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించే సామర్థ్యం పేదలకు తక్కువగా ఉంటుంది. పేదలు తీసుకున్న రుణాలను ఆర్థికసంస్థలు తిరిగి వసూలు చేయలేకపోతున్నాయి. కాబట్టి పేదలకు ఇచ్చే రుణాలపై ఎక్కువ వడ్డీలు ఉంటాయన్న తర్కాన్ని రచయితలు ఆమోదిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మైక్రోఫైనాన్స్ వంటి మార్గాల ద్వారా పేదలకు రుణాలు అందించే ప్రత్యామ్నాయ వ్యవస్థలను అందుబాటులోకి తేవాలన్నది ఈ మేధావుల సిఫార్సు. పేదల జీవితాల్లో రొక్కానికి ఉన్న ప్రాధాన్యతను ఉన్నంతలో హేతుబద్ధంగా వివరించేందుకు రచయితలు ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుంది. ప్రజలు పొదుపు చేయటం లేదన్నంత మాత్రాన దుబారా ఖర్చులకు, వినియోగ తత్వానికి బానిసలయ్యారన్న నిర్ధారణకు రావడం తప్పు అని రయితలు వాదిస్తారు. వివిధ సాంప్రదాయేతర

రూపాల్లో పేదలు పొదపు చేస్తూ ఉంటారని, ఉదాహరణకు ఏటా కొద్దికొద్దిగా నిర్మించుకోవడం ద్వారా స్వంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు ప్రయత్నం చేయటం వంటి ప్రత్యామ్నాయ మార్గాల్లో పేదలు పొదుపు చేసుకుంటారని ఈ రచయితలు తమ పరిశోధనల ద్వారా గుర్తించారు. చౌకగా నిర్వహించగలిగిన బ్యాంకు ఖాతాలు అందుబాటులోకి వస్తే పేదలు ఎక్కువ మొత్తాన్ని పొదుపు చేస్తారన్నది ఈ రచయితల ప్రయోగాల్లో వెల్లడైన విషయం. ఈ సూత్రం ఆధారంగానే మన దేశంలో జనధన యోజన అమలవుతోంది. భారత రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న లెక్కల ప్రకారం ఈ పథకం అమలు జరిగిన దాదాపు ఐదేళ్లల్లో పేదలు అదనంగా తమ ఖాతాల్లో జమచేసిన నిధులేమీ లేవు. నగదురద్దు సందర్భంగానే ఆయా జనధన యోజన ఖాతాల్లో అంతో ఇంతో డబ్బు జమైంది.

చిన్న మధ్యతరహా పరిశ్రమల్లో ఆదాయం పెట్టుబడి మీద యాభై శాతం ఎక్కువగా వస్తున్నప్పటికీ ఈ పరిశ్రమలు ఐదేళ్లకు మించి ఉత్పత్తి రంగంలో ఉండడం లేదని రచయితలు వాపోయారు. అయితే ఇటువంటి చిన్న సన్నకారు ఉత్పత్తి రంగంలోకి ప్రవేశించాలంటే అంతకు ముందు దశాబ్దాల తరబడి పొదుపు చేసుకున్న సొమ్మంతా బయటికి తీయాల్సి వస్తోందని, ఈ విషయంలో పేదలకు గ్యారంటీ లేకపోవడంతో ఎక్కువమంది ఈ రంగంలోకి ప్రవేశించలేకపోతున్నారని రచయితలు అభిప్రాయపడ్డారు. చివరిగా ఇప్పటి వరకు ప్రస్తావించుకున్న అనేక అంశాల కంటే భిన్నమైనది రచయితలు రాజకీయాలు విధానాలు శీర్షికన ఉన్న అధ్యాయంలో చెప్పిన విషయాలు.

పేదరికం వంటి వ్యవస్థాగత సమస్యల పరిష్కారానికి వ్యస్థాగత రాజకీయ మార్పులు అనివార్యం అన్న ఓ అభిప్రాయం ఉందనీ, అయితే రాజకీయ వ్యవస్థలను మార్చటం అంత తేలిక కాదని ఈ నోబెల్ గ్రహీతలు హెచ్చరిస్తున్నారు. ఉన్న వ్యవస్థలను మార్చడానికి ప్రయత్నం చేయడానికి బదులు సదరు వ్యవస్థల పరిధిలోనే సాధ్యమైనన్ని ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నం చేయడం సబబని రచయితులు హితవు పలికారు. చిన్న చిన్న విధానపరమైన మార్పులతో కొన్ని విజయాలు సాధించడం ద్వారా ఉన్న వ్యవస్థలపై ప్రజలకు మరింత నమ్మకం పెంచవచ్చని కూడా రచయితలు పాలకవర్గాలకు హితబోధ చేస్తున్నారు.

అవినీతి పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గతంగా కొనసాగే అంశంగా చూడడానికి బదులు కేవలం విధి నిర్వహణపట్ల నిర్లక్ష్యమేనని సదరు నిర్లక్ష్యాన్ని సరి చేస్తే వ్యవస్థలో అవినీతి లేకుండా చేయవచ్చున్న అభిప్రాయం చివరి అధ్యాయంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. స్థూలంగా చూసినప్పుడు ఆర్థిక రంగంలో వ్యవస్థలే కీలకమనీ, వ్యవస్థలు సజావుగా ఉంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునీ నోబెల్ గ్రహీతలు ప్రతిపాదించారు. వ్యవస్థలు పాలకుల ప్రయోజనాలకు భిన్నమైన అస్థిత్వాన్ని, అధికారాన్ని కలిగి ఉండవన్న వాస్తవాన్ని ఈ రచయితలు మరుగునపెట్టారు. ఆర్థిక వ్యవస్థకు అతీతంగా రాజకీయ వ్యవస్థను నిర్వహించవచ్చని, పెట్టుబడిదారీ వ్యవస్థలో ఆర్థిక ప్రయోజనాలకు, వ్యవస్థలపై ఓ వర్గానికి (దోపిడీ వర్గానికి) పెరుగుతున్న పట్టుకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించినట్లు ఈ రచనలో వ్యక్తం కాలేదు. భారతదేశంలో పేదరిక నిర్మూలనకు వ్యవస్థలకు మధ్య ఉన్న సంబంధాన్ని చర్చిస్తూ వలస పాలనలో వేర్వేరు ప్రాంతాలు వేర్వేరు పరిపాలనా వ్యవస్థల కింద ఉండడం కాకతాళీయంగా జరిగిన సంఘటన అని సరిపెట్టేశారు. నిజానికి వలసపాలనకు సుస్థిరత్వాన్ని సమకూర్చే ప్రయత్నంలో స్థానిక పాలకులను భాగస్వాములను చేసుకోవడంలో భాగమేనన్న చారిత్రక వాస్తవాన్ని అభిజిత్ బెనర్జీ విస్మరిస్తారు.

వ్యవస్థలను మార్చలేకపోయినప్పుడు మొత్తంగా దేశాన్ని ప్రైవేటీకరిస్తే సరిపోతుందని, హంగ్‌కాంగ్‌లాగా చార్టర్ నగరాలు రూపొందించి వాటిని సమర్థవంతంగా పరిపాలించడం ద్వారా అభివృద్ధికి ఉన్న ఆటంకాలు తొలగించుకోవచ్చన్న పాల్ రోమర్ వ్యాఖ్యతో అభిజిత్ బెనర్జీ ఏకీభవిస్తున్నారు. విడివిడి అంశాల్లో ఒకటో రెండో కోణాల్లో ప్రభుత్వ యాజమాన్య సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా మార్పు సాధించవచ్చన్న ప్రతిపాదన ముందుకు తెస్తూనే నోబెల్ గ్రహీతలు మరోవైపున ప్రభుత్వ జోక్యంతో సంబంధం లేకుండా మార్పు సాధించవచ్చన్న ఆలోచనను ముందుకు తెస్తారు. అందులో భాగమే ఈ రాండమైజ్డ్ ప్రయోగాలు. వ్యవస్థలను మార్చలేకపోయినప్పుడు సాధ్యమైన చిన్న చిన్న మార్పులతో ముందడుగు వేస్తూ భారీ ప్రయోజనాలు సాధించవచ్చని వాటి కోసం ప్రయత్నం చేయాలే తప్ప వ్యవస్థల మార్పు కోసం ప్రయత్నం చేసి నిరాశ చెందటం తగదన్నది ఈ సంవత్సరం నోబెల్ గ్రహీతలు ఉద్యమకారుల పట్ల సానుభూతితో చేస్తున్న వ్యాఖ్యగా భావించాలి.

ఓ ఆలోచనకు, ఆచరణకు, ప్రతిపాదనకు, పరిష్కార మార్గానికి నోబెల్ బహుమతి ఇవ్వడం అంటే సదరు ఆలోచన, ఆచరణ, ప్రతిపాదన, పరిష్కారానికి ప్రపంచ వ్యాప్తమైన ఆమోదం ఇవ్వడమే. ఈ సూత్రాన్ని అనుసరించి ఈ సంవత్సరం నోబెల్ గ్రహీతల ప్రతిపాదనలు – వ్యవస్థాగత మార్పు కోసం, వ్యవస్థాగత పరిష్కారాల కోసం ప్రయత్నం చేయాల్సిన అవసరం లేదన్న నయా ఉదారవాద కోణాన్ని మరోమారు సమర్థవంతంగా ముందుకు తేవడానికి ఉపయోగించుకున్నాయని చెప్పవచ్చు. ముగింపుగా రాజకీయ అర్థశాస్త్రంలో రాజకీయాలను వేరుచేయడమే అభిజిత్ బెనర్జీ ప్రయోగాల సారాంశం. అటువంటి ప్రయోగాలకు నోబెల్ బహుతి ఇవ్వడం అంటే ప్రపంచమంతా ఈ లక్ష్యాన్ని ఆమోదించమని ప్రోత్సహించడమే.

ఈ వైఖరి సమాజం ఎదుర్కొంటున్న వ్యవస్థాగత సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు దిశగా ఆలోచించాల్సిన అవసరం లేదని ప్రతిపాదిస్తోంది. సదరు సమస్యలకు కారణమైన సైద్ధాంతిక నేపథ్యాన్ని పరిశీలించాల్సిన అవసరం లేదన్న వాదన ముందుకు తెస్తోంది. కొన్నేళ్ల క్రితం నోబెల్ బహుమతి పొందిన ప్రవర్తనశీల ఆర్థిక సూత్రాలకు, ఇప్పుడు నిష్క్రియాపరత్వాన్ని బోధించే ఆర్థిక సూత్రాలకు మధ్య సంబంధం ఉంది. రాజకీయ అర్థశాస్త్ర అవగాహనలో ఉన్న వర్గ దృక్పథం వైపు యువ పరిశీలకులు, నవ పరిశోధకులు చూడకుండా కళ్లకు గంతలు కట్టడమే ఇటువంటి సూత్రాలను విశ్వవ్యాప్త అవగాహనగా మార్చటం వెనక ఉన్న ఉద్దేశ్యం.

గత నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న ఈ ప్రయత్నం – వ్యవస్థాగత దృక్పథం, వర్గ దృక్పధానికి బదులు వ్యక్తిగత దృక్పథానికి ప్రాధాన్యత ఇచ్చే ప్రయత్నం – ప్రపంచంలో ప్రగతిశీల శక్తులు బలహీనపడే కొద్దీ వేర్వేరు రూపాల్లో ముందుకొస్తుంది. ఈ ప్రయత్నంలోనే అభివృద్ధి–పేదరిక నిర్మూలన–వర్గపరిపాలనకు మధ్య ఉన్న సంబంధాన్ని మరుగునపెట్టే పరిశోధనలు వేలంవెర్రిగా వచ్చాయి. దాంతో పాటే అర్థశాస్త్ర విద్య సిద్ధాంతాలు వదిలి పెట్టి ప్రయోగాల చుట్టూ తిరుగుతోంది. ఇటువంటి పరిశోధనలన్నీ వామపక్ష జోక్యాన్ని, వామపక్ష ప్రత్యామ్నాయం దిశగా ఆలోచించాల్సిన అవసరాన్ని తిరస్కరించే పరిశోధనలే.

ఇటువంటి పరిశోధనలను విప్లవాత్మక పరిశోధనలుగా కితాబు నివ్వడం అసలైన విప్లవాత్మక ప్రత్యామ్నాయాల పట్ల యువత దృష్టి మళ్లకుండా చేసే ప్రయత్నమే తప్పమరోటి కాదు.

(రచయిత ఆర్థిక విశ్లేషకులు) వీ

యుద్ధం అనివార్యమా...?

కశ్మీర్ సమస్య మీద భారత్, పాకిస్తాన్‌ల మధ్య మాటల యుద్ధం నడుస్తోందనీ, అది నిజమైన యుద్ధానికి దారితీస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయనీ అంటున్నారు రాజేంద్రబాబు అర్విణి

2014లో అంటే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడీ ఏర్పడగానే, అందునా నరేంద్రమోడీ నాయకత్వంలో, మహబూబ్‌నగర్ పట్టణంలో 'పాలమూరు అధ్యయన వేదిక' ఒకరోజంతా 'యుద్ధ వ్యతిరేక సభ' నిర్వహించింది. అందులో అప్పటి కేంద్ర సమాచార సంచాలకుడిగా ఉన్న మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ హరగోపాల్ లాంటి ప్రముఖుల ప్రసంగాలతో పాటు పెద్ద సంఖ్యలో కవులు తమ యుద్ధ వ్యతిరేక గళాన్ని వినిపించారు. ఆ సమయంలో దేశ సరిహద్దులో ప్రత్యక్ష యుద్ధ వాతావరణం ఏమీలేదు. కానీ, ఆ సభలో పాల్గొన్న ప్రతి ఆలోచనాపరుడు యుద్ధం గనక వస్తే – జాత్యహంకార సిద్ధాంతం తలకెక్కించుకున్న సమూహం అధికారం చేపట్టింది కాబట్టి యుద్ధ ప్రమాదం మరింత చేరువైందన్న ముందుచూపుతో దేశంలో సంభవించబోయే విపత్కర పరిస్థితులను తమ ప్రసంగాల్లో, కవితలలో భావోద్వేగంతో వర్ణించారు. మరీ ముఖ్యంగా దిగువ మధ్యతరగతి, పేదవర్గాల జీవన స్థితిగతులు ఏ విధంగా దిగజారుతాయో కళ్లకు కట్టినట్లు పేర్కొన్నారు. రోజూ ఉదయాన్నే మనుషులు మేల్కొనడానికి ముందుగానే పక్షులు మేల్కొంటాయి. గాలి మందంగా వీస్తుంది. చెట్లు తమ ఒళ్లు విరుచుకుంటాయి. ప్రకృతి యావత్తు సూర్యునికంటే ముందుగానే కళ్లు తెరిచి లోకాన్ని పరికించి చూస్తుంది. అలాగే కవులు, మేధావులు కూడా దేశంలోని సామాన్య జనానికంటే ముందు వైతాళికులు లాగా మేల్కొని రానున్న వైపరీత్యాలను విడమరిచి చేప్పేవాళ్లు కొందరుంటారు. అలాంటి కోవలోకి చెందిందే పాలమూరు యుద్ధ వ్యతిరేక సభ.

ఐదేళ్ల తర్వాత భారత్, పాకిస్తాన్ దేశాల ప్రధాన మంత్రుల చేష్టలు, మాటలు పరికిస్తూ ఉంటే ఆనాటి పాలమూరు సభ గుర్తుకు వస్తున్నది. ప్రధానులిద్దరూ ప్రజలను యుద్ధానికి సన్నద్ధం చేస్తున్నారా లేక కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న అపరిష్కృత సమస్యల బారి నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి, వారి మెదళ్లలో యుద్ధ ఉన్మాదం నింపడానికి ప్రయత్నం చేస్తున్నారా అన్న అనుమానం రాకమానదు. రాజ్యాంగంలోని 370, 35 (ఎ) అధికరణలను తొలగించిన మరునాటి నుండి భారత సైన్యంలోని బాధ్యతాయుతమైన పదవులలో ఉన్న అధికారులు పదేపదే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలిపేసుకోవడమే మా ముందున్న కర్తవ్యం అని పత్రికా ప్రకటనలు చేస్తూ, మేం యుద్ధానికి సిద్ధమే అని కయ్యానికి కాలుదువ్వుతున్నారు. వీళ్లు మాత్రమే కాదు, కేంద్ర ప్రభుత్వంలో ప్రధాన మంత్రి తర్వాతి స్థానంలో ఉన్న అగ్రస్థాయి నేత అమిత్‌షా పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను వశపరుచుకోవడమే మా లక్ష్యం అని బహిరంగ ప్రకటన కూడా చేశాడు. తొమ్మిది లక్షల మంది సైనికులతో కూడిన సైనిక పటాలం ఇప్పుడు కశ్మీర్‌లో తిష్టవేసి ఉంది. అంటే సరిహద్దులకు దరిదాపులలో సిద్ధంగా ఉంది. అవసరమైతే సరిహద్దు రేఖ మీదకు చేరుకునేందుకు కొన్ని గంటల సమయం కంటే ఎక్కువ పట్టదు.

పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఐక్యరాజ్య సమితి వేదికగా కశ్మీర్‌లో భారత ప్రభుత్వం చేస్తున్న మానవ హక్కుల హననం, పౌరహక్కుల అణచివేత అవధులు దాటుతున్నదని, పక్క దేశం పాకిస్తాన్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్నదని, భారత చర్యలను నియంత్రించడం కోసం ప్రపంచ దేశాలు ముందుకు రావాలని పిలుపునిచ్చాడు. భారత్, పాకిస్తాన్ రెండూ అణ్వాస్త్రాలు కలిగిన దేశాలని, రెండు దేశాల మధ్య యుద్ధం సంభవిస్తే అది అణ్వాస్త్ర యుద్ధంగా మారుతుందని, అప్పుడు జరగబోయే నష్టం చెప్పనలవిగా ఉంటుందని, అది ప్రపంచ మానవాళికే ముప్పుగా దాపురిస్తుందని హెచ్చరిక చేశాడు. భారత్, పాకిస్తాన్‌లు రెండూ అణ్వాస్త్రాలు కలిగిన దేశాలు. అయితే ఈ రెండు దేశాల మధ్య ఓ కట్టుబాటు ఉంది. మొదట ఎవరూ అణ్వాయుధాన్ని ప్రయోగించకూడదు అని. ఎవరైనా మొదట ప్రయోగిస్తే ఎదురు దాడిగా రెండవ దేశం అణు బాంబును ప్రయోగించవచ్చు. కాని మొట్ట మొదట అణ్వాస్త్ర ప్రయోగాన్ని నియంత్రించుకోవాలి అన్నది ఆ కట్టుబాటు. అయితే, ఆ నిబంధనకు మేం కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. సందర్భాన్ని బట్టి, అవసరాన్ని బట్టి మేం అణ్వాయుధాలతో పాకిస్తాన్‌పై దాడి చేస్తాం అని భారతదేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రకటించాడు. మీరు కలగజేసుకోకపోతే అణు యుద్ధం తప్పదని ఐక్యరాజ్య సమితికి, ప్రపంచ దేశాలకు పదే పదే చెపుతున్నాడు పాకిస్తాన్ ప్రధాని. అమెరికాలో వారం రోజులు తిష్టవేసి అమెరికాను తనవైపు తిప్పుకునేందుకు శతవిధాల ప్రయత్నం చేశాడు. కాని, భారతదేశం అంటే అమెరికా దృష్టిలో, ప్రపంచ బ్యాంక్ తదితర సామ్రాజ్యవాద సంస్థల లెక్కల్లో, 130 కోట్ల వినిమయదారులున్న పెద్ద మార్కెట్. అందులో అంతో ఇంతో కొనుగోలు శక్తి ఉన్న మధ్యతరగతి ప్రజలు 35.40 కోట్లకు దరిదాపుల్లో ఉంటారు. ఇంత పెద్ద మార్కెట్‌ను వదులుకోవడం అమెరికా లాంటి వాణిజ్య ప్రముఖ దేశాలు మూర్ఖత్వంగా భావిస్తాయి. అలాగని పాకిస్తాన్‌కు పూర్తిగా దూరమైతే, ఆ దేశం చైనా వర్గంలో చేరిపోతే, ప్రపంచ ఆధిపత్య దేశాల సమీకరణంలో పెను మార్పులు సంభవించే అవకాశం ఎంతైనా ఉంటుంది. కాబట్టి అమెరికా పెద్ద మనిషిలా లాంకోటు వేసుకొని, భేషజం బూట్లు తొడుక్కొని 'ఇరు దేశాలు ఒప్పుకుంటే మధ్యవర్తిత్వం వహిస్తానని' కర్ర విరుగని పాము చావని సూత్రం వల్లిస్తూ కాలం వెల్లబుచ్చుతుంది.

ప్రపంచం మొత్తానికి విషయాన్ని తెలియపరిచేలా ఇమ్రాన్ ఖాన్ 'న్యూయార్క్‌టైమ్స్' పత్రికలో వ్యాసం రాసి దాన్ని చర్చలోకి వదిలేశాడు. న్యూయార్క్‌టైమ్స్ పత్రిక కూడా ఇమ్రాన్ ఖాన్ ఐక్యరాజ్య సమితి సభలో చేసిన ప్రసంగాన్ని ఉటంకిస్తూ ఎడిట్ పేజీలో పెద్ద వ్యాసమే రాసింది. ఆ పత్రిక సంపాదక బృందంతో మాట్లాడుతూ ఇమ్రాన్ 'ఐక్యరాజ్య సమితి కలగజేసుకోకపోతే ఇంకెవరు జోక్యం చేసుకుంటారు. అసలు ఐక్యరాజ్య సమితి 70 ఏళ్ల క్రితం కశ్మీరీల స్వయం నిర్ణయాధికార హక్కును గ్యారంటీ

చేసింది కాబట్టే సమస్య తీవ్రరూపం దాల్చకుండా ఇప్పటివరకు అలానే ఉంది. ఇప్పుడు ఐక్యరాజ్య సమితి ప్రేక్షకపాత్ర వహిస్తాననడం సబబు కాదు' అని వ్యాఖ్యానించినట్లు ఆ పత్రిక రాసింది.

నరేంద్రమోడీ జీవితంతో పెనవేసుకుపోయిన సిద్ధాంతాన్ని పేర్కొంటూ, ఇమ్రాన్‌ఖాన్ మోడీ నేతృత్వం వహిస్తున్న బిజెపి మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పుట్టుకలోనే ఫాసిస్టు భావజాలం ఉందని, ముస్లింలను అణిచివేయడమే దాని ప్రధానమైన ఎజెండా అని, అది హిట్లర్, ముస్సోలినీ కార్యాచరణతో పోలి ఉందని ఇమ్రాన్ ఖాన్ తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించాడు. గోల్వాల్కర్, సావర్కర్‌లు ద్వేష సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన సిద్ధాంతకర్తలని, గాంధీజీని హత్య చేసిన చరిత్రగల ఆర్ఎస్ఎస్ హిట్లర్ లాగా మనుషులంతా సమానులు అన్న సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఒక ప్రత్యేక జాతి ఔన్నత్యం మీద విశ్వాసం గల సంస్థ అని, నేనే కశ్మీరీనైతే నెలల తరబడి జైలులో మగ్గి బయటి ప్రపంచంలో భారత జవానులు కశ్మీరీ ముస్లింల ఇళ్లలోకి చొరబడి మా అక్కలను, చెల్లెళ్లను, భార్యలను హింసిస్తూ, మానభంగాలు చేసి, పదేళ్ల చిన్న పిల్లలను కూడా ఉగ్రవాది అన్న ముద్రవేసి అరెస్టు చేసి తెలియని ప్రదేశాలకు తరలిస్తున్నారని తెలిస్తే నేనేం చేస్తాను, గన్ పట్టుకొని సమరశీలతతో యుద్ధంలోకి వెళ్లక నేనేం చేస్తాను అని ప్రశ్నించాడు. స్వయం నిర్ణయాధికారం కశ్మీరీలకు ఉంటుందని హామీ ఇచ్చిన ఐక్యరాజ్య సమితి అది కాలరాయబడుతుంటే మౌనంగా ఉండడం తగదని హెచ్చరిక చేశాడు. మా రెండు దేశాల మధ్య సాంప్రదాయక యుద్ధం సంభవిస్తే, అది సాంప్రదాయక యుద్ధంగా మాత్రమే మిగిలిపోదని, అది అణు యుద్ధంగా రూపం తీసుకుంటే దానికి ఎర అయ్యేది మా రెండు దేశాలు మాత్రమే కాదు, ప్రపంచ మానవాళి ఉనికికే అది ప్రమాదకరంగా మారుతుందని ప్రపంచ దేశాలను హెచ్చరించాడు. కశ్మీర్‌లో ఎప్పుడో ఒకప్పుడు కర్ఫ్యూ ఎత్తివేయక తప్పదని, అలా కర్ఫ్యూ తొలగించినప్పుడు జరగబోయే రక్తపాతం ఊహకు అందనిదని, దాన్ని నివారించే ఆలోచన ఇప్పుడే ఐక్యరాజ్య సమితి, ప్రపంచ దేశాలు చేయాలని సూచించాడు.

మోడీ తన ఐక్యరాజ్య సమితి ఉపన్యాసంలో కశ్మీర్ సమస్య భారతదేశ అంతర్గత విషయమని, ఏ ఇతర దేశమూ ఇందులో కలుగజేసుకో కూడదన్న వైఖరిని నర్మగర్భంగా ప్రదర్శిస్తూ అసలు కశ్మీర్ సమస్య ఊసే ఎత్తలేదు. భారతదేశం ప్రపంచానికి నేర్పింది యుద్ధం కాదని, ఇచ్చింది శాంతి సందేశమని చెపుతూ మూడు వేల ఏళ్ల క్రితమే ఒక తమిళ కవి రాసిన కవితా పంక్తులను చదివి వినిపించారు. ఆ కవి విశ్వ కళ్యాణ, విశ్వ బంధుత్వం గురించి ప్రపంచానికి సందేశం ఇచ్చాడని, దాన్ని ఇప్పటికీ భారతదేశం కాంక్షిస్తున్నదని అన్నారు. తన హయాంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 12 కోట్ల మరుగు దొడ్లను దేశంలో నిర్మించామని, 2022 సంవత్సరం లోపు పేద ప్రజలకు 2 కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పుకొచ్చాడు. అంతకు కొద్దిరోజుల ముందు హోస్టన్‌లో జరిగిన బహిరంగ సభలో కూడా తాను దేశంలో చేపట్టిన పథకాల గురించి, ప్రణాళికల గురించి ప్రచారాన్ని హోరెత్తించాడు. అంతర్జాతీయ వేదికల మీద తన ప్రభుత్వ కార్యక్రమాల గురించి ఏకరువు పెట్టడం ఎంతవరకు సమంజసం అన్న విషయం వారి విజ్ఞతకే వదిలేయడం మంచిది.

హ్యూస్టన్ సభ మొత్తం ట్రంప్ ఎన్నికల సభలా జరగడం శోచనీయం. దాదాపు 40 నుండి 50 వేల మందిని పోగుచేసి మోడీ వారికిచ్చిన నినాదం 'ఫిర్ ఏక్ బార్ ట్రంప్ సర్కార్'. అమెరికాలోని హిందూ ఓటర్లు ఒక ప్రెజర్ గ్రూప్‌గా, లాబీయింగ్ గ్రూప్‌గా రూపొందుతున్నారన్న విషయాన్ని హ్యూస్టన్ సభ తెలియపరుస్తున్నది. ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రధానమంత్రి ఒక రిపబ్లికన్ పార్టీ కార్యకర్తగా మితిమీరిన ఉత్సాహంతో వ్యవహరించడం ప్రపంచ దేశాలలో భారత్‌కు తలవంపులు తెచ్చేదిగా ఉంది. భారతదేశ రాజకీయాలు ఇంకా వలస కాలపు ఛాయలతోనే ఉన్నాయనడానికి కూడా ఇదొక నిదర్శనం. హ్యూస్టన్ సభ జరుగుతుండగా మోడీ వ్యతిరేక ప్రదర్శనలు కూడా పెద్దఎత్తునే జరిగాయి కాని వాటిని దేశీయ మీడియా గాని, ప్రపంచ మీడియా గాని పట్టించుకోలేదు.

ఏది ఏమైనా పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రసంగానికి 'సమాధానమిచ్చే హక్కు' కింద భారత దౌత్య అధికారిణి ఒకరు ఆ మరునాడు సమాధానం ఇస్తూ ఇమ్రాన్ ఖాన్‌ది మధ్య యుగాల ఆలోచనా ధోరణి అని కొట్టి పారేస్తూ ఆయన 21వ శతాబ్దపు ఆలోచనా సరళిని అలవరుచుకోవాలని హితవు చెప్పారు. పాకిస్తాన్‌లో 1947లో 23 శాతం మైనారిటీ జనాభా ఉంటే ఇప్పుడు అది 3 శాతానికి పడిపోవడానికి పాకిస్తాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న మైనారిటీ వ్యతిరేక విధానాలు కావా అని ప్రశ్నించారు. అయితే ఆ సమాధానంలో కశ్మీర్‌లో జరుగుతున్న మానవ హక్కుల హననం గురించి గాని, పౌరహక్కుల కాలరాచివేత గురించి గాని భారత ప్రభుత్వం వైపు నుంచి ప్రస్తావనే లేదు. ప్రపంచానికి భారత్ శాంతి సందేశం ఇచ్చిందంటూ తమిళ కవి రాసిన పంక్తులు గుర్తుచేసుకున్న ప్రధానికి 'అణ్వాయుధాలను మొదట ప్రయోగించకూడదు అన్న నిబంధనకు కట్టుబడి ఉండాల్సిన అవసరం మాకు లేదు' అని తన మంత్రి మండలిలో రక్షణ శాఖ మంత్రి ఇచ్చిన బెదిరింపు హెచ్చరిక గుర్తుకు రాలేదు.

2019 అక్టోబర్ 2న భారతదేశ 'జాతిపిత'గా గౌరవింపబడుతున్న మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ 150వ జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ఒక వ్యాసం రాస్తూ నేటి ప్రపంచంలో గాంధీ అవసరం చాలా ఉందని, ఆయన తన జీవితంలో పాటించిన విలువలను ప్రచారం చేసిన సిద్ధాంతాలను గుర్తు చేశారు. 'వేరే దేశాలకు ఒక పర్యాటకుడిగా వెళ్లే నేను, భారతదేశానికి మాత్రం పుణ్యక్షేత్రానికి వెళ్లే ఒక తీర్థయాత్రికునిగా వెళతాను' అన్న మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ మాటలను ఉదహరిస్తూ మోడీ, ఆయనకు జ్ఞాన వెలుతురును ప్రసాదించిన గురువు గాంధీ అని, నెల్సన్ మండేలా, ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టిన్ గాంధీ గురించి చెప్పిన వ్యాఖ్యలను ఉదహరించారు. ఆ మరునాడే అంటే అక్టోబర్ 3న అదే న్యూయార్క్ టైమ్స్ పత్రిక శంకర్ చౌదరి అనే తన పాఠకుడు ఒకరు రాసిన ఉత్తరాన్ని ప్రచురించింది. 'కశ్మీరీల హక్కులను కాలరాస్తూ, 80 లక్షల మంది ప్రజలను గత రెండు నెలల నుండి నిర్బంధంలో ఉంచిన వ్యక్తి నుండి గాంధీ గురించి ఈ మాటలన్నీ వినడం ఒక పెద్ద జోక్' అని రాస్తూ శంకర్ చౌదరి హిందూ ఛాందస వాదాన్ని ప్రేరేపిస్తున్న వ్యక్తి గాంధీకి సర్టిఫికెట్ ఇస్తూ వ్యాసం రాస్తే న్యూయార్క్ టైమ్స్ లాంటి పత్రిక దాన్ని ప్రచురించడమేమిటని తన అభ్యంతరం కూడా వ్యక్తం చేశాడు.

భారత్, పాకిస్తాన్ ప్రధాన మంత్రుల కార్యాచరణ, ప్రసంగాన్ని పరిగణనలోకి తీసుకుంటే యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఆ మేఘాలు పలుచనై చెల్లాచెదురైతే ఫర్వాలేదు కానీ, అవి చినుకులుగానో, వర్షంగానో రూపాంతరం చెందితే అది ప్రళయానికి

పర్యావరణ పరిరక్షణే మనుగడ

***కార్పొరేట్, బహుళజాతి సంస్థల లాభాల కోసం పర్యావరణ విధ్వంసం జరుగుతోందనీ, ప్రకృతిని, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తే అది మానవాళి ఉనికికే ప్రమాదమనీ అంటున్నారు* షేక్ కరిముల్లా**

'ప్రకృతి ఆర్థిక వ్యవస్థలో కరెన్సీగా చెలామణిలో ఉన్నది డబ్బుకాదు జీవం, జీవవైవిధ్యం. ఇది లేకుంటే మనిషి మనుగడే లేదు' – వందనశివ.

తాము చేస్తున్నదే అభివృద్ధి అంటూ విధ్వంసం సృష్టిస్తున్న అగ్ర రాజ్యాధినేతలను, పాలకులను భావితరం ప్రశ్నిస్తుంది. పర్యావరణ విధ్వంసంపై గొంతెత్తుతోంది. ప్రపంచ వ్యాప్తంగా పాలకుల నిర్లక్ష్యం పెట్టుబడిదారీ విధానాలు ద్రవ్య పెట్టుబడి మోసుకొచ్చిన అభివృద్ధి పేరుతో సృష్టిస్తున్న విధ్వంసాల్లో పర్యావరణం ప్రధానమైనది. భావితరాలకు ఈ భూమి మీద జీవించే పరిస్థితులను లేకుండా చేస్తుండడంపై ప్రపంచ వ్యాప్తంగా నవతరం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మంది చిన్నారుల జీవించే హక్కులకు తీరని విఘాతం కలుగుతోందని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి వేదికపై 16 ఏళ్ల గ్రెటాథన్ బర్గ్ 'హౌ డేర్ యు?' అంటూ ప్రపంచ దేశాధినేతలను నిలదీసి అడిగింది. ఈ చిన్నారి గత రెండేళ్లుగా కొనసాగిస్తున్న ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా 157 దేశాలకు విస్తరించింది. ఈ అమ్మాయి పోరాట పటిమ, ధైర్యం, సాహసం, తెగువ అన్ని కలిపి పర్యావరణ కార్యకర్త గ్రేటాథన్ బర్గ్. ఇంత చిన్న వయస్సులో పర్యావరణం పట్ల ఆమెకు ఉన్న స్పృహ అమోఘం, ఆదర్శం. గత సంవత్సరం ఆగస్టు 20న గ్రెటా స్కూల్ మానేసి భూతాపం తగ్గించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ స్వీడన్ పార్లమెంట్ ముందు స్వీడిష్ భాషలో రాసిన ప్లకార్డు పట్టుకొని నినదించింది. అప్పటి నుండి ఆమె పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ రోల్ మోడల్‌గా మారిపోయింది. 'స్కూల్ స్ట్రైక్ ఫర్ క్లైయిమేట్' అనే బ్యానర్‌తో ఆమె చేపట్టిన ఉద్యమం... నినాదం వందలాది భాషలలోకి అనువాదమై ప్రపంచ వ్యాప్తంగా వైరల్ అయినది. ఆనాటి నుండి పర్యావరణ రక్షణ కోసం స్కూల్ సమ్మెలు మొదలైనాయి. ప్రపంచంలో ఏదో ఒక మూల వరుసగా జరుగుతూనే ఉన్నాయి. ఇది ఇప్పుడు 'గ్లోబల్ స్ట్రైక్ ఫర్ క్లైయిమేట్'గా మారింది.

ఐక్యరాజ్య సమితి పర్యావరణ సదస్సులో మాట్లాడుతూ 'ప్రపంచ దేశాధినేతలు మాలాంటి కొత్త తరానికి ద్రోహం చేస్తున్నారు. మా కలల్ని, మా బాల్యాన్ని వట్టి మాటలతో మోసగిస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నాయి. పర్యావరణ వ్యవస్థలు ధ్వంసమవుతున్నాయి'. అంటూ కడిగి పారేసింది. 'స్కూల్లో హాయిగా చదువుకోవాల్సిన నేను మీ నిర్లక్ష్యం, అలసత్వం కారణంగానే ఇక్కడికి వచ్చాను' అని మండి పడింది. 'మనమంతా సామూహిక వినాశనం ముందు ఉన్నాం' అని హెచ్చరించింది. 'మీ ప్రయోజనాల కోసం మమ్మల్ని మోసం చేస్తారా? మీకెంత ధైర్యం' అంటూ ఆ అమ్మాయి నిలదీసి అడిగింది. ప్రపంచ నేతలకు ఒకటే సందేశమిచ్చింది. 'భూతాపం, వాతావరణ ఉష్ణోగ్రతలు ఇలాగే పెరుగుతూ పోతే సర్వనాశనం తప్పదని సైన్స్ చెబుతుంది. నా మాటో మరొకరి మాటో వినక్కరలేదు. సైన్స్ చెప్పేమాట వినండి అంది. ఇలాంటి పిల్లలే మనదేశానికి కూడా కావాలి. మనం ఇలాంటి పిల్లలను తయారు చేయాలి. ఇది ప్రధానంగా ఉపాధ్యాయుల బాధ్యత. 'కొంత మంది పిల్లలు భావి భారత నిర్మాతలు, వారు భగత్‌సింగ్‌కు వారసులు' అంటాడు శ్రీశ్రీ. ఇలాంటి పిల్లలను ఉద్దేశించే ఆయన మాట్లాడినది. 'కొంత మంది పిల్లలు పుట్టుకతో వృద్ధులు' అంటాడు. ఇవాళ ఈ వృద్ధుల శాతం ఎక్కువైనది. ముఖ్యంగా మనదేశ విద్యా వ్యవస్థ కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లినాక ఈ ప్రైవేట్ విద్యా రంగంలో మరుగుజ్జులు తయారవుతున్నారు. ఇది ఈ దేశ దౌర్భాగ్యం కాదా?

ప్రపంచంతో పాటు భారతదేశంలో కూడా పర్యావరణ విధ్వంసం జరిగిపోతూ ఉంది. వాతావరణ కాలుష్యం తీవ్రంగా పెరిగిపోతూ ఉంది. దారితీస్తుంది. అణ్వాయుధాలు కలిగిన భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధం జరగడమే సంభవిస్తే జరగబోయే నష్టం గురించి అమెరికా దేశం కొలరాడోలోని 'బేల్డ అండ్ రట్టర్స్' యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు ఒక అధ్యయనం చేసి తమ అంచనాలను పత్రికలకు విడుదల చేశారు. వారి అంచనా ప్రకారం యుద్ధం ప్రారంభమైన వారం రోజులలోపే 5 కోట్ల నుండి 12.5 కోట్ల మంది ప్రాణాలు కోల్పోతారు. ఆ యుద్ధంలో అణుధార్మిక ప్రభావానికి లోనై దీర్ఘకాల అనారోగ్యానికి గురై కొంతకాలం తర్వాత మరణించేవారి సంఖ్య అసంఖ్యాకంగా ఉంటుంది. వాతావరణం కలుషితమై, వివిధ రోగాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వాతావరణ బీభత్సం నెలకొంటుంది. దీని ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుంది. ఈ రెండు దేశాలలో 150 అణువార్ హెడ్డులు ఉన్నాయని, ఓ ఐదేళ్లలో వాటి సంఖ్య రెట్టింపవుతుందని వారు పేర్కొన్నారు. అణుబాంబు పేలడం వలన దాని నుండి వెలువడే 16 నుండి 36 మిలియన్ టన్నుల నల్లటి సూక్ష్మమైన కార్బన్ అణువులు వాతావరణం పైభాగానికి చేరి వారం రోజుల్లో విశ్వమంతా వ్యాపిస్తాయట. ఆ అణువులు సీర ధార్మికతను పీల్చుకోవడం వల్ల గాలి భరించలేనంతగా వేడెక్కుతుంది. ఈ ప్రభావం తగ్గడానికి కనీసం పదేళ్లయినా పడుతుందని ఆ అధ్యయన బృందం నాయకుడు ప్రొఫెసర్ బ్రూన్‌టూన్ చెప్పాడు.

భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధమే వస్తే, ఆ యుద్ధం అణు యుద్ధంగా మారితే, అది నేతల పైశాచిక ఆనందాల కోసం మనమందరమో, మనలో కొంతమందిమో అర్ధాంతరంగా చావాలా? లేక అంగవైకల్యంతో, అనారోగ్యంతో కునారిల్లుతూ ఈసురోమని బతుకు గడపాలా? ఇవన్నీ జరగకూడదంటే యుద్ధానికి వ్యతిరేకంగా మనమంతా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టాలి. ఎంతటి నియంత అయినా ప్రజాభిప్రాయానికి తలవంచక తప్పదు.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

వాయునదీ జలాలు కాలుష్యం, వన్య ప్రాణులు, అడవులు, గిరిజనులు వారి హక్కులకు ప్రమాదం పొంచి ఉంది. దేశంలో కోట్లాది మంది ప్రజలు స్వచ్ఛమైన గాలి, నీరు, వాతావరణం దొరక్క ప్రత్యక్ష్యంగా ప్రభావితం అవుతూ రోగాల పాలై చనిపోతున్నారు. జీవ వైవిధ్యం నశించి జీవ, వృక్ష జాతులు కనుమరుగైపోతున్నాయి.

చెన్నైలో తాగునీరు సమస్య తారాస్థాయికి చేరుకొంది. భారీవర్షాలకు ముంబై నీట మునిగింది. 2006లో సూరత్ నగరం వరద ముంపుకు గురైంది. 2014లో శ్రీనగర్ వరదల పాలైంది. ఉత్తరాఖండ్‌లో బురద వరదై వందల మందిని బలిగొంది. వీటికి కారణం ఎవరు?

కోటి 40 లక్షల జనాభా కలిగిన హైదరాబాద్ నగరానికి ఇదే అనుభవం ఆకాశాన్నంటే భవంతులతో, మిరుమిట్లు గొలిపే కాంతులతో, పెను వేగంతో దూసుకెళ్లే వాహనాలతో, అరచేతిలో ఇమిడే ఫోన్ల ద్వారా దేన్నయినా క్షణాల్లో సమకూర్చుకునే సదుపాయాలతో వెలిగిపోయే నగరాల అసలు రంగు కుంభవృష్టి వేళ బయటపడుతుంది.

పర్యావరణ విధ్వంసం అంతిమంగా మానవుని ఉనికికి ఎంత ప్రమాదమో ఇవి ఉదాహరణలు. ప్రకృతిలో మనిషి తానొక్కడినే ప్రాణిని అనుకుంటే మిగలడు. కనుమరుగై పోతాడు. మనిషి కూడా జీవరాశిలో భాగమే. ఎక్కువ కాదు తక్కువ కాదు అనే ఈ వాస్తవాన్ని గుర్తించకపోవడం వలన సంభవిస్తున్న అనర్థాలకు ప్రపంచ వ్యాప్తంగా మానవాళి అనుభవిస్తోంది.

ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి పర్యావరణ సమావేశాలు కెన్యా దేశంలోని నైరోబీలో 2019 మార్చ్‌లో జరిగాయి. ఇక్కడ విడుదల చేసిన నివేదిక పర్యావరణాన్ని రక్షించుకోకపోతే మానవాళికి రాబోయే ముప్పు గురించి తీవ్రంగా హెచ్చరించింది. 'ఆరోగ్యకరమైన భూమి – ఆరోగ్యవంతమైన ప్రజలు' అన్న నినాదంతో సమితి నివేదికను విడుదల చేసింది. ప్రకృతి వనరులను పెద్ద ఎత్తున కొల్లగొడుతున్నారని, అలాగే అభివృద్ధి పేరుతో వ్యర్థాలను హెచ్చు స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారని, దీనివలన గాలి, నీరు కలుషితమై రోగాలు పెచ్చరిల్లి, జీవన, ఆయు ప్రమాణాలు తగ్గిపోతున్నాయని తెలిపింది. 2017లో భారతదేశంలో కోటి 24 లక్షల మంది వాయు కాలుష్యం వలన ప్రాణాలు కోల్పోయారని నివేదిక తెలియజేసింది. రవాణ, పరిశ్రమలు, వ్యర్థాలు ఇవన్నీ గాలి నాణ్యతను దెబ్బతీస్తాయి, పర్యావరణ హననానికి కారణమవుతాయి. వాయు కాలుష్యం దేశంలో ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నది. ప్రపంచంలోని 50 అతి కాలుష్య నగరాలలో 25 మనదేశంలోనే ఉన్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పర్యావరణ తీరు సూచికలు 180 దేశాలలో భారతదేశం 177వ స్థానంలో ఉంది. గాలి న్యాణ్యతలో 178వ స్థానంలో, ప్రజారోగ్యంలో 180వ స్థానంలో ఉంది. మన దేశంలో సుమారు 60 కోట్ల మంది నీటి కోసం సజీవంగా పారే నదులపై ఆధారపడి ఉన్నారు. కాలుష్యం, పర్యావరణం దెబ్బతినడం కారణంగా నదులు వట్టిపోవడమో, నీరు ఉన్నా వినియోగానికి పనికి రాకుండా పోతున్నాయి. దీని కారణంగా ప్రజలు ఇంతవరకు గ్రామాల నుంచి పట్టణాలకు, నగరాలకు వలసపోవడం మనకు తెలుసు. కాని రాబోయే రోజుల్లో నీటికోసం ఇతర దేశాలకు వలస వెళ్లడాన్ని కూడా మనం చూడబోతున్నాం. నీటి కోసం యుద్ధాలు కూడా జరిగే అవకాశం ఉంది. మనదేశం ఎదుర్కొంటున్న వాతావరణ పరిస్థితులే దీనికి కారణం.

ఈ ఏడాది మనదేశంలోని 17 రాష్ట్రాలలోని 365 జిల్లాలు కరువుతో బాధపడితే, 190కి పైగా జిల్లాలు వరదలతో మునిగిపోయాయి. పర్యావరణం దెబ్బతినడం వలన కలిగే వాతావరణ మార్పులే దీనికి కారణం. ఇలాంటి పరిస్థితుల్లో మంచినీటి నిర్వహణ పద్ధతులు అనుసరించాల్సిన అవసరం ఉంది.

పై పరిణామాలు గమనిస్తే ఇప్పటికే పరిస్థితి చేయి దాటిపోయింది. అయినా పాలక పార్టీలు మేం ప్రజలకు మేలు చేయడానికి కాదు ఉంది, కార్పొరేట్లకు ఊడిగం చేయడానికి అంటున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ – 4బి (ఎ) ప్రకారం అడవులను, వన్యప్రాణులను పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. కాని ప్రభుత్వాలు దేశ, విదేశీ బహుళజాతి కంపెనీలకు లాభాలు చేకూర్చే పనిలో ప్రజలకు దక్కాల్సిన ప్రకృతి వనరులను వారికి దోచిపెడుతున్నాయి. అభివృద్ధి పేరుతో అడవులను, పర్యావరణ విధ్వంసానికి పూనుకుంటున్నాయి. ఇక వన్యప్రాణుల, అడవుల, పర్యావరణ సంరక్షణ ఏ విధంగా సాధ్యపడుతుంది? ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా? ఈ విధ్వంసానికి అంతం లేదా?

జాతీయ అటవీ విధాన తీర్మానం 1952 ప్రకారం దేశ భౌగోళిక విస్తీర్ణంలో అటవీ విస్తీర్ణం 33 శాతం ఉండాలి. కానీ అటవీ నివేదిక 2013 ప్రకారం దేశంలో మొత్తం అటవీ విస్తీర్ణం 6,97,898 చదరపు కిలోమీటర్లు. ఇది మొత్తం విస్తీర్ణంలో 21.23 శాతం ఉంది. దీని కారణంగా దేశంలో భూమి – చెట్లు – మానవ నిష్పత్తి చూస్తే అనుకూలంగా లేదు. సరైన చెట్లు, దట్టమైన అడవులు లేని కారణంగా సకాలంలో సరైన వర్షాలు పడక నదులు వట్టిపోతున్నాయి. పంటలు పండడం లేదు. వ్యవసాయం కుంటుపడి మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటూ ఉంది. ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల ఊపిరితిత్తులైన నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు అనుమతులిచ్చింది. నల్లమలలో తవ్వకాలు జరిగితే పూర్తిగా పర్యావరణం దెబ్బతింటుంది. తెలుగు రాష్ట్రాలు వల్లకాడులుగా మారిపోతాయి. ఈ అడవులు తమ సహజత్వాన్ని కోల్పోయి నిర్జీవమైపోతాయి. ఈ చర్య రానున్న రోజులలో తెలుగు రాష్ట్రాల ప్రజలకు పెను ప్రమాదం కాగలదు. ఈ విధ్వంసం అంతా 'డిబీర్స్' అనే బహుళజాతి కంపెనీ కోసం. ఈ కంపెనీ లాభాల కోసం ఇందుకు ప్రభుత్వాలు చేసిన 1/70 ఫారెస్ట్ చట్టం, 1980 అటవీ సంరక్షణ చట్టం, 1966 పర్యావరణ చట్టం, 1996 పెసా చట్టం, 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం మొదలగు చట్టాలను తుంగలో తొక్కిమరీ నల్లమలను నాశనం చేయ పూనుకున్నారు. ప్రజలు ఈ దారుణాన్ని అడ్డుకోవాలి. నల్లమల అడవులను కాపాడుకోవాలి. 'సేవ్ నల్లమల' ఉద్యమంలో భాగస్వాములు కావాలి.

ద్రవ్య పెట్టుబడి బహుళజాతి కంపెనీల ప్రతినిధులైన పాలకులు అంతర్జాతీయ వేదికలపై పర్యావరణం కాపాడతామని వట్టి మోసపు మాటలు చెబుతారే కానీ, ఆచరణలో ఏమి చేయరు. ఈ కార్పొరేట్లు అత్యధిక లాభాల కోసం ఎంతకైనా తెగిస్తాయి. ప్రకృతి పర్యావరణాన్ని ధ్వంసం చేస్తారని మార్క్స్ తన రచనలలో విశ్లేషించారు. ఇదినేడు జరుగుతూ ఉంది. పర్యావరణం దెబ్బతినడం వలన దాని ప్రభావం భూమి, సముద్రాలు, వాతావరణం, జీవ వైవిధ్యంపై పడి మనిషి మిగలడు. ఏదో ఒక రోజు ఉనికిలో లేకుండా పోతాడని సైన్స్ చెబుతుంది. కాబట్టి రానున్న ఈ ప్రమాదాన్ని నిలువరించాలి. అందమైన సుందరమైన ఈ ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షించాలి. ముందు తరాలకు అందించాలి. ఇది జరగాలంటే సమస్త మానవాళి బాధలకు మూలమైన వ్యక్తిగత ఆస్తి పునాది గల సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ వ్యవస్థలను సమాధి చేసి సమసమాజాన్ని నిర్మించుకోవాలి.

(రచయిత సామాజిక విశ్లేషకులు) వీ

ఇజ్రాయిల్ భవిష్యత్తు ఏమిటి?

ఇజ్రాయిల్‌లోని రాజకీయ పార్టీలు ఏవీ కూడ ఎన్నికల్లో ప్రజల మద్దతును పొందలేకపోయాయనీ, ప్రజలు ఏ పార్టీకి పూర్తి మెజారిటీని ఇవ్వకుండా సంకట స్థితిలోకి నెట్టారనీ అంటున్నారు సంతోష్

2009 నుంచి ఇజ్రాయిల్ ప్రధానిగా ఉన్న బెంజిమన్ నెతన్యాహూ నేతృత్వంలోని లికుడ్ పార్టీ సెప్టెంబర్ 17న జరిగిన పార్లమెంట్ (నెస్సెట్) ఎన్నికల్లో మెజారిటీని కోల్పోవడం యూదుల ప్రాబల్యం ఉన్న దేశంలో ముఖ్యమైన పరిణామం. ఇజ్రాయిల్ పుట్టుకే వివాదాస్పదం. అమెరికా పెంచి పోషించిన ఉగ్ర దేశంగా ఇజ్రాయిల్‌ను వామపక్షాలు తరచూ అభివర్ణిస్తుంటాయి. ప్రపంచంలో ఉగ్రవాదం అనేది ఇజ్రాయిల్ నుంచే ప్రారంభమైందన్న ఆరోపణలు పూర్తిగా అసత్యం కాదు. పశ్చిమాసియాలో అమెరికా చేస్తున్న యుద్ధాలన్నిటికీ ఇజ్రాయిల్ సహకరించింది. పాలస్తీనా ప్రజలను అణచివేయడానికి ఇజ్రాయిల్ ఎన్నో దాడులు చేసింది. ఇప్పటికీ చేస్తోంది. పాలస్తీనాతో ఇజ్రాయిల్ అనుసరించే విధానం ప్రభావం కూడా ఇజ్రాయిల్ ఎన్నికలపై పడింది. నెతన్యాహూ అమెరికా గీసిన గీత దాటకుండా పాలన సాగిస్తున్న కారణంగా అమెరికాపై పెరిగే వ్యతిరేకత ఇజ్రాయిల్‌పై కూడా పడింది.

ఇజ్రాయిల్‌కు సుదీర్ఘకాలం ప్రధానిగా పనిచేసిన యూదు దురహంకార నేత నెతన్యాహుకు పార్లమెంట్ (నెస్సెట్) ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయిల్ రాజకీయాల్లో మళ్లీ అనిశ్చిత పరిస్థితే తలెత్తింది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ దక్కలేదు. ఈ ఏడాది అక్కడ ఎన్నికలు జరగడం ఇది రెండోసారి. గత ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లోనూ స్పష్టమైన మెజారిటీ రానందున నెతన్యాహూ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఈ కూటమి నుంచి లిబర్మన్ నాయకత్వంలోని బిటెన్యూ పార్టీ వైదొలగడంతో ఐదునెలల వ్యవధిలోనే మళ్లీ ఎన్నికలు జరిగాయి. తుది ఫలితాల ప్రకారం నెతన్యాహు నేతృత్వంలోని మితవాద కూటమి మెజారిటీకి 6 స్థానాలు తక్కువగా అంటే 55 స్థానాల వద్ద చతికిల పడింది. లికుడ్ పార్టీ గత ఏప్రిల్ ఎన్నికల్లో 35 స్థానాలు సాధించగా, ఈసారి ఎన్నికల్లో కేవలం 31 స్థానాలు మాత్రమే లభించాయి. లికుడ్ పార్టీ ప్రధాన ప్రత్యర్థి, మాజీ సైనికాధికారి బెన్నీ గాంట్జ్ నేతృత్వంలోని బ్లూ అండ్ వైట్ పార్టీ ఏకైక అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఈ పార్టీకి 33 స్థానాలు లభించగా దీని నేతృత్వంలోని కూటమికి 57 స్థానాలు దక్కాయి. అరబ్ పార్టీల కూటమి 13 స్థానాలు సాధించింది. లిబర్మన్ నాయకత్వంలోని (మితవాద లౌకిక) బిటెన్యూ పార్టీ 8 స్థానాలు సాధించింది. నెతన్యాహు కూటమిలోని మత ఛాందసవాద పార్టీలైన యునైటెడ్ తోరా జుడాయిజం (యుటిజె) 8 స్థానాలు, షాస్ 9 స్థానాలు, యామీనా 7 స్థానాలు పొందాయి. గాంట్జ్ కూటమిలోని లేబర్ పార్టీ 6 స్థానాలు, డెమోక్రటిక్ యూనియన్ 5 స్థానాలు సాధించింది.

ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత నెతన్యాహూకు ఎంతో అండగా నిలిచారు. దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న విధానాలను వెనక్కునెట్టి నెతన్యాహూ కోసం ఆయన జెరూసలేమ్‌ను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తున్నట్లు వెల్లడించారు. ఇజ్రాయిల్ భద్రంగా ఉండాలంటే ట్రంప్‌తో అత్యంత సాన్నిహిత్యం ఉన్న తాను ప్రధానిగా కొనసాగాలని నెతన్యాహూ ఎన్నికల్లో ప్రచారం చేసుకున్నారు. ట్రంప్‌తో కలిసి ఉన్న తన ఫోటోగల పోస్టర్లను వాడుకున్నారు. ఈ మారు ప్రధాని అయితే జోర్డన్ వ్యాలీని స్వాధీనం చేసుకుంటాననీ, వెస్ట్‌బ్యాంక్‌లో మరిన్ని యూదు నివాసాలు ఏర్పాటు చేస్తానని నెతన్యాహూ హామీలు గుప్పించారు. సెప్టెంబర్ ఎన్నికల్లో నెతన్యాహూ మితవాద శక్తులను ఒక్కటి చేయడంలో విఫలం కావడం, తన కూటమిని నిలబెట్టుకోలేకపోవడం ఆయనకు ప్రతికూలంగా మారాయి. బిటెన్యూ పార్టీ.. కూటమి నుంచి బయటకు పోవడం, పార్లమెంటు రద్దుకు అనుకూలంగా ఎక్కువ ఓట్లు పడడంతోనే ఆయన బలహీనత వెల్లడైంది.

మరోవైపు నెతన్యాహూపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. జర్మనీతో చేసుకున్న రక్షణ ఒప్పందాల్లో ఆయన కుటుంబ సభ్యులు లబ్ధిపొందారనే ఆరోపణలు వచ్చాయి. ఆయన భార్య సారా మీదా ఉన్న అవినీతి ఆరోపణల కేసులను కొట్టివేయడానికి అటార్నీ జనరల్‌కు లంచం ఆశచూపడం తదితర ఆరోపణలు నెతన్యాహూ మీద వచ్చాయి. మరోవైపు తనకు అనుకూలంగా మీడియాలో ప్రచారానికి లంచాలివ్వడం సంచలనం కలిగించింది. ఈ ఆరోపణల కేసులు కొన్ని న్యాయస్థానాల్లో విచారణ దశలో ఉండగా, మరికొన్నింటిలో దర్యాప్తు కొనసాగుతున్నది. వివిధ కేసుల్లో ఇరుక్కున్న నెతన్యాహూ ఈ ఎన్నికల్లో విజయం సాధించి ప్రధాని పదవి చేపట్టాలని ఎంతగానో ఆశించాడు. తద్వారా ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ పొందాలని ఆయన ఆలోచన. ఫలితాలు ప్రతికూలంగా ఉండడంతో ఏదో విధంగా ప్రధాని అయ్యేందుకు ఆయన విశ్వప్రయత్నాలు చేశారు.

మెజారిటీ సాధనలో రెండు కూటముల వైఫల్యం నేపథ్యంలో మాజీ రక్షణ మంత్రి అవిగ్డర్ లిబర్మన్ నేతృత్వంలోని మితవాద లౌకిక పార్టీ ఇజ్రాయిల్ బిటెన్యూ కింగ్ మేకర్‌గా అవతరించింది. ప్రధాని నెతన్యాహుకు ఆయన గతంలో అత్యంత సన్నిహితుడు. ఆయన ఇపుడు ఏ కూటమిలోనూ సభ్యుడు కాదు. లిబర్మన్ లికుడ్ పార్టీకి మద్దతునిస్తే నెతన్యాహు మరోసారి గద్దెనెక్కేవాడు. మతపరమైన పార్టీలకు తెరదించి లౌకిక వాద రాజ్యాన్ని ప్రోత్సహించాలన్న ఆలోచనలో లిబర్మన్ ఉన్నారు. తన కూటమి భాగస్వాములతో భేటీ అయిన నెతన్యాహు కొత్త కూటమికోసం వారిని వదులుకోబోనంటూ భరోసా ఇచ్చారు. సెంటరిస్ట్ గాంట్జ్ నేతృత్వంలో బ్లూ అండ్ వైట్, లీకుడ్ పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకావాలని, నెతన్యాహూ కూటమిలో ఉన్న మతవాద పార్టీలను పక్కన పెట్టాలని లిబర్మన్ కోరుకుంటున్నారు. గత డిసెంబర్ నుండి అవినీతి ఆరోపణలపై విచారణను ఎదుర్కొంటున్న నెతన్యాహు జైలు ఊచలు లెక్కబెట్టాల్సి రావచ్చు.

ఎన్నికల ముందు ఇజ్రాయిల్‌తో రక్షణ ఒప్పందాన్ని చేసుకోనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. మారిన పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయిల్

ఎటువంటి వైఖరి తీసుకుంటుందోనని అమెరికా విదేశాంగ విశ్లేషకులు ఎదురు చూస్తున్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా రక్షణ రంగంలోనే కాకుండా, సాంకేతిక రంగంలో సహకారం అవసరం. అయితే, ఇజ్రాయిల్ అమెరికాతో అతి సన్నిహితంగా ఉండడాన్ని స్వదేశంలో పలువురు వ్యతిరేకిస్తున్నారు. ఇజ్రాయిల్ అమెరికా అనుంగు దేశంగా ముద్ర పడినప్పటికీ ట్రంప్ అనుసరిస్తున్న విధానాల వల్ల అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలనే తామూ ఎదుర్కోవల్సి వస్తోందని ప్రజలు భావిస్తున్నారు. పాలస్తీనీయులపై దాడుల విషయంలో ఇజ్రాయిల్ నాయకులందరిదీ ఒకే పంథా... అందుకే, పాలస్తీనా బూచి చూపి అందరినీ తనవైపు తిప్పుకునేందుకు రాజకీయ దురంధరుడైన నెతన్యాహూ ప్రయత్నిస్తున్నారు. పాలస్తీనా అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్ నెతన్యాహూ మళ్లీ ప్రధాని కాకూడదని కోరుకుంటున్నారు.

ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కనీసం 61 సీట్లు అవసరం. ఎన్నికల ప్రచారంలో తాము ఒంటిచేత్తో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బీరాలు పలికిన నెతన్యాహూ... ఫలితాల అనంతరం ప్రత్యర్థిని (బెన్నీ గాంట్జ్) తనతో కలిసి రావాలని ఆహ్వానించినా ఫలితం లేకపోయింది. బ్లూ అండ్ వైట్ పార్టీ అధినేత బెన్నీ గాంట్జ్ తాను ప్రధాని బరిలో ఉన్నట్టు, కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఏ కూటమికీ మెజారిటీ లభించని పరిస్థితుల్లో అధ్యక్షుడు రూవెన్ రివ్లిన్ సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు చేయాలని అన్ని పార్టీలను సెప్టెంబర్ 22న కోరాడు. రెండు ప్రధాన పార్టీలను తమ విభేదాలను పక్కనపెట్టి ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని అధ్యక్షుడు రివ్లిన్ ఒత్తిడి చేస్తున్నారు. తమ కూటమితో చేతులు కలపాలంటూ బ్లూ అండ్ వైట్ పార్టీని నెతన్యాహూ పదేపదే ఆహ్వానిస్తున్నారు. కానీ ఏకైక అతిపెద్ద పార్టీగా ఉన్న బ్లూ అండ్ వైట్- ఇజ్రాయిల్ బిటెన్యూ పార్టీలు నెతన్యాహూ కూటమిలో చేరేందుకు ఇష్టపడడం లేదు. నెతన్యాహును ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదిస్తూ లికుడ్ పార్టీ నేతృత్వంలోని మతవాద పార్టీల కూటమి నేతలు సెప్టెంబర్ 19న ఒక ప్రకటన చేశారు.

నెతన్యాహూకు గతం కన్నా ఓట్లు, సీట్లు తగ్గడం ఆయన పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పుగా మిగిలిన పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. ఈ ఫలితాలు నెతన్యాహూను మరింత అప్రదిష్ట పాల్జేశాయి. ఇజ్రాయిల్ రాజకీయాల్లో నెతన్యాహూ శకం ముగిసినట్టేనని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ రక్షకుడిగా, యుద్ధోన్మాదిగా పేరొందిన ఆయనకు ఓటర్లు గట్టి దెబ్బకొట్టారు. ఎక్కువ స్థానాలు పొందిన బ్లూ అండ్ వైట్ పార్టీ అధినేత బెన్నీ గాంట్జ్‌కు లిబర్మన్ ఆధ్వర్యంలోని బిటెన్యూ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దీనికి ఎనిమిది స్థానాలున్నాయి. ఇజ్రాయిలీ అరబ్ పార్టీలు నాలుగింటితో కూడిన 'జాయింట్ లిస్ట్' కూటమి 13 స్థానాలతో మూడోస్థానం పొందడం విశేషం. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే స్థితిలో ఇరు పక్షాలూ లేనప్పటికీ, సర్వసాధారణంగా ప్రధాన పక్షాలు అరబ్ పార్టీలతో జతకట్టడానికి సాహసించవు.

బ్లూ అండ్ వైట్ పార్టీ నాయకుడు గాంట్జ్ తనకు అవకాశం ఇవ్వాలని కోరుతుండగా, సుదీర్ఘ పాలనానుభవం గల తాను ప్రధాని పదవిలో ఉంటేనే ఇజ్రాయిల్ ప్రయోజనాలు పరిరక్షించబడతాయని నెతన్యాహూ వాదిస్తున్నాడు. మాజీ రక్షణ మంత్రి లిబర్మన్ నేతృత్వంలోని బిటెన్యూ మద్దతును కూడగట్టేందుకు నెతన్యాహూ ప్రయత్నిస్తున్నారు. అయితే, ఆయనకు కూడా ప్రధానమంత్రి పదవిపై ఆశ ఉంది. తనకు నెతన్యాహూ, గాంట్జ్‌లు మద్దతు ఇస్తారని ఆశిస్తున్నారు. ఈ సారి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయిల్ ప్రధాని కావడానికి ఏ ఒక్కరికీ మద్దతు ఇచ్చేందుకు సుముఖంగా లేడు. ఇజ్రాయిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదన్నది అమెరికా నిర్ణయంగా కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. ఇజ్రాయిల్ ఎన్నికల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు నెతన్యాహూను నిరాశ పరిచేవిగా ఉన్నాయి. అమెరికా సంబంధాలు ఇజ్రాయిల్ తోనేననీ, వ్యక్తులతో కాదని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

ఏ పక్షానికైనా ఇప్పుడు బిటెన్యూ పార్టీ దిక్కయింది. గాంట్జ్ ఇతర పార్టీలతో కలిసి ఐక్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంటే, ఇజ్రాయిల్ అధ్యక్షుడు రెవిన్ రివ్లిన్ సమైఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 28 రోజుల గడువు ఇస్తూ సెప్టెంబర్ 25న నెతన్యాహూను సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి బాధ్యత అప్పగించారు. అయితే గడువు ముగిసేలోగా ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత మెజారిటీ సాధించలేకపోతున్నానని అధ్యక్షుడు రివ్లిన్‌కు అక్టోబర్ 23 తెలిపాడు. వెంటనే రివ్లిన్ ప్రభుత్వం ఏర్పాటుచేసే బాధ్యతను బ్లూ అండ్ వైట్ పార్టీ నేత బెన్నీ గాంట్జ్‌కు అప్పగించారు. ఇజ్రాయిల్‌లో అరబ్‌లకు, పాలస్తీనాకు ఎవరూ ఎక్కువ వ్యతిరేకంగా ఉంటే వారితో పొత్తుకు చిన్న పార్టీలు కలసే అవకాశం ఉంది. బెన్నీ గాంట్జ్‌కు కూడా 28 రోజుల గడువు అధ్యక్షుడు ఇచ్చాడు. ఒక వేల బెన్నీగాంట్జ్ మెజారిటీ పొందడంలో వైఫల్యం చెందితే మూడవసారి ఎన్నికలకు వెళ్లక తప్పదు. గాంట్జ్ మూడవసారీ ఎన్నికలు రాకూడదని ఆశిస్తున్నాడు. బిటెన్యూ నేత లిబర్మన్ ఉదారవాద కూటమి ఏర్పాటు కావాలంటున్నాడు.

నెతన్యాహుకు మతవాద పార్టీల దోస్తీ ఇప్పుడు ప్రధాని గద్దెనెక్కేందుకు అడ్డంకిగా మారింది. లిబర్మన్ నేతృత్వంలోని డిటెన్యూ, అరబ్ పార్టీల కూటమి ఈ ఎన్నికల్లో తమ బలాన్ని పెంచుకుంటాయని ఆశించినప్పటికీ అందుకు తగ్గ ఫలితాలు లభించలేదు. నెతన్యాహు ప్రతిపాదిస్తున్న ఇజ్రాయిల్ విస్తరణ వాదాన్ని గాంట్జ్ కూడా అనుసరించే అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ, ఇజ్రాయిల్‌లో చీలికలు పేలికలయిన రాజకీయ వాతావరణంలో ప్రభుత్వ ఏర్పాటులో అనివార్యతలపై రాజీ పడేందుకు పార్టీలు ఇష్టపడడం లేదు. నెతన్యాహూ, గాంట్జ్ లిరువురు పాలస్తీనా వ్యతిరేకులే. ఎవరు ప్రధాని అయినప్పటికీ పాలస్తీనా ప్రజల ఆత్మగౌరవాన్ని సార్వభౌమత్వాన్ని గుర్తించాల్సిన బాధ్యత ఏ ప్రభుత్వానికైనా తప్పనిసరి. ఇందుకు ముందుగా ఇజ్రాయిల్‌లో ప్రభుత్వ ఏర్పాటు అవసరం. పదవి నుండి తప్పుకోవడం ద్వారా నెతన్యాహు ఇందుకు అవకాశం కల్పించాలి. అది రాజనీతిజ్ఞత అనిపించుకుంటుంది.

అయితే గాంట్జ్ మాత్రం మతవాద పార్టీలతో పొత్తును వ్యతిరేకిస్తున్నారు. నెతన్యాహు కూటమిలోని మత ఛాందసవాద పార్టీ యుటిజె, షాస్, జాతీయవాద యామినా పార్టీల నేతలలో కనీసం ఇద్దరు తమ వైఖరిని మార్చుకుంటే గాంట్జ్ ప్రభుత్వ ఏర్పాటు సాధ్యమవుతుంది. లేకుంటే ప్రతిష్ఠంభన కొనసాగుతూనే ఉంటుంది. ఇజ్రాయిల్ బిటెన్యూ పార్టీ, అరబ్ పార్టీల కూటమి మద్దతుతో గాంట్జ్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశాలున్నాయి. కానీ అరబ్ పార్టీలతో జత కట్టేందుకు లిబర్మన్ సిద్ధంగా లేరు. బ్లూ అండ్ వైట్-లేబర్-ఇజ్రాయిల్ బిటెన్యూ పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసి బయటి నుండి మద్దతునిచ్చే అవకాశాన్ని అరబ్ పార్టీల కూటమి కొట్టిపారేయకపోవటం గమనార్హం. మితవాదులు సనాతన వాదులతో కూడిన నెతన్యాహూ కూటమితో మతం సహా పలు కీలకాంశాలలో విభేదించి బయటికి పోయిన లిబర్మన్ ఎవరితో చేతులు కలుపుతారో వేచి చూడాలి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

డేవిడ్ హార్వే: పెట్టుబడి - 7 ప్రధాన వైరుధ్యాలు

***పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు* రమేష్ పట్నాయక్**

(...గత సంచిక తరువాయి భాగం)

డేవిడ్ హార్వే పారిశ్రామిక పెట్టుబడిపై వ్యాపార వర్గం ఏవిధంగా ఆధిపత్యం చేస్తున్నది ఇక్కడ వివరించాడు. పెట్టుబడిదారులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి వివిధ మార్గాలు అనుసరిస్తారు. కార్లు, మోటారు సైకిళ్ళు వంటి కంపెనీలు తమతమ షోరూం లను నిర్వహించుకునే పద్ధతి ఉంది. కాస్మెటిక్ సంస్థలు తమ ఉత్పత్తులను సాధారణంగా వ్యాపారుల ద్వారానే అమ్ముకుంటారు. బట్టల పరిశ్రమల వారు కూడా ఒకవైపు స్వంత షోరూంల ద్వారా మరొక మల్టీబ్రాండు క్లాత్ షోరూంల ద్వారా సరుకులు అమ్ముకుంటారు. ఇలా వివిధ పారిశ్రామిక సరుకులు వివిధ రూపాలలో మార్కెట్ చేయబడుతున్నాయి. సంక్షిప్తంగా చెప్పుకుంటే ఫ్యాక్టరీ షోరూంలు. మల్టీ బ్రాండు – సింగిల్ కమోడిటీ (అన్ని కంపెనీల మందులు గాని, అన్ని కంపెనీల బట్టలు గాని, అన్ని కంపెనీల బ్రీవరీస్‌గాని, అన్ని కంపెనీల సిమెంటుగాని అమ్మే దుఖాణాలు) వంటివాటిద్వారా సరుకులు అమ్ముడుపోతూ ఉంటాయి. ప్రధానంగా ఒక యజమానికి ఒకే దుకాణం ఉండవచ్చు లేదా కొన్ని సందర్భాలలో గొలుసు కట్ట దుకాణాలుండవచ్చు. ఈ అన్ని సందర్భాలలో పెట్టుబడిదారుడు తనకు వచ్చిన లాభంలో కొంతభాగం వ్యాపారికి రిబేటుగా ఇస్తాడు. పెట్టుబడిదారుడు దీనిని తన సరుకులను త్వరితగతిని అమ్ముకోవడానికి మార్గంగా చూస్తాడు. నిజమే, ఇందులో ఏదో ఒక నెట్‌వర్క్ లేకుండా పెట్టుబడిదారుడు తన సరుకును అమ్ముకోలేడు. అయితే ఇప్పుడు పరిస్థితి తల్లకిందులైంది. వాల్‌మార్ట్ వంటి బహుళ కంపెనీల, బహుళ సరుకుల ప్రపంచవ్యాప్త గొలుసుకట్టు వ్యాపార సంస్థలు వచ్చాయి. వీటి వలన మిగిలిన అన్ని వ్యాపార సంస్థలు మూతపడుతున్నాయి. ఈ సంస్థలు టోకు, చిల్లర వ్యాపారాన్నంతా హస్తగతం చేసుకుంటున్నాయి. పాత వ్యాపార సంస్థలు మోనోపలి సంస్థలు కానందున అవి పరిశ్రమ యాజమాన్యాలతో చేసే వ్యవహారంలో కింది చేయిగా ఉండేవి. అయితే, ఇప్పుడు రంగంలోకి వచ్చిన వాల్‌మార్ట్, అమెజాన్ వంటివి పెద్ద వ్యాపార సంస్థలు. ఇవి ప్రపంచ స్థాయి కార్పొరేటు సంస్థలు. పారిశ్రామిక ఉత్పత్తులుచేసే అనేక కార్పొరేటు సంస్థల కంటే ఈ సంస్థలు నియంత్రిస్తున్న పెట్టుబడి పెద్దది. ఫలితంగా ఈ వ్యాపార కార్పొరేట్లు సరుకుల ఉత్పత్తిచేసే పారిశ్రామిక కార్పొరేట్లపై అనేక సందర్భాలలో పైచేయి కలిగి ఉంటాయి. ఈ సంస్థలు చాలా ఎక్కువ రిబేటును డిమాండు చేస్తాయి. గత్యంతరం లేని పరిస్థితులలో పారిశ్రామిక కార్పొరేట్లు వీటికి ఎక్కువ రిబేటు ఇస్తున్నారు. వారు సంపాదించిన లాభాలలో అధికాధిక వాటా వారు తమ సరుకులు అమ్మిపెట్టే వ్యాపార సంస్థలకు ఇవ్వవలసి వస్తున్నది. ఈ విధంగా పారిశ్రామిక పెట్టుబడి తన సరుకులు అమ్మకం కొరకు ప్రోత్సహించిన వ్యాపార వ్యవస్థ మోనోపలిగా పరిణామం చెంది ఇప్పుడు దానినే కబళిస్తున్నది. దీనిని తప్పించుకుందామని, దీనికి ప్రత్యామ్నాయంగా ఇంకా అమ్ముడుకాని సరుకుల స్టాక్‌పై క్రెడిట్ తీసుకుందామని బ్యాంకుల, ఫైనాన్సియర్ల వద్దకు వెళితే వారు కూడా పరిశ్రమల యజమానులను పీల్చిపిప్పిచేస్తున్నారు అంటాడు డేవిడ్ హార్వే. డేవిడ్ హార్వే, 'పెట్టుబడి ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రవహించడానికి ఏర్పాటు చేసుకున్న సామాజిక వ్యూహాలకు రెండు పార్శ్వాలుంటాయి. అవి మొదటిగా పెట్టుబడి ప్రవాహానికి సహకరిస్తాయి. అయితే, అదే సందర్భంలో అవి వాల్‌మార్ట్ వంటి వ్యాపార, గోల్డ్‌మన్ సాచ్ వంటి ఫైనాన్స్ సంస్థలను సృష్టిస్తాయి. ఇటు క్యాపిటల్ మార్కెట్ (పెట్టుబడిదారులకు రుణాలిచ్చే బ్యాంకింగ్ వ్యవస్థ), అటు కమోడిటీ మార్కెట్ (వారి సరుకులు అమ్మే వ్యవస్థ) –ఈ రెండు వ్యవస్థలు పారిశ్రామిక వ్యవస్థకు సేవచేయడానికి బదులు వాటి స్వంత ప్రయోజనాలను చూసుకుంటాయి' అంటాడు. పెట్టుబడి ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రవహించడానికి చేసుకున్న ఏర్పాట్లు పెట్టుబడి పెరుగుదలకు మూలమైన ఉత్పత్తి రంగానికే అడ్డంగా నిలబడుతున్నాయి అంటే పెట్టుబడి సాఫీగా ప్రయాణించడం అన్నదే అసాధ్యమైన విషయం అని చెప్పడం డేవిడ్ హార్వే ఉద్దేశం.

పెట్టుబడి సర్క్యులేషన్‌లో చలనశీలతకు, జడత్వానికి మధ్య ఉన్న వైరుధ్యం మరొక ప్రధానమైన సమస్య అంటాం. డేవిడ్ హార్వే విశ్లేషణను పరిశీలించేముందు కొన్ని విషయాలను గమనిద్దాం. పెట్టుబడిలో విభాగాలుంటాయి. సందర్భాన్ని బట్టి విభాగాలను గుర్తిస్తాము. ముందుగా ఒక పద్ధతిని తీసుకుని పరిశీలిద్దాం. ఉదాహరణకు ఒక ఉక్కు కర్మాగారం ఉందనుకుంటే, అందులో భవనాలు, యంత్రాలు, రోడ్లు, వాహనాలు, కంపూటర్లు మొదలగునవి స్థిర పెట్టుబడి అంటాం. ముడి సరుకు అయిన ఇనుప ఖనిజం, నీరు, బొగ్గు, విద్యుత్ వంటి సహాయక సరుకులు, కార్మికులకిచ్చే వేతనాలు టర్నోవర్ పెట్టుబడి అంటాం. స్థిర పెట్టుబడిలో కూడా స్థావర పెట్టుబడి, అస్థావర పెట్టుబడి అనే విభాగాలను గుర్తిస్తారు. భవనాలు, రోడ్లు, రైల్వేలు ఒక స్థలం నుంచి వేరొక స్థలానికి మార్చలేం. కాబట్టి అవి స్థిర పెట్టుబడి మాత్రమే కాదు, అందులో అవి స్థావర పెట్టుబడి విభాగానికి చెందినవి. అలాగే బ్లాస్ట్ ఫర్నేస్ ఉంటుంది. దీనిని ఒక స్థలంలో నిర్మించి వేరే స్థలానికి మార్చలేము. ఇది కూడా స్థిర పెట్టుబడిలో స్థావర పెట్టుబడి విభాగానికి చెందుతుంది. అయితే, కంపూటర్లు, వాహనాలు, కొన్ని రకాల యంత్రాలు ఒక స్థలం నుంచి వేరొక స్థలానికి తీసుకుపోవడానికి వీలుంటుంది. ఇవి ఉత్పత్తి ప్రక్రియలో ఖర్చు అయిపోయే ముడి సరుకులు లేదా సహాయ సరుకులు కాదు, ఇవి స్థిర పెట్టుబడి కిందకే వస్తాయి. అయినా వీటిని ఒక స్థలం నుంచి

వేరొక స్థలానికి మార్చవచ్చు. కావున ఇవి స్థిర పెట్టుబడిలో అస్థావర పెట్టుబడి విభాగానికి చెందుతాయి. మొత్తం పెట్టుబడిలో స్థిర పెట్టుబడి, టర్నోవర్ పెట్టుబడి అని రెండు భాగాలుంటాయని అలాగే మరల స్థిర పెట్టుబడిలో స్థావర పెట్టుబడి, అస్థావర పెట్టుబడి అనే రెండు విభాగాలుంటాయనే గుర్తింపు ఇక్కడ ప్రధానం. సందర్భాన్నిబట్టి, ప్రధానంగా అదనపు విలువను గుర్తించడానికి, గణించడానికి పెట్టుబడిని పరివర్తన రహిత, పరివర్తనశీల విభాగాలుగా గుర్తించే పద్ధతి ఉంది. వేతనాలను పరివర్తనశీల పెట్టుబడి అని, మిగిలిన భవనాలు, యంత్రాలు, వాహనాలు, ముడి సరుకులు, సహాయ సరుకులు అన్నింటిని కలిపి పరివర్తన రహిత పెట్టుబడి అని మార్క్స్ విశ్లేషించిన విషయం తెలిసిందే.

పెట్టుబడిలో స్థిర పెట్టుబడి, టర్నోవర్ పెట్టుబడి అనే భాగాలున్న విషయాన్ని అలాగే స్థిర పెట్టుబడిలో స్థావర, అస్థావర పెట్టుబడులు అన్న విభాగాలు ఉన్న విషయాన్ని గమనించాం. ఇప్పుడు డేవిడ్ హార్వే చెప్పిన విషయాలను పరిశీలిద్దాం. ఒక పెట్టుబడిదారుడు ఇనుప ఖనిజం, బొగ్గు, నీరు అందుబాటు చూసుకుని ఉక్కు పరిశ్రమను ఒకానొక స్థలంలో పెట్టాడనుకుందాం. ఒక ఇరవై సంవత్సరాల తరువాత ఆ పరిశ్రమకు దగ్గరగా ఉన్న ఇనుప ఖనిజం లేదా బొగ్గువంటి భారీ ముడి సరుకులు అందుబాటులో లేకుండా పోయాయనుకుందాం. ఫలితంగా పరిశ్రమను లాభదాయకంగా నడపడం సాధ్యం కాదు. ఇప్పుడు ఆ పరిశ్రమను మూసివేస్తే అక్కడ కట్టిన భవనాలుగాని, అక్కడ ఏర్పాటు చేసిన కదపడానికి వీలులేని బ్లాస్ట్ ఫర్నేస్ వంటి యంత్రాలుగాని, ఆ పరిశ్రమకు వేసిన రోడ్లు ఇతర రవాణా సౌకర్యాలుగాని, అంటే స్థిర పెట్టుబడిలో స్థావర పెట్టుబడి విభాగాన్ని అక్కడ నుంచి వేరే దగ్గరకు తీసుకుపోవడానికి కుదరదు. అవి నిరుపయోగమైపోతాయి. దీనినే డేవిడ్ హార్వే స్థావరత్వపు సమస్య అన్నాడు. ఈ స్థావరత్వపు సమస్య వలన పెట్టుబడి లాభాలు లేని స్థానం నుంచి లాభాలు వచ్చే స్థానానికి సాఫీగా ప్రవహించలేదు. ఈ పరిశ్రమ కొరకు వేసిన రోడ్లు, రైల్వేలు, కొన్ని సందర్భాలలో నౌకాశ్రయాలు పనికిరాకుండా పోతాయి. డేవిడ్ హార్వే ఇక్కడ మరికొన్ని విషయాలను కూడా జోడిస్తాడు. అవేమంటే కాలం గడుస్తున్న కొద్దీ 'ఉత్పత్తి సాధనాల అభివృద్ధి వలన' స్థిర పెట్టుబడిలో స్థావర పెట్టుబడి శాతం విపరీతంగా పెరుగుతుంది. అంతేకాదు పరిశ్రమలను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి మార్చవలసిన అవసరం లేని సందర్భాలలో కూడా ఆధునిక యంత్రాలు రంగంలోనికి రావడం వలన పరిశ్రమలో యంత్రాలను వాటి జీవిత కాలం పూర్తికాకముందే మార్చవలసి వస్తుంది. పాత యంత్రాలను వాటి జీవిత కాలం ముగియకముందే తొలగించి కొత్త యంత్రాలను పెట్టడం అంటే పాత యంత్రాలలో తరుగుపోగా మిగిలి ఉన్న విలువను వదులుకోవడమే కదా! స్థిర పెట్టుబడిలో అత్యధిక భాగం స్థావర పెట్టుబడిగా ఉండడం, కాలం గడుస్తున్న కొద్దీ స్థావర పెట్టుబడి వాటా పెరిగిపోతూ ఉండడం, ఈ స్థావర పెట్టుబడిని ఒక స్థానం నుంచి మరొక స్థానానికి కదల్చలేకపోవడమేగాక, కొన్ని సందర్భాలలో పరిశ్రమను కదల్చవలసిన అవసరం లేకపోయినా పనిచేస్తున్న యంత్రాలను తొలగించి మరింత ఆధునిక యంత్రాలను తీసుకురావలసిన అవసరం ఏర్పడడం పెట్టుబడి ప్రవాహానికి తీవ్ర ఆటంకాలను కలిగిస్తాయంటాడు డేవిడ్ హార్వే. పెట్టుబడి సజీవంగా ఉండాలంటే అది ప్రవహిస్తూ ఉండాలిగాని కాలం గడుస్తున్న కొద్దీ పెట్టుబడిలో అధికభాగం మారుతున్న అవసరాలకు తగ్గట్టు ఒక భౌగోళిక స్థానం నుండి మరొక భౌగోళిక స్థానానికి కదలలేనిదిగా మారిపోతుంది. ఇది ఒక తీవ్రమైన వైరుధ్యంగా ముందుకు వస్తుందంటాడు డేవిడ్ హార్వే. నిజానికి స్థావర పెట్టుబడి పెరడగం, స్థలాన్ని మార్చినప్పుడు ఆ పెట్టుబడి విలువలు వృథా కావడం అలాగే యంత్రాల ఆధునీకీకరణ వలన పాత యంత్రాల విలువ కోల్పోవడం అనే సమస్యలు సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో కూడా తారస పడతాయి. అయితే అక్కడ లాభ నష్టాల సమస్య ఉండదు. పైన చెప్పిన పరిస్థితులలో స్థిర స్థావర పెట్టుబడి కొంత నిరుపయోగమై పోయినా మొత్తం మీద ఉత్పత్తి పెరుగుతుంది కావున, సోషలిస్టు వ్యవస్థ దానిని సంక్షోభంగా భావించదు. లాభాపేక్షతో చూసినప్పుడు ఏదైతే సంక్షోభమో సామాజిక ప్రయోజనంతో చూసినప్పుడు అది సంక్షోభం కాకపోవచ్చు. అంతేకాదు సోషలిస్టు వ్యవస్థలో, అది ఒక పథకం ప్రకారం నడిచే వ్యవస్థ అయినందున ఈ నిరుపయోగమవ్వడం తక్కువగా ఉంటుంది. అంటే సోషలిస్టు వ్యవస్థలో ఈ సమస్య సంక్షోభానికి దారితీయదు.

ఇక్కడే మరొక విషయాన్ని డేవిడ్ హార్వే పరిశీలిస్తాడు. స్థిర పెట్టుబడి, టర్నోవరు పెట్టుబడుల మధ్య వైరుధ్యాన్ని ఇక్కడ చూపిస్తాడు. టర్నోవర్ పెట్టిబడి భాగం పెరిగితేనే ఎక్కువ లాభం వస్తుంది. అంటే టర్నోవర్ పెట్టుబడి అంటే ముడి సరుకులు, సహాయ సరుకులు, వేతనాలు అన్న విషయం తెలిసిందే. కాని దీనిని పెంచాలంటే, అందుకు స్థిర పెట్టుబడి శాతాన్ని తగ్గించవలసి వస్తే, ఉదాహరణకు రోడ్లు లేదా హార్బర్లపై వ్యయాన్ని తగ్గిస్తే తయారయిన సరుకులు మార్కెట్‌కు సరఫరా కావడంలో ఆటంకం ఏర్పడుతుందంటాడు. కాబట్టి టర్నోవర్ పెట్టుబడి, స్థిర పెట్టుబడుల మధ్య వైరుధ్యం నిరంతం కొనసాగుతుందంటాడు డేవిడ్ హార్వే.

భూములకు పెరుగుతున్న ధరలు, ప్రధానంగా స్పెక్యులేషన్ ధరలు పెట్టుబడి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తాయంటాడు డేవిడ్ హార్వే. ఇక్కడ మనం కొంత చర్చించాలి. భూస్వామ్య వ్యవస్థలో పెట్టుబడిదారీ వర్గం పుట్టి పెరుగుతున్న కాలంలో భూస్వాములు పెట్టుబడిదారుల నుంచి అధికాధికంగా కౌలు వసూలు చేసేవారు. ఆ పైన భూస్వాములకు వచ్చే ఆదాయం పెట్టుబడిగా మారేది కాదు. వారు ఆ ఆదాయాన్ని తమ పరివార జనాన్ని పెంచుకోవడానికి, ప్రైవేటు సైన్యాలను పెంచుకోవడానికి, ఇతర దేశాల నుండి ఖరీదైన డాబుసరి సరుకులు దిగుమతి చేసుకోవడానికి ఉపయోగించేవారు. అందుకే భూస్వాములకు చెల్లించిన కౌలు ఇంగ్లండులో పారిశ్రామికీకరణకు ఉపయోగపడేది కాదు. భూస్వామికి అధికాధికంగా కౌలు చెల్లించడం వలన వ్యవసాయ ఆధునీకీకరణ కూడా వేగాన్ని పుంజుకునేది కాదు. అందుకే భూస్వామికి చెల్లించే కౌలు పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధికి గుదిబండగా భావించబడేది. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. పరిశ్రమ పెట్టడానికి భూమి అవసరమైన పారిశ్రామిక వేత్త భూమి యజమాని అయిన రియల్ ఎస్టేట్ దారునికి అధికంగా చెల్లించవలసి వస్తే వ్యష్టి పారిశ్రామిక వేత్తకు నష్టం కలుగవచ్చేమోగాని మొత్తం పెట్టుబడిదారీ వర్గానికిగాని పెట్టుబడి ప్రవాహానికి గాని నష్టం ఏమీ లేదు. ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారి తనకు వచ్చిన ధనంతో ఆ పరిశ్రమలోనో లేదా వేరొక పరిశ్రమలోనో వాటాలు కొంటాడు. జరిగేది అంతా పెట్టుబడిదారీ వర్గ విభాగాల మధ్య లాభాల పున:పంపిణీ మాత్రమే. బ్యాంకర్లను, పరిశ్రమ యజమానులను, సరుకు వ్యాపారులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను వేరువేరుగా చూస్తున్నాడు డేవిడ్ హార్వే. నిజానికి ఈ విధంగా చూడలేని పరిస్థితి అధికాధికంగా ఏర్పడుతుంది. రియల్

ఎస్టేట్ వ్యాపారులు బ్యాంకులలో షేర్లు కొంటున్నారు. బ్యాంకులు పరిశ్రమలలో వాటాలు కొంటున్నాయి. వాల్ మార్టువాడు కూడా విస్తరిస్తూ వ్యాపార వర్గాలనన్నింటిని మింగివేసిన తరువాత పరిశ్రమ యజమానుల వద్ద అధికాధికంగా రిబేటు వసూలు చేస్తున్న తరువాత, లేదా అంతకంటే ముందే తన పెట్టుబడిని పరిశ్రమలలోనూ లేదా బ్యాంకులలోనూ పెట్టవలసిందే కదా! (ఇప్పటికే అలా జరుగుతుందేమో ఈ వ్యాస రచయిత పరిశీలించలేదు) ఇవన్నీ పెట్టుబడిదారీ వర్గంలో విభాగాలు మాత్రమే. బ్యాంకులు, పరిశ్రమ యజమానులు, సరుకుల వ్యాపారులు, భూమి వ్యాపారులు అందరూ పెట్టుబడిదారులే. పెట్టుబడి వ్యవస్థ ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య ఈ విభాగాల మధ్య లాభాల పంపకం కాదు. వారు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్య సరుకులు అమ్ముకోలేక పోవడమే. విదేశీ మార్కెట్ అందుబాటులో లేనప్పుడు కార్మికులకో లేదా కనీసం మధ్యతరగతి వారికో ఆదాయాలు పెంచకుండా అంటే ఆమేరకు తమ లాభాలు తగ్గించుకోకుండా పెట్టుబడిదారులు తమ సరుకులను ఎలా అమ్ముకోగలుగుతారు? లాభాలు తగ్గితే దానిని కూడా వారు ఒక సంక్షోభంగా భావిస్తారు. దీనికి పరిష్కారంగా కొనుగోలుదారులకు రుణాలివ్వడం ప్రారంభించారు. అదే అమెరికాలో సబ్ ప్రైమ్ సంక్షోభానికి దారితీసిన విషయం ముందు అధ్యాయాలలో పరిశీలించాం. ఏది ఏమైనా డేవిడ్ హార్వే పెట్టుబడి ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా పెట్టుబడి ప్రవాహానికి కలుగుతున్న ఆటంకాలను ఇక్కడ చర్చిస్తున్నాడు. వివిధ విభాగాల పెట్టుబడిదారుల వద్దకు చేరుతున్న లాభాలు పారిశ్రామిక రంగానికి చేరకపోతే పారిశ్రామిక రంగం విస్తరించకపోతే అది ఆర్థిక వ్యవస్థ మరింత అభివృద్ధికి ఆటంకమే. డేవిడ్ హార్వే దృష్టిలో ఈ విషయమే ఉండవచ్చు. కాని వస్తోత్పత్తి రంగంలోనికి పెట్టుబడి ప్రవాహం తక్కువగా ఉందని డేవిడ్ హార్వే రాయలేదు. దీనికి సంబంధించిన వాస్తవాల పరిశీలన మనం కూడా చేపట్టడం లేదు.

అభివృద్ధి చెందిన దేశాలలో పారిశ్రామిక వ్యవస్థ అధికాధికంగా క్యాపిటల్ ఇన్‌టెన్సివ్ (స్థిర పెట్టుబడి భాగం పెరగడం) శ్రామికుల సంఖ్య తగ్గడం, ఫలితంగా అదనపు విలువ తక్కువగా ఉత్పత్తి కావడం అధికాధిక పెట్టుబడులు పారిశ్రామిక రంగానికి ప్రవహించలేకపోవడానికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు. సేవారంగం ప్రధానంగా లేబర్ ఇంటెన్సివ్ కావడం వలన పెట్టుబడి సేవారంగానికి ప్రవహించడం గమనిస్తాం. ఏది ఏమైనా అభివృద్ధి చెందిన దేశాలలో (ఈమాట డేవిడ్ హార్వే రాయలేదు కాని హార్వే రచన పూర్తిగా అభివృద్ధి చెందిన దేశాలకే వర్తించేటట్లు కనిపిస్తున్నది.) ఆధునికీకరణ వలన అంటే క్యాపిటల్ ఇన్‌టెన్సిఫికేషన్ వలన వస్తు తయారీ పరిశ్రమలలో, వ్యవసాయం, పాడి పరిశ్రమలలో కార్మికుల సంఖ్య తగ్గడం, అదనపు విలువ ఉత్పత్తి తగ్గడం, లాభాల శాతాలు తగ్గడం, వచ్చిన లాభాలలో కూడా అటు బ్యాంకుల వారు ఇటు వ్యాపార వర్గాల వారు చివరికి రియల్ ఎస్టేట్ వారు అధికాధిక వాటాలు అడగడం జరిగి ఆయా వర్గాలు పొందుతున్న లాభాలు వస్తు పరిశ్రమలలో వాటాలు కొనడంగా మారకపోతే వస్తు తయారీ పరిశ్రమల సాపేక్షంగా చూసినప్పుడు బాగా క్షీణిస్తుంది అని చెప్పవచ్చు. అయితే అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడి వస్తు తయారీ పరిశ్రమ నుంచి ఒక రకమైన కౌలు ద్వారా సేవారంగానికి వెళితే దానిని వ్యవస్థ సంక్షోభంగా భావించాడని చెప్పవచ్చు.

డేవిడ్ హార్వే ఒక వైపు పెట్టుబడి స్థావర లక్షణానికి రెండవ వైపు దాని స్థాన చలన లక్షణానికి ఉన్న వైరుధ్యాన్ని వివరిస్తూ ఇది కొన్ని సందర్భాలలో తీవ్ర వైరుధ్యానికి దారితీస్తుందని చెప్తాడు. ప్రధానంగా ఆ వైరుధ్యం ఒక్కొక్కసారి ఒక్కొక్క ప్రాంతంపై విరుచుకుపడుతుందని చెప్తాడు. అమెరికాలో డెట్రాయిట్ వంటి పారిశ్రామిక కేంద్రం ఎలా కుప్పకూలిపోయిందో చెప్తాడు. అక్కడ ఉన్న నిర్మాణాలు – పరిశ్రమలు, రవాణా సదుపాయాలు, వసతి గృహాలు – సర్వస్వం ఏవిధంగా విడిచిపెట్టబడ్డాయో చెప్తాడు. అదేవిధంగా ఇప్పుడు చైనాలో షెన్‌జెన్, బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నగరాలలో పారిశ్రామిక కార్యకలాపాలు ఏవిధంగా ఊపందుకున్నాయో వివరిస్తాడు. డెట్రాయట్‌లో ఎంత స్థావర పెట్టుబడి విధ్వంసం జరిగిందో అదే విధంగా, ఈనాడు ఢాకా నగరం షెన్‌జెన్‌లలో ఆస్తి వాణిజ్యం, ఫైనాన్సియర్స్‌తో కలసి ఎన్నిరకాలుగా రెంటు (అద్దెలు, లీజులు, రుసుములు వంటివి) వసూలు చేస్తున్నదో ఇండ్ల స్థలాల ధరలు ఎంతగా పెరుగుతున్నాయో గమనించాలంటాడు. చరిత్రనిండా ప్రపంచవ్యాప్తంగా మనకు ఈ విధంగా పెట్టుబడి స్థావర లక్షణానికి, దాని స్థాన చలన లక్షణానికి ఉన్న వైరుధ్యం వివిధ స్థానిక సమాజాలను అతలాకుతలం చేయడం కనిపిస్తున్నదని వివరిస్తాడు.

జన సామాన్యాన్ని మొత్తంగా తీసుకున్నప్పుడు ఇళ్ళ ధరలు, భూముల ధరలు పెరగడం వలన వారికి ఎటువంటి లాభం ఉండదని అంటాడు. చివరిగా డేవిడ్ హార్వే ఈ విశ్లేషణ నుంచి తీసుకోవలసిన రాజకీయ లక్ష్యాలను వివరిస్తాడు. డేవిడ్ హార్వే సుమారు అమెరికా పరిస్థితులలో మాట్లాడుతున్నాడని మనం అర్థం చేసుకోవచ్చు.స్థిరాస్థులపై అధికాధికంగా అద్దెలు వసూలుచేసే అధికారాన్ని ముందుగా రద్దుచేయవలసి ఉంటుందంటాడు. అక్కడ స్థిరాస్తులు కొద్దిమంది చేతులలో కేంద్రీకృతమై ఉన్నందున హార్వే సూచన సరిపోతుంది. అయితే భారత దేశంలో ఇప్పటికీ స్థిరాస్తులు మొత్తం కొద్దిమంది చేతులలో కేంద్రీకృతం అయిన పరిస్థితి రాలేదు. ఇప్పటికీ స్థిరాస్థులు ప్రజల చేతులలో చిన్న చిన్న ఆస్తుల రూపంలో ఉన్నందున ఇక్కడ స్థిరాస్థి వ్యాపారులు సాధారణ ప్రజల నుంచి భూమి కొనుగోలు చేస్తున్న సందర్భం ఉన్నందున పరిస్థితిలో కొంత వ్యత్యాసం ఉంది. అయితే భూములు, ధరలు పెరగడం, అద్దెలు పెరగడం ఇక్కడ కొద్దిమంది సాధారణ రైతులకు, మధ్యతరగతి వారికి కలసి రాగా భూములు, భవనాలు అధికాధికంగా రియల్టర్ల చేతిలో కేంద్రీకృతం అవుతున్నందున మనకు కూడా త్వరలో అమెరికా పరిస్థితి వస్తున్నది. విస్తృత ప్రజానీకం పెరుగుతున్న ప్లాట్ల ధరలకు లేదా అద్దెలకు బలవుతున్నారు. డేవిడ్ హార్వే ఇళ్ళ తనఖా పత్రాలను కట్టలుగా కట్టి, వాటిని కొల్లేటరలైజ్డ్ డెబ్ట్ ఆబ్లిగేషన్‌లుగా మార్చి ప్రపంచం అంతటా – అవి ఆధారపడదగ్గవా కావా తెలియని వారికి – అమ్మిన పద్ధతిని వెంటనే రద్దుచేయాలని అన్నాడు. భూమి వనరులను, నిర్మిత వనరులను ప్రజలందరి ఆస్తిగా గుర్తించి వాటిని ఉపయోగ విలువగా వాడే వారికి వాటిపై ఆధారపడేవారికి ఉపయోగపడే విధంగా మార్చాలంటాడు. భౌతికమైన మౌలిక సదుపాయాలకు ఇతర రూపాలలో ఉన్న స్థిర పెట్టుబడికి ఫైనాన్స్ స్పెక్యులేషన్‌తో ఎటువంటి సంబంధం లేకుండా చూడాలని అప్పుడు మాత్రమే భౌతిక మౌలిక వసతుల వాడకానికి, ఉత్పత్తి కార్యకలాపాలకు ద్రవ్య ప్రయోజనాలు ఆటంకపడకుండా ఉండగలవని వివరిస్తాడు. ఇటువంటి విధానం ద్రవ్య ప్రయోజనాల ఆధారంగా కాక ఉపయోగపు విలువలుగా భౌతిక వనరుల నిర్మాణం, నిర్వహణకు పథక రచన చేసేటట్లు ఒత్తిడి చేస్తాయని డేవిడ్ హార్వే చెప్తాడు. ఈ సలహాలు

డిసెంబరిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు

***జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు* ఎన్.వి.యస్. నాగభూషణ్**

వారంతా మామూలు సైనికులు కాదు, ఉన్నత స్థాయి అధికారులు అందునా సామాజికంగా కింది స్థాయికి చెందినవారు కూడా కాదు. నాడు దేశంలో గల 14 స్థాయిల అంతస్తుల్లో ఉన్నత అంతస్తు అయిన ప్రభు వర్గానికి చెందినవారు. ఆ దేశంలో ప్రభు వర్గానికి చెందడమంటే, పెద్ద పెట్టున భూములుండడం అన్నమాట! అంతేకాదు, వారికి చట్టరీత్యానే ఇతర అంతస్తుల ప్రజలకు లేని ప్రత్యేక హోదా ఉంటుంది. హోదాను బట్టే ఉన్నతోద్యోగాలూ, అధిక సౌకర్యాలూ, గౌరవాలూ దక్కుతాయి. అంతేగాక వారంతా ఉన్నత విద్యావంతులు కూడా. మరి అలాంటి వారంతా రాజుకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. అది కూడా అత్యంత విశాలమైన సామ్రాజ్యానికి చక్రవర్తి, అందునా జార్. మరి జార్ అంటేనే, ప్రజలపై భయంకరమైన అణచివేతను ప్రయోగిస్తూ, అత్యంత నిరంకుశంగా పాలించే వాడన్నమాట! అలాంటి భయంకరుడైన జార్‌పై వారంతా సైనిక తిరుగుబాటు జరిపారు!

సాధారణంగా చరిత్రలో ఎక్కడ రాజరికాలపై సైనిక తిరుగుబాట్లు జరిగిన సంఘటనల్ని పరిశీలించినా, అవన్నీ ఉన్న పాలకుణ్ని దించేసి మరో పాలకుణ్ని గద్దెనెక్కించడం కోసమో, లేదా ఆ రాజుని దించేసి తామే అధికారాన్ని దక్కించుకోవడం కోసమో జరిగినట్లు కనబడతాయి. కానీ ఈ తిరుగుబాటు అలాంటి లక్ష్యం కోసం కాకుండా, ఒక ఉన్నత ఆదర్శం కోసం జరగడం గమనార్హం! జారిజాన్ని రద్దుచేసి, ప్రజాస్వామ్య పాలన కోసం జరిగింది కావడం విశేషం! అంతేగాక ప్రభు వర్గం వారికి (అందులో తామూ ఉన్నారు) ఉన్న ప్రత్యేక హోదాను రద్దుచేసి, ఒక ప్రభువర్గం వారి ఉన్నత హోదాను మాత్రమే గాక, సమాజంలో ఉన్న మొత్తం అంతస్తుల్ని రద్దుచేసి, చట్టం ముందు అన్ని వర్గాలకు చెందిన ప్రజల్నీ సమానంగా ప్రకటించాలని కూడా వారు ఆశించారు. ఇంతవరకే కాదు, ఆ దేశ సమాజంలో గల ఒక అతిచెడ్డ విధానం బానిసత్వ విధానం. దాన్ని కూడా రద్దుచేసి బానిస రైతులకి స్వేచ్ఛ కల్పించాలనీ, వారికి భూమి ఇవ్వాలనీ, దున్నేవారికే భూమి చెందాలనీ వగైరా ఉన్నత లక్ష్యాల కోసం వారు తిరుగుబాటు చేశారు. ఇలాంటి లక్ష్యాల కోసం, ప్రభు వంశాలకు చెందినవారే సాయుధ తిరుగుబాటుకు పూనుకోవడం అనేది యావత్తు ప్రపంచ చరిత్రలోనే జరిగిన ఒక అపురూప, అపూర్వ సంఘటన అని చెప్పాలి.

ఇంతకీ ఈ తిరుగుబాటు జరిగింది రష్యాలోనే అని చాలా మంది పాఠకులకు అర్థమయ్యే ఉంటుంది. ఈ తిరుగుబాటు జరిగింది జారిజం పైన. ఎప్పుడంటే 1825 డిసెంబర్ 26న. (పాత కేలండర్ ప్రకారం డిసెంబర్ 14న). డిసెంబర్ నెలలో జరిగింది కాబట్టి ఈ తిరుగుబాటు డిసెంబరిస్టు తిరుగుబాటుగా ప్రసిద్ధికెక్కింది. అయితే తిరుగుబాటు జరిగి ఎప్పుడో రెండు వందల సంవత్సరాలు అవుతున్నా, రష్యన్ సమాజంలో నేటివరకూ జరిగిన, ఇంకా జరుగుతూనే ఉన్న పలు పరిణామాలకు ఆ తిరుగుబాటు ప్రభావమే కారణంగా నిలవడం గమనార్హం! అయితే ఎప్పుడో ఎక్కడో జరిగిన ఈ తిరుగుబాటు గురించి ఇప్పుడు ఇక్కడ, మన భారతా వనిలో తెలుసుకోవడం ఎందుకంటే, ఈ తిరుగుబాటు వైఫల్య ఫలితంగానే రష్యాలో అక్టోబర్ మహా విప్లవం జరిగి, యావత్తు ప్రపంచ చరిత్రలోనే మొట్టమొదటగా శ్రామికవర్గ ప్రభుత్వం ఏర్పడింది గనుక, శ్రామికవర్గ రాజకీయాల పట్ల ఆసక్తి గల మనకు ఆ అక్టోబర్ విప్లవం ఉత్తేజదాయకమైనందున, మనందరం ఆ చరిత్రను ఆసక్తితో గమనించాల్సి ఉంది.

పాటించేటట్లు ప్రభుత్వాన్ని ఒప్పించడం లేదా అందుకు ఒత్తిడి తేవడం ప్రజలకు సాధ్యమా అనేది మనకు వెయ్యి డాలర్ల ప్రశ్న. చాలా బలమైన ఉద్యమం లేకుండా స్వదేశీ, విదేశీ కార్పొరేటు సంస్థల ఒత్తిడిని తట్టుకుంటూ ప్రజలు సూచించిన ఇటువంటి ప్రత్యామ్నాయ చర్యలను ఏ ప్రభుత్వాలు చేయగలుగుతాయి? ప్రభుత్వం పెట్టుబడిదారుల సాధారణ ప్రయోజనాలను చక్కబెట్టే కమిటీ మాత్రమే కదా! ఇది ఇండియాలో సాధ్యంకాదు. అమెరికాలో అసలే సాధ్యం కాదు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, ప్రజారోగ్యం, వంటివాటిని మార్కెట్‌కు అప్పజెప్పకుండా ఉండేటట్లు చేయడమే సాధ్యం కావడం లేదు. భారతదేశంలో ప్రభుత్వాలు పి.పి.పి పేరుతో అన్ని ప్రజా సేవలను, మౌలిక వసతులను ప్రైవేటు పరంచేస్తున్నాయి. ఇక్కడ ప్రజలు వాటిని అడ్డుకునేందుకు ఉద్యమాలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వాలు ప్రకృతి వనరులను కూడా కారు చౌకగా పెట్టుబడికి అప్పజెప్తూ పర్యావరణానికి తీవ్రమైన హానిని, తిరిగి కోలుకోలేని హానిని కలిగిస్తున్నాయి. వివిధ రంగాలలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలు పెరిగి పెద్దవై విస్తరించి బలవత్తరమై ఒకదానిని ఒకటి కలుసుకుంటూ ఒకదానినుంచి ఒకటి ప్రేరణ పొందుతూ మూల కారణాలను అన్వేషిస్తూ సమూల మార్పుకు దారితీస్తేగాని ఈ కార్పొరేటు ప్రక్రియను ఆపలేం. డేవిడ్ హార్వే పరిష్కారంలో అటువంటి సమూల మార్పుతో సంబంధం లేకుండా పాక్షిక మార్పులు సాధ్యమనే భావన కనిపిస్తున్నది. సమూల మార్పుల లక్ష్యంతో పాక్షిక మార్పుల కొరకు ప్రయత్నించడం ఆచరించదగ్గదే. అయితే అటువంటి అవగాహన హార్వేలో ఇంతవరకు కనిపించలేదు.

(ఇంకా ఉంది)

(రచయిత ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు) వీ

ఇప్పుడు ఆ డిసెంబరిస్టు సైనిక తిరుగుబాటుకు దారితీసిన కారణా లేమిటో, తిరుగుబాటు ఎందుకు విఫలమైందో, విఫలమైనప్పటికీ రష్యా అనంతర పరిణామాలకు ఎలా కారణభూతమైందో, ఆ పరిణామాలను, 1917 అక్టోబర్ విప్లవం దాకా జరిగిన వాటిని క్లుప్తంగా తెలుసుకుందాం. అలాగే ఈ వ్యాసంలో డిసెంబరిస్టు ఉద్యమం ప్రారంభానికి దారితీసిన పరిస్థితుల్నీ, ఉద్యమంలో గల వివిధ కోణాల్నీ, ఉద్యమకారుల ఆకాంక్షల మధ్య ఏర్పడ్డ విభేదాల్నీ, ఉద్యమ ఉత్థాన పతనాల్నీ కూడా సంగ్రహంగా తెలుసుకుందాం.

ముందు మాట : 1825 నవంబర్ 19న నాటి జార్ అలెగ్జాండర్-1 దక్షిణ రష్యాలో గల తగన్‌రోగ్ అనే పట్టణంలో అకాస్మాత్తుగా అస్వస్థతకు గురై మరణించాడు. చనిపోయిన చక్రవర్తికి సంతానం లేదు. అందువల్ల అతడి వారసుడిగా ముందు వరుసలో ఉన్న అతని పెద్ద తమ్ముడు 'కోన్‌స్తాన్తిన్' చక్రవర్తి పీఠాన్ని ఎక్కవలసి ఉన్నది. అప్పుడప్పుడు పోలెండ్‌కు గవర్నర్ జనరల్‌గా పనిచేస్తూ, వార్సా నగరంలో ఉన్నాడు. అయితే విషయం ఏమంటే, కోన్‌స్తాన్తిన్ అప్పటికే తాను ఆ వారసత్వ హక్కును వదులుకుంటున్నట్లు ప్రకటన చేసి ఉండడం! ఆ ప్రత్యేక ప్రకటనను ఆమోదిస్తూ అతడి అన్నగారైన నాటి జార్ అలెగ్జాండర్-1 కూడా దానిమీద సంతకం చేసి ఉన్నాడు. ఇంతకీ కొన్‌స్తాన్తిన్ తనకుగల వారసత్వ హక్కును వదులుకోవడానికి కారణం ఏమిటంటే, అతడు తన అంతస్తుకి దిగువన ఉన్న పోలిష్ ప్రభు వంశీకురాలైన ఒక యువతిని ప్రేమించి, ఆమెనే పెళ్లాడడానికి నిశ్చయించుకోవడం! ఆమె ప్రభు వంశానికి చెందినదైనప్పటికీ, ఉన్నత స్థాయి రాజరిక రక్తం ఆమెలో లేనందున, ఆమెను పెళ్లాడినట్లయితే కొన్‌స్తాన్తిన్ హక్కు చెల్లుబాటు కాదని అతను భావించాడు. అయితే వచ్చిన ఇబ్బంది ఏమంటే, కొన్‌స్తాన్తిన్ తన హక్కును వదులుకుంటున్నట్లు చేసిన ప్రకటన బహిరంగంగా చెయ్యక, రహస్యంగా చెయ్యడం! ఈ రహస్యం కొద్దిమంది కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుసు. ఈ ప్రకటన కాపీలను సీల్ చేసి, మాస్కో నగరంలో గల 'ఉస్పేన్‌స్కీ' కేథడ్రల్ చర్చిలో భద్రపరచడం జరిగింది. దానిని కేవలం అలెగ్జాండర్-1 మరణించినప్పుడు మాత్రమే తెరవవలసి ఉన్నది. ఈ ప్రకటనలోనే వారసునిగా రెండో తమ్ముడైన నీకోలస్ పేరుని ప్రస్తావించడం జరిగింది. అయితే ఈ విషయం నీకోలస్‌కి కూడా తెలీదని కొందరూ, తెలుసని కొందరూ చరిత్రకారులు వాదించుకుంటున్నారు.

జార్ అలెగ్జాండర్ చనిపోయింది 19న అయితే, ఆ విషయం సుదూరంలో ఉన్న రాజధానికి, సెయింట్ పీటర్స్ బర్గ్‌కి చేరడానికి వారానికి పైగా సమయం పట్టింది. కేవలం నవంబర్ 27వ తేదీనే (పాత కేలెండర్ ప్రకారం) చేరింది. అప్పటికి కూడా కొన్‌స్తాన్తిన్ ప్రకటన విషయం సైనికాధికారులకూ, తత్సంబంధ అధికారులకూ తెలియనందున, వారంతా కొన్‌స్తాన్తిన్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేశారు. మొదట మొదటి రాజధానియైన సెయింట్ పీటర్స్ బర్గ్‌లోనూ, ఆ తర్వాత మూడు రోజులకు రెండో రాజధానిగా ఉన్న మాస్కోలోనూ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేశారు. అయితే ముందుగానే తాను వారసత్వ హక్కు నుండి తప్పుకున్నందుకు, కొన్‌స్తాన్తిన్ పోలెండ్ నుంచి రాకుండా అక్కడే ఉండిపోయాడు. అతడి ప్రకటన విషయం తెలిసిన అతడి కుటుంబ సభ్యులు, ఒకవేళ అతడు మనసు మార్చుకుంటాడేమోనని, అతడితో చర్చించి, అతణ్ని ఒప్పించే ఉద్దేశంతో ఆ కుటుంబ సభ్యుల్లో కొందరు వార్సాకు వెళ్లారు. ఇలా వెళ్లిన వారికి కొన్‌స్తాన్తిన్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసిన సంగతి తెలియదు. వారు వార్సాలో అతణ్ని ఒప్పించడానికి ప్రయత్నించినా, అతడు అంగీకరించాడు కాదు. అతడు ఏమాత్రం మనసు మార్చుకోక, తను లోగడ చేసిన ప్రకటనకే కట్టుబడి ఉన్నాడు. దాంతో వెళ్లిన కుటుంబ సభ్యులు ఒట్టి చేతులతో తిరిగి రావలసి వచ్చింది.

(నిజానికి కొన్‌స్తాన్తిన్ వారసత్వ హక్కును వదులుకోవడానికి పెద్ద కారణమే ఉన్నది. తాను ప్రేమించి పెళ్లాడాలనుకున్న రాకుమార్తెకు తగిన రాజవంశీకుల రక్తం లేకపోవడం అనే కారణం ఒక సాకు మాత్రమే. అసలు కారణం ఇది: అలెగ్జాండర్1, కొన్‌స్తాన్తిన్, నీకొలస్‌ల తండ్రి అయిన పాల్14 జార్‌గా కొద్ది సంవత్సరాలే పాలించాడు. అతణ్ని క్రూరంగా హత్య చేశారు. హంతకులు ఎవరైందీ విచారణలో తెలిసింది. బ్రిటన్‌కు వ్యతిరేకంగానూ, చనిపోయిన తన తల్లి అయిన కేథరిన్2 నిర్ణయాలకు వ్యతిరేకంగానూ పాల్1 తీసుకున్న కొన్ని నిర్ణయాలకు కినిసిన బ్రిటన్, మరికొందరు రాజాస్థానంలోని వారితో కుట్రపన్ని, పాల్‌ని హత్య చేశారు. హంతకులెవరైందీ తెలిసినప్పటికీ, వారిపై ఏ చర్య తీసుకోలేదు. హంతకులలో కేథరిన్ రాణి ప్రియులలో ఒకడుండడం కొన్‌స్తాన్తిన్‌కు తెలుసు. అసలు కేథరిన్2 కూడా రష్యన్ సింహాసనాన్ని దక్కించుకోవడం ఒక కుట్ర ద్వారానే అనే విషయం బహిరంగమే. తన భర్త అయిన పీటర్3ని కేవలం ఆరు నెలలు మాత్రమే పరిపాలించనిచ్చిందామె. ఆ వెంటనే ఆమె తన ప్రియులతో కుట్రపన్ని, పీటర్3ని సింహాసనచ్యుతుణ్ని గావించి, అధికారాన్ని చేజిక్కించుకుంది. అంతటితోనే సంతృప్తిపడక, తన భర్త రాజధానికి దూరంగా వేరే కోటలో నివసిస్తున్నప్పటికీ, అతడు బతికి ఉంటే ఎప్పటికైనా ప్రమాదమేనని తలంచి, మరో ప్రియుని సహాయంతో తన భర్తను చంపించింది. నిజానికి ఆమెకసలు భర్తతో పెళ్లయితే జరిగింది కాని, ఒకే ఇంట్లో పదిహేనేళ్ల పాటు కలిసి ఉన్నా, ఇద్దరి మధ్య సంసారిక సంబంధం ఏమాత్రం లేదు. కొడుకు పాల్‌ని ఆమె దగ్గరకు కూడా తియ్యలేదు. అతడి పెంపకం అంతా అప్పటి జారినా అయిన ఎలిజబెత్తే చూసుకుంది. అయితే పాల్‌కు వారసత్వం మాత్రం దక్కింది. ఇదే పద్ధతిలో ఆమె (కేథరిన్2) తన కొడుక్కి పెళ్లి చేయగా పుట్టిన అలెగ్జాండర్ వగైరా మనుమలను, ముఖ్యంగా అలెగ్జాండర్‌ని అతడి తండ్రి దగ్గర పెరగనీయకుండా, ఎక్కువగా తన సంరక్షణలోనే ఉంచుకుంది. ఈ వివరాలన్నీ తెలిసిన కొన్‌స్తాన్తిన్ తన తండ్రినీ, తన తాతనూ రాజాస్థానంలోని ప్రముఖులే హత్య చేసినందున, భవిష్యత్‌లో తనకూ అదే గతి పట్టవచ్చునని భయపడి, వారసత్వాన్ని ముందుగానే వదులుకున్నాడు-రచ).

కొన్‌స్తాన్తిన్ తన వారసత్వపు హక్కును వదులుకునేందుకే కట్టుబడి ఉండడంతో, సహజంగానే వరుసలో అనంతర స్థానంలో ఉన్న నికొలస్‌కు ఆ పదవి దక్కనున్నది. అయితే డిసెంబరిస్టులు క్రూరుడైన నీకొలస్‌కి ఆ పదవి దక్కకుండా తీవ్రంగా వ్యతిరేకించాలని నిర్ణయించారు. ప్రముఖ చరిత్రకారుడైన అనతోల్ జి. మజేర్ అభిప్రాయం ప్రకారం, డిసెంబరిస్టులు ఎలాంటి సందేహాలకూ తావు లేకుండా నికొలస్‌ని అడ్డుకోవాలని నిర్ణయించడానికి కారణం, అతడి క్రూర ప్రవర్తనే. అంతేగాక, నికొలస్‌కి అప్పటిదాకా ఏమాత్రం రాయబార కార్యక్రమాలతో

గానీ, రాజకీయ వ్యవహారాలతో గానీ సంబంధం ఉన్న పనులు చేసిన చరిత్ర లేదు. ఎలాంటి పాలనానుభవం కూడా లేదు. అలాంటి నైపుణ్యాలు అతడికేమాత్రం లేకపోగా, వాటిలో పాల్గొనాలన్న ఆసక్తి కూడా చూపించలేదు. అంతేగాదు, అతడికి వ్యతిరేకాభిప్రాయం గలవారిని ఒప్పించే నైపుణ్యం గానీ, చాకచక్యంగా వ్యవహరించగల నైపుణ్యం గానీ, భవిష్యత్ పరిణామాలను ఊహించగల నేర్పు గానీ లేవు. అవన్నీ ఒక రాజనీతిజ్ఞుడికి ఎంతైనా అవసరమైన విషయాలనే సంగతి తెలిసిందే. అంతేగాక అతడికి తలబిరుసుగా వ్యవహరించే స్వభావం, ఎల్లప్పుడు సైనిక వ్యూహ ప్రతివ్యూహాల గురించిన చర్చల్లో పాల్గొంటూ, సేనలనడిపించడంలోనూ, సైనిక పెరేడ్లలో పాల్గొనడంలోనూ మాత్రమే ఆసక్తి చూపిస్తూ వచ్చాడు. ఇలాంటి వ్యక్తికి జార్ పదవి దక్కితే, తాము చేపట్టబోయే తిరుగుబాటుకు ఆటంకం ఏర్పడవచ్చునని డిసెంబరిస్టులు భావించి, ఏమైనా సరే అతణ్ని అడ్డుకోవాలని దృఢంగా సంకల్పించారు. మరోపక్కన రెండు రాజధానుల్లోనూ గందరగోళ వాతావరణం నెలకొన్నది. ఆ వాతావరణం అంతా క్రమంగా సద్దుమణిగి డిసెంబర్ 10 నాటికి ఒక స్పష్టత వచ్చింది. దాంతో తత్సంబంధిత అధికారులూ, సైన్యమూ ఇప్పుడు నీకొలస్‌ని అధికారం చేపట్టమని కోరారు. తేదీ ఖరారైంది. డిసెంబర్ 14న నికొలస్ జార్‌గా, నికొలస్1 పేర అధికార స్వీకరణ జరగనున్నది. దీంతో డిసెంబరిస్టులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆయుధాలు ధరించాలని నిశ్చయించారు.

1) కుట్రకు సమాయత్తం: నిజానికి కుట్రదారులు దీర్ఘకాలంగా కుట్రకు సమాయత్తం అవుతున్నారు. మొదట్లో వారి ఆలోచన అలెగ్జాండర్1ని హత్య చేయాలని! అయితే ఈ హత్యను సాధ్యం చేయాలని వారు నిర్ణయించుకున్న తేదీ నాటికి, వారు తగినంతగా సన్నద్ధం కాలేదు. కానీ, ఇంతలోనే వారి ఊహలకు భిన్నంగా హఠాత్తుగా అలెగ్జాండర్ జబ్బుపడి, వెంటనే అంత వ్యవధి లేకుండా మరణించాడని వినేసరికి, అప్పుడే వారనుకున్నారు ఇదే తిరుగుబాటుకి తగిన సమయమని. డిసెంబరిస్టులు తరచుగా రహస్య సమావేశాలు జరిపే స్థలాలైన – 1. రాకుమారుడు యుజెన్నీ ఒబోలెన్స్ఫీ ఇల్లు, 2. కవి కొండ్రాతీ రిలేయెవ్ అపార్టుమెంటు – ఈ రెండు చోట్ల వారు తరచు సమావేశాలు జరుపుతూ, తమ కుట్రలకు తగిన ప్రణాళికలు రచించుకోవడంలో నిమగ్నమయ్యారు. వారు డిసెంబర్ 14న (పాత కేలెండర్ ప్రకారం, కొత్త కేలెండర్ ప్రకారం డిసెంబర్ 26వ తేదీ) విప్లవానికి తగిన తేదీ అని నిశ్చయించారు. అదే రోజున కొత్త జార్ యెడ విశ్వాసం వ్యక్తం చేస్తూ సెయింట్ పీటర్స్ బర్గ్‌లో గల సైనిక గారిసన్‌లోని సైనిక దళాలు ప్రమాణ స్వీకారం చేయవలసి ఉన్నది. అయితే వారి ప్రణాళికలు అన్నీ అతిశయోక్తులతో కూడుకొని ఉన్నాయని వారు భావించలేకపోయారు. సైనిక దళాలన్నీ నాడు సెనేట్ స్క్వేర్‌లో గల విశాలమైన ఖాళీ స్థలంలో మోహరించి, ప్రమాణ స్వీకారం చేయాలి. అలాంటి సమయంలోనే తాము నూతన జార్‌కు అనుకూలంగా ప్రమాణ స్వీకారం చేసేందుకు నిరాకరించాలనీ, నికొలాస్ స్థానంలో ఉదారుడైన కొన్‌స్తాన్తిన్‌కి అధికారం అప్పగించాలనీ తామంతా ఏకకంఠంతో డిమాండ్ చేయాలనీ వారు భావించారు. తమ డిమాండ్లలో భాగంగా రాజ్యాంగాన్ని కూడా (కాన్‌స్టిట్యూషన్‌ని) కావాలని డిమాండ్ చేయాలనీ నిర్ణయించారు. తద్వారా రాజ్యాంగబద్ధ రాజరికం గానీ, లేదా రిపబ్లిక్ గానీ ఏర్పడుతుందని వారు ఆశించారు.

అయితే వాస్తవం ఏమంటే, వారి సంస్థ బలహీనంగా ఉన్నది. విప్లవాన్ని నడిపేంత శక్తి దానికి లేదు. నిజానికి అది తగిన సమయం కూడా కాదు. ఎందుకంటే, ఉత్తరాది సొసైటీకీ, దక్షిణాది సొసైటీకీ (డిసెంబరిస్టు విప్లవసంస్థలో రెండు ప్రధానమైన శాఖలు) ఈ తిరుగుబాటు విషయంలో ఒక అవగాహన ఏర్పడలేదు. అయితే డిసెంబరిస్టులు గట్టిగా ఆశపడింది ఏమంటే, జారిజం వల్ల ప్రజలలో అత్యధిక శాతం మంది తీవ్ర అణచివేతకు గురవుతూ, దుర్భరమైన జీవితాలతో బతుకులను వెళ్లదీస్తు న్నందున, వారంతా విప్లవానికి వెన్నంటి ఉండి గట్టి మద్దతునిస్తారని ఆశించారు. అలాగే తిరుగుబాటుకి తోటి సైనిక దళాలు కూడా మద్దతుగా నిలుస్తారని ఆశించారు. అంతేగాక, వారంతా తమ లక్ష్యాల్ని బహిరంగంగా ప్రకటించడానికి ప్రాధాన్యతనిచ్చారు. అవి భూనిసత్వాన్ని నిర్మూలించి రైతాంగానికందరికీ స్వేచ్ఛనివ్వాలనీ, మనుషు లందరికీ చట్టం ముందు సమానత్వాన్నివ్వాలనీ, వ్యవసాయం చేసి పంటలు పండించే రైతాంగానికే భూమి హక్కునివ్వాలనీ వగైరాలు. ఇలా తాము ఇదంతా బహిరంగంగా చేసినట్లయితే తిరుగుబాటు పెద్దఎత్తున జరిగి రక్తంపారి, తిరుగుబాటు జయప్రదమవు తుందని వారు నమ్మారు.

2) తిరుగుబాటు యుద్ధం: 1825 డిసెంబర్ 14న మాస్కో రెజిమెంటుకు చెందిన ఒక బెటాలియనూ, ఇంకా కొన్ని గ్రనేడియర్, నావికా గార్డుకి చెందిన దళాలూ సెయింట్ పీటర్‌బర్గ్‌లో వరుసలుతీరి నిలిచాయి. ఎక్కడైతే కిరీటధారియై, ఖడ్గాన్ని ఎత్తిపట్టి అశ్వాధిరూఢుడైన పీటర్ ది గ్రేట్ ప్రసిద్ధ విగ్రహం ఉంది ఆ సెనేట్ స్క్వేర్‌లో. తిరుగుబాటు దారులూ, గార్డు రెజిమెంటులూ, రాకుమారుడు 'సెర్గీత్రుబెత్స్కోయ్' రాకకోసం నిరీక్షిస్తున్నాయి. ఎందుకంటే కుట్రదారులంతా అతణ్ని తమ 'డిక్టేటర్' (తిరుగుబాటుని నడిపించే నాయకుడు) గా సూచించారు. అంచేత త్రుబెత్స్కోయ్ విప్లవానుకూలదారులకు తాను నాయకత్వం వహిస్తూ ఆ చౌరస్తాలోకి చేరుకుని, వరసలు తీరిన దళాల్ని తిరుగుబాటు వైపుగా నడిపించాలి. కానీ అతడు అసలు అక్కడికి రావడంలోనే విఫలమయ్యాడు. దాంతో త్రుబెత్స్కోయ్ ఏమయ్యాడో తెలుసుకునేందుకు వెళ్లిన కవి 'రీలీవ్' (లేకరీలయేవ్) కూడా వెళ్లినవాడు వెళ్లినట్టే ఉన్నాడు గానీ, ఎంతసేపటికీ వచ్చాడు కాదు. దాంతో ఏం చేయాలో తెలీక తిరుగుబాటుదళాలు, ఆ దళాలు ఏం చేస్తాయో చూద్దామన్నట్టు ప్రభుత్వ అనుకూల దళాలు ఎదురూ బొదురుగా అనేక గంటల పాటు మోహరించి నిలిచాయి. అయితే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమై రాలేదు. తిరుగుబాటుదారులంతా తెలిసినవారే. వారి సంఖ్య ఎంతో, బలమెంతో సరిగ్గా తెలీదు. అయితే ఇటు తిరుగుబాటు దారులూ ఏ చర్యా తీసుకోలేక విఫలమయ్యారు. అందుకు కారణం సాధానమైన గందరగోళం కొంతా, నాయకత్వ వైఫల్యం కొంతా. అలాగే కొత్త చక్రవర్తి తన పాలన ప్రారంభ దినాన, తన కారణంగా రక్తపాతం జరగకుండా ఉంటే బాగుంటుందని భావించాడు. అంచేత తిరుగుబాటు దారులంతా లొంగిపోయేందుకు వీలుగా చర్చలకు సిద్ధపడతారని చాలాసేపు ఎదురు చూశాడు.

(ఇంకా ఉంది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు) వీ

మంజీర రచయితల సంఘం 32వ వార్షికోత్సవం

మంజీర రచయితల సంఘం(మరసం) 32వ వార్షికోత్సవాన్ని సిద్ధిపేటలో సెప్టెంబర్ 29న జరుపుకొంది. ఈ వేడుకలకు వచ్చిన వక్తలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మరసం చేసిన కృషి గురించి తెలిపారు. దేశమంతా ఒకే భాష, ఒకే సంస్కృతి అమలుచేసే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. పాలకులకు ప్రజల స్వేచ్ఛను హరించే హక్కులేదన్నారు. మంజీర నది ప్రజల దాహాన్ని తీర్చినట్లే.. మంజీర రచయితల సంఘం సాహిత్య దాహాన్ని తీర్చాలన్నారు. మరసం అధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది.

దళితులపై దాడులను ఖండిస్తూ ధర్నా

నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని రామ సముద్రం, వడ్వాట్, మక్తల్, మాద్వార్, సోమేశ్వరబండ తదితర గ్రామాల్లో దళితులపై దాడులు జరిగాయి. ఈ దాడులు జరిపిన నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలో అక్టోబర్ 14న ధర్నా జరిగింది. పోలీసులు, రెవెన్యూ అధికారులు బాధితులకు రక్షణ కల్పించడం లేదన్నారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి పేరు చెప్పి అగ్రకులస్తులు దళితుల్ని బెదిరిస్తున్నారన్నారు. బేడ బుడగ జంగాల ఇంటిని కూల్చివేశారు. యాచక వృత్తి చేసుకుని బతికే వీధి కళాకారులపై దాడి చెయ్యడం మానుకోవాలని వక్తలు తెలిపారు.

ఎర్ర ఉపాలి మృతి

ప్రముఖ దళిత ఉద్యమ కవి, గాయకుడు ఎర్ర ఉపాలి(43) అక్టోబర్ 10న యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో మృతిచెందారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఆవశ్యకత, సమాజంలో అణచివేతకు గురవుతున్న దళితుల బతుకులపై రెండు దశాబ్దాలుగా ఆయన గేయాలు రాసి, పాడారు. ఆయన స్వస్థలం ఆలేరు మండలం రాఘవాపూర్. ఎర్ర ఉపాలి ఆయన కలం పేరు. అసలు పేరు ఎర్ర ఉప్పలయ్య. ఆయన మూడో తరగతివరకే చదివినా ఆర్థిక, సామాజిక అంతరాలను ప్రశ్నిస్తూ దాదాపు 200 గేయాలు రాశారు. 'పల్లెగొంతులు' పాట అనే గేయ సంపుటిని ప్రచురించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో పాటు దళిత బహుజన ఉద్యమాల్లో సాంస్కృతిక సైనికుడిగా కీలక పాత్ర పోషించారు.

కె.ఆర్. ఆమోస్ మృతి

తెలంగాణ ఉద్యమకారుడు మాజీ ఎంఎల్సి కె.ఆర్. ఆమోస్(76) అనారోగ్యంలో అక్టోబర్ 10న మృతిచెందారు. ఆయన తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. 1969లో తెలంగాణ ఉద్యమం సందర్భంలో ఉద్యోగ సంఘాలన్నిటినీ ఏకతాటిపైకి తేవడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. టిఎన్‌జిఓ సంఘానికి అధ్యక్షుడుగా పనిచేశారు. తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం జరిగిన ప్రతి సందర్భంలో వారి పక్షాన నిలిచారు. 1969 ఉద్యమ సమయంలో ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు. తెలంగాణ పట్ల ఆంధ్ర పాలకులు వివక్ష చూపుతున్నారంటూ నాలుగు దశాబ్దాల పాటు తన గళాన్ని వినిపించారు.

కసుకుర్తి రామలింగం మృతి

సామాజిక ఉద్యమకారుడు, రచయిత, కవి కసుకుర్తి రామలింగం (50) గుండెపోటుతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో అక్టోబర్ 10న అకాల మరణం చెందారు. రామలింగం స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని టంగుటూరు మండలం అనంతవరం గ్రామం. ఆయన విద్యార్థి దశలో వామపక్ష అభ్యుదయ భావజాలానికి ఆకర్షితుడయ్యారు. కొన్ని పత్రికల్లో కాలమిస్టుగా సేవలందించారు. ఈశ్వరీబాయి సంక్షిప్త జీవిత చరిత్ర 'అగ్నిశిఖ' అజ్మీరా రాములునాయక్ స్ఫూర్తి గాథ 'ఉలిచెక్కని శిల్పం' తదితర పుస్తకాలు రచించారు. ప్రస్తుతం శోషిత జనసభ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేస్తున్నారు.

పూర్ణచంద్రరావు కన్నుమూత

ప్రముఖ నాటక ప్రయోక్త, కవి, సినీ నాటక సాంస్కృతిక విమర్శకుడు పసుపులేటి పూర్ణచంద్రరావు(71) అక్టోబర్ 11న మరణించారు. కొంత కాలంగా ఆయన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. పూర్ణచంద్రరావు ఖమ్మంలో 1948 మే 22న జన్మించారు. ఉస్మానియా యూనివర్సిటీలో బిఎస్సి, పూణేలో ఎఫ్‌టిఐఐ చదివారు. 1980, 1990 దశాబ్దాల్లో వీధి నాటకాల తరహాలో ప్రయోగాలు చేశారు. సామాజిక సమస్యలు, వాటిని ఎదుర్కొంటున్న వివిధ వర్గాల వారితో కలిసి నాటకాలను రూపొందించి, వారినే పాత్రధారులుగా పాల్గొనేలా చేశారు. ఈ నాటక మార్గానికి విక్టిమ్స్ థియేటర్ (పీడితుల రంగస్థలి) అని పేరు పెట్టారు. ఆయన ఎథిక్స్ ఆర్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అందులో నిపుణులతో చర్చాగోష్టి నిర్వహించారు.

ప్రజాసంఘాల నాయకుల పై కేసులు, అరెస్టులు

మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయంటూ ప్రజా సంఘాలకు చెందిన 8 మందిపై గద్వాల పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదుచేశారు. అక్టోబర్ 5–15 మధ్య తెలంగాణ విద్యార్థి వేదిక సభ్యులు నాగన్న, బలరాం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె.జగన్, టిపిఎఫ్ నాయకుడు నలమాస క్రిష్ణ, టివివి రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటిని హైదరాబాద్‌లో అరెస్టుచేసి మహబూబ్‌నగర్ జైలుకు పంపారు. ఇదే కేసులో టిపిఎఫ్ నాయకులు మెంచ్ రమేష్, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు శిల్ప, సిఎంఎస్ సభ్యురాలు రేణుకపై కూడా పెట్టారు. ఉత్తరాలు దొరికాయంటూ భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసులు 45 మందిపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదు చేశారు.

కశ్మీర్‌లో కొనసాగుతున్న అణచివేత

గాంధీజీ 150వ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో 'ఓపెన్ మైండ్, ఓపెన్ డోర్స్' పేరుతో కార్వీ, మంథన్ సంవాద్ సంయుక్తంగా నిర్వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది మేనకా గురుస్వామి కశ్మీర్‌లో గత 58 రోజులుగా ఇంటర్నెట్, ఫోన్ సేవలు, రవాణా నిలిపివేశారని, ప్రజలు నిత్యావసరాల కోసం తల్లడిల్లితున్నారన్నారు. మానవ హక్కుల వేదిక నేత బాలగోపాల్ 10వ వర్ధంతి సందర్భంగా ఎచ్ఆర్ఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 13న 'కశ్మీర్ వార్తల్లో మనకు చెప్పని విషయాలు' అన్న అంశంపై సంజయ్ కక్ కశ్మీర్‌లోని వాస్తవ విషయాలను వెల్లడించేందుకు మీడియా సాహసించడం లేదన్నారు.

చారుమజుందార్ శత జయంతి సదస్సు

నక్సల్‌బరీ ఉద్యమ నిర్మాత చారుమజుందార్ శత జయంతి సదస్సును హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ 18న చారు మజుందార్ శతజయంతి కమిటీ నిర్వహించింది. ఈ కమిటీకి ప్రొ. హరగోపాల్ కన్వీనర్‌గా ఉన్నారు. ఇందులో చారుమజుందార్ నేపథ్యం–అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిస్టు వ్యతిరేక పోరాటం, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో రివిజనిస్టు వ్యతిరేక పోరాటం, భారత విప్లవోద్యమం లో సిపిఎం పాత్ర–విశ్లేషణాత్మక అంచనా, చారుమజుందార్ మార్గంలో వర్తమాన విప్లవోద్యమం అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు.

నిర్బంధ వ్యతిరేక సభ

ప్రజా సంఘాల నాయకుల అరెస్టులు, అణచివేతలకు నిరసనగా వామపక్ష, విప్లవ పార్టీలు, ప్రజాసంఘాలు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అక్టోబర్ 23న సభ నిర్వహించాయి. 23 ప్రజా సంఘాలను నిషేధిత జాబితాలో ఉన్నట్లు ప్రకటించించి ప్రజాస్వామ్యాన్ని హరించారని వక్తలు అన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీ

కశ్మీర్ విభజనను ఆపలేమన్న సుప్రీం కోర్టు

జమ్మూ కశ్మీర్‌ను రెండుగా విభజిస్తూ పార్లమెంట్ చేసిన చట్టం అమలు పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆర్టికల్ 370 రద్దు చేస్తూ పార్లమెంట్ చేసిన చట్టం చెల్లదని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణకు ఏర్పాటైన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విభజనను ఆపలేమని అక్టోబర్ 1న తేల్చిచెప్పింది. 'కాలాన్ని మేం వెనక్కి తిప్పగలం కానీ అంతకు ముందు కేంద్రం ఏం చెబుతుందో వినాల్సి ఉంటుంది. అది విన్నాకే తదుపరి వాదనలు. ఈలోగా విభజన నిలుపుదల చేయాలంటే కుదరదు' అని జస్టిస్ ఎన్.వి. రమణ సారథ్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

మేధావులపై దేశద్రోహం కేసు

దళితులు, మైనారిటీలపై మూక దాడులను అపాలని డిమాండ్ చేస్తూ గత జూలైలో ప్రధాన మంత్రికి లేఖ రాసిన 49 మంది మేధావులపై బిహార్‌లో దేశద్రోహం కేసు నమోదైంది. ప్రముఖులు తమ లేఖల ద్వారా దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ ఓ న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయాలని ముజఫరాబాద్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సూర్యకాంత్ తివారీ ఆగస్టు 20న ఆదేశించడంతో స్థానిక పోలీసులు అక్టోబరు 4న కేసు నమోదు చేశారు. ఇది దేశవ్యాప్తంగా నిరసనకు దారితీయడంతో ఎఫ్ఐఆర్‌ను రద్దుచేసి, కేసు పెట్టిన లాయర్ సుధీర్ కుమార్‌పై ఎదురుకేసులు పెడుతోంది.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ప్రభుత్వం చేపడుతున్న బ్యాంకుల విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బిఇఎఫ్ఐ), ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ)లు అక్టోబర్ 22న దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొన్నాయి. ఈ సమ్మెలో మూడు లక్షల మందికి పైగా పాల్గొన్నారని ఢిల్లీలో బిఇఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి ప్రకటించారు. దీంతో బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోయాయన్నారు. ఈ సమ్మె బ్యాంకులను ప్రైవేటీకరించకుండా కాపడదానికి, కార్పొరేట్ శక్తులు బ్యాంకుల నుండి దోచుకున్న లక్షల కోట్ల రూపాయలను తిరిగి రాబట్టడం ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయన్నారు. బ్యాంకులను విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు పోరాడుతామన్నారు.

భారతదేశంలో ఆకలి బతుకులు

ఆకలి సమస్య తీవ్రంగా ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. 2019 ప్రపంచ ఆకలి సూచీ (గ్లోబల్ హంగర్ ఇండెక్స్)లో 117 దేశాల్లో 102వ స్థానంలో ఉంది. పౌష్టికాహారలోపం, చిన్నారుల్లో బరువుతక్కువ సమస్య, ఎదుగుదల లోపం, ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటు తదితర అంశాల ప్రాతిపదికన పరిస్థితిని లెక్కగట్టే ఈ నివేదిక భారత్ ఆకలిస్కోరుపైనా, పేదరికం ప్రమాదకర స్థాయికి చేరుకోవడంపైనా ఆవేదన వ్యక్తంచేసింది. భారత్‌లో ఆర్నెల్ల నుంచి రెండేళ్లలోపు చిన్నారుల్లో 9 శాతం మందికి మాత్రమే సరిపడా ఆహారం అందుతుందని నివేదిక హెచ్చరిస్తున్నది.

మూక దాడులపై మోహన్ భాగవత్ స్పందన

మూకదాడుల వెనుక ఆర్ఎస్ఎస్ ఉన్నదని లేదా దాని సానుభూతిపరులు ఉన్నారని వచ్చిన ఆరోపణల మీద అక్టోబర్ 8న ఆర్ఎస్ఎస్ సంస్థాపక దినోత్సవంలో ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఒక ప్రకటన చేశారు. మూక దాడులు తమ మీదకు రావడం, ఫలితంగా తమకు, దేశానికి అప్రదిష్ట రావడం గురించి భాగవత్ ప్రస్తావించారు. 'లించింగ్' అన్న మాట పాశ్చాత్య భావన అని, భారతదేశ చరిత్రలో అటువంటి ఉదంతాలు లేవన్నారు తప్ప మూక హత్యలకు పాల్పడిన వారిని ప్రభుత్వం శిక్షించాలనే మాట ఎక్కడా చెప్పలేదు.

భావ్‌ఖేడీలో ఇద్దరు పిల్లల దారుణ హత్య

మధ్యప్రదేశ్‌లోని శివ్‌పురి జిల్లా భావ్‌ఖేడి గ్రామంలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నందుకు ఇద్దరు దళిత పిల్లలను ఆ ఊరి పెద్దలు సెప్టెంబర్ 25న కొట్టిచంపారు. ఇదే రోజు స్వచ్ఛ భారతం కోసం కృషిచేస్తున్నందుకు ప్రధాని మోడీకి 'గ్లోబల్ గోల్‌కీపర్' అవార్డుతో మెలిండా గేట్స్ ఫౌండేషన్ న్యూయార్క్‌లో సత్కరించింది. స్వచ్ఛభారత్ అభియాన్ కింద ఈ గ్రామంలో 247 మరుగు దొడ్లు నిర్మించినట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి. నాలుగు మట్టిగోడలు, గడ్డితో కప్పిన పైకప్పు, దానిమీద ఓ టార్పాలిన్ ఉన్న గుడిసెలో జీవిస్తున్న వీరికి మరుగు దొడ్డి సదుపాయం లేదు. ఆ పిల్లల తండ్రి మనోజ్ చెబుతున్న దాని ప్రకారం, చాలాకాలం క్రితమే అతడు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మరుగుదొడ్డితో కూడిన ఇంటికోసం దరఖాస్తు చేసుకున్నాడు. పిల్లల్ని కొట్టి చంపిన ఆధిపత్య కులస్తులు ఆ దరఖాస్తు పైకి పంపకుండా, అతడి పేరు జాబితాలో లేకుండా చేశారు.

అధికార పార్టీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్

ఎన్నికల సంఘం సిక్కిం ముఖ్యమంత్రి విషయంలో అది వ్యవహరించిన తీరు ప్రశ్నార్థకంగా మారింది. ఆర్జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ లాగానే ఈయన కూడా పశువులకు సంబంధించిన ఓ కుంభకోణంలో శిక్ష అనుభవించి, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీకి అర్హత కోల్పోయినాడు. సంవత్సరం జైలు శిక్ష అనుభవించి గత ఏడాది ఆగస్టు 10న బయటకు వచ్చిన నుంచి ఆరేళ్లపాటు, అంటే 2024 ఆగస్టు పది వరకు ఎన్నికలకు దూరంగా ఉండాల్సినవాడు. కానీ ఎన్నికల సంఘం ఆయన మీద ఉన్న ఆ అనర్హత కాలంలో ఐదేళ్లు కోతపెట్టి, దానిని 13 నెలలకు పరిమితం చేసింది. దీంతో ఆయన రాష్ట్రంలో జరిగిన ఉప ఎన్నికలలో పోటీచేసి నెగ్గాడు. ఇలాంటి కేసులోనే శిక్ష అనుభవిస్తున్న లాలూ ప్రసాద్ యాదవ్‌కు మాత్రం అలాంటి అవకాశం లభించలేదు. దీనికి కారణం సిక్కిం క్రాంతికారి మోర్చా బిజెపికి మిత్రపక్షం కావడమేనని విపక్షాలు అంటున్నాయి.

స్టాన్ స్వామిపై పోలీసుల దాడి

జార్ఖండ్‌లోని సామాజిక కార్యకర్త స్టాన్ స్వామి ఇంటిపై పోలీసులు దాడి చేసి ఆయనకు సంబంధించిన వస్తువులను ఎత్తుకెళ్లారు. స్టాన్ స్వామి జార్ఖండ్‌లో ఆదివాసుల హక్కులకై, వారిపై పోలీసుల అణచివేత, దమనకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అక్టోబర్ 21న రాజధాని రాంచికి సమీపంలోని నామ్‌కుమ్‌లో బగైచా క్యాంపస్‌లోని ఆయన ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేరు. ఆయనకు చెందిన రెండు టేబుల్లు, రెండు కుర్చీలు, బీరువా, పట్టుకెళ్లారు.

ఓటు వేయలేని దళితులు

హర్యానాలోని భగానా గ్రామంలో నివసించే ఐదు వందల మంది దళితులు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. అగ్రవర్ణ కులాలకు భయపడి వారు ఓటు వేయలేకపోయారు. 2012 నుంచి ఒక భూమి వివాదం కారణంగా అగ్రవర్ణాలకు భయపడి దళితులు ఊరి బయటే నివసిస్తున్నారు. 138 దళిత కుటుంబాలను అగ్రవర్ణాల వారు ఊరి నుంచి బహిష్కరించారు. దీంతో తమకు పునరావాసం కల్పించాలని, తమకు న్యాయం చేయాలని కోరుతూ గత ఏడు సంవత్సరాలుగా దళితులు హిసారిలోని మినీ సెక్రటేరియట్‌కు ఎదురుగా నిరసనలు తెలుపుతున్నారు. వీ

ఇరాక్‌లో నిరసనలు

ఇరాక్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు ఉధృతమవుతున్నాయి. అవినీతి, నిరుద్యోగం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అక్టోబర్ 3న ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని తెహ్రీర్ స్క్వేర్ వద్దకు వేలాది మంది పౌరులు చేరుకొని ప్లకార్డులు, బ్యానర్లతో నిరసన ప్రదర్శనలు చేశారు. నిరసనకారులను చెదరగొట్టడానికి ప్రభుత్వ బలగాలు కాల్పులు జరపడంతో దాదాపు ఇరవై మంది మరణించారు. నాలుగు వందల మందికి పైగా గాయపడ్డారు. ఆందోళనతో రవాణా వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు మూతపడ్డాయి.

పోర్చుగల్‌లో ఎన్నికలు

పోర్చుగల్ పార్లమెంట్‌కు అక్టోబర్ 7న ఎన్నికలు జరిగాయి. మొత్తం 230 స్థానాలున్న పార్లమెంట్‌లో అధికార సోషలిస్ట్ పార్టీ 106 స్థానాలు (36.6 శాతం ఓట్లు) గెలుచుకుంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ సోషల్ డెమోక్రాటిక్ పార్టీకి 77 స్థానాలు (28 శాతం ఓట్లు) వచ్చాయి. మిత్రపక్షం లెఫ్ట్ బ్లాక్‌కు 19 స్థానాలు, కమ్యూనిస్టు పార్టీకి 12 స్థానాలు దక్కడంతో ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతును తెలిపాయి. దీంతో సోషలిస్ట్ పార్టీ నాయకుడు ఆంటోనియో కోస్టా మరోసారి ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

కొలంబియాలో విద్యార్థుల నిరసన

కొలంబియా యూనివర్సిటీల్లో పేరుకుపోయిన అవినీతి అక్రమాలపై విద్యార్థులు గళమెత్తారు. యూనివర్సిటీ నిర్వహణ కోసం అధికంగా నిధులు కేటాయించాలని కోరుతూ అక్టోబర్ 11న భారీ ప్రదర్శన నిర్వహించారు. కొలంబియాలోని 17 ప్రధాన నగరాల్లో నిరసనకారులు ప్లకార్డులు, బ్యానర్లతో తమ నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రాజధాని బొగోటా వీధుల్లో ప్రభుత్వ వైఖరికి నిరసనగా వేలాది మంది విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. వీరికి మద్దతుగా అధ్యాపకులు కూడా ప్రదర్శనలో పాల్గొన్నారు. అనేక యూనివర్సిటీల్లో అవినీతిని అరికట్టాలని, విద్యా ప్రమాణాలు పెంచాలని డిమాండ్ చేశారు. నిరసనకారులపై ప్రభుత్వ బలగాలు తీవ్రస్థాయిలో అణచివేతను ప్రయోగించాయి.

బ్రెగ్జిట్‌కు మరింత గడువు

యూరోపియన్ యూనియన్ (ఇయు) నుంచి వైదొలగేందుకు బ్రిటన్ ప్రతిపాదించిన కొత్త ఒప్పందానికి బ్రిటన్, ఇయు ప్రతినిధుల బృందాలు అంగీకరించాయని బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ అన్నారు. అక్టోబర్ 31న బ్రెగ్జిట్ గడువు దగ్గర పడుతుండడంతో ఇయు బ్రిటన్‌కు మరింత సమయం ఇచ్చే అవకాశం ఉంది. కొత్త ఒప్పందంపై అటు బ్రిటన్ పార్లమెంట్, ఇటు ఇయు నుంచి అంగీకారం లభించిన తరువాత బ్రెగ్జిట్‌కు మార్గం సులభమవుతుంది.

మీడియాపై ఆంక్షలకు వ్యతిరేకంగా నిరసన

ఆస్ట్రేలియాలో మీడియా సంస్థలపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందని నిరసిస్తూ అక్టోబర్ 21న న్యూస్‌కార్ప్, మరో తొమ్మిది పత్రికలు తమ మెయిన్ ఎడిషన్ మొదటి పేజీలో నల్లరంగు వేసి దానిపై రహస్యం అనే స్టాంప్‌ను వేసి ముద్రించాయి. కనీస సమాచారాన్ని కూడా వెల్లడించకుండా ప్రభుత్వం నియంత్రిస్తోందని, ఆంక్షలు సడలించేంత వరకు తమ నిరసన కొనసాగిస్తామని మీడియా సంస్థలు ప్రకటించాయి.

కెనడా పార్లమెంట్ ఎన్నికలు

కెనడా పార్లమెంట్‌కు అక్టోబర్ 21న ఎన్నికలు జరిగాయి. మొత్తం 338 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో లిబరల్ పార్టీకి 158 సీట్లు వచ్చాయి. ప్రతిపక్ష కన్సర్వేటివ్ పార్టీకి 122 స్థానాలు లభించాయి. ప్రభుత్వం ఏర్పాటుకు 170 స్థానాలు ఉండాలి. చిన్నపార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రధాని జస్టిన్ ట్రూడో అన్నారు.

లెబనాన్‌లో నిరసనలు

లెబనాన్‌లో అధిక ధరలు, అధిక పన్నులకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వస్తు సేవల ధరలు బాగా పెరిగిపోయాయని, ప్రజలపై పన్నుల భారాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలు తీవ్ర నిరసన తెలిపారు. అక్టోబర్ 18న ప్రధాని సాద్ హరీరీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాజధాని బీరుట్‌లో నిరసన ప్రదర్శనలు చేశారు.

సిరియాపై టర్కీ దాడులు

సిరియాలో కుర్దు తిరుగుబాటుదారులను లక్ష్యంగా చేసుకొని టర్కీ జరుపుతున్న దాడుల్లో వందలాది మంది సామాన్య పౌరులు మరణిస్తున్నారు. లక్షలాది మంది నిరాశ్రయులవుతున్నారు. ఉత్తర సిరియాలో టర్కీ సైన్యం జరిపిన దాడిలో వందలాది మంది కుర్దు తిరుగుబాటుదారులతో పాటు సామాన్య పౌరులు కూడా మరణించారు. ఈ దాడులతో ఉత్తర సిరియాలో భీతావహ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉత్తర సిరియాలో అక్టోబర్ 18 నుంచి 22 వరకు కాల్పుల విరమణ ప్రకటించారు.

చిలీలో భారీ నిరసనలు

చిలై మెట్రో ఛార్జీల పెంపుతో మొదలైన నిరసన క్రమంగా ప్రజా తిరుగుబాటుగా మారుతోంది. పెంచిన మెట్రో ఛార్జీలకు, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర నిరసన ప్రదర్శనలు చేశారు. ఆర్థిక అసమానతలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశాధ్యక్షుడు సెబాస్టియన్ పినెరా అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 26న దేశ రాజధాని శాంటియాగోలో పది లక్షల మందితో మిలియన్ మార్చ్ నిర్వహించారు. చిలే సంప్రదాయం ప్రకారం కుండలను చెంచాలతో కొడుతూ, జెండాలు ఊపుతూ ఒక్కసారిగా లక్షలాది జనం రావడంతో శాంటియాగో వీధులు మొత్తం నిరసన హోరుతో దద్దరిల్లిపోయింది.

నోబెల్ ప్రైజ్ - 2019

ప్రతిష్ఠాత్మమైన నోబెల్ 2019 బహుమతులను ప్రకటించారు. ఈ ఏడాది వైద్యరంగంలో ముగ్గురికి నోబెల్ వచ్చింది. మానవ శరీరంలో కణాలు ఆక్సిజన్‌ను గుర్తించడంపై పరిశోధన చేసినందుకు గాను అమెరికాకు చెందిన విలియం కైలిన్, గ్రెగ్ సెమెంజా, బ్రిటిన్‌కు చెందిన పీటర్ రాట్‌క్లిఫ్‌లకు వైద్య నోబెల్ దక్కింది. సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రిక్ కార్లలో వినియోగించే లిథియం ఆధారిత బ్యాటరీలను రూపొందించినందుకు గాను రసాయన శాస్త్రంలో అమెరికా శాస్త్రవేత్త జాన్ బి. గుడెనఫ్, బ్రిటన్‌కు చెందిన ఎం. స్టాన్లీ విట్టింగ్‌హామ్, జపాన్‌కు చెందిన అకీరా యోషినో రసాయన శాస్త్రం నోబెల్ దక్కింది. ఫిజిక్స్ నోబెల్‌ను కెనడా ప్రొఫెసర్ జేమ్స్ పీబెల్స్, స్విట్జర్లాండ్ ప్రొఫెసర్ మైఖెల్ మేయర్‌తో పాటు జెనీవా యూనివర్సిటీకి చెందిన డిడియర్ క్వెలోజ్ గెలుచుకున్నారు. జేమ్స్ పీబెల్స్, మైఖెల్‌లు అంతరిక్షంలో వినూత్న పరిశోధనలు చేయడం, సరికొత్త గ్రహాలు, నక్షత్రాలను కనుగొన్నందుకు నోబెల్ దక్కగా, డిడియర్ సూర్యుడి తరహా మరో సరికొత్త గ్రహాన్ని కనుగొన్నందుకు నోబెల్ గెలిచారు. సాహిత్యంలో ఇద్దరికి నోబెల్ దక్కింది. 2018కి గాను పోలండ్ రచయిత్రి ఓల్గా టొకర్జుక్‌కు, 2019కి గాను ఆస్ట్రియాకు చెందిన నవలా రచయిత పీటర్ హ్యాండ్కేకు నోబెల్ లభించింది. ఈ ఏడాది శాంతి బహుమతి ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్‌కు లభించింది. ఇథియోపియా, ఎరిత్రియాకు మధ్య ఉన్న సరిహద్దు సమస్యలను పరిష్కరించినందుకు, శాంతి స్థాపనకు, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు కృషి చేసినందుకు గాను ఆయనకు ఈ అవార్డు అందింది. అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ వచ్చింది. భారత సంతతికి చెందిన అభిజిత్ బెనర్జీ, ఆయన భార్య ఎస్తేర్ డఫ్లోకు, మైఖేల్ క్రెమెర్ ప్రపంచ వ్యాప్తంగా మానవాళిని కబలిస్తున్న పేదరికాన్ని సూక్ష్మస్థాయిలో ఎదుర్కోవడంపై పరిశోధనలు చేసినందుకు ఈ పురస్కారం లభించింది. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్


మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 30, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (1037), ఆంధ్రప్రదేశ్‌లోని 11 జిల్లాలలో (968) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 2005)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	2	2	–	18	20	9	6	5	3	3	14	2	2	3	24	38	–	–	–	5	3
హైదరాబాద్	–	–	–	10	12	6	7	10	2	4	3	7	6	4	21	16	–	–	–	–	–
కరీంనగర్	–	3	2	5	16	3	5	2	1	2	1	3	–	3	13	11	–	–	–	–	3
ఖమ్మం	–	–	–	6	14	9	26	8	1	3	1	2	–	7	14	25	–	–	–	–	–
మహబూబ్‌నగర్	–	–	3	2	3	2	2	2	1	1	2	3	2	9	41	2	–	–	–	–	1
మెదక్	1	9	2	3	3	8	4	3	1	3	4	4	2	20	31	30	–	–	–	3	4
నల్గొండ	–	3	1	4	7	3	5	3	–	2	2	1	2	3	19	14	–	–	–	–	4
నిజామాబాద్	–	3	–	6	8	2	3	2	2	3	2	3	–	3	17	10	–	–	–	–	6
వరంగల్	1	4	3	4	4	4	4	3	1	2	5	4	4	19	22	32	–	–	–	2	3
వికారాబాద్	–	4	–	4	6	3	5	4	3	6	4	5	7	6	19	23	–	–	–	–	4
తెలంగాణ	**4**	**28**	**12**	**64**	**93**	**49**	**67**	**42**	**15**	**29**	**38**	**34**	**25**	**77**	**221**	**201**	**-**	**-**	**-**	**10**	**28**
అనంతపురం	–	4	1	2	21	2	2	6	–	3	3	1	11	10	50	–	–	–	–	–	–
చిత్తూరు	–	1	–	6	12	–	–	–	–	5	–	1	10	3	29	4	–	–	–	–	1
కడప	వివరాలు అందలేదు																				
గుంటూరు	–	3	–	4	7	2	3	2	1	3	3	6	1	2	17	15	–	–	–	–	2
కృష్ణా	–	2	–	3	5	3	4	3	2	3	1	3	2	4	16	14	–	–	–	–	3
కర్నూలు	–	3	–	6	8	4	6	2	3	4	3	5	2	4	26	21	–	–	–	–	1
తూర్పు గోదావరి	–	–	–	4	4	4	6	6	–	2	2	4	7	10	24	24	–	–	–	5	51
ప్రకాశం	–	3	–	9	8	3	6	4	1	3	2	2	2	9	26	21	–	–	–	–	6
శ్రీకాకుళం	వివరాలు అందలేదు																				
పశ్చిమ గోదావరి	–	–	–	3	6	4	5	3	1	2	1	3	1	6	18	16	–	–	–	–	6
నెల్లూరు	–	1	–	5	4	3	4	1	1	2	2	6	–	3	17	12	–	–	–	–	–
విజయనగరం	–	–	–	2	4	6	8	4	1	1	1	3	2	7	14	16	–	–	–	–	7
విశాఖపట్నం	–	–	–	8	12	3	3	1	–	1	2	1	3	2	15	11	–	–	–	10	1
ఆంధ్రప్రదేశ్	**-**	**17**	**1**	**52**	**91**	**34**	**47**	**32**	**10**	**29**	**20**	**35**	**41**	**60**	**252**	**154**	**-**	**-**	**-**	**15**	**78**

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 220 - November 2019 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/10/2019 ● Postal Regn. No. HD/1100/2017-19

Date of Posting : 29th, 30th



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao